సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 6.50
సంపుటి: 18
సంచిక: 328

బుధవారం 18-2-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఆస్ట్రేలియా ఇంటికి...
టి20 ప్రపంచకప్ నుంచి లీగ్ దశలోనే వెనుదిరిగిన మాజీ చాంపియన్ - 15లో

అజేయంగా ముగించాలని..
నేడు నెదర్లాండ్స్‌తో తలపడనున్న భారత జట్టు - 15లో

గద్దెనెక్కిన రహ్మాన్
బంగ్లాదేశ్ ప్రధానమంత్రిగా బీఎన్‌పీ చైర్మన్ తారిఖ్ రహ్మాన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు.
వివరాలు 6లో ▸

మార్చిలో షెడ్యూల్!
4 రాష్ట్రాలు, ఒకే కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు మార్చి మధ్యలో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముంది.
వివరాలు 6లో ▸

తుగ్లక్ కమిషన్!
కేంద్ర ఎన్నికల కమిషన్ తుగ్లక్ కమిషన్ మాదిరిగా వ్యవహరిస్తోందంటూ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.
వివరాలు 6లో ▸

పిటిషన్లకూ ఏఐ వాడతారా?
ఏఐ సాయంతో పిటిషన్లకు ఒక రూపమిస్తూ వాటినే న్యాయవాదులు న్యాయస్థానాల్లో సమర్పిస్తున్న తీరును సుప్రీం ఆక్షేపించింది.
వివరాలు 6లో ▸

ఆ పాపం బాబుదే

కిలో నెయ్యి రూ.300 నుంచి ఏకంగా రూ.658కి ఎందుకు పెరిగింది?

హెరిటేజ్‌తో ఇందాపూర్ డెయిరీకి ఉన్న బంధమేంటి?

- ఈ విషయంపై చర్చిద్దామంటే దుర్మార్గంగా మైక్‌లు కట్ చేస్తారా?
- వాయిదా తీర్మానంపై చర్చకు ఎందుకు భయపడుతున్నారు?
- టీటీడీకి ఇందాపూర్ డెయిరీ నెయ్యి సరఫరాపై అట్టుడికిన శాసన మండలి
- శ్రీవారిని అడ్డు పెట్టుకుని రాజకీయం చేయడంపై వైఎస్సార్‌సీపీ నిప్పులు
- చంద్రబాబు అధికారంలోకి రాగానే నెయ్యి సరఫరా ధర రెట్టింపు చేసే కుట్ర
- లడ్డూలో జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి వాడారని దుష్ప్రచారం
- తన హెరిటేజ్‌కు, తన సంబంధీకులకు భారీ లబ్ధి చేకూర్చేందుకు స్కెచ్
- ఈ ముసుగులో కిలో నెయ్యి రూ.658తో ఇందాపూర్ డెయిరీకి కట్టబెట్టిన వైనం
- వరుస ఘటనలతో హెరిటేజ్‌లో ఇందాపూర్ భాగమేనని బట్టబయలు.. ఈ విషయం సభలో చర్చకు రాకుండా డ్రామా..
- తిరుమలలో నిర్దిష్ట విధానంలో నాణ్యత పరీక్షల తర్వాతే నెయ్యి వాడకం
- గత బాబు పాలనకు ముందు.. ఆ తర్వాత, జగన్ పాలనలోనూ అదే విధానం

'హెరిటేజ్-ఇందాపూర్' బంధంపై చర్చకు అనుమతించాలని శాసనమండలి చైర్మన్‌ను కోరుతున్న వైఎస్సార్‌సీపీ సభ్యులు

సాక్షి, అమరావతి: చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ వ్యవహారంతో మంగళవారం శాసన మండలి అట్టుడికింది. హెరిటేజ్ నెయ్యిని ఇందాపూర్ డెయిరీ పేరుతో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)కు సరఫరా చేయడంపై చర్చకు అనుమతించాలని వైఎస్సార్‌సీపీ పట్టుబట్టింది. ఈ క్రమంలో ఎమ్మెల్సీలు కేఆర్‌జే భరత్, సిపాయి సుబ్రమణ్యం ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు తిరస్కరించారు. ఈ విషయంపై చర్చకు అనుమతించాల్సిందేనని, తద్వారా హెరిటేజ్‌తో ఇందాపూర్ డెయిరీ బంధం బయట పెట్టాలని వైఎస్సార్‌సీపీ సభ్యులు నినదించారు. అయినా చైర్మన్
మిగతా 2వ పేజీలో ▶

దుర్మార్గంగా మైకులు కట్

మండలి చరిత్రలో ఇదే ప్రథమం

హెరిటేజ్ బాగోతం చర్చకు వస్తుందనే భయంతోనే అడ్డుకున్నారు

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం మండిపాటు

2 లో

కంటి'పాప'ను చిదిమేశాడు

గంజాయి మత్తులో నరరూప రాక్షసుడి ఘాతుకం

ఏడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి.. నీటి డ్రమ్ములో ముంచి చంపేసిన ఉన్మాది

నిందితుడి ఇంట్లోనే బయటపడిన చిట్టితల్లి మృతదేహం

మదనపల్లెలో వెల్లువెత్తిన ప్రజాగ్రహం

నిందితుడిని అప్పగించాలంటూ ఆందోళన

కుటిల సర్కారు నిర్లక్ష్యానికి ముక్కుపచ్చలారని మరో పసిపాప బలైపోయింది. మత్తెక్కిన నర రూప రాక్షసుడి కబంధ హస్తాల్లో విలవిల్లాడి విగతజీవిలా మారిపోయింది. కామాంధుడి పైశాచికత్వానికి డ్రమ్ములో నిర్జీవంగా దర్శనమిచ్చింది. ఈ దృశ్యాన్ని చూసిన మాతృహృదయాలు తల్లడిల్లిపోయాయి. ఇన్నాళ్లూ అల్లారుముద్దుగా, కంటికి రెప్పలా కాపాడుకున్న చిట్టితల్లిని చూసి ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ఈ హృదయవిదారక ఘటనపై అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లె కదిలిపోయింది. చలనం లేని మొద్దు సర్కారుపై కన్నెర్రజేసింది. తక్షణం న్యాయం చేయాలని నినదించింది.
3 లో

చంద్రబాబూ ఇకనైనా మేలుకో!

- మదనపల్లెలో బాలిక అత్యాచారం, హత్య ఘటన మీ ప్రభుత్వానికి సిగ్గుచేటు కాదా?
- ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన వైఎస్ జగన్

3 లో

'పోక్సో' నిందితుడికి స్టేషన్ బెయిల్!

బాధిత కుటుంబానికి జైలు.. ఇదీ చంద్రబాబు మార్కు పాలన

3 లో

న్యూస్‌రీల్

జనన ధ్రువీకరణ పత్రంతో సివిల్ రిజిస్ట్రేషన్లు

విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ఆధార్, ఓటరు నమోదు, డ్రైవింగ్ లైసెన్స్ జారీ, ఇతర సివిల్ రిజిస్ట్రేషన్లకు ఇకపై జనన ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది.
వివరాలు 3లో ▸

పని ఒత్తిడితో 50 మంది ఉద్యోగులు చనిపోయారు

నిరంతరం ఫీల్డ్ డ్యూటీలు, సమయ పరిమితులు లేకుండా విధులు నిర్వర్తించడం వల్ల తీవ్ర పని ఒత్తిడికి గురై ఇటీవల 50 మందికి పైగా ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ బూరాడ మధుబాబు ఆవేదన వ్యక్తం చేశారు.
వివరాలు 13లో ▸

సిద్ధార్థ్ రెడ్డికి జైలు

రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఏపీలో సంచలనం సృష్టించిన సినీనటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ప్రధాన నిందితుడు సిద్ధార్థ్ రెడ్డిని దోషిగా తేలుస్తూ, అతనికి విధించిన శిక్షను అనుభవించేందుకు 4 వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది.
వివరాలు 10లో ▸

2047 కల్లా భారతే...

ఏఐ సూపర్‌పవర్!

అదే మా లక్ష్యం: ప్రధాని మోదీ

రోడ్‌మ్యాప్‌పై ఏఐ సదస్సుతో స్పష్టత

ఏఐతో ఉపాధి పోతుందన్నది అపోహ

ముందస్తు సన్నద్ధతే సరైన విరుగుడు

ద్వైపాక్షిక బంధం.. 'గ్లోబల్' స్థాయికి!

భారత్ - ఫ్రాన్స్ నిర్ణయం..

21 ఒప్పందాలపై సంతకాలు

6 లో

'బిల్'కు గేట్స్ క్లోజ్!

- ఏఐ ఇండియా సదస్సుకు దూరంగా బిల్ గేట్స్..?.. ప్యానలిస్టుల జాబితా నుంచి పేరు తొలగింపు?
- ఇప్పటికే సమాచారం ఇచ్చారంటున్న జాతీయ మీడియా చానళ్లు
- బిల్‌గేట్స్ పర్యటనపై వెల్లువెత్తుతున్న ఆగ్రహావేశాలతో కేంద్రం నిర్ణయం!
- ఏపీలో చంద్రబాబు సర్కారు ఏకపక్ష నిర్ణయాలపై ఆరా.. నిఘా వర్గాల నుంచి సమాచారం
- ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో బిల్ బాగోతం బట్టబయలు.. బిల్ గేట్స్‌ను దూరం పెట్టిన యావత్ ప్రపంచం

- విశిష్ట అతిథిగా అమరావతికి పిలిచి చంద్రబాబు సర్కారు రాచ మర్యాదలు
- ఆయన్ను మహిళా రైతులతో మాట్లాడించడం విభ్రాంతికరమని తీవ్రంగా మండిపడ్డ జాతీయ మీడియా
- సీఎం చంద్రబాబు, లోకేశ్ తీరుపై సర్వత్రా ఆగ్రహావేశాలు

10 లో

విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రగిలిన గుండెల 'రణభేరి'

బాబు సర్కారుపై గర్జించిన ఉపాధ్యాయులు

12వ పీఆర్సీ కమిషన్‌ను తక్షణం నియమించాలి

నాలుగు డీఏలు, ఆర్థిక బకాయిలు చెల్లించాలి

గురువుల నినాదాలతో దద్దరిల్లిన బెజవాడ ధర్నాచౌక్

2 లో



ఇలాంటోళ్ల

వ్యవసాయం దండగ అని సార్ ఎప్పుడో చెప్పారుగా!



సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 2125 9899

రగిలిన గుండెల 'రణభేరి'

బాబు సర్కారుపై గర్జించిన ఉపాధ్యాయులు

రాష్ట్ర నడిబొడ్డున ఉపాధ్యాయులు కదంతొక్కారు. చంద్రబాబు సర్కారు దుర్నీతిపై కన్నెర్రచేశారు. ఎన్నికల హామీలపై తక్షణం తేల్చాలని రణభేరి మోగించారు. రగిలిన గుండెలతో గర్జించారు. దుష్ట పన్నాగాలతో కాలం గడిపితే పతనం తప్పదు ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు.

విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఎన్నికల వరకు సాగదీసేందుకు యత్నిస్తే సర్కారు పతనం తప్పదని ఉపాధ్యాయులు హెచ్చరించారు. 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను తక్షణం నియమించాలని, ఐఆర్ 29 శాతం ప్రకటించాలని, నాలుగు డీఏలు, ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరుతూ ఉపాధ్యాయులు మంగళవారం చలో విజయవాడ చేపట్టారు. అన్ని జిల్లాల నుంచి ఉపాధ్యాయులు భారీగా తరలివచ్చారు. ధర్నా చౌక్‌లో రణభేరి సభ నిర్వహించారు. ఫలితంగా ధర్నా చౌక్ ఎరుపెక్కింది. రణన్నినాదాలతో దద్దరిల్లింది. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని ఉపాధ్యాయులు హెచ్చరించారు. రణభేరిలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘ నేతలు మాట్లాడుతూ 12వ పీఆర్సీ 2023 జూలై నుంచి అమలు కావాల్సినా ఇంతవరకు చైర్మన్‌ను కూడా నియమించలేదని విమర్శించారు. చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే సకాలంలో డీఏలు, మెరుగైన పీఆర్సీ అమలు చేస్తామని, బకాయిలు చెల్లిస్తామని హామీలు గుప్పించారని, అధికారంలోకి వచ్చి 20 నెలలు పూర్తి కావస్తున్నా ఇంతవరకు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఆర్సీ, ఐఆర్, డీఏల కోసం సీఎం చంద్రబాబుకు లక్ష ఉత్తరాలు రాశామని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతి పత్రాలు ఇచ్చామని, కానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. బడ్జెట్లోనూ పీఆర్సీ, డీఏ బకాయిలపై కనీసం ప్రస్తావించలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించాలని, లేకుంటే చలో సెక్రటేరియేట్ కార్యక్రమం చేపడతామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు పోరాటాలు చేస్తే తట్టుకునే శక్తి ఈ ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు.

శాసనమండలి, శాసన సభలలో టీటీడీ లడ్డూ నెయ్యిపై ప్రతిపక్షంపై అవాకులుచెవాకులు పేలడం తప్పితే ప్రజల, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై సర్కారు చర్చించడం లేదని విమర్శించారు. పీఆర్సీ జాప్యం జరిగే కాలానికి ఐఆర్ 29 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ వి.వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్, ఏపీజేఏసీ చైర్మన్ ఎ.విద్యాసాగర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ.వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మీడియా పాయింట్

తిరుమల లడ్డూ అంశంలో చంద్రబాబే దోషి

- లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్ దుష్ప్రచారం చేశారు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీల మండిపాటు

సాక్షి, అమరావతి: మాజీ సీఎం వైఎస్ జగన్‌పై నింద వేయాలనే ఉద్దేశంతోనే తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దుష్ప్రచారం చేశారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, కల్పలతారెడ్డి, వరుదు కళ్యాణి, రాచగొల్ల రమేష్ యాదవ్ మండిపడ్డారు. లడ్డూ నెయ్యిలో జంతుకొవ్వు లేదని సీబీఐ–సిట్, ఎన్‌డీఆర్ఐ, ఎన్‌డీడీబీ ల్యాబ్‌ల నివేదికలు తేటతెల్లం చేశాయన్నారు. మంగళవారం అసెంబ్లీ వద్ద మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీలు ఏమన్నారంటే..

కొనుగోలు కేంద్రాలు తెరవండి

రాయలసీమతోపాటు ప్రకాశం జిల్లాలో శనగ పంటను సాగు చేస్తారు. పంట కోతలు పూర్తయి 25 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. శనగ పంటను దళారులు రూ.4,600కు మించి కొనడంలేదు. శనగ రైతు ఎకరాకు రూ.10 వేలు నష్టపోతున్నాడు. జొన్న, మొక్కజొన్న పంటలను రైతు తక్కువ ధరకే తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం తక్షణం మద్దతు ధరలు పెంచి కొనుగోలు కేంద్రాల ద్వారా పంటల్ని కొనాలి. వైఎస్ జగన్‌పై నింద వేయాలనే తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని సీఎం చంద్రబాబు దుష్ప్రచారం చేశారు. చివరకు చంద్రబాబే దోషిగా నిలబడ్డారు.

– పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ

ఉద్యోగాల భర్తీపై తప్పుడు ప్రకటన

సూపర్ సిక్స్ పేరుతో టీడీపీ కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గాలికొదిలేశారు. గత రెండు బడ్జెట్లలో నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి పథకాలకు రూపాయి కూడా కేటాయించని చంద్రబాబు ప్రభుత్వం మూడో బడ్జెట్‌లోనూ మోసం చేసింది. ఇప్పటివరకు 191 మంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఎంతమందికి ఉద్యోగాలిచ్చారని అడిగితే 5,72,280 ఉద్యోగాలిచ్చినట్టు తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారు.

– రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ

ఆ పాపం బాబుదే

▶ మొదటి పేజీ తరువాయి

చర్చకు అనుమతించక పోవడంతో వైఎస్సార్‌సీపీ సభ్యులు పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. టీటీడీలో హెరిటేజ్ పాత్రపై చర్చ జరపాలని ప్లకార్డులు ప్రదర్శించారు. 'టీటీడీకి సరఫరా అయ్యే నెయ్యి ఒక్కసారిగా కిలో రూ.300 నుంచి రూ.658కి ఎందుకు పెరిగింది? హెరిటేజ్‌కు, ఇందాపూర్‌కు ఉన్న సంబంధం ఏంటి? ఈ విషయంపై చర్చిద్దామంటే దుర్మార్గంగా మైక్‌లు కట్ చేస్తారా? నెయ్యి ధర పెంచుకోవడానికే చంద్రబాబు దుష్ప్రచారం చేయడం నిజం కాదా? హెరిటేజ్ నెయ్యి, పాలు, పెరుగు అన్నీ కల్తీ కల్తీ.. చంద్రబాబు పాలనా కల్తీ కల్తీ..' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. వైఎస్సార్‌సీపీ సభ్యులు ఆందోళన చేస్తున్నప్పటికీ, చైర్మన్ మరో వైపు ప్రశ్నోత్తరాలను కొనసాగించారు. దీంతో చైర్మన్ కొద్దిసేపు సభను వాయిదా వేశారు. ఆ తర్వాత సభ తిరిగి ప్రారంభం కాగానే వైఎస్సార్‌సీపీ సభ్యులు మాట్లాడుతూ.. హెరిటేజ్ వ్యవహారం బయట పడుతుందని సీఎం చంద్రబాబు తన మంత్రులను పంపి డ్రామా ఆడిస్తున్నారని మండిపడ్డారు.

మండలిలో ప్లకార్డులు పట్టుకుని చైర్మన్ పోడియం వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు

ధర పెంచుకునేందుకే దుష్ప్రచారం

'రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటైంది. ఇదే అదనుగా తన కుటుంబ సంస్థ హెరిటేజ్ నుంచి ఇందాపూర్ డెయిరీ ద్వారా టీటీడీకి సరఫరా చేస్తున్న నెయ్యి ధరను ఏకంగా రెట్టింపు చేయాలని కుట్ర పన్నారు. తద్వారా తన హెరిటేజ్‌కు, తన సంబంధీకులకు, తన అనుబంధ సంస్థలకు లబ్ధి చేకూర్చాలనుకున్నారు. ఇందుకోసం శ్రీవారి పైనే బరితెగించి రాజకీయం చేశారు. శ్రీవారి లడ్డూ తయారీకి ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు, గొడ్డు మాంసం, బాత్‌రూమ్‌లు క్లీన్ చేసే రసాయనాలు వాడారని ఉద్దేశపూర్వకంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తక్కువ ధరకే కొనుగోలు చేయడం వల్ల నాణ్యత లేదని దుష్ప్రచారం చేశారు. చంద్రబాబుతో పాటు ఆయన మంత్రులు, ఎల్లో మీడియా ఈ విషయమై భక్తుల మనోభావాలు దెబ్బ తినేలా వ్యవహరించారు.

బండారం బట్టబయలు

శ్రీవారి లడ్డూపై చంద్రబాబు అండ్ కో చేయాల్సినంత దుష్ప్రచారం చేసేసి.. శ్రీవారి డబ్బులు దోచేసేందుకు బరితెగించారు. లడ్డూ సరఫరా ధరను ఏకంగా రెట్టింపు కిలో రూ.600కు పైగా పెంచేశారు. తద్వారా తన కుటుంబం సంస్థ, తన సంబంధీకులు, అనుబంధ కంపెనీలకు లబ్ధి చేకూర్చారు. ఆ లడ్డూ కల్తీ అనే ముద్ర వేసి, కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బ తీసి.. తను అనుకున్న రీతిలో స్కెచ్ మేరకు ధర పెంచుకోగలిగారు. చంద్రబాబు అంత తీవ్ర వ్యాఖ్యలు ఎందుకు చేశారనే కోణంలో పలు సంస్థలు, మీడియా, మేధావి వర్గాలు కాస్తా లోతుగా శోధించడంతో నెయ్యి సరఫరా చేసిన సంస్థలకు సంబంధించి పలు విషయాలు వెలుగు చూశాయి. ఈ నేపథ్యంలో ఇన్నాళ్లూ నెయ్యి సరఫరా చేసిన ఇందాపూర్ డెయిరీ చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్‌దేనని స్పష్టమైంది. దీంతో తన కుట్ర బెడిసి కొట్టడంతో కొద్ది రోజులుగా చంద్రబాబు ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దీనిపై మండలిలో చర్చ జరగాలని, హెరిటేజ్–ఇందాపూర్ డెయిరీ సంబంధాల గురించి స్పష్టం చేయాలని మంగళవారం మండలిలో వైఎస్సార్‌సీపీ పట్టుపట్టింది. ఈ విషయమై చర్చ జరిగితే ప్రజల్లో మరింత చులకన అవుతామని చంద్రబాబు హుటాహుటిన కొందరు మంత్రులను మండలికి పంపారు. మండలికి వచ్చిన మంత్రులు కొలుసు పార్థసారథి, కె.అచ్చెన్నాయుడు ప్రతి దశలోనూ వైఎస్సార్‌సీపీ సభ్యులకు అడ్డు తగిలారు.

ఇందాపూర్‌ను అడ్డుపెట్టుకుని ధనార్జన

బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. అసలు ప్రభుత్వానికి సభ జరిపే ఉద్దేశం ఉందా? లేదా? అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు ధనార్జన కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం దేవదేవుడైన వేంకటేశ్వరస్వామి లడ్డూపై దుష్ప్రచారం చేశారన్నారు. హెరిటేజ్ సంస్థకు చెందిన కల్తీ నెయ్యిని ఇందాపూర్ డెయిరీ ద్వారా టీటీడీకి సరఫరా చేశారని చెప్పారు. హెరిటేజ్–ఇందాపూర్ బంధంపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, మీరెందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. హెరిటేజ్– ఇందాపూర్ డెయిరీ బంధంపై చర్చకు పట్టుబట్టిన నేపథ్యంలో శాసన మండలి చరిత్రలో అరుదైన రికార్డు నెలకొంది. ఎప్పుడులేని విధంగా సభలో తొలిసారి మైక్, సౌండ్ సిస్టమ్ పని చేయలేదు. దీంతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.54 గంటల మధ్య 40 నిమిషాల పాటు మాత్రమే సభ జరిగింది. గందరగోళం వల్ల నాలుగుసార్లు సభ వాయిదా పడింది.

ఇది డ్రామా కాదా?

సభ్యుల వాదప్రతివాదనల నేపథ్యంలో చైర్మన్ కొద్దిసేపు సభను వాయిదా వేశారు. మళ్లీ సభ ప్రారంభం కాగానే అచ్చెన్నాయుడు మాట్లాడారు. ఆ తర్వాత ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ మాట్లాడటానికి చైర్మన్ మోషేన్‌రాజు అవకాశం ఇచ్చారు. అయితే వైఎస్సార్‌సీపీ సభ్యులు తమ స్థానాల్లోకి వెళ్లి కూర్చున్నాకే ఆయనతో మాట్లాడించాలని అచ్చెన్నాయుడు అభ్యంతరం తెలిపారు. దీంతో వైఎస్సార్‌సీపీ సభ్యులు పోడియం వద్ద నుంచి బొత్స వెనక్కి వెళ్లి నిల్చొన్నారు. ఆ తర్వాత బొత్స మాట్లాడే ప్రయత్నం చేయగా.. టీడీపీ సభ్యులు పోడియం వద్దకు దూసుకెళ్లి నినాదాలు చేశారు. తద్వారా సభలో గందరగోళం నెలకొనేలా చేశారు. వైఎస్సార్‌సీపీ సభ్యులకు మాట్లాడే నైతిక హక్కు లేదంటూ అడ్డుకున్నారు. మంత్రుల తీరుపై వైఎస్సార్‌సీపీ సభ్యులు తీవ్రంగా మండిపడ్డారు. తాము ఏ విషయంపై అయినా చర్చకు సిద్ధమేనని, హెరిటేజ్ వ్యవహారంపై చర్చ జరిగి తీరాల్సిందేనని నినదించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ కలుగ జేసుకుంటూ.. 'తిరుమల లడ్డూపై ఆధారం లేకుండా మాట్లాడుతున్నారు' అని ఎదురు దాడి చేయబోగా.. 'ఆధారాలు లేకుండా మాట్లాడిందెవరు? ఆధారాలు బయటకు రాకుండా ఇప్పుడు డ్రామాలాడుతోందెవరు?' అని వైఎస్సార్‌సీపీ సభ్యులు గట్టిగా నిలదీశారు.

నెయ్యి సరఫరాకు నిర్దిష్ట విధానం

చంద్రబాబు ఇది వరకు సీఎం కాక ముందు, సీఎం అయ్యాక.. గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో టీటీడీలో నెయ్యి సేకరణకు ఒక నిర్దిష్ట విధానం కొనసాగింది. టెండర్లు పిలిచి, తక్కువ ధరకు కోట్ చేసిన సంస్థలకు టెండర్ ఖరారు చేస్తారు. ఇవే సంస్థలు రాష్ట్రంలో పలు ఆలయాలకు కూడా నెయ్యిని సరఫరా చేశాయి. అక్రిడేటెడ్ ల్యాబ్‌లో సర్టిఫికెట్ పొందాకే టీటీడీకి నెయ్యిని అనుమతిస్తారు. ఇక్కడ మళ్లీ టీటీడీ సొంతంగా ఆ నెయ్యిని పరీక్షిస్తుంది. నాణ్యత లేకపోతే ఆ ట్యాంకర్లను వెనక్కు పంపుతారు. అలా గత ప్రభుత్వాల్లో పలుమార్లు వెనక్కు పంపారు.

దుర్మార్గంగా మైకులు కట్

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం మండిపాటు

సాక్షి, అమరావతి: హెరిటేజ్– ఇందాపూర్ డెయిరీ బంధంపై శాసన మండలిలో మంగళవారం చర్చకు పట్టుబట్టిన నేపథ్యంలో శాసన మండలి చరిత్రలో ఇదివరకెన్నడూ లేని విధంగా ప్రభుత్వం దుర్మార్గంగా, ఉద్దేశ పూర్వకంగా మైకులు కట్ చేయించిందని వైఎస్సార్‌సీపీ మండిపడింది.చంద్రబాబు, హెరిటేజ్ బాగోతం బయట పడకుండా ఉండేందుకు.. తప్పును కప్పి పుచ్చుకునేందుకు సాంకేతిక కారణాలంటూ సాకులు చెబుతోందని నిప్పులు చెరిగింది. ఈ మేరకు మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం ప్రకటన విడుదల చేశారు. అందులో ఏమన్నారంటే.. 'చంద్రబాబు కుటుంబ సంస్థ హెరిటేజ్.. ఇందాపూర్ డెయిరీ పేరుతో టీటీడీకి నెయ్యి సరఫరా చేసింది. ఇప్పుడు ఆ ధరను రెట్టింపు చేసుకునేందుకు చంద్రబాబు బరితెగించి శ్రీవారి లడ్డూపై దుష్ప్రచారం చేశారు. తక్కువ ధరకు నెయ్యి కాంట్రాక్టు ఇవ్వడం వల్లే నాణ్యత లేకుండా పోయిందన్నారు. ఆ పేరుతో తన సంస్థకు లబ్ధి చేకూర్చడం కోసం తాజాగా టెండర్లలో ధరను రెట్టింపు చేసుకున్నారు. ఈ విషయం బట్టబయలైంది. దీంతో హెరిటేజ్–ఇందాపూర్ డెయిరీ మధ్య సంబంధంపై చర్చించాలని మండలిలో వైఎస్సార్‌సీపీ పట్టుపట్టింది. దీంతో డ్రామా మొదలైంది. ఎప్పుడూలేని విధంగా సభలో తొలిసారి మైక్, సౌండ్ సిస్టమ్ పని చేయలేదు. ఆ పేరుతో మండలి ఆలస్యంగా మొదలైంది. ఉదయం 10కి మండలి ప్రారంభం కాగా.. మైక్, సౌండ్ సిస్టమ్ పనిచేయడం లేదని మళ్లీ గంటపాటు సభకు విరామం ప్రకటించారు. అనంతరం 11 గంటలకు సభ తిరిగి ప్రారంభమైంది. వైఎస్సార్‌సీపీ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తిరస్కరించగానే మైకులు మళ్లీ పని చేయలేదు. దీంతో 11.15 గంటలకు సభ మళ్లీ వాయిదా పడింది. తిరిగి 12.17 గంటలకు మొదలైంది.. ఆ తర్వాత మళ్లీ సభ వాయిదా.. మళ్లీ 1.42 గంటలకు ప్రారంభం.. మండలిలో విపక్షనేత బొత్స మాట్లాడుతుండగానే బుధవారానికి సభ వాయిదా పడింది. ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందనడానికి ఇదే నిదర్శనం' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్రీవారి సొమ్ము దోపిడీకి ఇందాపూర్ ముసుగు

- ఇది సీఎం చంద్రబాబు మరో స్కామ్
- మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపాటు
- ఆ డెయిరీ పేరుతో హెరిటేజ్‌కు దోచి పెట్టేందుకు కుట్ర
- టీటీడీ నెయ్యి కాంట్రాక్ట్ దక్కించుకునే కుతంత్రం
- అందుకే లడ్డూల్లో కల్తీ నెయ్యి వాడారంటూ నిందలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలు, దుష్ప్రచారం
- హెరిటేజ్ వెబ్‌సైట్‌లో మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌గా ఇందాపూర్ డెయిరీ
- గుట్టు రట్టు కావడంతో వెబ్‌సైట్‌లో వివరాలు మార్పు

సాక్షి, అమరావతి : చంద్రబాబు మరో స్కామ్ ఇందాపూర్ డెయిరీ అని, ఆ డెయిరీ పేరుతో హెరిటేజ్‌కు దోచి పెట్టేందుకు ఆయన కుట్ర చేశారని శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. హెరిటేజ్.. టీటీడీకి నెయ్యి సరఫరా చేసే కాంట్రాక్ట్ దక్కించుకునే కుతంత్రం చేసిన చంద్రబాబు, తిరుమల లడ్డూల్లో కల్తీ నెయ్యి వాడారని నిందలు వేశారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. అయితే ఇందాపూర్ డెయిరీ వ్యవహారంతో చంద్రబాబు కుట్ర బట్టబయలు అయిందని, అందుకే సభలో తాము చర్చకు పట్టుబడితే ప్రభుత్వం పారిపోయిందన్నారు. మంగళవారం ఆయన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలతో కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. 'ఇందాపూర్ డెయిరీ ముసుగులో భారీ ఎత్తున శ్రీవేంకటేశ్వరస్వామి సంపదను తన కుటుంబ సంస్థ హెరిటేజ్‌కు దోచి పెట్టేందుకు చంద్రబాబు పూనుకున్నాడు. ఆ దుర్బుద్ధితోనే కల్తీ నెయ్యి పేరుతో శ్రీవారి ప్రసాదంపై నిందలు మోపాడు. ఇప్పుడు చంద్రబాబు చేసిన కుట్రలు బట్టబయలయ్యాయి. అందుకే ఇందాపూర్–హెరిటేజ్ అనుబంధం గురించి మండలిలో చర్చకు పట్టుబడితే ప్రభుత్వం భయపడి పోతోంది' అన్నారు. బొత్స ఇంకా ఏమన్నారంటే..

అందుకే లడ్డూపై దుష్ప్రచారం

- ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ఎంతో భక్తితో పూజించే కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరుడి లడ్డూ ప్రసాదం గురించి సీఎం చంద్రబాబు తప్పుడు ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూశాడు. లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు, గొడ్డు మాంసం, చేపల నూనె కలిసిందని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సహా కూటమి నాయకులు దుష్ప్రచారం చేశారు.
- జంతువుల కొవ్వు కలిసిందంటూ వారు చేసిన ప్రచారమంతా పచ్చి అబద్ధమని సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ ఏర్పాటు చేసిన సిట్ చార్జిషీట్‌తో తేటతెల్లమైంది. ఈ నేపథ్యంలోనే లడ్డూపై దుష్ప్రచారం చేయడం వెనుక ఉన్న దుర్బుద్ధి బయట పడింది. తన కుటుంబ సంస్థ హెరిటేజ్ డెయిరీకి లాభం చేకూర్చడానికి దేవుడి లడ్డూను వాడుకున్నాడు. పనిలో పనిగా వైఎస్ జగన్‌ను హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించడానికి భారీ కుట్ర చేశాడు.

నాడు నెయ్యి కాంట్రాక్టులు ఇందాపూర్ డెయిరీకే

- 2014–19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ నెయ్యి సరఫరా కాంట్రాక్టులను ఇందాపూర్ డెయిరీ అనే సంస్థ ముసుగులో హెరిటేజ్ ఫుడ్స్ సంస్థకు చంద్రబాబు కట్టబెట్టారు. ఈ ఇందాపూర్ డెయిరీ అనేది హెరిటేజ్ ఫుడ్స్ అనుబంధ సంస్థే. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చైర్‌పర్సన్‌గా ఉన్న హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్‌కు దేశంలో పాలు, పాల ఉత్పత్తులు (డెయిరీ ప్రొడక్ట్స్) తయారు చేసే 22 సంస్థలు ఉన్నాయి.
- మహారాష్ట్రలోని 'ఇందాపూర్ డెయిరీ అండ్ మిల్క్ ప్రొడక్ట్స్ లిమిటెడ్' కూడా వాటిలో ఒకటి. ఆ ఇందాపూర్ డెయిరీకే 2014–19లో నాటి సీఎం చంద్రబాబు ఏకపక్షంగా టీటీడీ నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టింది. ఇందాపూర్ డెయిరీ సరఫరా చేసిన నెయ్యి శాంపిల్స్ 2016లో ల్యాబ్ పరీక్షల్లో విఫలమయ్యాయి. ఆ డెయిరీపై అనర్హత వేటు వేశారు. కానీ కేవలం ఆరు నెలల్లోనే ఆ అనర్హతను తొలగించారు. ఆ తర్వాత 2019లో అధికారం నుంచి దిగిపోయే వరకు ఇందాపూర్ డెయిరీకి రూ.వందల కోట్ల విలువైన నెయ్యి కాంట్రాక్టులు అప్పగించారు.
- 2019లో టీడీపీ అధికారం కోల్పోగానే హెరిటేజ్ ఫుడ్స్‌కు చెందిన ఇందాపూర్ డెయిరీ టీటీడీ టెండర్ల ప్రక్రియ నుంచి తప్పుకుంది. అయిదేళ్ల పాటు కనీసం బిడ్లు కూడా దాఖలు చేయలేదు. 2024లో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడగానే మళ్లీ తెరపైకి వచ్చింది. 2025 డిసెంబరులో టీటీడీ నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొంది.

హెరిటేజ్ డెయిరీకి ఇందాపూర్ ముసుగు

- ఇందాపూర్ డెయిరీకి హెరిటేజ్ డెయిరీతో ఉన్న అనుబంధం గురించి హెరిటేజ్ వెబ్‌సైట్‌లోనే రాసి ఉంది. ఇందాపూర్ డెయిరీని మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్, ఫ్యాక్టరీల అడ్రస్‌ల పేరుతో స్పష్టంగా రాసుకుంది. ఇండోర్ అడ్రస్‌తో 17వ యూనిట్‌గా ఇందాపూర్ డెయిరీ గురించి రాశారు. ఈ ఇందాపూర్ డెయిరీ ద్వారానే హెరిటేజ్ ఫుడ్స్ తిరుమలకు నెయ్యి తయారు చేసినట్టు మీడియా ద్వారా ప్రపంచానికి తెలియగానే హెరిటేజ్ వెబ్‌సైట్ నుంచి ఇందాపూర్ ప్లాంట్‌ను అనుబంధ సంస్థగా మార్చేసి మసిపూసి మారేడుకాయ చేయాలని చూశారు.
- వెబ్‌సైట్‌లో అప్పటి వరకు ఇందాపూర్ డెయిరీని మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ల జాబితాలో చూపిన హెరిటేజ్ డెయిరీ, తమ వ్యవహారం బయట పడటంతో ఇందాపూర్ డెయిరీని మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ల జాబితా నుంచి తొలగించి, కో మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లలో చేర్చారు.

చర్చకు ప్రభుత్వం భయపడింది

- హెరిటేజ్ డెయిరీతో ఇందాపూర్ డెయిరీకి ఉన్న అనుబంధం గురించి చర్చించాలని మండలిలో వైఎస్సార్‌సీపీ పట్టుబడితే ప్రభుత్వం భయపడి పారిపోయింది. రూ.300కు స్వచ్ఛమైన కేజీ నెయ్యి వస్తుందా.. అని మాట్లాడిన చంద్రబాబు మాటల వెనుక మర్మం ఇందాపూర్ డెయిరీకి డబుల్ రేటుకు నెయ్యి కాంట్రాక్టు కట్టబెట్టడమేనని తేలిపోయింది. 2025 డిసెంబర్‌లో టీటీడీ నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొన్న ఇందాపూర్ డెయిరీ.. రూ.658కి కేజీ నెయ్యి సరఫరా చేస్తామని కోట్ చేసింది. దీంతో అదే ధరకు నెయ్యి సరఫరా చేసేలా, గత ఏడాది డిసెంబర్‌లో టీటీడీ ఇందాపూర్ డెయిరీకి కాంట్రాక్ట్ ఖరారు చేసింది.
- అధిక ధరలకు హెరిటేజ్‌కి నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టడానికి తిరుమల లడ్డూ గురించి చంద్రబాబు దిగజారుడు వ్యాఖ్యలు చేశారు. దోచుకోవడం కోసం దేవుడిని రాజకీయాల్లోకి లాగడం కన్నా దుర్మార్గం ఇంకోటి ఉంటుందా? హిందూ ధర్మ పరిరక్షణ పేరుతో రాజకీయాలు చేస్తూ భక్తుల విశ్వాసాలతో ఆడుకోవడం సిగ్గుచేటు.

చంద్రబాబు మూల్యం చెల్లించక తప్పదు

- ఇందాపూర్ డెయిరీ ముసుగులో చంద్రబాబు హెరిటేజ్ డెయిరీకి రూ.వందల కోట్లు దోచి పెట్టడానికి సిద్ధపడ్డాడు అనేది సుస్పష్టం. అందులో భాగంగానే కల్తీ నెయ్యి ముసుగులో రాజకీయ వికృత క్రీడకు దిగాడు. టాయ్‌లెట్లు క్లీన్ చేసే కెమికల్స్‌ని కూడా లడ్డూ తయారీకి వాడారని చెప్పడం సిగ్గుచేటు. ఇది క్షమించరాని తప్పు. దోపిడీ చేయడమే ధ్యేయంగా దేవదేవుడి మీద నిందలు మోపిన వారిని ఆ దేవుడు క్షమించడు.
- ఇందాపూర్ డెయిరీపై మండలిలో చర్చ జరిగితే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయన్న భయంతోనే ప్రభుత్వం చర్చకు రాకుండా పారిపోయింది. కల్తీ ముసుగులో అడ్డగోలుగా తప్పులు చేసిన చంద్రబాబు దేవుడి ముందు దొరికిపోయాడు. కల్తీ నెయ్యి పేరుతో చంద్రబాబు దుర్మార్గంపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. దేవుడి ముసుగులో చంద్రబాబు చేసిన దారుణాలకు మూల్యం చెల్లించుకోక తప్పదు.
- సీఎం చంద్రబాబు వ్యక్తిగత ప్రతిష్ట, వ్యక్తిగత లబ్ధి కోసం ఏ స్థాయికైనా దిగజారిపోతాడని తిరుమల లడ్డూ పేరుతో చేసిన కుట్రలే రుజువు చేస్తున్నాయి. వ్యక్తిగత ప్రతిష్ట కోసమే బిల్‌గేట్స్‌ని పిలిపించుకుని చంద్రబాబు విపరీతంగా పబ్లిసిటీ చేసుకుంటున్నాడు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటింటికీ ఉచిత వైద్యం అందించేలా విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్టును తీసుకొస్తే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దానిని చంద్రబాబు నిర్వీర్యం చేశాడు.
- నాడు వైఎస్సార్‌సీపీ హయాంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్న విద్య, వ్యవసాయ రంగాలను నాశనం చేసిన చంద్రబాబు.. గేట్స్ ఫౌండేషన్ సహకారం పేరుతో బిల్‌గేట్స్‌ని పిలిపించి పబ్లిసిటీ చేసుకోవడం దుర్మార్గం. సభ్యుల హాజరు నమోదు చేయడానికి అసెంబ్లీలో ఫేస్ రికగ్నిషన్ ప్రవేశపెట్టిన ప్రభుత్వం, కౌన్సిల్‌లో ఆ పని ఎందుకు చేయడం లేదు?

నినాదాలతో హోరెత్తిన అసెంబ్లీ ప్రాంగణం

వైఎస్సార్‌సీపీ సభ్యుల నినాదాలతో అసెంబ్లీ ప్రాంగణం హోరెత్తింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు మంగళవారం శాసనమండలిలో సభ వాయిదా పడిన అనంతరం విపక్ష నేత బొత్స సత్యనారాయణతో కలిసి పెద్దపెట్టున మూకుమ్మడిగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బయటకు వచ్చారు. ప్లకార్డులు చేతబూని అసెంబ్లీ బయట మీడియా పాయింట్ వద్దకు వచ్చి నినాదాలు చేశారు. చంద్రబాబు బండారం బట్టబయలైందని, హెరిటేజ్–ఇందాపూర్ బంధంపై చర్చించలేక ప్రభుత్వం పారిపోయిందని ఎద్దేవా చేశారు.

క్లుప్తంగా...

దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలి

జేఈఈ టాపర్స్‌కు వైఎస్ జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: జేఈఈ పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించి టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. జేఈఈలో ప్రతిభ కనబరిచి ఉన్నత ర్యాంకులు సాధించడం వెనుక విద్యార్థుల ప్రతిభ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం ఉందని పేర్కొన్నారు. ఈ విజయం భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రానికి కీర్తి తీసుకువచ్చిన ఈ ప్రతిభావంతులైన విద్యార్థులు భవిష్యత్తులో దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు 72వ జన్మదినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. కేసీఆర్‌తో ఉన్న ఫొటోను షేర్ చేశారు.

మాజీ ఎంపీ రత్నాబాయి మృతి పట్ల జగన్ సంతాపం

సాక్షి, అమరావతి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ ఎంపీ తడపట్ల రత్నాబాయి (79) మరణం పట్ల మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. రత్నాబాయి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రత్నాబాయి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని వైఎస్ జగన్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

మదనపల్లె ఘటనకు ప్రభుత్వ వైఫల్యమే కారణం

ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఆగ్రహం

సాక్షి,అమరావతి: మదనపల్లెలో ఏడేళ్ల చిన్నారి హత్యాచార ఘటనకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని, ఈ ఘటనలో నిందితుడిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. మదనపల్లెలో జరిగిన దారుణం రాష్ట్రాన్ని కలచివేసిందని, చిన్నారుల భద్రతలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి, మద్యం విచ్చలవిడిగా లభించడం వల్లే మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

సివిల్ రిజిస్ట్రేషన్లకు జనన ధ్రువీకరణ పత్రముంటే చాలు

సాక్షి, అమరావతి: విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ఆధార్, ఓటరు నమోదు, డ్రైవింగ్ లైసెన్స్ జారీ, ఇతర సివిల్ రిజిస్ట్రేషన్లకు ప్రజలు ఇకపై జనన ధ్రువీకరణ పత్రం ఇస్తే సరిపోతుంది. ఈ మేరకు జనన, మరణాల నమోదు (సవరణ) చట్టం–2023 అమలుపై సోమవారం వైద్య, ఆరోగ్య శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో సోమవారం నుంచి రాష్ట్రంలో ఏపీ జనన, మరణాల నమోదు నిబంధనలు అమలులోకి వచ్చాయి. ఇప్పటి వరకూ సివిల్ రిజిస్ట్రేషన్‌లలో వివిధ శాఖలు జనన ధ్రువీకరణ పత్రాన్ని ఆప్షనల్‌గా మాత్రమే పరిగణిస్తూ వస్తున్నాయి. నూతన నిబంధనల ప్రకారం జనన ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

ఆర్టీపీపీకి 2.60 టీఎంసీలు

సాక్షి, అమరావతి: రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ (ఆర్టీపీపీ)కు మైలవరం, గండికోట రిజర్వాయర్ల నుంచి 2.60 టీఎంసీలను కేటాయిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

మదనపల్లె అన్నమయ్య సర్కిల్ జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న ప్రజలు

కంటి'పాప'ను చిదిమేశాడు

మదనపల్లెలో గంజాయి మత్తులో నరరూప రాక్షసుడి ఘాతుకం

- ఏడేళ్ల బాలికపై లైంగిక దాడి.. అనంతరం నీటి డ్రమ్ములో ముంచి చంపేసిన ఉన్మాది
- నిందితుడి ఇంట్లోనే బయటపడిన చిట్టితల్లి మృతదేహం
- వెల్లువెత్తిన ప్రజాగ్రహం

మదనపల్లె / మదనపల్లె టౌన్: అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెలో అదృశ్యమైన ఏడేళ్ల చిన్నారి హత్యాచారానికి గురైంది. ఆమెపై నిందితుడు లైంగికదాడి చేసి, ఆపై హత్య చేసినట్టు కర్నూలు రేంజ్ డీఐజీ కోయప్రవీణ్ మంగళవారం రాత్రి ప్రకటించారు. మదనపల్లె పట్టణంలో రెండో తరగతి చదువుతున్న ఏడేళ్ల చిన్నారి సోమవారం సాయంత్రం ఆడుకుంటూ అదృశ్యమైంది. తల్లిదండ్రులు, బంధువులు ఎంత గాలించినా జాడ కానరాలేదు. దీంతో ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. రాత్రంతా ఎంత వెతికినా చిన్నారి ఆచూకీ లభ్యం కాలేదు. కుటుంబీకులు అనుమానంతో బాలిక ఇంటికి సమీపంలోనే ఉండే కులవర్ధన్ అనే వ్యక్తిపై మంగళవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు కులవర్ధన్ ఇంటికి చేరుకున్నారు. లోపల తలుపులు వేసుకుని కులవర్ధన్ ఎంతకీ తీయకపోవడంతో పోలీసులు గడియ పగలగొట్టి లోపలికి వెళ్లారు. అక్కడ ఓ డ్రమ్ములో బాలిక మృతదేహం కనిపించింది. నిందితుడే చిన్నారిపై లైంగిక దాడి చేసి డ్రమ్ములో పెట్టాడని తెలియడంతో బాలిక తల్లిదండ్రులు, బంధువుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ప్రజలూ ఈ ఘటనపై రగిలిపోయారు. దీంతో పట్టణంలో ఒక్కసారిగా ఆందోళనలు మిన్నంటాయి. సర్కారు, పోలీసుల తాత్సారం, నిర్లక్ష్యంపైనా నిరసనలు వెల్లువెత్తాయి. నిందితుడిని తమకు అప్పగించాలని తల్లిదండ్రులు, బంధువులు పట్టుబట్టారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించడాన్ని అడ్డుకున్నారు. ఎట్టకేలకు కడప ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించడానికి అంగీకరించారు.

లైంగిక దాడి చేసి, హత్య చేశాడు: డీఐజీ

కులవర్ధన్ బాలికపై లైంగిక దాడి చేసి.. ఆపై నీటి డ్రమ్ములో ముంచి హత్య చేశాడని డీఐజీ కోయ ప్రవీణ్ మంగళవారం రాత్రి వెల్లడించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ తాము ఇంటి తలుపులు పగలగొట్టి బాలిక మృతదేహాన్ని గుర్తించామని, అయితే నిందితుడు పరారయ్యాడని, అతడిని పట్టుకునేందుకు గాలిస్తున్నామని వివరించారు. నిందితుడి ఇంటిపై నిఘా పెట్టామని వెల్లడించారు.

ఎస్పీ, సబ్ కలెక్టర్ ప్రయత్నం విఫలం

బాలిక హత్యాచారాన్ని నిరసిస్తూ మదనపల్లె అన్నమయ్య సర్కిల్ జాతీయ రహదారిపై ప్రజలు మంగళవారం ఉదయం నుంచే ఆందోళన చేపట్టారు. బాలిక తల్లి ప్రజలతో కలిసి రోడ్డుపైనే బైఠాయించింది. గంటలు తరబడి ఆందోళన కొనసాగించారు. ఎస్పీ, మదనపల్లె డీఎస్పీ అందుబాటులో లేకపోవడంతో కడప ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ మదనపల్లె చేరుకున్నారు. బాలిక తల్లితో చర్చించారు. నిరసన విరమించాలని కోరారు. అయినా తల్లి అంగీకరించలేదు. న్యాయం చేయాలని ఎస్పీ, సబ్ కలెక్టర్‌ను వేడుకుంది. పోలీస్ గోబ్యాక్ అని ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

నిందితుని ఇల్లు ముట్టడి, ఉద్రిక్తత

నిందితుడు కులవర్ధన్ ఇంటిని మంగళవారం ఉదయం స్థానిక ప్రజలు ముట్టడించారు. చిన్నారిని చిదిమేసిన ఉన్మాదిని తక్షణమే శిక్షించాలని పట్టుబట్టారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు బిడ్డకు న్యాయం జరగాల్సిందేనని డిమాండ్ చేశారు. న్యాయం చేస్తామని పోలీసులు, అధికారులు వచ్చి చెప్పినా వినలేదు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్, డీఎస్పీ మహేంద్ర విజయవాడ వెళ్లడంతో సత్వర నిర్ణయాలు తీసుకునేందుకు జాప్యం జరిగినట్టు పోలీసులు చెబుతున్నారు. ప్రజలు నిందితుడి ఇంటివద్దే సాయంత్రం వరకు ఉన్నారు. రాక్షసుడిని తమకు అప్పగించాలని పట్టుబట్టారు. దీంతో రాకపోకలు స్తంభించాయి.

గంజాయికి బానిస

నిందితుడు కులవర్ధన్ గంజాయికి బానిసని స్థానికులు చెబుతున్నారు. అతడికి నేరచరిత్ర కూడా ఉన్నట్టు సమాచారం. స్థానికులు చాలాసార్లు నిందితుడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెబుతున్నారు. ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారికి మాయమాటలు చెప్పి తీసుకెళ్లి ఉంటాడని భావిస్తున్నారు. మంగళవారం ఉదయం కూడా గంజాయి మత్తులోనే ఉన్నాడని, అందువల్లే తలుపులు తట్టినా తీయలేదని పోలీసులే చెబుతున్నారు.

కులవర్ధన్ సైకో: బాలిక తండ్రి

తన బిడ్డను పొట్టన పెట్టుకున్న కులవర్ధన్ సైకో అని బాలిక తండ్రి హోం మంత్రి అనితతో తన ఆవేదన వెలిబుచ్చాడు. బాలిక మరణంపై అనిత ఫోన్‌లో తల్లిదండ్రులతో మాట్లాడారు. తన బిడ్డను చంపిన వ్యక్తిపై తక్షణం చర్యలు తీసుకోవాలని తండ్రి డిమాండ్ చేశాడు. బాలిక మరణంపై ఆధారాలు సేకరించాలంటే పోలీసులకు సహకరించాలని మంత్రి కోరారు. నిందితుడికి బెయిల్ రాకుండా జైలులోనే ఉంచి, ఆపై శిక్ష పడేలా చేస్తామని హామీ ఇచ్చారు. తర్వాత మంత్రి బాలిక తల్లితో మాట్లాడారు. కాగా, నిందితుడు పారిపోయాడని పోలీసులు చెబుతున్న మాటలు నమ్మశక్యంగా లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. తలుపులు వేసుకుని లోపలే ఉన్న అతను ఎలా పారిపోయాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరులో విద్యార్థినిపై టీచర్ అత్యాచారం

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): గుంటూరులో ఒక ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థిని (13)పై అదే పాఠశాల ఉపాధ్యాయుడు అత్యాచారం చేశాడు. దీనిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన బాలిక ఒక ప్రైవేట్ పాఠశాలలో చదువుతోంది. ఆ బాలికపై కన్నేసిన అదే పాఠశాల ఉపాధ్యాయుడు.. తనతో మాట్లాడకపోతే చనిపోతానంటూ బాలికను బెదిరించి మాట్లాడుతుండేవాడు. బాలిక తండ్రి ఫోన్ నంబరు తీసుకున్న అతడు ఇటీవల ఒకరోజు ఫోన్‌చేసి బాలికతో మాట్లాడాడు. ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించి ఆ బాలికను మోటారుసైకిల్ మీద విజయవాడ తీసుకెళ్లాడు. అక్కడ ఒక లాడ్జిలో బాలికపై అత్యాచారం చేశాడు. ఈ విషయం తెలిసి నిలదీసిన బాలిక కుటుంబసభ్యులను కులం పేరుతో దూషించాడు. దీంతో బాలిక కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇబ్రహీంపట్నంలో మరో బాలికపై ఘాతుకం

- పలుమార్లు యువకుడి లైంగిక దాడి
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
- బాలిక గర్భం దాల్చడంతో తల్లిదండ్రుల ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన బాలికపై హైదరాబాద్‌కు చెందిన యువకుడు పలుమార్లు లైంగికదాడి చేసిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాలిక గర్భం దాల్చడంతో తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన యువకుడికి, ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన బాలికతో గతంలో పరిచయమైంది. ఇబ్రహీంపట్నం మండలంలో ఆ యువకుడికి బంధువులు ఉండటంతో తరుచూ ఇక్కడికి వచ్చేవాడు. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం సమీపంలోని ఓ లాడ్జిలో పలు మార్లు బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక అనారోగ్యానికి గురికావడంతో తల్లి దండ్రులు ఆరా తీశారు. దీంతో జరిగిన విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో యువకుడిపై ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

'పోక్సో' నిందితుడికి స్టేషన్ బెయిల్!

- బాధిత కుటుంబానికి జైలు
- ఇదీ చంద్రబాబు మార్కు పాలన
- నిందితుడు టీడీపీకి చెందిన వాడు కావడమే కారణం
- కూటమి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఒత్తిడితోనే బాధితులపై కేసు
- తమకు న్యాయం చేయాలని కన్నీరుమున్నీరైన బాధితులు

అనపర్తి: పోక్సో కేసు నమోదైన నిందితుడికి పోలీసులు రాచమర్యాదలు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చిన ఘటన వివాదాస్పదమైంది. తమ కుమార్తెపై లైంగిక దాడికి యత్నించాడని ఫిర్యాదు చేసిన పాపానికి తిరిగి తమ కుటుంబ సభ్యులందరిపైనే అన్యాయంగా హత్యాయత్నం కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపారని తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలానికి చెందిన బాధితులు మంగళవారం విలేకరుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడు టీడీపీ గ్రామ నాయకుడి కుమారుడు కావడం వల్లే అతనిపై పోలీసులు అతిప్రేమ చూపించారని కన్నీటిపర్యంతమయ్యారు. చంద్రబాబు నాయుడి హయాంలో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆక్రోశించారు. **అసలేం జరిగిందంటే..** బాధితుల కథనం ప్రకారం.. బిక్కవోలు మండలంలో ఆరో తరగతి చదువుతున్న బాలికపై అదే గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు నంగన వెంకట రమణ కుమారుడు నరసింహ గత నెల 26న లైంగిక దాడికి యత్నించాడు. ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు నరసింహ తండ్రి వెంకట రమణను ప్రశ్నించడానికి వారింటికి వెళ్లారు. ఆ సమయంలో నరసింహ కత్తితో బాలిక తల్లిదండ్రులపైనే దాడికి యత్నించాడు. దీంతో బాధితులు బిక్కవోలు పోలీసులను ఆశ్రయించారు. మూడు రోజులపాటు స్టేషన్ చుట్టూ తిప్పించుకున్న పోలీసులు నిందితులతో రాజీ కుదుర్చుకోవాలంటూ బాధితులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. మూడు రోజుల అనంతరం బాధిత కుటుంబ సభ్యులు ఐదుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు వారికి రిమాండ్ విధించింది. ఇంటి వద్ద బాధితురాలైన తమ కుమార్తె, వృద్ధురాలైన ఆమె అమ్మమ్మ మాత్రమే బిక్కుబిక్కుమంటూ ఉన్నారని బాలిక తల్లిదండ్రులు వివరించారు. నిందితులు అధికార టీడీపీ నాయకులు కావడంతో కూటమి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సహకారంతో తమపై ఇంతటి దారుణానికి ఒడిగట్టారని, దర్యాప్తు అధికారిని కూడా స్థానిక అధికారులు తప్పుదోవ పట్టించారని విమర్శించారు.

చంద్రబాబూ ఇకనైనా మేలుకో!

ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'మదనపల్లె పరిధిలో ఏడేళ్ల బాలికపై లైంగిక దాడి జరిపి, ఆపై హత్యచేసి, నీటి డ్రమ్ములో కుక్కిన దారుణమైన ఘటన మీకు, మీ ప్రభుత్వానికి సిగ్గుచేటు కాదా?' అని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. బాలిక కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎందుకు కాపాడలేకపోయారని నిలదీశారు. ఇకనైనా మేలుకుని తక్షణమే శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టి మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించి.. వారి ప్రాణాలు కాపాడటంపై దృష్టి పెట్టాలని చంద్రబాబుకు హితవు పలికారు. ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వైఎస్ జగన్ పోస్ట్ చేశారు. 'నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం కొత్త ముచ్చుమర్రిలో తొమ్మిదేళ్ల గిరిజన బాలిక, వైఎస్సార్ కడప జిల్లా మైలవరం మండలం ఎ.కంబాలదిన్నెలో మూడేళ్ల బాలిక, తిరుపతి జిల్లా వడమాలపేటలో మూడున్నరేళ్ల చిన్నారి లైంగిక దాడికి గురై, ఆపై హత్యకు గురయ్యారు. ఇలా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక బాలికలు, మహిళలపై ఎన్నో దారుణమైన ఘటనలు జరిగాయి' అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ ఘటనలను తేలిగ్గా తీసుకుందనేది వాస్తవమన్నారు. ఎల్లో మీడియాలో హడావుడి ప్రకటనలు చేయడం, అనంతరం ఆ విషయాన్ని వదిలేయడం సహజంగా మారిందన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే, ప్రశ్నించిన వారు మాజీ మంత్రులైనా వారి ఇళ్లమీద పోలీసులను వాడుకుని ఒక వ్యూహంతో దాడులు చేయించి, ఆస్తులను ధ్వంసం చేయడంతో పాటు హత్యాయత్నాలు చేయించడంపై ఉన్న శ్రద్ధ రాష్ట్రంలో బాలికలు, మహిళలకు రక్షణ కల్పించడంపై చంద్రబాబుకు లేదని మండిపడ్డారు. శాంతిభద్రతలపై హోం మంత్రి బాధ్యత వహించరని, చంద్రబాబు కుమారుడు ఆయన శాఖలను నీరుగారుస్తూ.. అందరి శాఖల్లో వేలుపెడతారని విమర్శించారు. ఏ మంత్రీ దేనికీ బాధ్యత వహించరన్నారు. 'ముఖ్యమంత్రిగా మీకు ప్రచారం తప్ప మరేమీ పట్టదు. సొంత జేబులు నింపుకోవడం, పబ్లిసిటీ చేసుకోవడమే ఇప్పుడున్న ప్రభుత్వంలో ఉన్నవారి పనిగా మారిపోయింది. మరి ఇలాంటి దారుణాలపై ఎవరు దృష్టిపెడతారు?' అని చంద్రబాబును ప్రశ్నించారు. 'చంద్రబాబు సృష్టించిన పొలిటికల్ గవర్నెన్స్‌తో, రెడ్ బుక్ రాజ్యాంగంతో పోలీసు సహా వ్యవస్థలను కలుషితం చేస్తే ఇక లా అండ్ ఆర్డర్ ఎలా ఉంటుంది? ఎలా బతుకుతుంది? చిన్నారులకు, మహిళలకు రక్షణ ఎక్కడ నుంచి లభిస్తుంది? మీ పాలనా వైఫల్యాలకు, అసమర్థతకు అభం శుభం తెలియని బాలికలు, మహిళలు బలైపోవాలా? ప్రతిరోజూ భయంతో బతకాలా? పైగా అన్యాయం జరిగిందని ఎవరైనా పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే, బాధితులపైనే ఎదురు కేసులు పెట్టి అన్యాయంగా జైళ్లకు పంపుతున్నారు' అని వైఎస్ జగన్ మండిపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం రంగాపురంలో ఓ టీడీపీ నాయకుడు మైనర్ బాలికపై అత్యాచారయత్నం చేస్తే కేసు కట్టి అరెస్టు చేయాల్సిన పోలీసులు మూడు రోజులు స్టేషన్ చుట్టూ తిప్పి, చివరకు టీడీపీ నేతల ఒత్తిడితో తమపైనే హత్యాయత్నం కేసు పెట్టి జైళ్లకు పంపారని ఆ బాలిక కుటుంబ సభ్యులు వాపోతున్నారని వెల్లడించారు. ఈ లెక్కన రాష్ట్రంలో ఎవరికి న్యాయం జరుగుతుందని వైఎస్ జగన్ ఆందోళన వ్యక్తం చేశారు.

రిటైర్మెంట్‌కు రెండేళ్ల ముందే సర్వీస్ ధ్రువీకరణ

- నిధి పోర్టల్‌లో కామన్ అప్లికేషన్ ఫాం
- ఉత్తర్వులు జారీచేసిన ఆర్థికశాఖ

సాక్షి, అమరావతి: ఉద్యోగులు పదవీ విరమణ ప్రయోజనం పొందేందుకు దరఖాస్తులు, సంబంధిత ఫాంలలో మార్పులు చేస్తూ ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం పదవీ విరమణ సమయంలో మాత్రమే సర్వీస్ వివరాలు తనిఖీ చేస్తుండటం వల్ల పెన్షన్ దరఖాస్తుల ప్రాసెసింగ్‌లో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని నివారించేందుకు ప్రీ రిటైర్మెంట్ సర్వీస్ వెరిఫికేషన్ చేపట్టినట్లు తెలిపారు. పదవీ విరమణ తేదీకి రెండేళ్ల ముందు సర్వీస్ వివరాల ధ్రువీకరణను తప్పనిసరి చేశారు. ఇది పదవీ విరమణ సమయంలో చివరి రెండేళ్ల సర్వీస్ వివరాల ధ్రువీకరణను సులభతరం చేస్తుందని, ప్రక్రియ జాప్యాన్ని తొలగిస్తుందని పేర్కొన్నారు. ఆర్థికశాఖ నిధి పోర్టల్ ద్వారా పదవీ విరమణ ప్రయోజనాలను ఆన్‌లైన్‌లో అందించే ప్రక్రియను క్రమబద్ధీకరించడంతో పాటు డిజిటలైజ్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పోర్టల్‌లోని కామన్ అప్లికేషన్ ఫాం ద్వారా దరఖాస్తుల్ని ప్రాసెస్ చేయనున్నట్లు తెలిపారు. సర్వీస్ రిజిస్టర్‌కి సంబంధించినవి తప్ప దేనికీ మాన్యువల్ ప్రక్రియలు, భౌతికపత్రాలు ఉండవని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సాక్షి SAKSHI.COM
సాక్షి టీవీ ప్రసారాలను నిలిపివేయడం..
చట్టరీత్యా నేరం...
సాక్షి టీవీ ప్రసారాలు మీ హక్కు..
ప్రసారాలను అడ్డుకోవడం చట్టవిరుద్ధం...
ప్రజల కోసమే మా పోరాటం ప్రజా గొంతుకై నినదిస్తాం
వార్తల వెనుక వాస్తవాలు తెలియాలంటే
సాక్షి టీవీ చూడండి
సాక్షి టీవీ ప్రసారాల కోసం...
మీ స్థానిక కేబుల్ ఆపరేటర్‌ను వెంటనే సంప్రదించండి.
డీటీహెచ్‌లో సాక్షి ప్రసారాల కోసం
1456 | 2449 | airtel 907 | 184
ఇంటర్నెట్‌లో సాక్షి ప్రసారాల కోసం
youtube.com/SakshiNews | Jio Fiber | xstream
సత్యమేవ జయతే

డా॥ కె.కె.ఆర్ గౌతమ్
ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ - ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ
దక్షిణ భారతదేశంలో ఒకే ఒక్కడు

P. Mohith
App. No. 26031043291
300/300 MARKS
2026 IIT JEE Main (Session-1) లో
300కి 300 మార్కులు P. Mohith సాధించాడు.
ఇతను మా డా॥ కె.కె.ఆర్ పూర్వ విద్యార్థి.
ఓపెన్ కేటగిరిలో IIT అడ్వాన్స్‌లో All India Below 10 IIT ర్యాంకులు ఎవరైనా ఇన్ని సార్లు సాధించారా?
ఈ ఫలితాలతో మా పూర్వ విద్యార్థులు స్కూలు స్థాయిలో ఐఐటి ఫౌండేషన్‌లో మేమే బెస్ట్ అని నిరూపించారు.

2008 IIT Rank	2011 IIT Rank	2013 IIT Rank	2015 IIT Rank	2020 IIT Rank	2021 IIT Rank	2022 IIT Rank	2024 IIT Rank
7 OC	9 OC	7 OC	9 OC	2 OC	10 OC	6 OC	5 OC
CH Dinesh	J Varun	M Viswa Virinchi	K V Vardhan Reddy	G Bhuvan Reddy	M Hrushikesh Reddy	Polisetty Karthikeya	Putti Kushal Kumar
HT. No 6044346	HT. No 6078245	HT. No 6001059	HT. No 6037138	HT. No 6107225	HT. No 6045193	HT. No 6038078	HT. No 246150349

డా॥ కె.కె.ఆర్ విద్యాసంస్థల వారి
హ్యాపీ వ్యాలీ స్కూల్
ఆగిరిపల్లి (M), తాడేపల్లి(V), కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్.
2026 IIT JEE Main (Session-1) లో
రెండు తెలుగు రాష్ట్రాలలో 12 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ పైన సాధించిన ఏకైక స్కూల్ హ్యాపీ వ్యాలీ స్కూల్.
• 40 ఎకరాల విస్తీర్ణం. ప్రకృతి వ్యాలీలో పొల్యూషన్ లేని క్యాంపస్. • AC హాస్టల్, AC క్లాస్ రూములు, AC డైనింగ్ హాల్. • రుచి మరియు శుచితో పాటు న్యూట్రిషన్ విలువలతో కూడిన భోజన వసతి. • అన్ని రకాల ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ కలవు. • ఇండోర్ స్విమ్మింగ్ పూల్, మెడిటేషన్ కొరకై ఆడిటోరియంలు. • స్కూల్ మరియు +1, +2 లకు అనుభవజ్ఞులైన టీచింగ్ ఫ్యాకల్టీ. • IIT (అడ్వాన్స్), IIT (మెయిన్స్) టీచింగ్ కు స్పెషల్ ఫ్యాకల్టీ. • అన్ని రకాల ఆటలకు, స్పోర్ట్స్ కొరకు విశాలమైన ఆట స్థలాలు. • ఆధునిక టెక్నాలజీతో సెంట్రల్ AC సినిమా థియేటర్. • హ్యూమన్ వాల్యూస్ బోధనకు ప్రత్యేకంగా క్లాసులు.
10th మరియు +2 CBSE బోర్డ్ లో 100% ఫలితాలు.
IIT, NIT, IIIT, మెడికల్, డీమ్డ్ యూనివర్సిటీలలో, విదేశీ యూనివర్సిటీలలో అత్యధికంగా అడ్మిషన్లు సాధిస్తున్న ఏకైక స్కూల్.
అడ్మిషన్స్ జరుగుచున్నవి 4th to +1 CBSE, Co-Education
వివరాలకు : ఫోన్ : 9014 551 223 / 224 / 225,
www: kkrhappyvalley.com సంప్రదించగలరు

నీతో నడిచే జ్ఞానవంతుడైన, నీతిమంతుడైన సహచరుడు నీకు దొరకకపోతే, రాజ్యాన్ని విడిచిపెట్టవలసి వచ్చిన రాజులా ఒంటరిగానే నడువు.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 18 ఫిబ్రవరి 2026

అ'భద్రతా' సదస్సు!

అమెరికా, యూరప్ దేశాలు భిన్న ధ్రువాలని మరోసారి రుజువైంది. భూగోళం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్యలపై ఆ రెండు పక్షాల అధినేతలూ పరస్పరం అభిప్రాయాలు పంచుకునే వార్షిక మ్యూనిక్ భద్రతా సదస్సు (ఎస్‌సీఓ) మరోసారి దీన్ని చాటింది. ఏడాదిగా అవకాశం దొరికినప్పుడల్లా యూరప్ దేశాలను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏకిపారేస్తున్నారు. అయినా తిరిగి జవాబివ్వలేని నిస్సహాయత వాటిని ఆవరించింది. మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైందంటూ ఈ సదస్సుకు ముందు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానియేల్ మెక్రాన్ పిలుపునిచ్చారు. జర్మనీ చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ యూరప్ రాజ్యాలు స్వతంత్ర పంథాను ఎంపిక చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. నిరుడు జరిగిన సదస్సుకు హాజరైన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'మీరు పాటిస్తున్న విలువలేమిటి... స్వేచ్ఛాయుత గళాలను అణిచేస్తారా?' అంటూ నిప్పులు చెరిగినప్పుడు సదస్సులోని యూరప్ దేశాల అధినేతలు నిర్ఘాంతపోయారు. సమాజ సామరస్యతకు భంగం కలిగిస్తున్న అతి మితవాద పక్షాలను యూరప్ దేశాలు అదుపు చేస్తుండటం వాన్స్‌కు నచ్చలేదు. అలాగే తమ మాదిరే యూరప్ దేశాలు కూడా వలస నిబంధనలు కఠినం చేయాలన్నది ఆయన ఉద్దేశం. ఈసారి సదస్సుకు అమెరికా ప్రతినిధిగా వచ్చిన విదేశాంగ మంత్రి మార్కో రుబియో... వాన్స్ మాదిరి గద్దిస్తూ మాట్లాడకపోయినా అవే అభిప్రాయాలను ప్రకటించారు. 'మీతో మాకు గాఢమైన అనుబంధం ఉంది. మన ఇద్దరి భవితవ్యాలూ పెనవేసుకుని ఉన్నాయి. అవి కొనసాగాలనే మా ఆకాంక్ష కూడా! కానీ అవసరమైతే ఒంటరి ప్రయాణానికి మేం సిద్ధం' అంటూ మెత్తగా హెచ్చరించారు.

ఒకప్పుడు మ్యూనిక్ భద్రతా సదస్సు అంటే అమెరికా డాబూ దర్పం ప్రదర్శించే సందర్భం. స్వేచ్ఛాయుత ప్రపంచాధినేతగా అమెరికా అధ్యక్షుడికి నీరాజనాలు పట్టేవారు. పెద్దన్నగా భావించి సలహాలూ, సూచనలూ స్వీకరించేవారు. తొలి సదస్సు నాటి నుంచీ ఇదే స్థితి. కానీ ట్రంప్ ఆగమనంతో అంతా తలకిందులైంది. ఈ సదస్సులకు అమెరికా ప్రతినిధుల సభలోని పాలక, విపక్ష సభ్యులు కూడా హాజరవుతారు. తాము అధికారంలోకొస్తే విదేశాంగ విధానంలో చేసే మార్పులేమిటో విపక్ష ప్రతినిధులు ఏకరవు పెడతారు. వీరిలో మున్ముందు అమెరికా అధ్యక్ష పదవికి పోటీపడదల్చుకున్నవారే అధికంగా వస్తారు. ఈసారి కూడా ఇరుపక్షాల సెనెటర్లు వచ్చారు. కానీ వామపక్ష భావాలున్న డెమాక్రటిక్ పార్టీ సెనెటర్ ఒకాసియో కోర్టెజ్ తప్ప ఇతరులెవరూ ట్రంప్ ప్రవచిస్తున్న విధానాలను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించలేకపోయారు.

డెమాక్రాట్ల అయోమయానికి కారణం ఉంది. 2016లో తొలిసారి ట్రంప్ ఎన్నికైనప్పుడు అది యాదృచ్ఛిక ఘటనగా ఆ పార్టీ భావించింది. యూరప్ అధినేతల అంచనా కూడా అదే! కానీ రెండో దఫా ఎన్నిక వారిలో జ్ఞానోదయాన్ని కలిగించింది. అందుకే ఇది మొత్తంగా అమెరికన్ సమాజ ధోరణిలో వచ్చిన మార్పునకు సంకేతం కావొచ్చన్న నిర్ణయానికొచ్చారు. ట్రంప్ అనంతరం ఎవరు అధికారంలోకొచ్చినా కొంత హెచ్చుతగ్గులతో ఈ విధానాలే తప్పక పోవచ్చని డెమాక్రాట్లు భావిస్తున్నారు. ట్రంప్ కారణంగా విచ్ఛిన్నమైన అమెరికా–యూరప్ బంధాన్ని ఏదో మేరకు మరమ్మతు చేయగలిగినా పూర్వపు స్థితి రావటానికి కొన్ని తరాలు పడుతుందని అరిజోనా సెనెటర్ మార్క్ కెల్లీ వ్యాఖ్యానించటంలోని అంతరార్థం అదే.

ఈసారి భద్రత మాట అటుంచి... మ్యూనిక్ సదస్సు యూరప్ దేశాల అరణ్యరోదనగా మిగిలింది. ఉక్రెయిన్ యుద్ధంపై నిర్వహించిన చర్చకు రుబియో గైర్హాజరయ్యారు. ఆ దేశానికి అమెరికా నుంచి అదనంగా వచ్చిపడేదేమీ లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి అర్థమై ఉండాలి. 'నాటో సభ్యత్వం వద్దు... కనీసం రెండు దశాబ్దాల పాటు మా భద్రతకు పూచీ పడతామని అమెరికా హామీ ఇస్తే రష్యాతో రాజీ పడతామని ఆయనన్నారు. కానీ వినేవారేరి? యూరప్‌దీ అదే స్థితి. గ్రీన్‌ల్యాండ్ విషయంలో రుబియోతో ప్రత్యేకంగా సమావేశమయ్యే అవకాశం వచ్చినా డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ అధినేతలకు ఎలాంటి హామీ దొరకలేదు. మొత్తానికి తమది ఇకపై ఒంటరి పయనమేనని తెలిసింది గనుక స్వీయ ప్రయోజనాలపై యూరప్ దృష్టి సారించాలి. అమెరికా కీలుబొమ్మగా వ్యవహరించటం విరమించుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** శు.పాడ్యమి సా.5.31 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** శతభిషం రా.10.07 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** తె.4.29 నుండి 6.04 వరకు (తెల్లవారితే గురువారం), **దుర్ముహూర్తం:** ప.11.52 నుండి 12.36 వరకు, **అమృత ఘడియలు:** ప.2.44 నుండి 4.21 వరకు.

సూర్యోదయం : 6.29
సూర్యాస్తమయం : 5.58
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

వారి త్యాగాలకు ఇదా విలువ?

సందర్భం

బర్ఖా దత్

ఏ వ్యవస్థను ఎక్కువ విశ్వసిస్తారని ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తే... సాయుధ దళాలు అగ్ర భాగాన నిలుస్తాయి. వరద జలాలలో వంతెనలు నిర్మించడం, మైనస్ ఉష్ణోగ్రతలలో సరిహద్దులను కాపలా కాయడం నుంచి కార్గిల్ యుద్ధం, ఆపరేషన్ సిందూర్ వరకు సైన్యం అందించే సేవలు వెల కట్టలేనివి. వారు విధి నిర్వహణలో రక్తాన్ని, చెమటను, కన్నీటిని చిందించవలసి ఉంటుంది. మనం మన సైనికుల గౌరవాన్ని ఎంతగానో కాపాడుతున్నట్లు చెప్పుకుంటాం. నిజంగా వారిని అంత నెత్తిన పెట్టుకుంటున్నామా? అదే నిజమైతే, 2026 బడ్జెట్ ప్రతిపాదనలలో కొన్నింటిపై మౌనాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? సర్వీసు కాలం పూర్తయ్యేంత వరకు సేవలందించిన, అవయవాలను కోల్పోయిన సైనికులకు ఇచ్చే పెన్షన్‌పై పన్ను విధించే ప్రతిపాదన సబబేనా?

సైనిక వికలాంగులపై పన్నా?

సాయుధ దళాలకు ఇస్తున్న అంగవైకల్య పింఛను మొత్తాలు 1922 నుంచి పన్ను మినహాయింపు పొందుతున్నాయి. ఈ మినహాయింపును పరిమితం చేసే విధంగా ఆదాయ పన్ను చట్టాలకు సవరణ తీసుకురానున్నట్లు 2026 ఫైనాన్స్ బిల్లు పేర్కొంది. అవయవాలు కోల్పోయిన కారణంగా విధుల నుంచి పూర్తిగా వైదొలగవలసి వచ్చిన సైనికులకు మాత్రమే ఆ మినహాయింపును వర్తింప చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. శరీరంలో ఏ అవయవాన్ని అయినా కోల్పోయినా, విధులలో కొనసాగగల శక్తి సామర్థ్యాలున్నాయని మెడికల్ బోర్డు నుంచి సర్టిఫికెట్ తెచ్చుకుని సర్వీసులో కొనసాగి రిటైరైనవారికి ఇచ్చే పెన్షనుకు ఆ మినహాయింపు వర్తించదు. వారు ఒక చెయ్యి లేదా కన్ను లేదా కాలు కోల్పోయినా పన్ను పడుతుంది. సర్వీసులో కొనసాగగల అర్హత లేనంతగా గాయపడిన వారు మాత్రం మినహాయింపు పొందగలుగుతారు.

క్షతగాత్రులైన సైనికులను దయాదాక్షిణ్యాలపైన బతుకుతున్న వారిగా చూడకూడదు. వారు కూడా ఇంచుమించుగా అనన్య సామాన్యమైన శౌర్యవంతులే. తమకు కలిగిన గాయానికి భయపడకుండా, దాని నుంచి మరింత శక్తిని, స్ఫూర్తిని కూడదీసుకుని తమకు అప్పగించిన విధులకు అంకితమవడం నిజానికి ప్రశంసించవలసిన విషయం.

ముగ్గురు వీరుల ముచ్చట

ఫీల్డ్ మార్షల్ సామ్ మానెక్ షా 1971 యుద్ధంలో మనకు విజయాన్ని అందించారు. పాకిస్తాన్ సైన్యం లొంగుబాటు బాట పట్టేటట్లు చేసి, బంగ్లాదేశ్ ఆవిర్భావానికి తోడ్పడ్డారు. ఇంతవరకు మనకున్న ఇద్దరు ఫీల్డ్ మార్షళ్ళలో ఆయనొకరు. వృత్తి జీవితం ఆరంభంలోనే గాయపడిన చరిత్ర సామ్‌కు ఉంది. 1942 సిట్టాంగ్ యుద్ధంలో తన పటాలాన్ని జపాన్ సేనలకు వ్యతిరేకంగా నడిపిస్తూ బులెట్ల బారినపడ్డారు. ఆయన కడుపు, పేగులలోకి తొమ్మిది బుల్లెట్లు దూసుకుపోయాయి. ఎంత తీవ్రంగా గాయపడ్డారంటే, శస్త్ర చికిత్స చేసేందుకు సర్జన్ కూడా సంశయించారు. పైగా 'ఒక కంచర గాడిద తన్నింది' అంటూ సామ్ దాని గురించి హాస్యస్ఫోరకంగా చెప్పుకున్నారు.

◆ సాయుధ దళాలకు ఇస్తున్న అంగవైకల్య పింఛను మొత్తాలు 1922 నుంచి పన్ను మినహాయింపు పొందుతున్నాయి. ఈ మినహాయింపును పరిమితం చేసే విధంగా ఆదాయ పన్ను చట్టాలకు సవరణ చేస్తున్నట్లు 2026 ఫైనాన్స్ బిల్ పేర్కొనడం సైనిక వీరులకు అగౌరవం!

మేజర్ జనరల్ ఇయాన్ కార్డొజో అనుభవం కూడా తక్కువదేమీ కాదు. సామ్ నేతృత్వం వహించిన 1971 యుద్ధంలో కార్డొజో కూడా పాల్గొన్నారు. గూర్ఖా రైఫిల్స్ అధికారి అయిన కార్డొజో అప్పటి తూర్పు పాకిస్తాన్‌లో భాగమైన సిల్హెట్‌లో మందుపాతర పేలుడులో తన కుడి కాలును కోల్పోయారు. ఆయన ఆ సంఘటనను ఎలా ఎదుర్కొన్నారో రోమాంచితమైన రీతిలో ఇప్పటికీ చెప్పుకుంటారు. ఎముకలు కనిపించే విధంగా మాంసం ముక్కలు కాలు నుంచి కిందపడితే ఆయన తన పిడిబాకును బయటకు తీయించి ఛిద్రమైన ఆ భాగాన్ని తెగ్గొట్టవలసిందిగా కింది సిబ్బందిని ఆదేశించారు. ఆ అసాధారణ సైనికుడు మొదట ఒక బెటాలియన్‌కి, ఆ తర్వాత బ్రిగేడ్‌కి నేతృత్వం వహించే స్థాయికి ఎదిగారు. ఒక అవయవాన్ని కోల్పోయిన అధికారి ఆ స్థాయిని అందుకోవడం అదే మొదటిసారి. ఒక కాలు లేకపోయినా, మంచులో నడుస్తూ కొండలపైకి ఎక్కగలననీ, చెప్పిన పనులు చేయగలననీ ఆయన పై అధికారులను ఒప్పించి చేసి చూపించగలిగారు. గాయం వల్ల డెస్కు పనులకే పరిమితమయ్యేందుకు తిరస్కరించారు.

చివరగా, లెఫ్టినెంట్ జనరల్ విజయ్ ఒబెరాయ్ గురించి చెప్పుకుందాం. దేశంలో అత్యధిక పతకాలను అందుకున్న అధికారులలో ఆయనొకరు. భారత్–పాకిస్తాన్ మధ్య 1965లో జరిగిన యుద్ధంలో ఆయన కూడా కుడి కాలు కోల్పోయారు. అయినా, మరో నాలుగు దశాబ్దాలపాటు సైన్యానికి సేవలందించగలిగారు. కృత్రిమ కాలుతో మారథాన్‌లలో కూడా పాల్గొన్నారు. అవయవాలు కోల్పోయిన సైనికులకు పునరావాసం కల్పించడంపై దృష్టి పెట్టే విధంగా 'వార్ ఊండెడ్ ఫౌండేషన్'ను నెలకొల్పారు. ఆయన భారత సైన్య ఉప ప్రధానాధికారి స్థాయి వరకు ఎదిగారు.

జీవన సంధ్యలో ఏదీ భరోసా?

ఆదర్శంగా తీసుకోవలసిన జాతీయ హీరోల గాథలివి. అలాంటివారు చాలామంది ఉన్నారు. అటువంటి వీరుల డిజెబిలిటీ పెన్షన్‌పై పన్ను విధించడం సమంజసమా? అదీ వారి జీవన సంధ్యలో, ఆర్థిక భద్రత అత్యంత అవసరమైన కాలంలో పన్ను ప్రతిపాదన తీసుకురావడం ఎంతవరకు సముచితం? ధైర్య సాహసాలకుగానూ ఇటీవల వాయు సేనా మెడల్ అందుకున్న కార్పొరల్ వరుణ్ కుమార్‌ను దేశం కొనియాడింది. ఆపరేషన్ సిందూర్‌లో శత్రు క్షిపణి దాడిలో ఆయన తన కుడి చేతిని కోల్పోయారు. ఆయన చెరగని చిరునవ్వుతో తన ఎడమ చేయితోనే వైమానిక దళ ప్రధానాధికారికి శాల్యూట్ చేసిన ఫొటో ఎవరి హృదయాలనైనా కదిలిస్తుంది.

నౌకా, వైమానిక, సైనిక దళాలకు చెందిన 10,000–12,000 మంది డిజెబిలిటీ పెన్షన్లు అందుకుంటున్నారని డేటా సూచిస్తోంది. దీనివల్ల ప్రభుత్వంపై పడిపోయే ఖర్చు కూడా పెద్దగా ఏమీ లేదు. జనరల్ మాలిక్ చెప్పినట్లుగా పెద్ద మొత్తాల ఖర్చులను గాలికొదిలేసి, చిన్న మొత్తాల ఖర్చులను లెక్కలోకి తీసుకోవడం వివేకం అనిపించుకోదు. అసలిది ఖర్చుల కోణం నుంచి చూడవలసిన అంశం కాదు. ఒక సైనికుడి గౌరవ పరిరక్షణకు సంబంధించినది. దీని కోసం చర్చలు జరుపవలసిన లేదా పోరాడవలసిన అవసరం ఏ సైనికుడికీ రాకూడదు. ఈ పన్ను ప్రతిపాదనను కేంద్రం పునః పరిశీలించి తీరాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

ఆ 'గీతం'లో అపశ్రుతులెన్నో!

అభిప్రాయం

పి. విజయబాబు

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం అనేది ప్రజల ఆస్తికి కేవలం ఒక 'ట్రస్టీ' (ధర్మకర్త) మాత్రమే. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన పాలకులు తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనమే పరమావధిగా ఉండాలి. కానీ ఇటీవలి కాలంలో రాజకీయ పలుకుబడి, బంధుప్రీతి (నెపోటిజం) ప్రాతిపదికన విలువైన ప్రభుత్వ భూములను 'క్రమబద్ధీకరణ' లేదా 'తక్కువ ధర' పేరుతో కట్టబెట్టడం తీవ్ర చర్చనీయాంశమవుతోంది.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 – 'చట్టం ముందు అందరూ సమానులే' అని చెబుతోంది. ప్రభుత్వ వనరులను పంపిణీ చేసే టప్పుడు ప్రభుత్వం ఏకపక్షం (ఆర్బిట్రరీ)గా వ్యవహరించకూడదు. రాజకీయ సంబంధాలు, వ్యక్తిగత పరిచయాలు లేదా బంధుత్వం ఆధారంగా నిబంధనల్లోని లోపాలను (లూప్‌హోల్స్) వెతికి మరీ ప్రయోజనం కల్పించడం అధికార దుర్వినియోగం (అబ్యూజ్ ఆఫ్ పవర్)గా పరిగణించబడుతుంది. ఇది కేవలం నైతిక తప్పిదం మాత్రమే కాదు; ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్య.

కీలక తీర్పులు

ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగంపై సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులు ఇచ్చిన తీర్పులు పాలకులకు కనువిప్పు కలిగించేలా ఉన్నాయి: సుప్రీంకోర్టు 'ఈపీ రాయప్ప వర్సెస్ స్టేట్ ఆఫ్ తమిళనాడు' (1974) కేసులో 'ఆర్బిట్రరీనెస్ యాంటీథెటికల్ టు ఈక్వాలిటీ' అని స్పష్టం చేస్తోంది. అంటే ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం సమానత్వ సూత్రానికి విరుద్ధం. ప్రకృతి వనరులు, భూమి వంటి ప్రజా ఆస్తుల విషయంలో సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో పబ్లిక్ ట్రస్ట్ డాక్ట్రిన్‌ను ప్రామాణికంగా పేర్కొంది. ఎమ్‌సీ మెహతా వర్సెస్ కమల్‌నాథ్ (1997) కేసులో కోర్టు 'ప్రభుత్వం ప్రజా వనరుల యజమాని కాదు; కేవలం వాటిని సంరక్షించే ట్రస్టీ మాత్రమే' అని చెప్పింది.

◆ రాజకీయ సంబంధాలు లేదా బంధుత్వం ఆధారంగా నిబంధనల్లోని లోపాలను వెతికి మరీ 'గీతం' యూనివర్సిటీ లాంటి వాటికి ప్రయోజనం కల్పించడం అక్షరాలా అధికార దుర్వినియోగంగా పరిగణించ బడుతుంది.

అక్రమ ఆక్రమణలను 'క్రమబద్ధీకరణ' పేరిట చట్టబద్ధం చేయడం ఇటీవల పెరుగుతున్న ధోరణి. కానీ సుప్రీంకోర్టు దీనిపై కఠినంగా స్పందించింది. 'జగ్‌పాల్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్' (2011) కేసులో సుప్రీంకోర్టు... 'రాజకీయ ప్రభావం ఉన్నవారు ఉమ్మడి భూములను ఆక్రమించి, ఆ తర్వాత వాటిని రెగ్యులరైజ్ చేయడం చెల్లదు. అక్రమాలను క్రమబద్ధీకరించడం నిజాయతీ గల పౌరులను అవమానించడమే'నని వ్యాఖ్యానించింది. అలాగే 'సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' (2జీ కేసు–2012) కేసులో ప్రకృతి వనరుల కేటాయింపులో పారదర్శకత్వం అవసరమనీ, నామమాత్రపు ధరలకు కేటాయింపులు చేయడం రాజ్యాంగ విరుద్ధమనీ కోర్టు పేర్కొంది.

పాలించేవారు... తమ బంధువులకు లేదా సన్నిహితులకు ప్రయోజనం చేకూర్చేలా విధానాలు రూపొందిస్తే అది 'నెపోటిజం' కిందకు వస్తుంది. ఇది అర్హులైన ఇతరుల అవకాశాలను దెబ్బ తీస్తుంది. 'కస్తూరీలాల్ లక్ష్మీరెడ్డి వర్సెస్ స్టేట్ ఆఫ్ జమ్మూ అండ్ కశ్మీర్'(1980) కేసులో సుప్రీంకోర్టు 'ప్రభుత్వ ఆస్తుల కేటాయింపులో ఫేవరిటిజం, మాలిఫైడ్స్ అనుమతించబడవు' అని స్పష్టం చేసింది. ప్రభుత్వ నిర్ణయాలు ఆర్టికల్ 226 (హైకోర్టులు), ఆర్టికల్ 32 (సుప్రీంకోర్టు) కింద న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయి. పౌరులు లేదా ప్రజాహిత సంఘాలు పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ (పిల్) ద్వారా అలాంటి నిర్ణయాలను సవాలు చేయవచ్చు.

2024లో 'హైదరాబాద్ ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్ కేసు' (2024)పై వెలువడిన కీలక తీర్పులో, ప్రత్యేక వర్గాలకు (ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, ఇతర ప్రభావవంతులైన వర్గాలు) ప్రాధాన్యం ఇచ్చి జరిగిన భూమి కేటాయింపులను సుప్రీంకోర్టు ఆర్టికల్ 14 ఉల్లంఘనగా పరిగణించింది. ఈ తీర్పులో ప్రభుత్వ భూమి కేటాయింపులో సమాన అవకాశ సూత్రం తప్పనిసరిగా ఉండాలనీ, 'ప్రిఫరెన్షియల్' లేదా 'స్పెషల్ కేటగిరీ' పేరిట ప్రత్యేక హక్కులు కల్పించడం సమానత్వానికి విరుద్ధమనీ, రాజకీయ లేదా అధికార వర్గాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం రాజ్యాంగబద్ధం కాదనీ కోర్టు స్పష్టం చేసింది. అలహాబాద్ హైకోర్టు పలు తీర్పుల్లో ప్రభుత్వ లీజు భూములను నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులరైజ్ చేసిన చర్యలను రద్దు చేసింది. ఒకవైపు సామాన్య పౌరుడు చిన్న స్థలం కోసం ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే, మరోవైపు విలువైన భూములు ప్రత్యేక వర్గాలకు సులభంగా లభిస్తే అది సామాజిక న్యాయాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తుంది.

వ్యాసకర్త రాజ్యాంగ న్యాయశాస్త్ర పట్టభద్రుడు

సోషల్ టాక్

ఎదగాలంటే...

ఎప్పుడూ తక్కువతో సరిపెట్టుకోకండి. ఆ పరిస్థితి వచ్చినా ఆశ వదులుకోకండి. మీరు మీ కెరీర్‌లో, జీవితంలో ఎటువైపు వెళ్లాలని అనుకుంటున్నారో, ఆ వైపు దారి లేకున్నా, దారి చేసుకుంటూ వెళ్లండి. సరిపెట్టుకోవటం మిమ్మల్ని ఎదగనివ్వదు.

– మనూ భాకర్, ప్రొఫెషనల్ షూటర్

దొరకాలి!

ఎన్నో చిత్రాలు నిర్మించినా, ఇప్పటికీ నన్ను నేను కొత్త నిర్మాతలానే భావించుకుంటాను. సరైన వ్యక్తులు సరైన చోట ఉన్నప్పుడే చిత్ర నిర్మాణం తేలిక. లేదంటే, ఒక సినిమా తీయటానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. ఏదైనా అంతే. సరైన మనుషులు దొరకాలంతే!

– సాజిద్ నాడియాడ్‌వాలా, చిత్ర నిర్మాత

గొంతుక

స్వరం లేకపోవటం అంటే మెదడు లేకపోవటం కాదు. స్వరం లేని వారు కూడా చెప్పటానికి చాలా ఉంటుంది. వాళ్ల దృష్టి, ఆలోచనల నుంచి మనమెంతో తెలుసుకోవచ్చు. వారి గొంతు వినాలంటే, మనమే వారి మనసును కదిలించాలి.

– ఆనంద్ పట్వర్ధన్, డాక్యుమెంటరీ రూపకర్త

వెనక్కి చూడద్దు!

సైక్లింగ్‌లో మీరు వెనక్కు తిరిగి చూసుకుంటే ఓడిపోతారు. ముగింపు రేఖను మాత్రమే చూడాలి. జీవితానికి కూడా ఈ సూత్రం చక్కగా సరిపోతుంది. రేసులో చేసిన తప్పుల్ని తలుస్తూ ఉంటే, గతంలోని కష్టాల జ్ఞాపకాల్లో తడుస్తూ ఉంటే, మీ వేగం తగ్గిపోతుంది.

– డెబోరా హెరాల్డ్, ఇండియన్ సైక్లిస్ట్

మార్పు

మీ వయసు పెరుగుతున్న కొద్దీ, కొత్త కలల్ని కనటానికి మిమ్మల్ని మీరు శక్తిమంతం చేసుకోవాలి. స్తబ్దత శత్రువు. బతికుండగానే జీవితాన్ని కబళిస్తుంది. మానసికంగా యవ్వనంగా ఉండటానికి ఏదో ఒక కొత్త పని చేస్తుండండి. చేసే పనిని మారుస్తుండండి.

– జాన్ ట్రవోల్టా, హాలీవుడ్ నటుడు

అహంకారం

విద్య మిమ్మల్ని వినయంగా మారుస్తుంది. వినయం మిమ్మల్ని అర్హులను చేస్తుంది. అర్హత మీకు డబ్బును సంపాదించి పెడుతుంది. డబ్బు మిమ్మల్ని సౌకర్యవంతంగా ఉంచుతుంది. కానీ మీరు అహంకారిగా మారిన మరుక్షణం మునుపటివన్నీ కోల్పోతారు.

– రజత్ శర్మ, సీనియర్ జర్నలిస్ట్

సమానత్వం సాధ్యమేనా?

విద్యాలయాలలో సమానత్వాన్ని సాధించడం ద్వారా వివక్షను రూపుమాపడం కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ రూపొందించిన కొత్త నియమాలపై ఆధిపత్య కులాల విద్యార్థులు నిరసన ఉద్యమాలను చేపట్టడంతో ఈ విషయం పెద్ద చర్చనీయాంశమైంది. ఈ నియమాలు కొత్త సమస్యలను తెచ్చే విధంగా ఉన్నాయని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయి మాల్యా బాగ్చీలతో కూడిన ద్వి సభ్య ధర్మాసనం స్టే విధించింది.

కుల వివక్షకు గురయ్యామనే బాధతో వేముల రోహిత్, పాయల్ తాడ్వి ఆత్మహత్యలు చేసుకున్న సంగతి తెలిసిందే. వారి తల్లులు విద్యాలయాలలో

కుల వివక్షను రూపుమాపడం కోసం కఠిన నియమాలు రూపొందించాలని సుప్రీంకోర్టు తలుపు తట్టారు. సుప్రీంకోర్టు చేసిన సూచనల మేరకు యూజీసీ విద్యాలయాలలో సమానత్వ సాధన నియమాలు రూపొందించింది. ఈ నియమాల్లో భాగంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ప్రతినిధులతో ఈక్విటీ కమిటీలను విద్యాలయాల్లో ఏర్పాటు చేయాలని సూచనలు చేసింది. కులం, మతం, లింగం, ప్రాంతం, రూపం ఆధారంగా వివక్ష చూపితే 24 గంటల్లో ఫిర్యాదు నమోదు చేయాలి. ఈ ఫిర్యాదుపై 15 రోజుల్లో విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలి. ఏడు రోజుల్లోపు శిక్ష ఇవ్వాలి.

వివక్షాపూరిత సంఘటనలు ఏ విద్యాసంస్థలో నమోదైనా ఆ విద్యాసంస్థ రిజిస్ట్రేషన్ రద్దు చేసే హక్కు యూజీసీకి ఉంది. ఈ నియమాలు అగ్రకుల విద్యార్థులను, అధ్యాపకులను టార్గెట్ చేసే విధంగా ఉన్నాయని కొంతమంది విద్యార్థులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. ధర్మశాస్త్రాల నీతిని తలకెక్కించుకోని కొంతమంది మూర్ఖులు చేసే కొన్ని పనులను ఆధారం చేసుకుని, కొంతమంది కుల మనుగడ ఉద్యమాలను లేవదీయడం మొదలుపెట్టారు. ఈ ఉద్యమాల ప్రభావం యూజీసీ కొత్త నియమాలలో కనిపిస్తుంది. 'ఇఫ్ మెన్ ఆర్ బ్యాడ్ నో యూజ్ ఆఫ్ లా, ఇఫ్ మెన్ ఆర్ గుడ్ నో నెస్ససరీ ఆఫ్ లా' అని గ్రీకు తత్వవేత్త 'ప్లేటో' చెప్పిన మాటలను అర్థం చేసుకుంటే చట్టాల ద్వారా మనిషిలో సంస్కారాలను, విలువలను నిర్మాణం చేయలేమనే విషయం సత్య దూరం కాదేమో!

ఈ నియమాలు రూపుదిద్దిన తీరు చూస్తే – అగ్రకులాలకు చెందిన విద్యార్థులందరూ చెడ్డవారని, వారి వల్ల మిగతా కులాలకు చెందిన విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటారని చెప్పకనే చెప్పినట్లుంది. ముస్లిం మైనారిటీలకు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక విద్యాలయాలు ఏర్పాటు చేసినట్లు, అగ్రకులాల వారిని మిగతా వారితో కలపకుండా విద్యాలయాల ఏర్పాటు జరగాలని డిమాండ్ వచ్చే అవకాశం లేదని ఎవరైనా అంటారా?

– ఉల్లి బాలరంగయ్య । సామాజిక, రాజకీయ విశ్లేషకులు

డేటా పాయింట్

పెరుగుతున్న కాంట్రాక్ట్ టీచర్స్

దేశంలోని పాఠశాల ఉపాధ్యాయుల్లో సుమారు 16 శాతం కాంట్రాక్ట్, పార్ట్ టైమ్ ఉద్యోగులే కావడం గమనార్హం. 'యుడిసె ప్లస్' (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్) గణాంకాల ప్రకారం, దాదాపు 16 లక్షల మంది ఉపాధ్యాయులు తక్కువ వేతనాలకు (రెగ్యులర్ ఉపాధ్యాయుల జీతంలో దాదాపు నాలుగో వంతు) పనిచేస్తున్నారు. పైగా ఏటికేడు వీరి సంఖ్య పెరుగుతోంది.

విద్యా సంవత్సరాల వారీగా కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల శాతం

2022-23	2023-24	2023-24
15.31	15.59	16.12

మంచి పద్ధతుల కొనసాగింపే...

ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన క్రైస్తవ విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ఆచరించే తపస్సు కాలాన్ని 'లెంట్' అంటారు. లెంట్ అనే లాటిన్ మాటకు చిగురించడం అని అర్థం. విశ్వవ్యాప్తంగా ఇది బుధవారంతో ప్రారంభమవుతుంది కాబట్టి, 'భస్మ బుధవారం' లేదా 'బూడిద బుధవారం' అని తెలుగులో అంటారు. లెంట్ కాలం మొత్తం నలభై రోజులు. బైబిల్‌లో నలభై దినాల ఉపవాసానికి ఉదాహరణగా మోషే నలభై దినాలు ఉపవసించి ప్రార్థించాడు. ఏలియా ప్రవక్త నలభై దినాలు ఉపవాసంతో ప్రార్థన చేశాడు. ఇశ్రాయేలీయులు ఈజిప్టు నుండి కానానుకు నలభై సంవత్సరాలు పయనించారు. ఏసు పరిచర్య ప్రారంభించే ముందు నలభై దినాలు ఉపవసించి ప్రార్థించాడు. ఏసు పునర్జీవితుడయిన తర్వాత పరలోకానికి ఆరోహణమయే ముందు నలభై రోజులు తన శిష్యులతో ఉన్నాడు. ఈ కారణాల వల్ల క్రైస్తవ సమాజం నలభై రోజులు నియమ నిష్ఠలతో సాత్వికాహారం తీసుకుంటూ ప్రార్థనలో గడుపుతుంది.

ఆలయాల్లో నలభై రోజులు వివిధ అంశాలపై ధ్యానిస్తారు. ఈ కాలంలో శుభకార్యాలు, కుటుంబపరమైన ఉత్సవాలు జరపరు. భస్మ బుధవారం నుంచి శుభ శుక్రవారం వరకు శ్రమల కాలంగా పాప ప్రక్షాళన జరిపే సంప్రదాయం ప్రపంచ వ్యాప్తంగా ఉంది. ఈ ఆచారం క్రీస్తు శకం 325లో నైసియా చర్చ్‌లో ప్రారంభమైంది. అలెగ్జాండ్రియాకు చెందిన అథనేషియస్ లెంట్ ఉపవాసం నలభై రోజులని నిర్ధారిస్తే, హిప్పోకు చెందిన సెయింట్ అగస్టీన్ లెంట్‌లో ఉపవాసం చేసి ఇష్టమైన ఆహారానికీ, ఇష్టమైన వాటికీ దూరంగా ఉండాలని ధ్రువీకరించాడు. శుభ శుక్రవారం అనంతరం వచ్చే శనివారాన్ని 'నిశ్శబ్ద శనివారం' లేదా 'లాజరస్ శాటర్ డే' అంటారు. శనివారం తరువాత వచ్చే ఆదివారం 'ఈస్టర్ సండే'. లెంట్ కాలంలో నూతనంగా నిరంతరం సన్మార్గ వర్తనంలో గడపాలని ప్రతినబూనడం వ్యక్తిగత క్షాళనకు నిదర్శనం. లెంట్ కాలంలో ఏర్పడిన మంచి పద్ధతులు నిరంతరం కొనసాగించే విధంగా జీవించడం ఉపవాస ప్రార్థనల ప్రధాన లక్ష్యం.

– ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి । క్రైస్తవ సాహిత్య పరిశోధకులు (నేటి నుంచి లెంట్ దినాలు ప్రారంభం)

వైభవంగా అమరేశ్వరుని దివ్యరథోత్సవం

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమరావతి క్షేత్రంలోని బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి దివ్యరథోత్సవం మంగళవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. భక్తులు ఓం నమశ్శివాయ అంటూ నినదించారు. శివపంచాక్షరి నామంతో అమరావతి మార్మోగింది. భక్తుల శివనామస్మరణ, మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణలతో బాలచాముండేశ్వరిదేవి, చండీదేవిలతో కలిసి అమరేశ్వరుడిని దర్శించుకున్నారు. తొలుత స్వామి వారి దివ్యరథానికి ఆలయ స్థానాచార్యులు కుంభం పోసి దీపారాధన చేయడంతో రథోత్సవం ప్రారంభమైంది. వేలాది మంది భక్తులు వెంటరాగా, స్వామి రథాన్ని గాంధీబొమ్మ సెంటర్ వరకు అక్కడ నుంచి వెనుదిరిగి రథశాలలోకి చేర్చారు. – అమరావతి

కమనీయం ముక్కంటీశుని కల్యాణం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తిలోని జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని కల్యాణోత్సవం మంగళవారం అర్ధరాత్రి దాటాక ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా పెళ్లి మండపానికి తీసుకొచ్చారు. అక్కడ స్వామి, అమ్మవార్ల వివాహ ఘడియల్లో వివాహం చేసుకునేందుకు పదుల సంఖ్యలో జంటలు వచ్చారు. మంగళవారం ఉదయం అధికార నంది, కామధేను వాహనంపై ఉత్సవమూర్తులు పురవీధుల్లో ఊరేగారు. రాత్రి గజ, సింహ వాహనాలపై ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు టీటీడీ తరపున అదనపు ఈవో వెంకయ్యచౌదరి పట్టువస్త్రాలను సమర్పించారు. కాణిపాకం ఆలయం నుంచి ఈవో పెంచలకిషోర్ స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందజేశారు. – ఏర్పేడు

క్లుప్తంగా...

తిరుపతిలో ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

రూ.7.48 లక్షలు స్వాధీనం

పట్టుబడిన నగదు చూపిస్తున్న సీఐ

తిరుపతి క్రైం: తిరుపతి పట్టణం వైరాగిపట్టెడ పద్మావతి పార్క్ సమీపంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 7,48,000 నగదు, ల్యాప్‌టాప్, 4 మొబైల్ ఫోన్లు, 4 పేటీఎం క్యూఆర్ కోడ్ బాక్సులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐ కె. శ్రీనివాసులు, ఎస్ఐలు ఓ. రామస్వామి, జి. ప్రసాద్, క్రైమ్ సిబ్బంది దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు యాప్‌ల ద్వారా అమాయక ప్రజలను ఆకర్షించి క్యాసినో, క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ కమీషన్ రూపంలో అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నట్లు గుర్తించారు. పరారీలో ఉన్న మరికొంతమంది నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శాస్త్రోక్తంగా పూర్ణాహుతి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వైభవంగా నిర్వహించిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవ క్రతువులకు మంగళవారం పూర్ణాహుతి నిర్వహించారు. స్వామివారి యాగశాలలో అర్చకస్వాములు, వేదపండితులు ఇందుకోసం నిర్వహించిన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రుద్రహోమ పూర్ణాహుతి, వసంతోత్సవం, అవభృథం, త్రిశూలస్నానం కార్యక్రమాలు నిర్వహించారు. పూర్ణాహుతిలో శాస్త్రోక్తంగా నారికేళాలు, పలు సుగంధ ద్రవ్యాలు, ముత్యం, పగడం, నూతన వస్త్రాలు వంటి పూజాద్రవ్యాలను హోమగుండంలోకి సమర్పించారు. చివరిగా త్రిశూల స్నానం చేపట్టారు. సాయంత్రం ఉత్సవాల ముగింపు సూచికంగా ధ్వజ పతాకావరోహణ చేశారు. అనంతరం సదస్యం–నాగవల్లి కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల చివరి రోజు బుధవారం సాయంత్రం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి అశ్వవాహనసేవ, ఉత్సవ ఊరేగింపు, పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ నిర్వహిస్తారు.

కుంకుమ పువ్వు సాగును ప్రైవేట్ పరం చేయవద్దు

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: అల్లూరి జిల్లా లంబసింగి ప్రాంతంలో కుంకుమ పువ్వు సాగును పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ కంపెనీలకు ఇచ్చే నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ చంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతు రామారావు, ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర, సహాయ కార్యదర్శి ఎ.అశోక్‌లు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఏ ప్రాజెక్టు అయినా, ఏ పథకమైనా ప్రభుత్వం చేపట్టే ముందు పీసా చట్టానికి అనుగుణంగా గ్రామసభల్లో ఆ ప్రతిపాదనను ప్రవేశపెట్టి స్థానిక గిరిజనుల అనుమతి తీసుకోవాలని గుర్తుచేశారు. కార్పొరేట్ కంపెనీలకు అటవీ వనరులను తాకట్టు పెట్టడం దుర్మార్గమన్నారు. స్థానిక గిరిజనులకు ప్రభుత్వం శిక్షణ ఇచ్చి గిరిజనులే కుంకుమ పువ్వు సాగు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ప్రైవేట్ కంపెనీలను ప్రవేశపెట్టడాన్ని నిషేధిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

నౌకాదళం అలరింతకు సిద్ధం

నేడు ఐఎఫ్ఆర్, రేపు మిలాన్ విన్యాసాలకు సాగరతీరం ముస్తాబు

ఐఎఫ్ఆర్‌కు ముఖ్య అతిథిగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఇప్పటికే విశాఖకు చేరుకున్న దేశాధ్యక్షురాలు

- మిలాన్‌ను ప్రారంభించనున్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- 20న ఐయాన్స్ కాన్‌క్లేవ్.. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించనున్న భారత్
- సాగర తీరాన 72 దేశాల నావికాదళాల సంగమం
- భారీ భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు

నింగీనేలా నివ్వెరబోయేలా నీలిసంద్రం యుద్ధనౌకలను మోహరించిందా.. పోటెత్తిన అలలు నమస్కరిస్తున్నాయంతో ఎగసి పడుతున్నాయా.. కెరటాల హోరు స్నేహ శంఖారావం పూరిస్తోందా.. అన్నట్లు అద్భుత విన్యాసాల వీక్షణకు విశాఖ తీరం ముస్తాబైంది. భారత నౌకాదళ శక్తిసామర్థ్యాలను చాటేలా.. మిత్రదేశాల సమన్వయంతో జరిగే ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్), మిలాన్- 2026, ఐయాన్స్ కాన్‌క్లేవ్‌లకు తూర్పు తీరం వేదికవుతోంది. బుధ, గురువారాల్లో అద్భుత విన్యాసాలతో భారత నౌకాదళం తన సైనిక పరాక్రమ విశ్వ రూప ప్రదర్శనకు సర్వసన్నద్ధమైంది.

సముద్రంలో విన్యాసాలు

విశాఖ సిటీ: 'సౌభ్రాతృత్వం, సహకారం, సమన్వయం' అనే నినాదంతో ఐఎఫ్ఆర్, మిలాన్, విన్యాసాలు జరగనున్నాయి. ఈ విన్యాసాల కోసం 72 దేశాల నుంచి నాలుగు వేల మందికి పైగా నావికాదళ అధికారులు, విదేశీ ప్రతినిధులు విశాఖకు చేరుకున్నారు.

ఒకేసారి మూడు ప్రధాన వేడుకలు

దేశ స్వాతంత్య్ర చరిత్రలో ఒకేసారి మూడు ప్రధాన నౌకాదళ కార్యక్రమాలను (ఐఎఫ్ఆర్, మిలాన్, ఐయాన్స్) నిర్వహించడం ఇదే తొలిసారి. ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన 'మహాసాగర్' దార్శనికతలో భాగంగా.. సముద్ర భద్రత, పరస్పర సహకారాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం. దశాబ్దం తర్వాత నగరంలో ఈ ఫ్లీట్ రివ్యూను 'యునైటెడ్ త్రూ ఓషన్స్' (సముద్రాల ద్వారా ఏకమవుదాం) అనే ప్రత్యేక థీమ్‌తో నిర్వహిస్తున్నారు. బుధవారం ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్), 19న మిలాన్–2026 విన్యాసాలతో పాటు 20న ఇండియన్ ఓషన్ నావల్ సింపోజియం (ఐయాన్స్) సదస్సుకు విశాఖ తీరం ఆతిథ్యమిస్తోంది.

నేడు విన్యాసాలు తిలకించనున్న రాష్ట్రపతి

ఇండియన్ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్)కు ముఖ్య అతిథిగా భారత సర్వసైన్యాధ్యక్షురాలు, దేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరవుతున్నారు. ఆమె మంగళవారం సాయంత్రమే విశాఖకు చేరుకున్నారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి వేడుకలు ప్రారంభమవుతాయి. 9 గంటలకు రాష్ట్రపతి నేవల్ డాక్ యార్డ్‌కు చేరుకుంటారు. అనంతరం ఆమె సుమేధ అనే యుద్ధ నౌకపై (ప్రెసిడెన్షియల్ యాచ్) ప్రయాణిస్తూ.. సముద్రంలో లంగరు వేసిన 71 యుద్ధ నౌకలను వీక్షిస్తారు. ఇందులో 52 భారతీయ నౌకలు, 19 విదేశీ యుద్ధనౌకలు ఉన్నాయి. ప్రతి నౌకలోని సైనికులు తమ దేశ సంప్రదాయ పద్ధతిలో రాష్ట్రపతికి వందనం సమర్పిస్తారు. 50కి పైగా యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు ఆకాశంలో అద్భుతమైన విన్యాసాలు చేస్తూ రాష్ట్రపతికి సెల్యూట్ చేస్తాయి. సముద్రం మధ్యలో మార్కోస్ కమాండోలు శత్రువులను ఎలా ఎదుర్కొంటారో ప్రత్యక్షంగా ప్రదర్శిస్తారు. నౌకాదళ విమానాల 'ఫ్లై పాస్ట్', సముద్ర గర్భంలో జలాంతర్గాముల విన్యాసాలనూ నౌకాదళ సైనికులు ప్రదర్శిస్తారు.

ప్రత్యేక ఆకర్షణగా సిటీ పరేడ్

విశాఖ తీరాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టేలా ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ గురువారం జరగనుంది. ఈ మెగా ఈవెంట్.. సముద్ర భద్రత, ప్రపంచ దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలకు ప్రతీకగా నిలవనుంది. గురువారం సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు ఆర్‌కే బీచ్ వద్ద సాగరతీరం వెంబడి ఈ పరేడ్ జరుగుతుంది. ఈ భారీ ప్రదర్శనను ప్రజలు వీక్షించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో 45 విదేశీ నౌకాదళ మార్చింగ్ బృందాలు, 8 అంతర్జాతీయ నావికాదళ బ్యాండ్లు ప్రతిభను చాటనున్నాయి. భారత సైన్యం, నౌకాదళం, వాయుసేన, కోస్ట్ గార్డ్ బృందాలతో పాటు విదేశీ సైనిక బృందాలు కవాతు నిర్వహిస్తాయి. ఈ పరేడ్‌లో భారత నౌకాదళానికి చెందిన ఫైటర్ జెట్లు, హెలికాప్టర్లతో 'ఎయిర్ పవర్ డెమాన్‌స్ట్రేషన్' మొదలవుతుంది. అలాగే భారతదేశ సంస్కృతిని తెలిపే జానపద కళారూపాలు, వివిధ రాష్ట్రాల శకటాలు, విదేశాల సంస్కృతులను ప్రతిబింబించే ప్రదర్శనలు ఉంటాయి. ఇందులో ఎన్‌సీసీ, సీ క్యాడెట్ కార్ప్స్, నేవీ చిల్డ్రన్ స్కూల్ విద్యార్థులు పాల్గొననున్నారు. పరేడ్ చివరలో సముద్రంలో లంగరు వేసిన యుద్ధనౌకల 'సెరిమోనియల్ ఇల్యూమినేషన్' (దీపకాంతులతో అలంకరణ), లేజర్ లైట్ షో, బాణసంచా, డ్రోన్ షోలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

రాష్ట్రపతికి ఘన స్వాగతం

గోపాలపట్నం: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మంగళవారం విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. విశాఖలో నిర్వహించనున్న ఫ్లీట్ రివ్యూను ప్రారంభించేందుకు ఆమె నగరానికి విచ్చేశారు. విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తదితరులు రాష్ట్రపతికి ఆత్మీయంగా స్వాగతం పలికారు.

రెండు దశల్లో మిలాన్

మిలాన్–2026 విన్యాసాలు విశాఖలోని తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. దేశ రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈ విన్యాసాలను ప్రారంభిస్తారు. ఇవి 19 నుంచి 20 వరకు హార్బర్ ఫేజ్, 21 నుంచి 25 వరకు సీ ఫేజ్‌లో జరగనున్నాయి. హార్బర్ ఫేజ్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, అంతర్జాతీయ సముద్ర సెమినార్లు, ద్వైపాక్షిక చర్చలు, మిలాన్ విలేజ్ ప్రదర్శనలు ఉంటాయి. సీ ఫేజ్‌లో భాగంగా సముద్ర గర్భంలో అసలైన యుద్ధ విన్యాసాలు జరుగుతాయి. ఇందులో యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్, ఎయిర్ డిఫెన్స్, సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్లు, క్లిష్టమైన నౌకా విన్యాసాలు నిర్వహిస్తారు.

ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రధాన ఆకర్షణ

ఐఎఫ్ఆర్, మిలాన్ ద్వారా భారత్ తన స్వదేశీ పరిజ్ఞానాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు సిద్ధమైంది. ఈ విన్యాసాల్లో ప్రధాన ఆకర్షణగా 'ఐఎన్ఎస్ విక్రాంత్' నిలవనుంది. దీంతో పాటు ఐఎన్ఎస్ విక్రమాదిత్య కూడా జతకట్టడం విశేషం. రెండు విమాన వాహక నౌకలు ఒకేసారి కవాతు నిర్వహించడం భారత రక్షణ రంగ చరిత్రలో ఒక అద్భుత ఘట్టం. ఇవి కాకుండా విధ్వంసక నౌకలు, అత్యాధునిక జలాంతర్గాములు, విశాఖపట్నం క్లాస్ డిస్ట్రాయర్లు, నీలగిరి క్లాస్ స్టెల్త్ ఫ్రిగేట్లు కూడా సముద్ర గర్భంలో భారత్ పటిష్టతను చాటనున్నాయి. మిగ్–29కె, పి–8ఐ వంటి అత్యాధునిక యుద్ధ విమానాలు, హెలికాప్టర్లతో కలిపి 50కి పైగా ఎయిర్ క్రాఫ్టులు గగనతలంలో విన్యాసాలు ప్రదర్శించనున్నాయి.

20న ఐయాన్స్ కాన్‌క్లేవ్

హిందూ మహాసముద్ర నౌకాదళ సింపోజియం (ఐయాన్స్) ఈ నెల 20న హోటల్ నోవొటెల్‌లో జరగనుంది. ఈ సదస్సులో 42 దేశాల నౌకాదళాధిపతులు పాల్గొని సముద్ర భద్రత, విపత్తు నిర్వహణపై చర్చిస్తారు. ఈ సందర్భంగా భారత్ 2025–27 కాలానికి గానూ 'ఐయాన్స్' అధ్యక్ష పదవిని థాయిలాండ్ నుంచి స్వీకరించనుంది.

72 దేశాల నుంచి 71 యుద్ధ నౌకలు

ఐఎఫ్ఆర్, మిలాన్ వేడుకల్లో మొత్తం 72 దేశాలు పాల్గొంటున్నాయి. 71 యుద్ధ నౌకలు (19 విదేశీ నౌకలతో కలిపి), 50కిపైగా విమానాలు ఈ ప్రదర్శనలో కనువిందు చేయనున్నాయి. అమెరికా, రష్యా, జపాన్, ఆస్ట్రేలియా, యూకే, ఫిలిప్పీన్స్, యూఏఈ వంటి ప్రధాన దేశాలు తమ శక్తివంతమైన నౌకలను పంపాయి.

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల శ్రీవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అలాగే శ్రీకాళహస్తిలోని జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని కూడా న్యాయమూర్తి దర్శించుకున్నారు. – తిరుమల / శ్రీకాళహస్తి

ఐబొమ్మ రవికి హైకోర్టు బెయిల్

పలు షరతులు విధించిన న్యాయస్థానం

సాక్షి, హైదరాబాద్: సినిమాల పైరసీ కేసులో గతేడాది నవంబర్‌లో అరెస్టయిన ఇమంది రవి (ఐబొమ్మ)కి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు అదే మొత్తానికి ఇద్దరు పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. చార్జిషీట్ దాఖలు చేసే వరకు సంబంధిత ఎస్‌హెచ్‌వో ఎదుట ప్రతిరోజూ హాజరు కావాలని షరతులు విధించింది. షరతులకు కట్టుబడి ఉండాలని, ప్రస్తుత కేసుల్లో పాల్గొన్న సాక్షులు, ఫిర్యాదుదారులు, సహ నిందితులైన వారిని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంప్రదించడం, బెదిరించడం, ప్రేరేపించడం, ప్రభావితం చేయకూడదని స్పష్టం చేసింది. విడుదల తేదీ నుంచి ఒక వారం లోపు సంబంధిత కోర్టు ముందు పూచీకత్తులను అందిస్తూ, పాస్‌పోర్ట్‌ను సరెండర్ చేయాలని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని సూచించింది. సైబర్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్)లో నమోదైన పలు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తూ హైకోర్టులో రవి పిటిషన్లు దాఖలు చేశారు. ఈ కేసులో జస్టిస్ సుజన కళాసికం ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ న్యాయవాది, పీపీ వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్(రవి)కి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ తీర్పునిచ్చారు. దర్యాప్తు దాదాపు పూర్తయిందని, పిటిషనర్ 90 రోజులకుపైగా కస్టడీలో ఉన్నారని, చార్జిషీట్ ఇంకా దాఖలు చేయలేదని, పిటిషనర్‌ను ఇంకా కస్టడీలో విచారించడం అవసరమని చూపించడానికి ఎటువంటి ఆధారాలు లేవని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు రవి దాఖలు చేసిన నాలుగు పిటిషన్లను అనుమతించారు. కేసు పెండింగ్‌లో ఉన్న సమయంలో అనుమతి లేకుండా కాపీరైట్ చేయబడిన కంటెంట్‌ను అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం చేయరాదని, వెబ్‌సైట్, డొమైన్, అప్లికేషన్, సోషల్ మీడియా ఛానల్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ను పిటిషనర్ ఏ విధంగానూ ఆపరేట్ చేయకూడదని తెలిపారు. దర్యాప్తు సంస్థ కోరితే.. చట్టబద్ధమైన ప్రక్రియకు లోబడి, డిజిటల్ పరికరాలు, ఖాతాలు, డేటా ఫోరెన్సిక్ పరీక్షకు పిటిషనర్ అందుబాటులో ఉండాలన్నారు. షరతుల్లో దేనినైనా ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు చేయమని కోరే స్వేచ్ఛ ప్రాసిక్యూషన్‌కు ఉందంటూ విచారణ ముగించారు.

22 మంది మావోల లొంగుబాటు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఒక మహిళ సహా 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. అక్కడి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 'పునా మార్గెమ్' (పునరావాసం నుంచి పునర్జన్మ) కార్యక్రమంలో భాగంగా మంగళవారం సుక్మా జిల్లా ఏఎస్పీ రోహిత్‌షా ఎదుట వారు లొంగిపోయినట్లు తెలిపారు. లొంగిపోయిన మావోలు దండకారణ్యంలో జరిగిన పలు విధ్వంస కార్యక్రమాల్లో పాల్గొన్నారని ఏఎస్పీ వెల్లడించారు. వీరికి ప్రభుత్వం నుంచి తక్షణ సాయంగా రూ.50 వేల చొప్పున నగదు అందించినట్లు తెలిపారు.

చిత్తూరులో ఇంజినీరింగ్ విద్యార్థి కిడ్నాప్, హత్యాయత్నం

గంజాయి సమాచారం పోలీసులకు చెప్పాడని దారుణం

రాకేష్ శరీరంపై గాయాలు

తిరుపతి టాస్క్‌ఫోర్స్: గంజాయి సమాచారం పోలీసులకు చెప్పాడనే అనుమానంతో ఇంజినీరింగ్ విద్యార్థిని కిడ్నాప్‌చేసి హత్యాయత్నం చేసిన ఘటన జిల్లా కేంద్రం చిత్తూరులో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఆ విద్యార్థిని కిడ్నాప్ చేసిన తోటి విద్యార్థులు, మరికొందరు అతడిని తీవ్రంగా కొట్టి మృతిచెందాడని వదిలేసి వెళ్లిపోయారు. ప్రాణాలతో బయటపడిన అతడు సెల్ఫీ వీడియో విడుదల చేయడంతో ఈ ఉదంతం బయటకు వచ్చింది. కిడ్నాప్, హత్యాయత్నానికి సంబంధించి ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు, మరో నలుగురు.. మొత్తం ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన రాకేష్ చిత్తూరు శివారుల్లోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల ప్రాంగణంలో ఇటీవల గంజాయి విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. దీనిపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో రాకేష్ తమ వివరాలను పోలీసులకు చెప్పాడనే అనుమానంతో పీజీ హాస్టల్‌లో ఉన్న అతడిని సోమవారం కిడ్నాప్ చేశారు. చిత్తూరులోని కట్టమంచికి తీసుకెళ్లి కర్రలు, ఇనుపరాడ్లు, బెల్టులతో తీవ్రంగా కొట్టారు. స్పృహతప్పి పడిపోయిన రాకేష్ చనిపోయాడని భావించి వెళ్లిపోయారు. మంగళవారం స్పృహలోకి వచ్చి, హాస్టల్‌కు చేరుకున్న రాకేష్ సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. 'నన్ను వంశీ, అఖిల్, శివారెడ్డి, రాకేష్, బాబ్జి అనే ఐదుగురు, ఇంకా కొంతమంది కిడ్నాప్ చేసి దాడిచేశారు. దీనివెనుక ఉన్నవాళ్ల పేర్లు చెబితే చంపేస్తామన్నారు. విషయం బయటకు చెబితే చంపేస్తామని, కత్తితో కోసేస్తామని బెదిరించారు. నాకు భయంగా ఉంది..' అని ఆ వీడియోలో పేర్కొన్నాడు.

కాలేజీ చైర్మన్‌కు షోకాజ్ నోటీసు

ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో చిత్తూరు ఎస్పీ తుషార్ డూడీ సీరియస్ అయ్యారు. వీడియో ఆధారంగా బాధితుడిని గుర్తించి, అతడి నుంచి ఫిర్యాదు తీసుకుని ముందుకెళ్లాలని పోలీసులను ఆదేశించారు. దీంతో పోలీసులు బాధితుడి నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. సుబ్బారెడ్డి, నాయుడు, రాకేశ్, అఖిల్, వంశీ, బాబ్జి, శివారెడ్డిపై పూతలపట్టు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వీరిలో సుబ్బారెడ్డి, నాయుడు, రాకేశ్ అదే కాలేజీలో ఫైనలియర్ చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో వంశీ కట్టమంచికి, బాబ్జి సంతపేటకు చెందినవారు. విద్యార్థులకు ఏం జరుగుతోందో చూడాల్సిన బాధ్యత కళాశాల యాజమాన్యంపై ఉందని, దీనిపై సంజాయిషీ ఇవ్వాలని కళాశాల చైర్మన్‌కు పోలీసులు షోకాజు నోటీసు ఇచ్చారు.

మహిళాడాన్ ఆదేశాలతోనేనా?

ఈ ఘటనలో కట్టమంచిలో అధికార పార్టీకి చెందిన ఓ మహిళా డాన్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఇంజినీరింగ్ కళాశాలల్లోని కొందరు ఆకతాయిలను చేరదీసి వారితో గంజాయి విక్రయిస్తున్న మహిళా డాన్ ఆదేశాలతోనే రాకేష్‌పై హత్యాయత్నం జరిగిందనే ఆరోపణలు వినవస్తున్నాయి. పోలీసులు సైతం ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు.

ఉండి చరిత్రలో ఇంత దోపిడీదారుడిని చూడలేదు

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై టీడీపీ నేత వెంకటేశ్వరరాజు ధ్వజం

ఉండి: పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గ చరిత్రలో ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు వంటి దోపిడీదారుడిని తాను ఎప్పుడూ చూడలేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు (బుడ్డియ్య రాజు) ధ్వజమెత్తారు. అభివృద్ధి పేరుతో నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేసేవన్నీ మోసాలు, దోపిడీలేనని ఆరోపించారు. ఉండి మండలం వెలివర్రులో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో మద్యం షాపులన్నీ ఎమ్మెల్యేవేనని, అధిక ధరలకు విక్రయించి ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని చెప్పారు. రోడ్డు పక్కన ఇల్లు కనిపించినా, దుకాణం కనిపించినా వెంటనే కూలగొట్టేయాలంటూ ఎమ్మెల్యే ఆదేశాలివ్వడం దుర్మార్గమన్నారు. రోడ్డుపై ఎమ్మెల్యే కాన్వాయ్ వెళుతుంటే చాలామంది దుకాణదారులు దుకాణాలకు బరకాలు కట్టుకుని దాక్కుంటున్నారని చెప్పారు. జిల్లాస్థాయి అధికారుల సహాయ సహకారాలతో నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. జూదం, కోడిపందేలు, మద్యం అక్రమాలతో పాటు మరెన్నో జరుగుతున్నాయని చెప్పారు. ఎవరైనాసరే చెప్పినంత ఇవ్వాల్సిందేనని, లేకుంటే ఏదీ జరగదని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఉండి ప్రజలు సంతోషంగా ఉన్నారు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉండిలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని చెప్పారు. కానీ ఇప్పుడు టీడీపీ అధికారం చేపట్టాక ప్రజలంతా గజగజ వణికిపోతున్నారన్నారు. రఘురామకృష్ణరాజు బ్యాంకులకు కోట్ల రూపాయలు టోకరా వేశారని చెప్పారు. గతంలో వైఎస్సార్‌సీపీ ఎంపీగా పనిచేసిన రఘురామ.. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు వెళ్లి తాను మోసం చేసిన కోట్ల రూపాయలను రద్దుచేయించాలని అడిగారని, అందుకు జగన్ సహకరించకపోవడంతో ఆయనపై తిరుగుబాటు చేశారని పేర్కొన్నారు. టీడీపీకిగానీ, కూటమి అధికారంలోకి వచ్చేందుకుగానీ రఘురామ వ్యక్తిగతంగా ఏమీ కష్టపడలేదని చెప్పారు. అసలు ఆయనకు టీడీపీతో ఏంటి సంబంధం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్రైస్తవులపై దారుణ వ్యాఖ్యలు

వెలివర్రు గ్రామానికి చెందిన క్రైస్తవులు శ్మశానవాటిక సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు వద్దకు వెళితే.. 'మీ శవాలెందుకురా పూడ్చుకుంటారు.. కాల్చేసుకోండి' అంటూ వారి మనోభావాలను దెబ్బతీసేలా దారుణ వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. త్వరలోనే చంద్రబాబు వద్దకు వెళుతున్నానని, రఘురామకృష్ణరాజు అక్రమాలను ఆధారాలతో సహా బయటపెడతానని వెంకటేశ్వరరాజు చెప్పారు.

ఖాళీ బిందెలతో రోడ్డుపై మహిళల నిరసన

మడకశిర రూరల్: టీడీపీ కూటమి పాలనలో గుక్కెడు నీరు దొరక్క గ్రామాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో తాగునీటి కోసం జనం అల్లాడిపోతున్నారు. రక్షిత మంచినీటి పథకాలకు నీరందించే బోర్లు తరచూ మరమ్మతులకు గురికావడం, పని చేసే బోర్లలో నీరు రాకపోవడంతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు కన్నీటి కష్టాలు పడుతున్నా స్థానిక టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అమరావతికే పరిమితమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. మడకశిర మండలం దిగువ అచ్చంపల్లిలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చడంతో మంగళవారం సాయంత్రం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఇంకెన్నాళ్లు తాము నీటి కోసం ఇబ్బందులు పడాలని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో రెండు వాటర్ స్కీమ్‌లు ఉన్నా, ఒక్కదాంట్లోనూ నీరు రావడం లేదన్నారు. కొత్త బోరు వేసి సమస్యలను పరిష్కరించాలని అధికారులను విన్నవించినా ఫలితం లేదన్నారు. ఎమ్మెల్యేకు చెప్పుకుందామంటే ఆయన ఎక్కడుంటాడో కూడా తెలియడం లేదంటున్నారు.

వధూవరులకు బంగారు తాళిబొట్లు

వైఎస్ జగన్ పేరిట 48 మందికి పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే

బంగారు తాళిబొట్లు అందజేస్తున్న గురుమూర్తి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరిట నిరుపేద వధూవరులకు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి బంగారు తాళిబొట్లు, నూతన వస్త్రాలను మంగళవారం రాత్రి పంపిణీ చేశారు. 20 ఏళ్లుగా కొనసాగుతున్న సేవా కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది కూడా 48 జంటలకు వీటిని అందించారు. కార్యక్రమానికి తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై నూతన వధూవరులకు బంగారు తాళిబొట్లు అందజేశారు. ఈ సందర్భంగా బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాల్లో వివాహ వేడుకలు ఆర్థిక భారంగా మారకుండా చేయడమే ముఖ్య లక్ష్యమని అన్నారు. బలహీనవర్గాలకు అండగా నిలుస్తూ రెండు దశాబ్దాలుగా నిరంతరం సేవలు అందించడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు, ఉన్నం వాసుదేవనాయుడు, చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, షేక్ సిరాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
ప్రభుత్వ రంగ షెడ్యూల్డ్ బ్యాంక్
ప్రధాన కార్యాలయం : గుంటూరు

టెండర్ ఆహ్వాన నోటీసు

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, తమ శాఖలకు 1 mg ఎలక్ట్రానిక్ జువెల్ వెయింగ్ మెషీన్ల సరఫరా కోసం (3 సంవత్సరాల వారంటీతో) 2 సంవత్సరాల రేట్ కాంట్రాక్ట్‌కు సంబంధించి అభ్యర్థన పత్రాలను ఆహ్వానిస్తుంది. అభ్యర్థన పత్రాలను పోస్టు/కొరియర్ ద్వారా మాత్రమే క్రింద పేర్కొన్న మా ప్రధాన కార్యాలయ చిరునామాకు చేరే విధంగా సమర్పించవలెను. నిర్దేశిత నమూనాలో బిడ్లు సమర్పించుటకు చివరి తేదీ 10-03-2026 సాయంత్రం 5.00 గంటల వరకు. మరిన్ని వివరముల కోసం: జనరల్ మేనేజర్(సర్వీసెస్), ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ప్రధాన కార్యాలయం, సర్వీసెస్ డిపార్ట్‌మెంట్, డోర్ నెం.5-38-27/28, 2వ అంతస్తు, 5/2 వ లైను, HP పెట్రోల్ బంక్ ఎదురు, బ్రాడీపేట, గుంటూరు-522002, ఫోన్: 9490158007 లేదా బ్యాంక్ యొక్క వెబ్‌సైట్: https://apgb.bank.in లేదా CPP Portal https://eprocure.gov.in/cppp/ సందర్శించవలెను. బిడ్ ఐడి: APGB/HO/Services/23/2025-26. టెండర్‌కు సంబంధించిన నియమ నిబంధనలు మరియు షరతులను సవరించుటకు లేదా ఎలాంటి కారణము చెప్పకుండానే ఏదైనా లేదా అన్ని బిడ్లను తిరస్కరించే హక్కు బ్యాంక్ వారికి ఉంటుంది. *షరతులు వర్తిస్తాయి.

జనరల్ మేనేజర్, ప్రధాన కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, గుంటూరు.

ద్వైపాక్షిక బంధం... గ్లోబల్ స్థాయికి!

భారత్, ఫ్రాన్స్ నిర్ణయం

- మాక్రాన్–మోదీ కీలక చర్చలు
- 21 ఒప్పందాలపై సంతకాలు

చర్చల అనంతరం మరో కార్యక్రమంలో పాల్గొనేందుకు కార్లో కలిసి వెళ్తున్న మాక్రాన్, మోదీ

ముంబై: భారత్, ఫ్రాన్స్ సంబంధాల్లో నూతన శకానికి తెర లేచింది. అంతర్జాతీయంగా తీవ్ర అస్థిర పరిస్థితుల నేపథ్యంలో ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. వాటిని 'ప్రత్యేక ప్రపంచ స్థాయి వ్యూహాత్మక భాగస్వామ్యం'గా తీర్చిదిద్దుకోవాలని నిశ్చయించాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్, ప్రధాని నరేంద్ర మోదీ నడుమ జరిగిన చర్చల్లో ఈ మేరకు కీలక ఒప్పందం కుదిరింది. రక్షణ, వర్తకం మొదలుకుని అరుదైన ఖనిజాల దాకా అన్ని రంగాల్లోనూ పరస్పర సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవాలని నేతలు నిర్ణయించారు. ఈ దిశగా రక్షణ, అత్యంత అధునాతన టెక్నాలజీ, సంప్రదాయేతర ఇంధన వనరులు, ఆరోగ్యం తదితరాలకు సంబంధించి ఇరు దేశాల నడుమ 21 కీలక ఒప్పందాలు కుదిరాయి. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఫ్రెంచి రక్షణరంగ దిగ్గజం సఫ్రాన్ సంయుక్తంగా భారత్‌లో హమ్మర్ క్షిపణుల తయారీ, భారత, ఇరుదేశాల సైన్యంలో పరస్పరం అధికారుల నియామకం తదితరాలు వీటిలో ఉన్నాయి. మూడు రోజుల పర్యటన నిమిత్తం భారత్ వచ్చిన మాక్రాన్‌తో మంగళవారం సాయంత్రం మోదీ ముంబైలో సమావేశమయ్యారు. పలు అంశాలపై ఇరువురూ లోతుగా చర్చించారు. భారత్–ఫ్రాన్స్ ద్వైపాక్షిక బంధాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలని తీర్మానించారు. అనంతరం మోదీ, మాక్రాన్ సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు.

కీలక భాగస్వామ్యం: మోదీ

ప్రపంచం ప్రస్తుతం అత్యంత అస్థిర దశ గుండా సాగుతోందని మోదీ అభిప్రాయపడ్డారు.ఈ పరిస్థితుల్లో స్థిరత్వ స్థాపనలో భారత్, ఫ్రాన్స్ భాగస్వామ్యం కీలకపాత్ర పోషించగలదని విశ్వాసం వెలిబుచ్చారు. ఫ్రాన్స్ నైపుణ్యం, భారత వనరులు ఒక్కతాటిపైకి వస్తే అద్భుతాలు జరుగుతాయన్నారు. ఇరుదేశాలదీ ఎలాంటి హద్దులూ లేని ఆదర్శ భాగస్వామ్యం. ఇరు దేశాల మధ్య మొదటి నుంచీ ప్రత్యేక సంబంధాలు కొనసాగుతూ వస్తున్నాయి''అని చెప్పారు. భారత్‌కు అత్యంత పురాతన వ్యూహాత్మక భాగస్వాముల్లో ఫ్రాన్స్ ఒకటని ఆయన గుర్తు చేశారు. ''మాక్రాన్‌తో తాజా భేటీ ద్వారా ఈ బంధాన్ని ఎన్నడూ లేనంతగా ముందుకు తీసుకెళ్లాం. ఇరు దేశాలు పరస్పర విశ్వాసం, ఉమ్మడి విజన్‌తో కలసి సాగనున్నాయి. ఇది కేవలం వ్యూహాత్మక బంధం మాత్రమే కాదు. ప్రపంచ ప్రగతికి బాటలు పరిచే కీలక బంధం''అని ప్రకటించారు. ఉగ్రవాదం కూడా మాక్రాన్‌తో చర్చల్లో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చినట్టు ప్రధాని తెలిపారు. దాన్ని అన్ని రూపాల్లోనూ తుదముట్టించేందుకు ఇరు దేశాలూ కృతనిశ్చయంతో ఉన్నట్టు చెప్పారు.

సంస్కరణలతోనే సమాధానం

ఉక్రెయిన్, పశ్చిమాసియాతో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు ఇతర చోట్ల యుద్ధ మేఘాలు ఇంకా తొలగలేదని మోదీ గుర్తు చేశారు. ''ఈ కల్లోల పరిస్థితుల నుంచి గట్టెక్కించగలిగేది ప్రజాస్వామిక విలువలే అన్నదే భారత్, ఫ్రాన్స్ వైఖరి. ఐరాస వంటి అంతర్జాతీయ సంస్థలను సమూలంగా సంస్కరించినప్పుడే ఈ అంతర్జాతీయ సవాళ్లకు సజావైన పరిష్కారాలు లభిస్తాయి ఆ ప్రయత్నాలకు భారత్, ఫ్రాన్స్ పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తాయి. ఎందుకంటే రెండు దేశాలూ బహుళ ధ్రువ ప్రపంచాన్నే కోరుతున్నాయి''అని వివరించారు. యూరోపియన్ యూనియన్‌తో భారత్ ఇటీవలే తన చరిత్రలోనే అతి పెద్ద స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుందని మోదీ గుర్తు చేశారు. అది భారత్, ఫ్రాన్స్ సంబంధాలకు కూడా ఎంతగానో ఊపునిచ్చే పరిణామమేనని ఆయన చెప్పారు. ''ఇరు దేశాల ప్రజలు, కంపెనీలు ఇకపై రెండు పన్నులు కట్టాల్సిన దురవస్థ తప్పింది. పరస్పర వర్తకం, పెట్టుబడులు తదితరాలను నూతన శిఖరాలకు తీసుకెళ్లేందుకు ఇరు దేశాలకు ఈ ఒప్పందాలు సరికొత్త రోడ్‌మ్యాప్‌గా నిలిచాయి''అన్నారు.

హెలికాప్టర్ నిర్మాణ కేంద్రం ప్రారంభం

కర్నాటకలోని వెమగల్‌లో ఎయిర్‌బస్ హెచ్125 హెలికాప్టర్ల నిర్మాణ కేంద్రాన్ని ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఇరుదేశాల మధ్య పరస్పరం నెలకొన్న లోతైన విశ్వాసానికి ఈ ప్లాంట్ ప్రారంభమే తాజా నిదర్శనమని మోదీ ఈ సందర్భంగా అన్నారు. ''మౌంట్ ఎవరెస్టును మించిన ఎత్తుల్లో ఎగరగల సామర్థ్యమున్న ఏకైక హెలికాప్టర్‌ను ఇరుదేశాలూ కలిసి భారత్‌లో సంయుక్తంగా తయారు చేయనుండటం నిజంగా గర్వకారణం. వాటిని ప్రపంచమంతటికీ ఎగుమతి చేయనున్నాం''అని ప్రకటించారు. ఈ హెలికాప్టర్ల తయారీ ప్లాంటు ఫ్రాన్స్‌కు చెందిన ఎయిర్‌బస్, భారత్‌కు చెందిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ జాయింట్ వెంచర్

భారత్ అత్యంత విశ్వసనీయ భాగస్వామి: మాక్రాన్

ఫ్రాన్స్‌కు భారత్ అత్యంత విశ్వసనీయ భాగస్వామి అని మాక్రాన్ పేర్కొన్నారు. రఫేల్‌యుద్ధ విమానాలు మొదలుకుని జలాంతర్గాముల దాకా రక్షణ రంగంలో ఇరు దేశాల నడుమ పరస్పర సహకారం నానాటికీ పెంపొందుతోందని హర్షం వెలిబుచ్చారు. ఉగ్రవాదంపై పోరాటంలో కూడా భారత్, ఫ్రాన్స్ పరస్పరం మరింతగా సహకరించుకుంటాయని ప్రకటించారు. భారత్‌లో తనకు లభించిన అపూర్వ స్వాగతానికి కృతజ్ఞతలు తెలిపారు. మాక్రాన్‌కు భారత్‌లో ఇది నాలుగో అధికారిక పర్యటన.

''గ్లోబల్ ఇన్నోవేషన్‌లో భారత్ కేవలం భాగస్వామి కాదు. సిలికాన్ వ్యాలీ మొదలుకుని టెక్నాలజీ, సంస్కృతి దాకా అన్ని రంగాల్లోనూ సారథి స్థానంలో రాణిస్తోంది'' అంటూ మాక్రాన్ ప్రశంసించారు. ద్వైపాక్షిక చర్చల సందర్భంగా మోదీతో కలిసి 'ఇండియా–ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్'ను ఆయన ఆవిష్కరించారు. ఇరుదేశాల భాగస్వామ్యాన్ని ప్రజల భాగస్వామ్యంగా తీర్చిదిద్దడమే దీని లక్ష్యమని నేతలు వివరించారు.

ఇన్నొవేషన్ల సారథి భారత్: మాక్రాన్

ఇందులో భాగంగా పరిశ్రమలు, స్టార్టప్‌లు, చిన్న–మధ్య తరహా పరిశ్రమలు, విద్యార్థులు, రక్షణ రంగంలో పరిశోధనలు, స్వచ్ఛ ఇంధనం, అంతరిక్షం, నూతన టెక్నాలజీలు తదితర రంగాల్లో పరిశోధనలకు మరింత ఊపు లభిస్తుందని మోదీ అన్నారు. ఇన్నొవేషన్ ఇయర్‌లో భాగంగా ఆరోగ్యం, డిజిటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో ఇండో–ఫ్రెంచ్ ఏఐ సెంటర్లను స్థాపించనున్నారు. ఫ్రాన్స్‌లో భారత్ త్వరలో స్వామి వివేకానంద కల్చరల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది.

మెరీన్ డ్రైవ్‌లో మాక్రాన్ జాగింగ్!

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ మంగళవారం ఉదయం బాంబేలోని మెరీన్ డ్రైవ్‌లో జాగింగ్ చేశారు. నీలిరంగు టీ షర్టు, నలుపు షార్ట్స్, రన్నింగ్ షూస్ ధరించిన ఆయన జాగింగ్ చేస్తున్న వారితో కలిసి పోటాపోటీగా పరుగు తీశారు. భద్రతా సిబ్బంది మారువేషాల్లో కాస్త వెనకగా ఆయనను అనుసరించారు. ఈ సందర్భంగా ముంబై పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. మాక్రాన్‌ను గుర్తుపట్టిన పలువురు ఆయన్ను తమ స్మార్ట్ ఫోన్లలో బంధించారు. అవన్నీ వైరల్‌గా మారాయి. మాక్రాన్ విదేశీ పర్యటనల్లో కూడా జాగింగ్ కొనసాగిస్తుంటారు.

బాలీవుడ్ తారలతో మాక్రాన్ దంపతుల భేటీ

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ భారత పర్యటనలో తారల తళుకులు చోటుచేసుకున్నాయి. పలువురు బాలీవుడ్ తారలతో మాక్రాన్, బ్రిగెటీ దంపతులు మంగళవారం భేటీ అయ్యారు. సినీ పరిశ్రమపరంగా భారత్, ఫ్రాన్స్ సంబంధాల బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు తదితరాలపై వారితో రెండు గంటలకు పైగా చర్చించారు. తాజ్‌మహల్ ప్యాలెస్ హోటల్లో జరిగిన ఈ సమావేశంలో జోయా అక్తర్, షబానా అజ్మీ, మనోజ్ బాజ్‌పాయ్, అనిల్ కపూర్, కబీర్ ఖాన్, రిచా ఛద్దా తదితరులు పాల్గొన్నారు. 2008లో ఆస్కార్ అవార్డులు గెలుచుకున్న స్లమ్‌డాగ్ మిలియనీర్ చిత్రమంటే తనకెంతో ఇష్టమని బ్రిగెటీ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

2047 కల్లా భారతే ఏఐ సూపర్‌పవర్!

అదే మా లక్ష్యం: మోదీ

- రోడ్‌మ్యాప్‌పై ఏఐ సదస్సుతో స్పష్టత
- ఏఐతో ఉపాధి పోతుందన్నది అపోహే
- ముందస్తు సన్నద్ధతే సరైన విరుగుడు

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) మానవ కేంద్రకంగా ఉంటూనే ప్రపంచ పురోగమనాన్ని వేగవంతం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. ఏఐ వినియోగంలో భారత్ 2047 నాటికి సూపర్ పవర్‌గా, ప్రపంచంలో టాప్–3 దేశాల్లో ఒకటిగా నిలవాలన్నదే తమ లక్ష్యమన్నారు. అందుకు అనుసరించాల్సిన మార్గాలపై ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సుతో మరింత స్పష్టత వస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు. ''భారత్‌ను కేవలం ఏఐ వినియోగదారుగా మాత్రమే కాకుండా ఏఐ సృష్టికర్తగా తీర్చిదిద్దేందుకు కావాల్సిన వనరులు స్టార్టప్‌లు, పరిశోధన సంస్థలు, సాంకేతిక వ్యవస్థల రూపంలో మన దగ్గర పుష్కలంగా ఉన్నాయి. ఏఐ విప్లవంలో భాగస్వామి దశ నుంచి దాన్ని శాసించే స్థాయికి భారత్ ఎదిగేలా మౌలిక సదుపాయాలు, వ్యవస్థలు, నైపుణ్యాలను తీర్చిదిద్దుతున్నాం''అని వివరించారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సదస్సు నేపథ్యంలో మంగళవారం ఏఎన్ఐ వార్తా సంస్థకు ప్రధాని ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ''ఏఐ రూపంలో మానవ నాగరికత ప్రస్తుతం మరో కీలక మలుపు ముంగిట నిలిచింది. మానవ సామర్థ్యాన్ని ఇది అసాధారణ రీతిలో బహుముఖంగా విస్తరించగలదు''అని అభిప్రాయపడ్డారు. సరైన మార్గనిర్దేశం లేకపోతే సామాజిక పునాదులకే ఏఐ పెను సవాలు విసరగలదని ఆయన హెచ్చరించారు. వీటన్నింటిపై సదస్సులో కూలంకషంగా చర్చ జరిగి పరిష్కార మార్గాలు లభిస్తాయని ఆశాభావం వెలిబుచ్చారు. ''ఏఐతో అన్ని రంగాల్లోనూ అంతరాలు పెరుగుతాయని అంతా భయపడుతున్నారు. వాటిని తగ్గించడానికి భారత్ కృషి చేస్తోంది. భారత ఐటీ రంగం ముమ్ముందు ప్రపంచానికే చుక్కానిలా మారుతుంది''అని మోదీ ధీమా వెలిబుచ్చారు.

అందరికీ ఏఐ ప్రయోజనాలు

ఏఐ ప్రయోజనాలను తొలుత అందిపుచ్చుకునే దేశాలు వాటిని తమకే పరిమితం చేసుకోకుండా అన్ని దేశాలకూ అందించాలని మోదీ అన్నారు. ''పలు రంగాల్లో మనుషులు చేసే చాలా పనులు ఏఐమయంగా మారుతున్నాయి. దాంతో ఏఐతో ఉద్యోగాలు పోతాయనే భయాందోళనలు యువతలో నెలకొన్నాయి. ముందస్తు సన్నద్ధతే ఈ భయాలకు విరుగడు''అని సూచించారు. అంతేగాక, ''డిజిటల్ విప్లవం మరిన్ని సరికొత్త ఉపాధి అవకాశాలకు తెర తీస్తోంది. వాటిని సమర్థంగా ఒడిసిపట్టుకోవాలి''అంటూ పిలుపునిచ్చారు. ఏఐ ఆధారిత భవిష్యత్తు దిశగా యువత నైపుణ్యాల మెరుగుదల, శిక్షణపై భారీగా పెట్టుబడులు పెడుతున్నట్టు గుర్తు చేశారు. భావి ప్రపంచ ప్రగతికి భారత యువతే సారథ్యం వహిస్తుందని ధీమా వెలిబుచ్చారు. ''ఏ దేశానికైనా ఏఐ ఇప్పుడొక తిరుగులేని బలం. వికసిత భారత్–2047 లక్ష్యసాధనలో ఏఐదే కీలక పాత్ర. ఇది సరికొత్త ఆర్థికావకాశాలను సృష్టించగలదు. సమ్మిళిత వృద్ధిని సుసాధ్యం చేస్తూ పట్టణ–గ్రామీణ అంతరాలను తగ్గించి అందరికీ సమానావకాశాల కల్పనకు దోహదం చేస్తుంది''అన్నారు.

సర్వం ఏఐమయం!

ప్రతి రంగంలోనూ ఇప్పుడు ఏఐ ప్రభావం గణనీయంగా కనిపిస్తోందని మోదీ అభిప్రాయపడ్డారు. ''ప్రాథమిక, జిల్లా ఆరోగ్య కేంద్రాల్లో కూడా పలు వ్యాధుల ముందస్తు గుర్తింపుకు ఏఐ ఆధారిత పరిష్కారాలు అందుబాటులో ఉన్నాయి. భారతీయ భాషల్లో రూపొందించిన ఏఐ అభ్యసన వేదికలు గ్రామీణ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. వ్యవసాయ రంగంలోనూ ఏఐ అమూల్య సేవలు అందిస్తోంది. ప్రాచీన రాతప్రతుల డిజిటలీకరణ తదితరాలతో వారసత్వ సంరక్షణలోనూ తోడ్పడుతోంది. ఆధార్, యూపీఐ తదితర భారత డిజిటల్ సదుపాయాల వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోంది. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సజావుగా చేరడం, ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకతను పెంపొందించడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తోంది. ఏఐ ప్రయోజనాలను నిరక్షరాస్యులకు కూడా అందించే విషయంలో ప్రపంచంలో అగ్ర స్థానం భారత్‌దే!''అని చెప్పారు.

కట్టడి తప్పనిసరి

ఏఐ సాంకేతికత దుర్వినియోగాన్ని కట్టడి చేసేందుకు కఠినమైన నియమ నిబంధనలు తప్పనిసరని మోదీ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా డీప్‌ఫేక్, నేరాలు, ఉగ్రవాద కార్యకలాపాల కోసం ఏఐని వాడకుండా కట్టుదిట్టాలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ఇందుకోసం గతేడాది ఇండియా ఏఐ సేఫ్టీ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించినట్టు ఆయన గుర్తు చేశారు.

'ఏఐ ఎక్స్‌పో' ఆలోచనల కూడలి: మోదీ

దేశ రాజధానిలో జరుగుతున్న ఇండియా ఏఐ సదస్సును భిన్న ఆలోచనలు, ఇన్నొవేషన్ల అపూర్వ కూడలిగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. మంగళవారం ఎక్స్ పోస్టులో ఆయన ఈ మేరకు పేర్కొన్నారు. ''భారతీయుల ప్రతిభను, ఏఐ భవితవ్యాన్ని ప్రపంచానికి మేలు చేసేలా తీర్చిదిద్దడంలో వారి సామర్థ్యాన్ని ఈ సదస్సు కళ్లకు కడుతోంది. అంతేగాక ఏఐని బాధ్యతాయుతంగా వినియోగించుకోవడం, తద్వారా మానవ ప్రగతికి బాటలు పరవడంలో భారత్ చిత్తశుద్ధిని ఇది ప్రపంచానికి చాటుతోంది'' అన్నారు.

తుగ్లక్ కమిషన్!

ఈసీపై మమత తీవ్ర వ్యాఖ్యలు

- బెంగాల్ ఓటర్లపై దమనకాండ
- అచ్చం హిట్లర్‌ను తలపిస్తోంది
- టార్చర్ కమిషన్ అంటూ ధ్వజం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ మంగళవారం కేంద్ర ఎన్నికల కమిషన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈసీ అచ్చం తుగ్లక్ కమిషన్ మాదిరిగా వ్యవహరిస్తోందంటూ దుయ్యబట్టారు. అధికార బీజేపీ చెప్పినట్టల్లా ఆడుతూ రాష్ట్రంలో ఓటర్ల జాబితాకు అక్రమంగా మార్పుచేర్పులు చేస్తోందని ఆరోపించారు. ఈసీ తీరును తుగ్లక్, హిట్లర్ వ్యవహార శైలితో ఆమె పోల్చారు. బెంగాల్ ఓటర్లను ఈసీ తీవ్రంగా హింసిస్తోందని, వారికి నరకం చూపుతోందని మండిపడ్డారు. ''బెంగాల్లో అన్ని నిబంధనలనూ ఈసీ తుంగలో తొక్కుతోంది. సుప్రీంకోర్టు నిర్దేశాలను కూడా ధిక్కరిస్తోంది. తీవ్ర అయోమయాలకు, అమాయకుల మరణాలకు కారణమవుతోంది. ఇది కచ్చితంగా టార్చర్ కమిషనే. అచ్చం తుగ్లక్ మాదిరిగా వ్యవహరిస్తోంది. ఓటర్లపై అక్రమాలతో హిట్లర్‌ను తలపిస్తోంది. ప్రభుత్వాలను ఎన్నుకునేది ప్రజలా, లేక ఒక రాజకీయ పార్టీ తాబేదారు మాదిరిగా వ్యవహరిస్తున్న తుగ్లక్ కమిషనా?''అంటూ తూర్పారబట్టారు. ఈసీ తీరుపై హరియాణా, బిహార్, మహారాష్ట్రల్లో కూడా తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని మమత అన్నారు. ఎవరేమనుకున్నా బీజేపీని తృప్తి పరచడమే ధ్యేయంగా ఈసీ వ్యవహరిస్తోందని ఆక్షేపించారు.

ద్వంద్వ ప్రమాణాలు

పలు అంశాలకు సంబంధించి బెంగాల్ విషయంలో ఈసీ పలు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని మమత ఆరోపించారు. ''స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో భాగంగా బిహార్ తదితర రాష్ట్రాల్లో అనుమతించిన డాక్యుమెంట్లను బెంగాల్లో మాత్రమే తిరస్కరిస్తున్నారు. దీని వెనక మతలబు ఏమిటి?''అని ప్రశ్నించారు. ''సర్ ప్రక్రియ కోసం కేటాయించిన ఏడుగురు రాష్ట్ర అధికారులను ఏ కారణమూ చూపకుండానే ఈసీ సస్పెండ్ చేసింది. ఇవన్నీ కక్షసాధింపు చర్యలే తప్ప మరోటి కాదు. రాష్ట్ర ప్రభుత్వాధికారులను బలి పశువులు చేయాలన్న ఈసీ ప్రయత్నాలను సాగనివ్వబోం''అని పేర్కొన్నారు. తన సొంత అసెంబ్లీ నియోజకవర్గం భవానీపూర్‌లో 2 లక్షల పై చిలుకు ఓటర్లుంటే వారిలో ఏకంగా 40 వేల మంది పేర్లు ఉన్నట్టుండి జాబితా నుంచి మాయమైనట్టు మమత ఆరోపించారు. తమతో ఈసీ దాగుడుమూతలు ఆటాడుతోందంటూ ధ్వజమెత్తారు.

బీజేపీ గూటికి భూపేన్

22న పార్టీలో చేరతారన్న అస్సాం సీఎం హిమంత

గువాహటి: అస్సాం కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, సీనియర్ నేత భూపేన్ బోరా కమలదళంలో చేరేందుకు రంగం సిద్ధమైంది. ధుబ్రీ పార్లమెంట్ సభ్యుడు రకీబుల్ హుస్సేన్‌తో ఆధిపత్యపోరులో భూపేన్ కాంగ్రెస్‌ను సోమవారం వీడినట్లు వార్తలొచ్చాయి. తాను పార్టీని వీడుతున్నట్లు భూపేన్ సోమవారం ప్రకటించగా మరుసటి రోజే గువాహటిలోని ఆయన నివాసానికి బీజేపీ రాష్ట్ర అగ్రనేత, ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ విచ్చేశారు. భూపేన్ భార్య, కుమారుడు సీఎంకు హారతి పట్టి మరీ ఇంట్లోకి ఆహ్వానించారు. భూపేన్‌తో భేటీ తర్వాత సీఎం మీడియాతో మాట్లాడారు. ''భూపేన్ బీజేపీలో ఫిబ్రవరి 22వ తేదీన చేరబోతున్నారు. ఆయన చేరికకు సంబంధించిన వివరాలను భూపేన్‌తో భేటీ తర్వాత బీజేపీ రాష్ట్ర చీఫ్ దిలీప్ సైకియా వెల్లడిస్తారు. కాంగ్రెస్‌లో హిందువులకు స్థానంలేదని భూపేన్ నిష్క్రమణ రుజువుచేస్తోంది. కాంగ్రెస్‌లో భూపేన్ ఎన్నో కష్టాలుపడ్డారు. ఆయన అనుకున్నది సాధించడానికి బీజేపీయే మంచి వేదిక. మా పార్టీలో చేరాక పార్టీ బలంగా ఉన్న నియోజకవర్గం నుంచి ఆయన్ను గెలిపించుకుంటాం''అని సీఎం శర్మ అన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న హిమంత. చిత్రంలో బోరా

రహ్మాన్‌కు ఆహ్వానం అందిస్తున్న ఓం బిర్లా

భారత్‌కు రండి

తారిఖ్‌కు మోదీ ఆహ్వానం

లేఖను అందజేసిన ఓం బిర్లా

న్యూఢిల్లీ: బంగ్లా నూతన ప్రధాని తారిఖ్ రహ్మాన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన్ను భారత్‌కు ఆహ్వానించారు. భారత్‌లో పర్యటించాల్సిందిగా కోరుతూ మోదీ రాసిన లేఖను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మంగళవారం రహ్మాన్‌కు అందజేశారు. ప్రమాణస్వీకారం అనంతరం ఆయనతో బిర్లా భేటీ అయ్యారు. ప్రజాస్వామిక, ప్రగతిశీల బంగ్లా పునర్నిర్మాణ క్రతువులో అన్నివిధాలా సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందంటూ మోదీ సందేశాన్ని రహ్మాన్‌కు అందజేశారు.

గద్దెనెక్కిన రహ్మాన్

- బంగ్లా ప్రధానిగా బాధ్యతల స్వీకరణ
- భారత్ తరఫున స్పీకర్ బిర్లా హాజరు
- మంత్రివర్గంలో మైనారిటీలకు చోటు
- ఒకరు హిందువు, మరొకరు బౌద్ధ నేత

ఢాకా: బంగ్లాదేశ్‌లో 18 నెలల పై చిలుకు రాజకీయ అనిశ్చితికి తెరపడింది. దేశ నూతన ప్రధానమంత్రిగా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) చైర్మన్ తారిఖ్ రహ్మాన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. 60 ఏళ్ల రహ్మాన్‌తో దేశ అధ్యక్షుడు మొహమ్మద్ షాబుద్దీన్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం 25 మంది మంత్రులుగా, 24 మంది సహాయ మంత్రులుగా కూడా ప్రమాణం చేశారు. ఢాకాలోని చారిత్రక జతియా సంసద్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో దేశ, విదేశాల నుంచి 1,200 మందికి పైగా రాజకీయ తదితర రంగాల ప్రముఖులు, అతిథులు పాల్గొన్నారు. భారత్ తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీ హాజరయ్యారు. ఇటీవలి పార్లమెంటు ఎన్నికల్లో బీఎన్‌పీ ఘనవిజయం సాధించడం తెలిసిందే. 297 స్థానాలకు గాను ఆ పార్టీ ఏకంగా 209 సీట్లను కేవసం చేసుకుంది. మతవాద జమాతే ఇస్లామీకి 68 సీట్లు దక్కాయి. రహ్మాన్ మంత్రివర్గంలో బీఎన్‌పీ ఉపాధ్యక్షుడు నితాయ్ రాయ్ చౌధరితో పాటు దీపెన్ దీవాన్ రూపంలో ఇద్దరు మైనారిటీలకు చోటు దక్కడం విశేషం. చౌధరి హిందువు కాగా దీవాన్ బౌద్ధుడు. ఆశ్చర్యకరంగా మధ్యంతర ప్రభుత్వ భద్రతా సలహాదారు ఖలీలుర్ రహ్మాన్‌కు కూడా మంత్రివర్గంలో స్థానం కల్పించారు. రెహ్మాన్ ప్రధాని పదవి చేపట్టడం ఇదే తొలిసారి. ఆయన బాధ్యతల స్వీకరణతో మహ్మద్ యూనుస్ సారథ్యంలోని మధ్యంతర ప్రభుత్వ ఏడాదిన్నర పై చిలుకు పాలనకు లాంఛనంగా తెరపడింది. 2024 ఆగస్టులో జరిగిన ఆందోళనల నేపథ్యంలో షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలిన నాటినుంచీ తాత్కాలిక ప్రభుత్వానికి యూనుస్ సారథిగా వ్యవహరిస్తూ రావడం తెలిసిందే.

ప్రమాణం చేస్తున్న తారిఖ్ రహ్మాన్

ఎంపీ ప్రమాణస్వీకారంలో రగడ

అంతకుముందు బీఎన్‌పీ తరఫున ఎన్నికల్లో గెలిచిన సభ్యులంతా పార్లమెంటు సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. అయితే రిఫరెండానికి ఆమోద ముద్ర వేస్తూ రాజ్యాంగ సంస్కరణ మండలి సభ్యులుగా కూడా వారంతా రెండో ప్రమాణస్వీకారం చేయాల్సి ఉండగా అందుకు నిరాకరించారు. తమ ఎంపీలెవరూ రెండో ప్రమాణస్వీకారం చేయబోరని బీఎన్‌పీ స్పష్టం చేసింది. ప్రధాన ప్రతిపక్షం జమాతే ఇస్లామీతో పాటు నేషనల్ సిటిజన్ పార్టీ దీన్ని తీవ్రంగా నిరసించాయి. సంస్కరణలను ఆమోదించని పక్షంలో పార్లమెంటు ఉనికికే అర్థం ఉండదంటూ ఆగ్రహం వెలిబుచ్చాయి. రాజ్యాంగ సంస్కరణ మండలి సభ్యులుగా కూడా బీఎన్‌పీ ఎంపీలంతా ప్రమాణం చేసేదాకా తాము ప్రమాణస్వీకారం చేయబోమని భీష్మించాయి. చివరికి పట్టువీడి మధ్యాహ్నం అనంతరం ఇరు పార్టీల ఎంపీలూ ప్రమాణస్వీకారం చేశారు. వారంతా రెండో ప్రమాణస్వీకారం కూడా చేయడం విశేషం. ఇటీవలి సాధారణ ఎన్నికల్లో భాగంగా దేశవ్యాప్తంగా రిఫరెండం కూడా జరగడం తెలిసిందే. రాజ్యాంగాన్ని తిరగరాయడంతో పాటు అన్ని రంగాల్లోనూ సమూల సంస్కరణలను లక్షిస్తూ 84 పాయింట్లతో రూపొందించిన 'జూలై చార్టర్'పై రిఫరెండం ద్వారా ప్రజాభిప్రాయం సేకరించారు. 60 శాతం మందికి పైగా ఓటర్లు రిఫరెండానికి అనుకూలంగా ఓటేశారు.

పిటిషన్లకూ ఏఐ వాడతారా?

లాయర్ల తీరుపై సుప్రీంకోర్టు అసహనం

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ) సాయంతో పిటిషన్లకు ఒక రూపమిస్తూ వాటినే న్యాయవాదులు న్యాయస్థానాల్లో సమర్పిస్తున్న తీరుపై సర్వోన్నత న్యాయస్థానం ఆక్షేపించింది. ప్రపంచంలో అతిపెద్ద కృత్రిమమేధ సదస్సుకు రాజధాని 'ఏఐ ఇంపాక్ట్'వేదికగా నిలిచిన రోజున సుప్రీంకోర్టు ఏఐ వినియోగంపై ప్రతికూల ధోరణిలో పలు వ్యాఖ్యానాలు చేయడం గమనార్హం. మెర్సీ వర్సెస్ మ్యాన్‌కైండ్ అంటూ అసలు ఏనాడూ ఇవ్వని తీర్పులను సైతం విచిత్రంగా ప్రస్తావిస్తూ దాఖలుచేసిన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది. రాజకీయనేతల ప్రసంగాలపై మార్గదర్శకాలు జారీచేయాలని కోరుతూ విద్యావేత్త రూప్ రేఖా వర్మ దాఖలుచేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల ధర్మాసనం విచారించింది. ''ఏఐ టూల్స్‌తో రూపొందించిన పిటిషన్లనే నేరుగా కోర్టులో సమర్పిస్తున్నారు. ఇది ఏమాత్రం వాంఛనీయం కాదు''అని అన్నారు. ''మెర్సీ వర్సెస్ మ్యాన్‌కైండ్ అంటూ ఒక తీర్పును ఉదహరిస్తూ నా ముందుకూ ఒక పిటిషన్ వచ్చింది''అని జస్టిస్ నాగరత్న గుర్తుచేశారు. ''జస్టిస్ దీపాంకర్ దత్తా సారథ్యంలోని ధర్మాసనం ముందుకు సైతం ఇలాంటి ఎన్నో కాల్పనిక తీర్పులను ఉదహరిస్తూ పిటిషన్లు వచ్చాయి''అని అన్నారు. ''గతంలో పాత తీర్పులను ఉదహరించేవారు. ఇప్పుడు నకిలీల బెడద ఎక్కువైంది. వీటిని సరిచూడటం కూడా పెద్ద సమస్యగా తయారైంది. ఈ ధోరణి జడ్జీలపై అదనపు భారంగా మారింది''అని జస్టిస్ నాగరత్న ఆవేదన వ్యక్తంచేశారు. ''పిటిషన్‌ను సొంతంగా రాసే కళ బాగా తగ్గిపోతోంది. పాత తీర్పుల్లోని సుదీర్ఘ వాక్యాలను కాపీ కొట్టేసి స్పెషల్ లీవ్ పిటిషన్లలో అచ్చేస్తున్నారు. తామెందుకు పిటిషన్ వేస్తున్నామనే కారణాలను సూటిగా చెప్పే ధోరణి బాగా తగ్గిపోయింది. సొంతంగా రచన, సొంత వాక్యాలు చాలా తగ్గిపోయాయి''అని జస్టిస్ జోయ్‌మాల్య వ్యాఖ్యానించారు.

4 రాష్ట్రాల ఎన్నికలకు మార్చిలో షెడ్యూల్

- ఎన్నికల సంఘం వర్గాల వెల్లడి
- ముగియనున్న బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీల గడువు

వాటన్నింటికీ కలిపి ఏప్రిల్లోనే ఎన్నికలు!

న్యూఢిల్లీ/గువాహటి: పలు రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగనుంది. నాలుగు రాష్ట్రాలు, ఒకే కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలకు మార్చి మధ్యలో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముంది. కేంద్ర ఎన్నికల సంఘం వర్గాలు మంగళవారం ఈ మేరకు వెల్లడించాయి. కీలకమైన పశ్చిమబెంగాల్, తమిళనాడుతో పాటు కేరళ, అస్సాం అసెంబ్లీల గడువు మేలో, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీ గడువు జూన్‌లో ముగియనున్నాయి. వాటన్నిటికీ వచ్చే ఏప్రిల్లోనే ఎన్నికలు జరపాలని ఈసీ భావిస్తోంది. ఇందుకు సంబంధించి మార్చిలో షెడ్యూల్ విడుదల చేస్తామని ఈసీ వర్గాలు పేర్కొన్నాయి. ఎన్నికల సన్నద్ధతను అంచనా వేయడంతో పాటు ముందస్తు ఏర్పాట్ల నిమిత్తం ఈసీ బృందాలు ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తున్నాయి. సర్ ప్రక్రియ అనంతరం అస్సాం, పుదుచ్చేరిల్లో తుది ఓటర్ల జాబితాను ఈసీ ఇప్పటికే విడుదల చేసింది. తమిళనాడులో బుధవారం, కేరళలో ఫిబ్రవరి 21న, కీలకమైన పశ్చిమబెంగాల్లో 28న ఓటర్ల జాబితాలు వెలువడనున్నాయి. 2021లో పశ్చిమబెంగాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఏకంగా 8 విడతల్లో జరిగాయి. ఆ రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విడతల్లో పోలింగ్ జరిగిన ఎన్నికలుగా అవి రికార్డులకెక్కాయి! ఇక తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిల్లో ఒకే విడతలో, తీవ్రవాద ప్రభావిత అస్సాంలో 2 విడతల్లో పోలింగ్ జరిగింది.

అస్సాంలో ఈసీ పర్యటన

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషితో కూడిన ఈసీ బృందం మంగళవారం రెండో రోజు కూడా అస్సాంలో పర్యటించింది. రాష్ట్రంలో ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించింది.

సాక్షి
గుంటూరు
బుధవారం । 18 । ఫిబ్రవరి । 2026



మహా చండీహోమం

పిడుగురాళ్ల:త్రయోదశి వార్షికోత్సవంలో భాగంగా కనకదుర్గమ్మ ఆలయంలో మంగళవారం మహాచండీహోమం నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు.



సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 538.60 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి సాగర్‌కి 1,087 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.7000, గరిష్ట ధర రూ.8600, మోడల్ ధర రూ.8000 వరకు పలికింది.

నగర వాసులకు నీటి కష్టాలు తప్పవా?

- వేసవిలో రోజు వారీ నీటి వినియోగం 150 నుంచి 160 మిలియన్ లీటర్లు
- కృష్ణా నది నుంచి దాదాపు 132 మిలియన్ లీటర్ల నీటి సేకరణ లక్ష్యం
- సంగంజాగర్లమూడి నుంచి 19.50 మిలియన్ లీటర్ల నీరు లభ్యం
- అసంపూర్తిగా గోరంట్ల వాటర్ ట్యాంకుల నిర్మాణం
- స్పందించని పాలక వర్గం, అధికారులు

గుంటూరు నగర పరిధిలో 10 లక్షలకు పైగా జనాభా

గుంటూరు నగర ప్రజలకు ఈ వేసవిలో నీటి కష్టాలు తప్పేలా లేవు. ప్రస్తుతం తక్కెళ్లపాడు, సంగంజాగర్లమూడిల నుంచి 151.50 మిలియన్ లీటర్ల నీరు సరఫరా అవుతోంది. పైప్ లైన్ లీకేజీల కారణంగా ప్రతిరోజు వేలాది లీటర్లు వృథాగా పోతోంది. అయితే వేసవిలో రోజు వారి వినియోగం 150 నుంచి 160 మిలియన్ లీటర్ల నీరు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన వేసవిలో నగర వాసులకు నీటి కష్టాలు తప్పేలా లేవు.

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలో వేసవి వస్తే చాలు తాగునీటి సమస్య ఉత్పన్నమవుతుంది. నగర శివారు ప్రాంతాల తోపాటు..విలీన గ్రామాలకు తాగునీటి కష్టాలు ఉత్పన్నమవుతున్నాయి. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నగరంలో తాగునీటి సమస్యకు చెక్ పెట్టే కార్యక్రమాలు సత్ఫలితాలు ఇవ్వడం లేదనే చెప్పుకోవచ్చు. దీంతో పాటు ఏళ్ల తరబడి గోరంట్ల వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో వేసవిలో తాగునీటి కష్టాలు మళ్లీ పునరావతం కాక తప్పదని నగర వాసులు ఆందోళన చెందుతున్నారు.

అవసరం కొండంత...సరఫరా గోరంత

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 43 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. ఈ ట్యాంకులకు గుంటూరు నగరానికి కృష్ణానది నుంచి తక్కెళ్లపాడుకు 132 మిలియన్ లీటర్ల తాగునీరు సరఫరా అవుతుంది. సంగంజాగర్లమూడి(కొమ్మమూరు కెనాల్) నుంచి 19.50 మిలియన్‌ల నీరు సరఫరా అవుతోంది. మొత్తం 151.50 మిలియన్ లీటర్ల నీరు గుంటూరు నగరానికి ప్రతిరోజూ సరఫరా అవుతుంది. పైపులైన్ల లీకులు వలన రోజుకు 10 నుంచి 20 మిలియన్ లీటర్ల నీరు వృథా అవుతూ ఉంటుంది. వేసవిలో నీటి వాడకం ఎక్కువగా ఉండటంతో నగర శివారు ప్రాంత వాసులకు నీటి కష్టాలు వస్తుండేవి. పైపులైన్ లీకులు మరమ్మతులు చేపడుతున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పైపులైన్లు పాతవి కావడంతో లీకు బరస్ట్ అవ్వడంతో తిరిగి అక్కడే లీకులు ఏర్పడతున్నాయనే చెప్పుకోవచ్చును.

పైపులైన్ లీకులకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

అసంపూర్తిగా గోరంట్ల ట్యాంకు పనులు

గోరంట్ల కొండపై రూ.33 కోట్లతో రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ నుంచి వయా ఆటోనగర్ మీదుగా 10.14 కిలోమీటర్ల పైపులైను కొండమీద వాటర్ ట్యాంక్ నిర్మాణానికి కనెక్ట్ చేశారు. ట్యాంక్ పైభాగాన శ్లాబ్ వేయకపోవడంతో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

సమ్మర్ యాక్షన్ ప్లాన్ ఊసే లేదు..!

వేసవి కాలం రాకముందే గుంటూరు నగర పాలక సంస్థ అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తారు. ఇందులో భాగంగా పైపులైన్ల లీకుల మరమ్మతులు.. మోటార్లు కండీషన్‌లో ఉన్నాయో.. లేవో చూసుకోవడం..ఏమైన మరమ్మతులు ఉంటే చేయించడంతోపాటు బోరింగ్ పంపుల మరమ్మతులు..ఎక్కడైనా తాగునీరు రాకపోతే తీసుకునే చర్యలపై ఇంత వరకు అధికారులు యాక్షన్ ప్లాన్ చేయలేదనే చెప్పుకోవచ్చు. ఇప్పుడిప్పుడే ఎండలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ ఎప్పుడు ప్రారంభిస్తారో వేచి చూడాల్సి ఉంది.

'ఉగాది' నాటికి గృహ లక్ష్యాలను పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: ఉగాది నాటికి గృహ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆమె అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉగాది నాటికి జిల్లాలో 22,952 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యంగా ఉందన్నారు. దీనిని పూర్తి చేసేందుకు మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బిల్లుల చెల్లింపు వెంటనే జరుగుతుందనే విషయమై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. పీఎంఏవై 2.0 కింద 1755 గృహాలు మంజూరు చేశారని, వాటిలో 262 మాత్రమే ప్రారంభించారని, మిగిలినవి వెంటనే ప్రారంభించాలన్నారు.

ఉపాధి హామీ పనులు పూర్తి చేయాలి

ఉపాధి హామీ పనులు మార్చి 31 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. పనుల్లో రాజీ పడకూడదన్నారు. ఎంపీడీఓలు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేయాలన్నారు. ఉపాధి హామీ పనులను పూర్తి చేయడం సంబంధిత ఇంజినీర్లదే బాధ్యత అని స్పష్టం చేశారు. అన్ని మండలాల్లో మంజూరు చేసిన వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్లు, అంగన్వాడీ కేంద్రాలలో తాగు నీటి సౌకర్యాలు కల్పన ఈనెల చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ జె.వి.ఎస్.ఆర్.కె ప్రసాద్, జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు, డీపీఓ బి.వి.నాగసాయికుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి జె.శ్రీనివాస్, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ కె.కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోబీ పనులు నిర్దేశిత కాల పరిమితిలో పూర్తి చేయాలి

శంకర్ విలాస్ రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నిర్దేశిత కాల పరిమితిలో పూర్తి అయ్యేలా నిర్మాణ కాంట్రాక్ట్ ఏజెన్సీని సమన్వయం చేసుకుంటూ ఆర్ అండ్ బీ, జీఎంసీ అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్‌తో కలిసి సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫిల్లర్లు, డ్రెయిన్‌ల నిర్మాణం ప్లానింగ్‌లో నిర్దేశించిన సమయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని నిర్మాణ ఏజెన్సీకి సూచించారు. సమావేశంలో ఆర్డీవో కె.శ్రీనివాసరావు, జీఎంసీ ఎస్ఈ వెంకటేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ రెహ్మాన్, ఈఈలు విష్ణు, వేణు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ అనిల్‌కుమార్, ఆర్ అండ్ బీ, విద్యుత్, ఆర్వోబి నిర్మాణ పనులు నిర్వహిస్తున్న ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

జిల్లాలో ఎక్కడా వేసవి నీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లా నీరు, పారిశుద్ధ్య కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లడుతూ స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. తాగునీటి ఎద్దడి గ్రామాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వేసవిలో తాగు నీటి సమస్యపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఫోన్ ద్వారా సమాచారం అందిన వెంటనే పరిష్కారం చేయాలని అన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ కె.కళ్యాణ చక్రవర్తి, డీపీఓ బి.వి.నాగసాయికుమార్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మొరాయించిన రైల్వేగేటు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కొత్తూరు నుంచి పాతూరు వెళ్లే మార్గంలో కృష్ణా కెనాల్ జంక్షన్ పరిధిలో ఉన్న రైల్వేగేటు మంగళవారం మొరాయించింది. గేటు వద్ద పనిచేసే సిబ్బంది ఆ రైల్వేగేటును తరుచూ పైకి లేపి వాహనాల రాకపోకలకు అనుమతించారు. మంగళవారం ఉదయం గేటు పైకి ఎత్తే సమయంలో ఒకవైపు గేటుకు ఉన్న లాక్ ఓపెన్ కాక మొరాయించింది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో రైల్వేగేటు మొరాయించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గేటు వేసిన ప్రతిసారి సిబ్బంది ఆ లాక్‌ను తప్పించి గేటును ఎత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాయంత్రం 6 గంటలకు రైల్వే గేటుకు మరమ్మతులు నిర్వహించారు.

21న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఒకటవ స్థాయీ సంఘ సమావేశాన్ని ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే రోజు జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఇటీవల షెడ్యూల్ విడుదల చేసిన అధికారులు మూడు జిల్లాల పరిధిలోని ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీ సభ్యులకు సమాచారాన్ని పంపారు. కాగా ఈనెల 7వ తేదీన జరిగిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో భాగంగా ప్రణాళిక–ఆర్థిక అంశాలకు సంబంధించిన ఒకటో స్థాయీ సంఘ సమావేశాన్ని సభ్యులు బహిష్కరించిన విషయం విదితమే. ఈనెల 7వ తేదీన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించేందుకు నిర్ణయించడంతో ప్రణాళిక–ఆర్థిక అంశాలకు సంబంధించిన అజెండాను సమావేశంలో ప్రవేశపెట్టాలంటే, ముందుగా ఆయా అంశాలు స్థాయీ సంఘం ఆమోదించాల్సి ఉంది. ఇందు కోసం శనివారం ఉదయం 9.30 నుంచి స్థాయీ సంఘ సమావేశాన్ని నిర్వహించి, అదే రోజు ఉదయం 11 గంటల నుంచి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించే విధంగా షెడ్యూల్ విడుదల చేశారు.

మెడికల్ ఎగ్జిబిషన్ 22 వరకు పొడిగింపు

గుంటూరు మెడికల్: గుంటూరు మెడికల్ కళాశాలలో జరుగుతున్న మెడికల్ ఎగ్జిబిషన్‌ను ఈ నెల 22వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు గుంటూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి. సుందరాచారి తెలిపారు. కాలేజీ విభాగాధిపతుల అభిప్రాయం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంగళవారం తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 38,120 మంది మెడికల్ ఎగ్జిబిషన్‌ను సందర్శించినట్లు వెల్లడించారు. ప్రజలు, పాఠశాలల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, విభాగాధిపతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఎగ్జిబిషన్‌ను పొడిగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే జర్నలిస్టులకు, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారుల పరిధిలో పనిచేసే ఫీల్డ్ వర్కర్లు, మెడికల్ ఆఫీసర్లు, ట్రాఫిక్ పోలీసులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉచిత ప్రవేశం పొందదలచిన వారు తమ అధికారిక గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గుంటూరు మెడికల్ కాలేజీ అధ్యాపకులు, సిబ్బంది, వైద్య విద్యార్థులు తగిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

గుంటూరు డీఎంహెచ్‌ఓగా డాక్టర్ వెంకటేశ్వర్లు



గుంటూరు మెడికల్: గుంటూరు డీఎంహెచ్‌గా డాక్టర్ టి.వెంకటేశ్వర్లును నియమిస్తూ హెల్త్ సెక్రటరీ సౌరబ్ గౌరవ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన ప్రకాశం జిల్లా డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్నారు. గుంటూరు డీఎంహెచ్‌గా పనిచేస్తున్న డాక్టర్ కొర్రా విజయలక్ష్మిని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో గుంటూరులో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా పనిచేసిన డాక్టర్ వెంకటేశ్వర్లు 2024 డిసెంబరు 25 నుంచి ప్రకాశం జిల్లా డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్నారు.



నయన మనోహరం...

- తిలకించిన అశేష భక్తజనం
- మారుమోగిన శివనామస్మరణ

మంగళగిరి టౌన్: ఆదిదంపతుల రథోత్సవం నయన మనోహరంగా అత్యంత వైభవంగా సాగింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మంగళగిరిలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం అనంతరం స్వామివారి దివ్య రథోత్సవం మంగళవారం క్షేత్ర వీధుల్లో జరిగింది. మంగళగిరి పురవీధులన్నీ ఓం నమశ్శివాయ, శంభోశంకరా అంటూ భక్తులు నినదిస్తుండగా రథం ముందుకు సాగింది. ముందుగా స్వామివారి ఉత్సవ మూర్తులను అర్చకులు వేదమంత్రోచ్ఛరణల మధ్య తీసుకువచ్చి రథంపై అధిష్టింపజేశారు. స్వామివారిని, రథాన్ని రంగురంగుల పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. రథోత్సవంలో రథం ఎదుట కుంభం వారబోశారు. మేళతాలు, కనక తప్పెట్లు, విచిత్ర వేషధారణలతో బాణసంచా పేలుళ్ల మధ్య రథోత్సవం సాగింది. దేవస్థానం నుంచి మెయిన్‌బజార్, సాధుసోడా సెంటర్, పూలమార్కెట్ సెంటర్ మీదుగా మిద్దె సెంటర్ వరకు చేరుకుని, తిరిగి అదేమార్గంలో దేవస్థానానికి చేరుకుంది. రథంపై గంగా భ్రమరాంబ సమేతుడై పురవీధుల్లోకి వేంచేసిన మల్లేశ్వరుడుని భక్తులు దర్శించుకుని టెంకాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు బ్రాహ్మణ సమారాధన నిర్వహించారు. రథోత్సవానికి కై ంకర్య పరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన వేలూరి శివావధానులు, సురేష్‌బాబు, రమేష్‌బాబు, సాయిబాబు, శివ రామకృష్ణ, శాస్త్రి, సుబ్రహ్మణ్యంలు వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గోపీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

రథంపై ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కనుల పండువగా దివ్య రథోత్సవం

- స్వాగతం పలికిన భక్తజనం
- కోయ నృత్యాలు, బోనాల డాన్సులు, కేరళ వాయిద్యాలతో సందడి

పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి మహా శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం భ్రమరాంబ అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెదకాకాని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో తెల్లవారుజామున సుప్రభాతసేవ, ఆలయ బలిహరణ, హారతులతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం 4 గంటలకు స్వామివారి దివ్య రథాన్ని శోభాయమానంగా అలంకరించారు.

వైభవంగా దివ్య రథోత్సవం

పెదకాకాని శివాలయంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు స్వామివారి దివ్య రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించిన రథంపై శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారిని ఉంచారు. ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు, ధర్మకర్తలు స్వామివారి రథాన్ని లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. కోయ నృత్యాలు, బోనాల డ్యాన్సులు, కేరళ వాయిద్యాలు, బ్యాండ్ మేళాలు, విద్యుత్ కాంతుల నడుమ స్వామి వారి రథోత్సవం పెదకాకాని పురవీధులలో కనుల పండుగగా సాగింది. దివ్యరథంపై శీనులైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారు భక్తులను అనుగ్రహించారు. గ్రామ ప్రజలు రథోత్సవానికి దారి పొడవునా స్వాగతం పలికారు. కొబ్బరికాయలు, పూజా సామాగ్రి సమర్పించి భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. స్వామివారి రథాన్ని లాగేందుకు యువతీ యువకులు, భక్తులు పోటీ పడ్డారు. బాణసంచా వెలుతురులో భ్రమరాంబ అమ్మవారి దివ్య రథోత్సవం వైభవంగా జరిగింది. పెదకాకాని పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్, పాలక వర్గం చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు

నేడు స్వామివారి తెప్పోత్సవం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం భ్రమరాంబ అమ్మవారు విశేష అలంకరణల్లో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ డిప్యూటీ కమిషనర్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం విశేషంగా పూలతో అలంకరించిన హంస వాహనంలో గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారు ఆలయం పక్కనే ఉన్న చెరువులో తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ తిరునాళ్ల ఆదాయం రూ.1.50 కోట్లు

నరసరావుపేట: కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా ఆర్టీసీకి రూ.1.50కోట్ల ఆదాయం లభించినట్లు ఆ సంస్థ జిల్లా ప్రజారవాణా అధికారి టి.అజితకుమారి చెప్పారు. మంగళవారం 'సాక్షి'కి వివరాలు వెల్లడించారు. మహాశివరాత్రికి జిల్లా వ్యాప్తంగా 460 బస్సులను నడపటం ద్వారా 4.47 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయటం జరిగిందన్నారు. గతేడాదిలో 4 లక్షల మంది ప్రయాణికులను చేరవేయటం ద్వారా రూ.1.22 కోట్ల ఆదాయం లభించిందన్నారు. నరసరావుపేట డిపో ద్వారా మూడు లక్షల మంది ప్రయాణికులను కొండకు చేరవేయటం ద్వారా రూ.90 లక్షల ఆదాయం రాగా గతేడాది 2.89 లక్షల మంది ప్రయాణికులను చేరవేసి రూ.71లక్షల ఆదాయం వచ్చిందన్నారు. చిలకలూరిపేట బస్‌డిపో ద్వారా 65 వేల మంది ప్రయాణికులను చేరవేసి రూ.12.50 లక్షల ఆదాయం వచ్చిందని, గతేడాది రూ.17లక్షలు ఆదాయం సమకూరిందన్నారు. వినుకొండ డిపో ద్వారా 16వేల మంది భక్తులను కొండకు చేరవేయటం ద్వారా రూ.12.50 లక్షల రాగా, గతేడాది 7,200 మంది ప్రయాణికుల ద్వారా రూ.9.20 లక్షల ఆదాయం సమకూరిందని ఆమె తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని చిన్నారులు పరారీ

రేపల్లె: తల్లిదండ్రులు మందలించారని ఇరువురు చిన్నారులు ఇంటి నుంచి పారిపోయిన సంఘటన రేపల్లె మండలం పేటేరులో చోటుచేసుకుంది. పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు... పేటేరు పంచాయతీ బావాజీపాలేనికి చెందిన దిట్ల గోపయ్య, సంధ్యారాణిల కుమారులు రాజ్‌కుమార్, జాషువాలు పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూలులో 8, 3 తరగతులు చదువుతున్నారు. ఆడుకోవటానికి చిన్నారులకు తల్లిదండ్రులు అనుమతి ఇవ్వకపోవటంతోపాటు మందలించడంతో అలిగిన చిన్నారులు మంగళవారం ఉదయం ఏడు గంటల సమయంలో తమ సైకిళ్లను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఎంతసేపటికీ పిల్లలు ఇంటికి తిరిగి రాకపోవటంతో కంగారుపడిన తల్లిదండ్రులు చుట్టు ప్రక్కల, బంధువుల ఇళ్ల వద్ద విచారించారు. ఆచూకీ లభించకపోవటంతో పోలీసులను ఆశ్రయించారు. పట్టణ సీఐ మల్లికార్జునరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించటంతోపాటు సమీపంలోని సీసీ టీవీ పుటేజీలను సేకరించారు. చిన్నారుల ఆచూకీని కనుగొనేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. చిన్నారుల ఆచూకీ తెలిసిన వారు పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని సీఐ కోరారు.

పరారైన చిన్నారులు రాజ్‌కుమార్, జాషువాలు

ఘనంగా నాగేశ్వరస్వామి రథోత్సవం

హర..హర నామస్మరణతో మార్మోగిన చేబ్రోలు పురవీధులు

చేబ్రోలు: చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి రథోత్సవం భక్తుల హరనామ స్మరణతో మంగళవారం స్థానిక పురవీధుల్లో అత్యంత వైభవంగా జరిగింది. సుమారు వంద సంవత్సరాల పురాతన భారీరథంపై గంగాపార్వతి సమేత నాగేశ్వరస్వామి కల్యాణ మూర్తులను దర్శించుకోవటం కోసం చేబ్రోలు పరిసర గ్రామాల నుంచి ప్రజానీకం అధిక సంఖ్యలో తరలివచ్చారు. నాగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా కల్యాణోత్సవంను పండితులు ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం కల్యాణమూర్తులు నాగేశ్వరస్వామి, గంగాదేవి, పార్వతి దేవి అమ్మవార్లు పురాతనమైన భారీ రథం మీద చేబ్రోలు పురవీధుల్లో విహరించారు. పాతపోలీసు స్టేషన్ సమీపంలో కొద్ది సేపు రథాన్ని ఆపి గంగానమ్మ తల్లికి పూజలు చేశారు. గ్రామానికి చెందిన పలువురు భక్తులు రథోత్సవం సందర్భంగా పులిహోర, పొంగలి, మజ్జిగ తదితర ప్రసాదాలను పంపిణీ చేశారు. చేబ్రోలు పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు రథం తాడు లాగటానికి ఉత్సాహం చూపారు. మహిళలు, పిల్లలు, యువకులు రథోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవదాయశాఖ ఈవో పర్యవేక్షించారు.

చేబ్రోలు పుర వీధుల్లో ఊరేగింపుగా వస్తున్న గంగాపార్వతి సమేత నాగేశ్వరస్వామి రథోత్సవం

ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను నిరాశ పర్చిన బడ్జెట్

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలను తీవ్ర నిరాశకు గురి చేశారు. పీఆర్సీతోపాటు డీఏలు, సరెండర్ లీవ్స్ సహా ఉద్యోగులకు రూ.37వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. బడ్జెట్‌లో బకాయిలు చెల్లింపునకు పైసా నిధులు విదల్చకపోవడంతో ఆయా వర్గాలు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్‌తో ఈనెల 25న ఎస్టీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలతో ప్రభుత్వ నిరసన తెలియజేయనున్నాం.

డి.పెదబాబు, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

రాష్ట్ర బడ్జెట్‌పై 'మన్ కీ బాత్'

మైనారిటీలకు మరోసారి ద్రోహమే

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): బడ్జెట్‌లో ఎక్కడా.. మైనారిటీ సంక్షేమాన్ని పట్టించుకోలేదు. ఏదో నామ్‌కే వాస్తే.. నిధులు కేటాయించారు తప్ప.. స్పష్టంగా ఏ పథకానికి ఇచ్చారో తెలియదు. దుల్హన్ పథకం, విదేశీ విద్య, మైనారిటీల స్కాలర్‌షిప్‌లకు ఒక్క రూపాయి కేటాయించలేదు. మైనారిటీలు వ్యాపారం చేసుకునేందుకు రూ. 5లక్షల రుణాలు ఇస్తామన్న చంద్రబాబు దాని కోసం ఎన్ని కోట్లు కేటాయించారో.. చెప్పాల్సిన అవసరం ఉంది. బడ్జెట్‌లో ఎక్కడ కూడా రంజాన్ తోఫా, మసీదుల మరమ్మతు కోసం నిధులు కేటాయింపు లేదు. మరోసారి మైనారిటీలను నిలువునా వంచించారు. ముస్లింలను అన్ని విషయాల్లో చంద్రబాబు చిన్నచూపు చూశారు.

– పఠాన్ అబ్దుల్లాఖాన్, మౌజాన్ అసోసియేషన్, జిల్లా అధ్యక్షుడు

అంబటిని అంతం చేయాలనే దాడి

• మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ • అంబటి కుటుంబ సభ్యులకు పరామర్శ

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): అంబటి రాంబాబును అంతమొందించాలనే దాడికి తెగబడ్డారని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. గుంటూరు సిద్ధార్థనగర్‌లోని మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ టీడీపీ పాలనలో ప్రశ్నించే గొంతుకను నొక్కే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. కోర్టులో బెయిల్ వచ్చినప్పటికీ అనేక అక్రమ కేసులను నమోదు చేసి, ఉద్దేశపూర్వకంగా అంబటిని జైల్లో పెట్టారని ఆరోపించారు. మేమంతా రాంబాబు పక్షాన [illegible] స్పష్టం చేశారు. రాష్ట్రంలో అసలు లా అండ్ ఆర్డర్ లేకుండా పోయిందని, అంబటి నివాసంపై పచ్చమూకలు దాడి చేస్తుంటే పోలీసులు చేతులు కట్టుకుని చూస్తున్నారని దుయ్యబట్టారు. అంబటిపై పచ్చి బూతులతో విరుచుకుపడ్డ మహిళకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి ఇవ్వడం బాధాకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే గళ్లా మాధవి మహిళననే విషయం మరిచిపోయి, దగ్గరుండి దాడులు చేయించటమే కాకుండా, వార్నింగ్‌లు ఇవ్వటం ఏంటనీ ప్రశ్నించారు. ఆమెలాగే సాటి మహిళలు ఇంట్లో ఉన్నారన్న విషయాన్ని మరిచిపోయారన్నారు. దళితురాలు, మహిళ అయి ఉండి హోం మంత్రిని అనే విషయాన్ని మరిచిపోయి అనిత వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అంబటి ఆరోగ్యంపై కుటుంబసభ్యులకు, మాకు ఆందోళన కలుగుతోందన్నారు. అంబటి రాంబాబు కుటుంబ సభ్యులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని, పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న రోజుల్లో కూటమి మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో అంబటి రాంబాబు కుమార్తె మౌనిక, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సురేష్, చిత్రంలో మౌనిక, నూరిఫాతిమా తదితరులు

ఎన్జీ రంగా వర్సిటీలో భారత్ విస్తార్ వర్చువల్ ప్రోగ్రాం

గుంటూరు రూరల్: నగర శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో మంగళవారం భారత్ విస్తార్ డిజిటల్ వ్యవసాయంపై వర్చువల్ ప్రోగ్రాం నిర్వహించారు. రాజస్థాన్‌లోని జైపూర్ నుంచి కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రారంభించిన కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు వీక్షించారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకుడు డాక్టర్ శివనారాయణ మాట్లాడుతూ భారత్ విస్తార్ కార్యక్రమం రైతులకు తమ సొంత భాషలో ఫోన్ ద్వారా కాని ఫోన్ కాల్స్ ద్వారా కాని సమాచారాన్ని అందించేందుకు రూపొందించారన్నారు. పంటల ప్రణాళికలు, పద్ధతులు, తెగుళ్ల యాజమాన్యం, వాతావరణ మార్పులు, మార్కెట్లు, ప్రభుత్వ పథకాలు వారి భాషలో ఏఐ టెక్నాలజీ ద్వారా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకుడు డాక్టర్ పీవీ సత్యనారాయణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ ఎ. మణి, డాక్టర్ జి. రామచంద్రరావు, డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ పి. రవి, డాక్టర్ దుర్గాప్రసాద్, వైవీ సుబ్బారావు, రామకృష్ణ, తిరుపతిరావు, విద్యార్థులు శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): నివాసాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. లాలాపేట పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ వివరాలను వెల్లడించారు. చెడు వ్యసనాలకు బానిసగా మారిన గుంటూరు రూరల్ మండలం స్వర్ణ భారతినగర్‌కు చెందిన చాగంటి భానుప్రకాష్ చోరీలు చేయటం ప్రారంభించాడు. గత నెల 22వ తేదీన లాలాపేట పరిధిలోని ఒక నివాసంలో చోరీకి పాల్పడ్డాడు. దీనిపై దృష్టి సారించిన పోలీసులు ఈ నెల 16వ తేదీన మూడు బొమ్మల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న భానుప్రకాష్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించటంతో అసలు విషయాన్ని బయటపెట్టాడు. లాలాపేట పీఎస్‌తో పాటు, పాతగుంటూరులోని యాదవబజారులో సైతం నివాసంలో చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. మొత్తం 53గ్రాముల బంగారం, 105 గ్రాముల వెండి, రూ.10వేల నగదు నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసుల్లో భానుప్రకాష్‌తో పాటు చోరీలకు పాల్పడిన గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన ఉప్పల సురేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరిద్దరిపై 2019 సంవత్సరంలో కురిచేడు బైకు చోరీ కేసు నమోదు అయి ఉంది. భానుప్రకాష్‌పై ఎన్డీపీఎస్, వ్యక్తిని బెదిరించి డబ్బులు లాక్కున్న కేసులతో పాటు మరి కొన్ని కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకోవటంలో ప్రతిభ కనబరిచిన లాలాపేట పీఎస్ ఎస్ఐ కె.రోజాలత, కానిస్టేబుళ్లు శంకర్, కిరణ్, వెంకటేశ్వర్లను డీఎస్పీ అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

వైద్యులు నిరంతర విద్యార్థులు

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్

మంగళగిరి టౌన్: వైద్య విద్యార్థులకు అధికారికంగా విద్యాకాలం ముగిసినప్పటికీ వారు నిరంతరం విద్యార్థులేనని, జీవితాంతం వైద్యంలో నేర్చుకోవాల్సి ఉంటుందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ అన్నారు. గుంటూరు జిల్లా, మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) రెండవ స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్రమంత్రి అనుప్రియ పటేల్ మాట్లాడుతూ యువ వైద్యులది కీలకపాత్ర అని, చిత్తశుద్ధితో పనిచేసి దేశ ఆరోగ్యాభివృద్ధిలో పాలుపంచుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణాలు కాపాడి వారి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే అమూల్య అవకాశం వైద్యులకే ఉందని తెలిపారు. రాష్ట్ర వైద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ జీవితానికి, మరణానికి మధ్య నిలబడి ప్రాణదాతలుగా సేవలు అందించడం వల్లే సమాజంలో వైద్యులకు గౌరవం లభిస్తోందని పేర్కొన్నారు. ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అండ్ సీఈఓ ప్రొఫెసర్ డాక్టర్ అహంతెం శాంతాసింగ్ మాట్లాడుతూ వైద్యవిధానంలో ప్రభావవంతమైన కమ్యూనికేషన్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వైద్యవిద్యను పూర్తిచేసుకున్న 49మంది వైద్య విద్యార్థులకు, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకున్న ఐదుగురు విద్యార్థులకు, పోస్ట్ డాక్టోరల్ సర్టిఫికేట్ కోర్సు పూర్తి చేసుకున్న నలుగురు విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేశారు. మంగళగిరి ఎయిమ్స్ అధ్యక్షుడు మేజర్ జనరల్ డాక్టర్ తపన్‌కుమార్ సాహా, విశిష్ట అధ్యాపక సభ్యులు, పట్టభద్రులైన వైద్యులు, నర్సులు, ఆరోగ్య సంరక్షకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తున్న కేంద్రమంత్రి అనుప్రియ పటేల్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్

స్టెరాయిడ్ ఇంజక్షన్లు పట్టివేత

గుంటూరు రూరల్: గేదెల పాల ఉత్పత్తికి, పాలు ఇవ్వని గేదెలకు సేపు వచ్చేందుకు ఉపయోగించే అనుమతిలేని స్టెరాయిడ్ ఇంజక్షన్‌లు విక్రయిస్తున్న ఇరువురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం రూరల్ మండలం రెడ్డిపాలెం గ్రామంలో పల్లపోతు రేణుక అనే మహిళ ఎటువంటి అనుమతులు లేని, ముద్రలు లేని స్టెరాయిడ్స్ కలిగిన ఇంజక్షన్‌లను విక్రయిస్తుందన్న సమాచారం మేరకు దాడిచేయగా ఆమె నివాసంలో 1860 గేదెల పాల ఉత్పత్తికి, పాలు ఇవ్వని గేదెలకు సేపు వచ్చేందుకు వినియోగించే స్టెరాయిడ్స్ కలిగిన ఇంజక్షన్‌లు లభ్యమయ్యాయన్నారు. వాటి విలువ సుమారు రూ.2,79,000 ఉంటుందని తెలిపారు. రేణుకతోపాటు ఆమెకు స్టెరాయిడ్స్ అందజేసి, విక్రయింపజేస్తున్న పున్నారావును అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించామని, కేసు నమోదు చేసి తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

ఎమ్మెస్సీ, ఎంసీఏ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాయంలో 2025 సంవత్సరంలో జరిగిన ఎమ్మెస్సీ, ఎంసీఏ 3వ సెమిస్టర్ ఫలితాలను వర్సిటీ పరీక్షల నిర్వహణ అధికారి ఆలపాటి శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటన ద్వారా విడుదల చేశారు. ఎమ్మెస్సీ సాలిడ్ వాటర్ మేనేజ్‌మెంట్ సెమిస్టర్‌కు తొమ్మిది మంది హాజరు కాగా ఏడుగురు ఉత్తీర్ణులయ్యారు. అలానే ఎంసీఏ 3వ సెమిస్టర్ పరీక్షలకు 833 మంది హాజరు కాగా వారిలో 592 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈనెల 26వ తేదీన రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి, దరఖాస్తులను పీజీ కోఆర్డినేటర్ కార్యాలయంలో 27వ తేదీలోగా సమర్పించాలన్నారు. ఒక్కో సబ్జెక్ట్‌కు ఫీజు రూ.1860 చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : 27 BKC, C27, G Block బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (E), ముంబై - 400051

బ్రాంచ్ ఆఫీస్: 6-3-1109/1, 2వ అంతస్తు, నవభారత్ చాంబర్స్, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్ – 500082

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం) (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(1)తో చదువబడే అనుబంధం IV ప్రకారం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ 27 BKC, C27, G బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (E), ముంబై – 400051 వద్ద రిజిష్టర్డ్ ఆఫీస్ మరియు # 6-3-1109/1, 2వ అంతస్తు, నవభారత్ ఛాంబర్స్, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్ – 500082 వద్ద బ్రాంచ్ ఆఫీస్ కలిగి బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం, 1949 అర్థంతో బ్యాంకింగ్ కంపెనీ అయిన కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారియగు దిగువ సంతకందారు 19 నవంబరు, 2025 తేదీ గల డిమాండ్ నోటీస్ జారీచేసి మరియు లోన్ అకౌంట్ నం.లు LAP18438595 (CRN 12091807) [illegible]

[illegible]

తేది: 17 ఫిబ్రవరి 2026 సం/- అధీకృత అధికారి

ప్రదేశం: గుంటూరు మరియు హైదరాబాద్ కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ తరఫున

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(పూర్వపు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

రిజిష్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

[illegible]

క్ర. సం.	ఋణగ్రహీత (లు) / సహ-ఋణగ్రహీత (లు) / హామీదారు (లు) పేరు	NPA తేది బకాయి మొత్తం	డిమాండ్ నోటీసు తేది బకాయి మొత్తం
1	1. గుడిపాటి వీరేంద్ర కుమార్, [illegible] 2. గుడిపాటి [illegible] 3. గుడిపాటి [illegible] 4. [illegible]	08-12-2021 Rs. 15,00,000/-	12-01-2026 [illegible]

ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. GNTR4TF1711300013

[illegible]

ప్రదేశం : గుంటూరు అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

జోనల్ ఆఫీస్ చిరునామా: శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ ప్రకటన

[illegible]

ఋణగ్రహీత (లు) / సహ ఋణగ్రహీతలు / హామీదారు(లు) పేరు	ఎన్.పి.ఏ తేది బకాయి మొత్తం	డిమాండ్ నోటీసు తేది బకాయి మొత్తం
1. గడ్డి పాటి శ్రీనివాస్, తండ్రి: నాగేశ్వరరావు, డి.నెం: 5-80, అమృతలూరు, తెనాలి, గుంటూరు - 522211. 2. గడ్డి పాటి నాగేశ్వరరావు, తండ్రి: [illegible], డి.నెం: 5-80, మూల్పూరు, గుంటూరు - 522313. 3. గడ్డి పాటి రామకృష్ణ, తండ్రి: నాగేశ్వరరావు, డి.నెం: 5-80, మూల్పూరు, గుంటూరు జిల్లా - 522313. 4. [illegible], తండ్రి: [illegible], డి.నెం: 3-61, వేమూరు, గుంటూరు - 522201.	10-05-2023 రూ. 15,00,000/- [illegible]	09-12-2025 రూ. 09-12-2025 తేది నాటికి రూ. 29,71,831.42/- [illegible]

ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం.లు. TENALTF2210310009

గడ్డి పాటి శ్రీనివాస్, గడ్డి పాటి నాగేశ్వరరావు, గడ్డి పాటి రామకృష్ణ గార్లకి చెందిన స్థిరాస్తి వివరాలు:

[illegible]

ప్రదేశం: గుంటూరు అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ GMC లిమిట్స్‌లో వెంచర్, RTO ఆఫీస్ నుండి 6కి.మీ. 40అ.రోడ్ ఆనుకొని దామరపల్లిలో తారురోడ్లు, డ్రైనేజ్, ప్రహరీ, తియ్యని నీరు. చ.గ. రూ.11,000/- స్వా. ది. 83175 28192

FINANCIAL SERVICES

■ సింగో కంపెనీ:లోన్స్, ప్రాపర్టీ లోన్స్, ప్రాజెక్ట్ లోన్స్, పర్సనల్ లోన్స్, అగ్రికల్చర్ ప్రాజెక్ట్ లోన్స్, బిజినెస్ టేక్ అవర్ లోన్ & లోన్ ఏజెంట్ కావలెను. జీతం+కమీషన్. ✆ 9050130793

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టు లో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు.తీసుకుంటాం ✆ 83338 33368

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు. కొనబడును సంప్ర॥✆ 87907 41166

WANTED

■ గుంటూరు బస్టాండ్ ఎదురు Office నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Qul: 10th-డిగ్రీ, జీతం: 8500 - 9000/- టైం: 9.00 AM- 5.30 P.M. ✆99893 98775

■ ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు అనుభవం గల లేడీ టెలికాలర్స్ కావలెను. అ: 10th-డిగ్రీ, జీ:13000 - 15000/- + ఇన్సెంటీవ్స్ సంప్ర: 9381801860, 7995533679

■ ఆఫీస్ స్టాఫ్, నర్సెస్ (MPHW) కావలెను. కొత్త వారికి కూడా ప్రాధాన్యత. అహల్యా నర్సింగ్ హోమ్, శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. 92464 27459

■ గుంటూరు, హౌసింగ్ బోర్డు మామిడి కళ్యాణ మండపం నందు గుమస్తా కావలెను. వయస్సు: 30 సం॥-40 సం॥ లోపు. ఉ॥ 9 గం.॥ తరువాత. సంప్ర: 94414 35555

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్లాస్ ఇన్‌ఛార్జ్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 14,000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు వయస్సు 22 సంవత్సరాలు నుండి 45సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్. 8978480435

■ విజయవాడ, గుంటూరు ప్రాంతాలలో పేషంట్లని, పెద్దవారిని వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు కాంపౌండర్లు, నర్సులు (M/F) కేర్‌టేకర్స్ కావలెను. Sal: 24K. వాట్సప్ / కాల్. ✆ 98850 25559, 91608 35559

■ కొటక్ బ్యాంక్ అనుబంధ సంస్థకు రిటైర్డ్, వ్యాపారస్తులు, గృహిణిలు టీచర్స్ కావలెను, వయస్సు :45 to 65 yrs సంప్ర ✆ 98853 08538

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటి పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి భోజనం. జీ: 17K. Ph: 9640648899, 9848999184.

■ గుంటూరులో గల ఎటుకూరు, బొంతపాడు నందు జాబ్ చేయుటకు సెక్యూరిటి గార్డ్స్ కావలెను. సంప్ర॥ ✆ 8367460999, 8367490999

సాక్షి క్లాసిఫైడ్స్ [illegible] రూ. 475 [illegible] ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే [illegible]

గుంటూరు 7075167663 7075167541

గమనిక [illegible]

క్లుప్తంగా

ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలి

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం తెలిపారు. 0–5 ఏళ్ల చిన్నారులు.. 6–15 ఏళ్ల లోపు వారికి నూతన ఆధార్ నమోదు, ఆధార్‌లో పుట్టిన తేదీ, పేరు మార్పుల కోసం మంగళవారం బేతపూడి సచివాలయం, ఫిరంగిపురంలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్, మార్నింగ్‌స్టార్ కళాశాల, అమీనాబాద్ ఎంపీపీ(హెచ్‌ఎఫ్) పాఠశాలల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిని పరిశీలించిన ఆయన సిబ్బందికి తగిన సూచనలు అందజేశారు. పలు చోట్ల సర్వర్ మొరాయించడంతో నమోదు విషయంలో కొంత ఆలస్యం ఏర్పడింది. నాలుగు కేంద్రాల్లో సుమారు 36 వరకు ఆధార్ నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

భక్తులకు ప్రసాదాలు పంపిణీ

మంగళగిరి టౌన్: మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దివ్య రథోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీనారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం మిద్దె సెంటర్‌లో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ.. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి దివ్య రథోత్సవం మిద్దె సెంటర్ వరకు చేరుకున్న తరుణంలో దర్శనానికి వచ్చిన వేలాదిమంది భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు సేవా సమితి సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి అస్సాం వాసి మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి అస్సాం వాసి మృతి చెందిన ఘటన విజయవాడ–చెన్నై రైలు మార్గంలోని మోదుకూరు సమీపంలో మంగళవారం జరిగింది. అస్సాంకు చెందిన సత్య సాయికియా(43) రైల్లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలతో మృతి చెందారు. ఘటనా స్థలాన్ని తెనాలి జీఆర్పీ పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా కేసు నమోదు చేసుకుని అస్సాంలోని అధికారులకు తెలియజేశారు.

భారీగా బంగారం, వెండి చోరీ

పొన్నూరు: మండలంలోని చింతలపూడిలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తల్లి ప్రమీలాదేవి ఇంటిలో భారీ చోరీ ఘటన చోటుచేసుకుంది. భారీగా బంగారం ఆభరణాలు, వెండి, నగదు అపహరణకు గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. రూరల్ ఎస్‌ఐ శ్రీహరి తెలిపిన వివరాలు.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అర్ధరాత్రి దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి, బీరువాలోని 42 సవర్ల బంగారం, పదిన్నర కిలోల వెండి, రూ.లక్ష నగదు అపహరించినట్టు తెలిపారు. చోరీ చేసిన సొత్తు విలువ సుమారు రూ.80లక్షల వరకు ఉండవచ్చని చెప్పారు. ఘటనా స్థలాన్ని రూరల్ సీఐ కృష్ణయ్య పరిశీలించి కేసు నమోదు చేశారు. క్లూస్ టీం చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేశారు. డాగ్ స్క్వాడ్ పరిసరాలను పరిశీలించింది.

రాజీ మార్గం ద్వారా కేసుల పరిష్కారం

పొన్నూరు: పట్టణంలోని సివిల్ జడ్జి కోర్టులో మార్చి 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా అధిక కేసులు పరిష్కారం అయ్యే విధంగా చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్, న్యాయమూర్తి జి.రుక్మిణి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కోర్టు పరిధిలోని వివిధ బ్యాంకు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్ కార్యక్రమంలో కోర్టు పరిధిలోని కక్షిదారులు రాజీపడే చెక్‌బౌన్స్, బ్యాంకు కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించే విధంగా అధికారులు సహకరించాలని తెలిపారు. అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని తెలిపారు. సమావేశంలో న్యాయవాదులు డి. కోటేశ్వరరావు, పిల్లి.విజయకుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి చందూస్ కప్ క్రికెట్ పోటీలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): చందూస్ కప్ క్రికెట్ పోటీలు బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ పరుచూరి గోపీచంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 26 జట్లు పోటీల్లో పాల్గొంటాయన్నారు. కేవలం అధ్యాపకులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

సమష్టి కృషితోనే పార్టీ బలోపేతం

మాట్లాడుతున్న వేమారెడ్డి

సమావేశానికి హాజరైన ముఖ్య నాయకులు

మంగళగిరి టౌన్: వైఎస్సార్ సీపీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు అందరూ సమష్టిగా కృషిచేయాలని పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, రాష్ట్ర సంస్థాగత యాక్టివిటీ సెక్రటరి వజ్ర భాస్కరరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆత్మకూరులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ పార్టీ ముఖ్యనాయకులతో, మాజీ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పార్టీ కార్యాచరణపై, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై కార్యాచరణ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వేమారెడ్డి, వజ్ర భాస్కరరెడ్డిలు మాట్లాడుతూ.. రానున్న స్థానిక ఎన్నికల్లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పార్టీని గెలిపించే దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పేర్కొన్నారు. పార్టీ చేపట్టే కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ, గ్రామస్థాయిల్లో పార్టీ పదవులు పొందిన నాయకులంతా కార్యకర్తలు, ప్రజలకు రోజూ అందుబాటులో ఉండాలని తెలిపారు. పార్టీకోసం నిజాయితీగా అంకితభావంతో పని చేసే ఏ కార్యకర్తకైనా గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. సమన్వయ సమావేశాల ద్వారా పార్టీని మరింత బలపరచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ, మండల అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాలి వెంకటకృష్ణ, తాడేపల్లి పట్టణ, మండల అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్య, దుగ్గిరాల మండల అధ్యక్షులు తాడిబోయిన శివగోపయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఎదుగుదలకు నులిపురుగు నివారణ మాత్రలు

రావెల ఎంపీపీ పాఠశాలలో మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంఈవో–2 ప్రభాకర్

మునగపాడు పాఠశాలలో మాత్రలు అందిస్తున్న సిబ్బంది

విద్యార్థులకు మాత్రలు ఇస్తున్న వైద్యాధికారులు

రావెల(తాడికొండ): చిన్నారుల్లో ఆరోగ్యకరమైన ఎదుగుదలకు నులిపురుగు నివారణ మాత్రలు తప్పనిసరిగా అందించాలని తాడికొండ మండల ఎంఈవో–2 ప్రభాకర్ అన్నారు. మంగళవారం తాడికొండ మండలం రావెల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎల్‌ఈ)లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా చిన్నారులకు నులిపురుగుల మాత్రలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ లక్ష్మీ నరసమ్మ, ఏఎన్‌ఎం ఎన్.అరుణశ్రీ, ఆశా వర్కర్ సునీత, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండలంలోని మునగపాడు జెడ్పీ పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాత్రలు అందించారు. పాఠశాలలోని విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత ఆరోగ్య సిబ్బంది వారికి మాత్రలు ఇచ్చారు. నులిపురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం ఏర్పడుతుందని.. దీంతో నీరసంగా ఉంటారని పేర్కొన్నారు. విద్యార్థులు భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ శోభారాణి, సీహెచ్‌వో లింగరాజు యాదవ్, ఏఎన్‌ఎం అరుణ, ఆశా కార్యకర్తలు రమణ, అరుణ, పాఠశాల హెచ్‌ఎం వి.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాల విద్యార్థులకు నివారణ మాత్రలు పంపిణీ చేశామని డాక్టరు అబ్దుల్ ఇజాజ్ రెహమాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు అందించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. మండలంలోని 9,078 మంది విద్యార్థులకు గానూ 8,336 మంది విద్యార్థులకు మాత్రలు అందించామన్నారు. ఈనెల 24న లక్ష్యాన్ని పూర్తిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ జబీన్, తహసీల్దార్ ఐ.సునీత, డిప్యూటీ ఎంపీడీవో కేజే నెహ్రూ, డాక్టర్ సీహెచ్ ఇందిర, హెల్త్ ఎడ్యుకేటర్ వి.సుబ్బారావు, ఆశా కార్యకర్తలు దుర్గాభవాని, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువలోకి దూకి యువకుడి ఆత్మహత్య

ఆవుల సాయి (ఫైల్)

తాడేపల్లి రూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొలనుకొండలో నివాసం ఉండే ఓ యువకుడు బకింగ్‌హామ్ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తొలుత తమ కుమారుడు కనిపించకుండా పోయాడని, బకింగ్ హామ్ కాలువ పక్కన తమ కుమారుడి బైక్ ఉందని, బహుశా అందులో దూకి ఆత్మహత్యాయత్నం చేసి ఉంటాడని ఆవుల శ్రీనివాసరావు అనే వ్యక్తి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ ఖాజావలి సంఘటనా స్థలానికి వెళ్లి యువకుడి ద్విచక్రవాహనాన్ని పరిశీలించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో బకింగ్‌హామ్ కెనాల్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. బంధువుల నుంచి సేకరించిన వివరాల ప్రకారం.. ఆవుల శ్రీనివాసరావు, లంకేశ్వరి దంపతులకు రెండో సంతానమైన ఆవుల సాయి(27) విజయవాడలోని ఓ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం బ్యాంకుకు సెలవు అయినప్పటికీ బ్యాంకుకు వెళ్లివచ్చి మధ్యాహ్నం సమయంలో కొలనుకొండ వడ్డేశ్వరం బకింగ్‌హామ్ కెనాల్ పక్కన తన ద్విచక్రవాహనాన్ని పార్క్ చేసి జేబులో ఉన్న సెల్‌ఫోన్, బ్యాంక్ తాళాలు, ఇతర వస్తువులు బండి డిక్కీలో పెట్టి కనిపించకుండా వెళ్లాడు. సాయంత్రం ఆవుల సాయి ద్విచక్రవాహనం బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున ఉండడాన్ని గమనించిన గ్రామస్తులు తండ్రి ఆవుల శ్రీనివాసరావుకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. రాత్రి ఇంటికి వస్తాడని భావించిన తల్లిదండ్రులు సాయి ఇంటికి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలకు మెల్లెంపూడి సమీపంలో సాయి మృతదేహం లభించింది. సంఘటనపై ఎస్‌ఐ ఖాజా వలి కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు, ఇతర కష్టాలు లేకపోయినా ఆవుల సాయి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడనే విషయాన్ని బంధువులు చెప్పలేకపోతున్నారు. మృతుడి సెల్‌ఫోన్, ఇతర వస్తువులను పరిశీలిస్తే ఆత్మహత్యకు గల కారణాలు తెలుస్తాయని బంధువులు భావిస్తున్నారు.

మంత్రి లోకేష్ కార్మికుల సమస్య పరిష్కరించాలి

దీక్షా శిబిరంలో కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను నాయకులు గురవయ్య, ఆదినారాయణ, ఆశీర్వాదంలతో కలిసి ప్రారంభించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు గత 441 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నా ప్రభుత్వంలో స్పందన రాలేదని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఈ ప్రాంతంలో పర్యటించిన నారా లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీ ప్రకారం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో శారద, ఆరిఫ్, సువర్ణకుమారి, డి.నాగమల్లేశ్వరి, రిబ్కా పాల్గొన్నారు. దీక్షల్లో యేసుబాబు, సుభాని, ఇశ్రాయేల్, హగ్గయ్య, సాంబశివరావు తదితరులు కూర్చున్నారు.

రహదారిపై మురుగుతో ఇబ్బందులు

మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారిపై రోడ్డుపై పారుతున్న మురుగు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ప్రకాశం బ్యారేజ్ మంగళగిరి రహదారిలో పలుచోట్ల మురుగు రహదారిపై పారుతోంది. పోలకంపాడు శివాలయం వద్ద నుంచి ముస్లిం బరియల్ గ్రౌండ్ వరకు డ్రైనేజీ అడుగు భాగం పూర్తిగా దెబ్బతింది. గత 10 ఏళ్ల కిందట నిర్మించిన ఈ డ్రైన్ ప్రధాన రహదారికన్నా ఎత్తులో ఉండడం, కింద భాగంలో ఎలుకలు తవ్వివేయడంతో కింద అడుగు భాగాన ఉన్న కాంక్రీట్ ఊడిపోయి మురుగు ఆ రంధ్రాల నుంచి బయటకు వచ్చి రోడ్డుపై పారుతుంది. ఒక్కోసారి రోడ్డు మొత్తం మురుగు పారడంతో ఆ రోడ్డులో ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా కార్పొరేషన్ సిబ్బంది తాత్కాలికంగా మట్టిపోసి లీకేజ్‌ను అరికడుతున్నారు. అయినప్పటికీ తిరిగి ఎలుకలు తవ్వడంతో యథావిధిగా లీకేజ్‌లు అవుతున్నాయి. కార్పొరేషన్ అధికారులు పోలకంపాడు శివాలయం నుంచి ముగ్గురోడ్డు సాయిబాబా ఆలయం వరకు కొత్త డ్రైన్ నిర్మిస్తే తప్ప ఈ సమస్య పరిష్కారం కాదని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఘనంగా మహామంగళ అమావాస్య

తెనాలి: వారాహీ అమ్మవారికి భక్తులు తమ స్వహస్తాలతో అభిషేకం చేయటం పూర్వజన్మ సుకృతమని పెనుగొండ పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామీజీ అన్నారు. కొల్లిపర మండల గ్రామం కుంచవరంలో వేంచేసియున్న శ్రీవారాహీ అమ్మవారి దేవస్థానంలో మంగళవారం మహామంగళ అమావాస్య పూజలు చేశారు. మాఘ అమావాస్య శుభ సందర్భంగా శ్రీవారాహీ అమ్మవారికి పంచ సూక్తములతో వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య 108 బిందెల పానకంతో అభిషేకం చేశారు. శ్రీప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామీజీ స్వయంపర్యవేక్షణలో కార్యక్రమాన్ని చేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ తన్నీరు శ్రీనివాసబాబు, స్వామి రమేష్, ఎస్వీ యోగ కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య భక్తులు పాల్గొన్నారు.

శివాలయంలో అన్నసంతర్పణ

తెనాలి: స్థానిక రామలింగేశ్వరపేటలోని శ్రీ దుర్గా పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి వంశపారంపర్య అర్చకులు వడ్లమూడి రాఘవేంద్ర శివవరప్రసాద్ విశేష పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఈవో హరిప్రసాద్ ప్రారంభించారు. సుమారు 2000 మందికి అన్న ప్రసాదాన్ని దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్టు ఈవో తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. స్థానిక నాయకులు హరిదాసు గౌరీ శంకర్ , మామిడి బత్తుల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కర్పూరీ ఠాకూర్ ఆశయ సాధనకు కృషి

కర్పూరీ ఠాకూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కేశన

మంగళగిరి టౌన్: భారతరత్న కర్పూరీ ఠాకూర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు పేర్కొన్నారు. మంగళగిరిలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం కర్పూరీ ఠాకూర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీసీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేశన మాట్లాడుతూ.. రెండు సార్లు బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేసి సొంత ఇల్లు కూడా లేని నిరాడంబర వ్యక్తిగా, అవినీతి రహిత నాయకుడిగా కర్పూరీ ఠాకూర్ ప్రసిద్ధి చెందారన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనుకబడిన తరగతులకు చెందిన బీసీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను 1970లోనే అమలు జరిపిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2024లో దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు ఉమామహేశ్వరరావు, దుర్గారావు, మహేష్, మేకా వెంకటేశ్వరరావు, వాకా వెంకటేశ్వరరావు, వెంకటకృష్ణ, చిన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్‌లు బహూకరణ

కంప్యూటర్‌లను స్వీకరిస్తున్న హెచ్‌ఎం బీవీ కృష్ణారావు

దుగ్గిరాల: కంప్యూటర్ విద్య, ల్యాబ్ పరిజ్ఞానం పెంపొందించుకునేందుకు విద్యార్థులు కంప్యూటర్‌లను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల హెచ్‌ఎం బీవీ కృష్ణారావు అన్నారు. మంగళవారం దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌సీ మూర్తి, డాక్టర్ జీవన్ పాఠశాలకు రూ.75 వేలు విలువ గల 5 కంప్యూటర్లను బహూకరించారని అన్నారు. విద్యార్థులు నేర్చుకున్న కంప్యూటర్ విద్యను తిరిగి ల్యాబ్‌లో ప్రాక్టీస్ చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. రానున్న రోజుల్లో కంప్యూటర్ ఆవశ్యకత ఎక్కువగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఉపాధ్యాయులు చక్రవర్తి, జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి ఒక్కరికి అవసరం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ అధ్యాపకులు, విద్యార్థులు

మంగళగిరి టౌన్: కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి ఒక్కరికి అవసరమని కేఎల్‌యూ ప్రొఫెసర్ ఇన్‌చార్జి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. నవులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కేఎల్ యూనివర్సిటీ సీఈఏ, సీఎస్ఐటీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం బేసిక్ నాలెడ్జ్ ఆఫ్ కంప్యూటర్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్సిటీ సీఎస్‌టీ విభాగానికి చెందిన అధ్యాపకులు కంప్యూటర్ ప్రాథమిక భాగాలు, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ మధ్య తేడాలు, ఆపరేటింగ్ సిస్టమ్ వినియోగం, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ ఉపయోగాలు గురించి విద్యార్థులకు వివరించారు. డిజిటల్ లిటసరీ ప్రాముఖ్యతను వివరించారు. సీఈఏ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, సీఎస్ఐటీ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ ప్రవీణ్‌లు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత అవకాశాలను పొందవచ్చని సూచించారు. కార్యక్రమాన్ని నిర్వహించినందుకు వర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్ , డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ కె.సుబ్బారావు, విద్యార్థుల విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, విద్యార్థుల విభాగం అడ్వయిజర్ డాక్టర్ హబీబుల్లా ఖాన్ తదితరులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి పిల్లలకు శిక్షణ

ప్రమాణ స్వీకారం చేస్తున్న తేజ బాలల పార్లమెంట్ సభ్యులు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరంలో గుడ్‌షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తేజ బాలల పార్లమెంట్ గ్రూప్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సిస్టర్ విద్య మాట్లాడుతూ.. 30 మంది బాలబాలికలతో తేజ బాలల పార్లమెంట్ గ్రూప్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామ అభివృద్ధి, సమాజం పట్ల ప్రభుత్వ పరిపాలన విధానంపై అవగాహన కల్పించి ఆసక్తి కలిగిన 12 మందితో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎన్నుకున్న మంత్రులకు బాధ్యతలు, విధుల గురించి తెలియజేసి వారితో ప్రమాణ స్వీకారం చేయించామని అన్నారు. బాలబాలికలు చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని.. సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించి సమాజంలోని సమస్యలను గుర్తించి స్థానిక అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటికి పరిష్కార మార్గాలు కనుగొనే విధంగా పిల్లలకు శిక్షణ ఇస్తున్నామని వివరించారు. సైబర్ క్రైమ్ బారిన పడితే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బాలబాలికలు, గ్రామ పెద్దలు, గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది అత్తోట పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అగస్త్యేశ్వర స్వామి రథోత్సవం

శివనామస్మరణతో మార్మోగిన కొలకలూరు

స్వామి వారిని ఊరేగిస్తున్న దృశ్యం

అశేష జనవాహిని నడుమ స్వామివారి రథోత్సవం

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీగంగా పార్వతి సమేత శ్రీఅగస్త్యేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం స్వామివారి రథోత్సవం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా నిర్వహించారు. త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా ప్రాచుర్యం పొందిన కొలకలూరు గ్రామంలో శ్రీగంగాపార్వతి సమేత శ్రీఅగస్త్యేశ్వరస్వామి దేవస్థానం నాటినుంచి భక్తుల కొంగుబంగారంగా విలసిల్లుతోంది. ఏటా ఇక్కడ మహాశివరాత్రి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తుంటారు. వేలాది భక్తులు స్వామివార్లను దర్శించుకుంటారు. ఆ క్రమంలో ప్రస్తుతం మహాశివరాత్రి ఉత్సవాలను వేడుకగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం అలంకరించిన రథంపై స్వామివార్లను వేంచేయించి, గ్రామోత్సవం జరిపారు. ఈ సందర్భంగా గ్రామ వీధులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. మహిళలు మంగళహారతులతో స్వామివారిని ఆహ్వానించగా, యువకులు రథాన్ని లాగుతూ భక్తి పారవశ్యాన్ని పొందారు. రథోత్సవం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. జనసేన నాయకులు, మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు రథోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సంగం జాగర్లమూడిలో....

తెనాలిరూరల్: రూరల్ మండల సంగంజాగర్లమూడిలో మహాశివరాత్రి పర్వదినం మరుసటిరోజున స్వామివార్ల దివ్య మహా రథోత్సవం కనుల పండువగా సాగింది. వేలాది భక్తులు దర్శించుకుని స్వామివార్ల కృపకు పాత్రులయ్యారు. తెనాలి–నారాకోడూరు రోడ్డులో తెనాలి మండల గ్రామం సంగంజాగర్లమూడిలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీబాలాత్రిపురసుందరీ సమేత శ్రీసంగమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీబాలాత్రిపురసుందరీ సమేత శ్రీసంగమేశ్వరస్వామి దివ్య మహారథోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా రథాంగహోమం, వాస్తు పూజ, వాస్తు హోమం, వాస్తు బలి అనంతరం స్వామివార్లను రథంపై వేంచేసుకుని కళ్యాణమూర్తులైన ఆదిదంపతులు భక్తులను అనుగ్రహించేందుకు గ్రామోత్సవానికి బయలుదేరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా వంశ పారంపర్య ధర్మకర్త రావుబహదూర్ మాణిక్యరావు సిద్ధార్థ వెంకట మార్కండేయ రావు(సిద్ధార్థ బాబు), ఆలయ కార్యనిర్వహణాధికారి వి.పద్మ పర్యవేక్షించారు.

పోలీసుల అదుపులో మహిళలను ట్రాప్ చేసే వ్యక్తి

తెనాలిరూరల్: భర్త నుంచి విడిపోయినా లేదా వితంతు మహిళల వివరాలను మ్యాట్రిమోనియల్ సైట్‌లలో చూసి వారిని పెళ్లి పేరిట మోసగించి డబ్బు దోచుకుంటున్న వ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. సేకరించిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా కొల్లూరుకు చెందిన 35 ఏళ్ల వ్యక్తి మ్యాట్రిమోనియల్ సైట్‌ల ద్వారా తెనాలి, పరిసర గ్రామాల్లోని భర్త నుంచి విడిపోయినా లేదా వితంతు మహిళల వివరాలను తీసుకుని వారిని పెళ్లి చేసుకుంటానని మాటలు కలిపి వారి నుంచి రూ.లక్షల్లో నగదు తీసుకుని మోసం చేస్తుంటాడు. ఈ క్రమంలోనే 2024లో చెంచుపేటలోని ఓ మహిళ వద్ద పెద్ద మొత్తంలో నగదు తీసుకోగా పోలీసు కేసు అవడంతో కటకటాలపాలయ్యాడు. తాజాగా అంగలకుదురుకు చెందిన ఓ మహిళతో ఇదే తరహాలో మాటలు కలిపాడు. 10 రోజుల్లోనే ఆమె నుంచి రూ.11 లక్షలు దోచుకున్నాడు. మోసపోయిన మహిళ పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ప్రస్తుతం నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఇదే తరహాలో మరో 15 మంది వరకు మహిళలను మోసం చేశాడని పోలీసుల వర్గాల్లో చర్చించుకుంటున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

'బిల్'కు గేట్స్ క్లోజ్!

- ఏఐ ఇండియా సదస్సుకు దూరంగా బిల్ గేట్స్..?
- ప్యానలిస్టుల జాబితా నుంచి పేరు తొలగింపు?
- ఇప్పటికే సమాచారం ఇచ్చారంటున్న జాతీయ మీడియా చానళ్లు
- బిల్‌గేట్స్ పర్యటనపై సర్వత్రా వెల్లువెత్తుతున్న ఆగ్రహావేశాలతో కేంద్రం నిర్ణయం!
- ఏపీలో చంద్రబాబు సర్కారు నిర్ణయాలపై ఆరా.. నిఘా వర్గాల నుంచి సమాచారం
- ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో బిల్ బాగోతం బట్టబయలు
- బిల్ గేట్స్‌ను దూరం పెట్టిన యావత్ ప్రపంచం
- విశిష్ట అతిథిగా అమరావతికి పిలిచి చంద్రబాబు సర్కారు రాచ మర్యాదలు
- ఆయన్ను మహిళా రైతులతో మాట్లాడించడం విభ్రాంతికరమని తీవ్రంగా మండిపడ్డ జాతీయ మీడియా
- సీఎం చంద్రబాబు, లోకేశ్ తీరుపై సర్వత్రా ఆగ్రహావేశాలు

సాక్షి, అమరావతి: తీవ్రమైన లైంగిక నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించడంపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం కావడం... సీఎం చంద్రబాబు, లోకేశ్ తీరును జాతీయ మీడియా పెద్ద ఎత్తున ఎండగట్టడం.. మహిళలు మండిపడుతుండటంతో ఢిల్లీలో నిర్వహిస్తున్న 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇండియా' సదస్సుకు బిల్‌గేట్స్‌ను దూరంగా ఉంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. తొలుత నిర్ణయించిన ప్రకారం ఈ సదస్సులో బిల్‌గేట్స్ గురువారం పాల్గొని ప్రసంగించాల్సి ఉంది. సదస్సు ప్యానలిస్టులు జాబితాలో ఆయన పేరుంది. అయితే లైంగిక వేధింపులకు పాల్పడ్డ బిల్‌గేట్స్‌కు చంద్రబాబు ప్రభుత్వం విశిష్ట అతిథిగా రాచ మర్యాదలు చేయడం.. అమరావతిలో మహిళల వద్దకు తీసుకెళ్లి మాట్లాడించడంపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ మీడియా దీన్ని తీవ్రంగా తప్పుబడుతూ చర్చలు నిర్వహించింది. లైంగిక నేరాలను చంద్రబాబు ప్రభుత్వం ఆమోదిస్తోందా? అని సూటిగా నిలదీసింది. ఎన్‌డీటీవీ లాంటి ప్రముఖ జాతీయ చానల్ మంగళవారం దీనిపై ప్రత్యేక కథనాలు ప్రసారం చేసింది. ఇక జాతీయస్థాయిలో ప్రముఖ మహిళా నేతలు, పాత్రికేయులు చంద్రబాబుపై మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మీయ బంధువుగా బిల్‌గేట్స్‌ను ఆలింగనం చేసుకోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. చంద్రబాబు సర్కారు తీరును పలువురు పార్లమెంట్ సభ్యులు సైతం తీవ్రంగా తప్పుబట్టారు. దీంతో చంద్రబాబు సర్కారు ఏకపక్ష నిర్ణయంపై ఆరా తీసిన కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. ఏఐ ఇండియా సదస్సు ప్యానలిస్టుల జాబితా నుంచి బిల్ గేట్స్ పేరు తొలగించాలని సదస్సు నిర్వాహకులను తాజాగా ఆదేశించినట్లు తెలుస్తోంది. ఆ సదస్సుకు దూరంగా ఉండాలని బిల్ గేట్స్‌కు సమాచారం కూడా ఇచ్చారని జాతీయ మీడియా చానళ్లు వెల్లడించాయి.



బిల్‌గేట్స్‌తో నవ్వులు చిందిస్తున్న చంద్రబాబు



ఏఐ సమ్మిట్‌కు బిల్‌గేట్స్ హాజరుపై ప్రముఖ పాత్రికేయురాలు సుహాసిని హైదర్ సోషల్ మీడియాలో చేసిన పోస్టు



బిల్‌గేట్స్‌కు మంత్రి లోకేశ్ స్వాగతం పలకడాన్ని నిరసిస్తూ శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది చేసిన ట్వీట్

బాబు బృందం ఘన స్వాగతం..

బిల్ గేట్స్.. ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ స్థాపకుడు! ఇది నాణానికి ఓవైపు మాత్రమే. మరి రెండో వైపు..? తీవ్రమైన లైంగిక నేరాలు... అభం శుభం తెలియని చిన్నారులపై లైంగిక వేధింపులు.. ఎప్‌స్టీన్ ఫైల్స్ సాక్షిగా బట్టబయలయ్యాయి! అందుకే బిల్ గేట్స్ అంటేనే యావత్ ప్రపంచం దూరం పెడుతోంది. కానీ అంతటి దారుణాలకు పాల్పడ్డ వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత ఆత్మీయుడయ్యారు. సహచర మంత్రులతో కలసి విమానాశ్రయంలో ఆయనకు లోకేశ్ ఘన స్వాగతం పలికారు. ఇక చంద్రబాబు బిల్ గేట్స్‌ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వ అతిథిగా రాచ మర్యాదలు చేయడంతో యావత్ దేశం విస్తుపోయింది. జాతీయ మీడియా తీవ్రంగా మండిపడింది.

ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో బాగోతం బట్టబయలు

అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తున్న ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బిల్‌గేట్స్ పేరు అత్యంత ప్రముఖంగా బయటపడింది. అభం శుభం తెలియని చిన్నారులను తమ వికృత లైంగిక కార్యకలాపాలకు వాడుకున్నారని వెలుగులోకి వచ్చింది. బిల్ గేట్స్‌కు ఆయన భార్య మెలిండా గేట్స్ కొంతకాలం క్రితం విడాకులు కూడా ఇచ్చారు. ఆయన అక్రమ, అనైతిక లైంగిక కార్యకలాపాలను భరించలేక ఆమె విడాకులు ఇచ్చారు. కాగా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బిల్ గేట్స్ పేరు బయటపడటంతో యావత్ ప్రపంచం నివ్వెరపోయింది. ఎప్‌స్టీన్ ఫైల్స్ బాగోతంపై ఓటీటీ చానల్ నెట్‌ఫ్లిక్స్‌లో ప్రత్యేక సీరీస్ కూడా చిత్రీకరించారు. దాంతో బిల్‌గేట్స్ తదితరులు ఎంతటి తీవ్ర లైంగిక నేరాలకు పాల్పడ్డారన్నది తెలుసుకుని యావత్ ప్రపంచం కంపించిపోయింది.

బాబు సర్కారు తీరుపై కేంద్రం ఆరా

వివాదాస్పద బిల్ గేట్స్‌కు చంద్రబాబు ప్రభుత్వం అతిథి మర్యాదలు చేయడంపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. విదేశీ ప్రతినిధులు, విదేశీ కార్పొరేట్ ప్రతినిధులను అతిథులుగా ఆహ్వానించే ముందు కేంద్ర ప్రభుత్వానికి సమాచారం ఇవ్వడం సంప్రదాయం. ఇక వివాదాస్పద వ్యక్తులను పిలవాలంటే కచ్చితంగా అనుమతి తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్టానుసారంగా తీసుకునే నిర్ణయాలు జాతీయ విధానాలు, దేశ ప్రతిష్టకు భంగకరంగా ఉండకూడదు. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం ఇవేవీ పట్టించుకోలేదు. కనీసం కేంద్ర ప్రభుత్వ అనుమతి కూడా లేకుండా వివాదాస్పద బిల్ గేట్స్‌కు అతిథి మర్యాదలు చేసింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఆరా తీసింది. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై కేంద్ర నిఘా వర్గాలు నివేదిక పంపినట్లు సమాచారం. అయితే బిల్ గేట్స్ ఏఐ ఇండియా సదస్సులో పాల్గొని ప్రసంగిస్తారని బిల్‌గేట్స్ ఫౌండేషన్ ఓ ప్రకటనలో పేర్కొనడం గమనార్హం.



ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బిల్‌గేట్స్‌పై లైంగిక ఆరోపణలపై ఎన్‌డీటీవీలో కథనం

బాలికలు, మహిళలను అవమానించడమే..!

తీవ్రమైన లైంగిక నేరాలకు పాల్పడ్డ బిల్ గేట్స్‌ను యావత్ ప్రపంచం దూరం పెట్టింది. ఒకప్పుడు బిల్ గేట్స్‌ను ముఖ్య అతిథిగా పిలిచేందుకు పోటీ పడ్డ ప్రపంచ దేశాధినేతలు, కార్పొరేట్ ప్రముఖులు ప్రస్తుతం ఆయన పేరు పలికేందుకు కూడా ఇష్టపడటం లేదు. ఇక ఆయనతో వేదిక పంచుకునేదే లేదని తేల్చిచెప్పారు. అలాంటి బిల్ గేట్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు పనిగట్టుకుని పిలిచి మరీ రాష్ట్ర ప్రభుత్వ అతిథిగా రాచ మర్యాదలు చేశారు. చంద్రబాబు తీరుపై దేశంలోనే కాదు.. అంతర్జాతీయంగా కూడా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి లోకేశ్‌తోపాటు పలువురు మంత్రులు బిల్ గేట్స్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం పలకడం... ముఖ్యమంత్రి చంద్రబాబు తన అధికారిక నివాసం వద్ద ఎదురొచ్చి మరీ ఆయన్ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకోవడం.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు పరిచయం చేయడం తదితర దృశ్యాలు చూసి యావత్ ప్రపంచం నివ్వెరపోయింది. బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిల్ గేట్స్‌కు హోంమంత్రి వంగలపూడి అనిత విమానాశ్రయంలో సాదర స్వాగతం పలకడం... ఆయన్ను ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలోని వ్యవసాయ క్షేత్రానికి తీసుకెళ్లి మహిళా రైతులతో మాట్లాడించడం విభ్రాంతికరమని పేర్కొంటున్నారు. ఇక బిల్ గేట్స్, చంద్రబాబు అనుబంధాన్ని కీర్తిస్తూ టీడీపీ సోషల్ మీడియాలో వైరల్ వీడియోలు పోస్టు చేయడం విస్మయపరిచింది. బిల్ గేట్స్ రాష్ట్రానికి రావడం గర్వకారణమని చంద్రబాబు, లోకేశ్‌లు బహిరంగంగా ప్రకటించడం, వీటిని తమ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టులు పెట్టడం దిగజారుడుతనమేనని... బాలికలు, మహిళలను అవమానించడమేనని మండిపడుతున్నారు. బిల్‌గేట్స్‌తో చంద్రబాబు భేటీని ఆహా ఓహో.. అంటూ టీడీపీ అనుకూల పచ్చ మీడియా ఆకాశానికి ఎత్తే యత్నం చేసింది. కానీ జాతీయ మీడియా, సోషల్ మీడియా మాత్రం చంద్రబాబు తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతోంది.

లైంగిక నేరాలను చంద్రబాబు ప్రభుత్వం ఆమోదిస్తోందా?

లైంగిక నేరాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోద ముద్ర వేస్తోందా..? తీవ్రమైన లైంగిక నేరాలకు పాల్పడ్డ బిల్ గేట్స్ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన ఫొటోలు చూసి చాలా బాధపడ్డా. ఆయనకు చంద్రబాబు, లోకేశ్ ఎలా స్వాగతం పలికారు? బిల్ గేట్స్ గురించి ఆయన సతీమణి చేసిన వ్యాఖ్యలను నారా లోకేశ్ ఒకసారి పరిశీలించి ఉంటే బాగుండేది.

– ప్రియాంకా చతుర్వేది, ఎంపీ, శివసేన

క్లుప్తంగా...

పొగాకు పంట పరిమాణం నిర్ధారణ

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్, రైతు సాగుబడికి ఆమోద యోగ్యమైన పరిధికి అనుగుణంగా 2026–27కు సంబంధించి కర్ణాటక ప్రాంత పంట కాలానికి 90.00 మిలియన్ కిలోగ్రామ్ పొగాకును పంట పరిమాణంగా నిర్ధారించారు. గుంటూరులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన 166వ బోర్డు సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వర్చువల్‌గా జరిగిన ఈ సమావేశానికి బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ అధ్యక్షత వహించగా ఎంపీలు పి.మహేశ్‌కుమార్, డాక్టర్ కె.లక్ష్మణ్, డైరెక్టర్లు మానిక్‌గౌర్, డాక్టర్ మాగుంట శేషుమాధవ్, ఏపీ, కర్ణాటక వ్యవసాయ శాఖ ప్రతినిధులు, పొగాకు బోర్డు ఉన్నతాధికారులు హాజరయ్యారు. నిర్ధారించిన పంట పరిమాణానికి లోబడే పంటను పండించి, మెరుగైన ధరలను పొందాలని రైతులకు సూచించారు.

మూలిగ మార్పిడి చికిత్స అందుబాటులో లేదా?

రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు ధర్మాసనం విస్మయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో అత్యంత ఖరీదైన మూలిగ మార్పిడి చికిత్స (బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్) అందుబాటులో లేకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. పలు రాష్ట్రాల్లో బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ఉచిత చికిత్స అందిస్తుండగా, ఏపీలో అలాంటి సౌకర్యం లేకపోవడం ఏమిటని ప్రశ్నించింది. డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకం కింద ప్రైవేటు ఆస్పత్రుల్లో బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స పొందిన రోగులకు ప్రస్తుతం రూ.11 లక్షలే చెల్లిస్తున్నారని.. ఆ మొత్తాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. ఈ చికిత్సను అందుబాటులోకి తెచ్చేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి తదితరులను ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

ఆర్టీపీపీకి ఎక్సలెన్సీ అవార్డు

అవార్డు అందుకున్న సీఈ వాసుదేవరావుతో ఆర్టీపీపీ అధికారులు

ఎర్రగుంట్ల: విద్యుత్ ఉత్పత్తి రంగంలో అందించే ప్రతిష్టాత్మకమైన ఫెర్పార్మెన్స్ ఎక్సలెన్సీ అవార్డు డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ)కు దక్కింది. జాతీయ థర్మల్ పవర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్‌లో సోమవారం జరిగిన ఎన్‌టీపీసీ కార్యక్రమంలో సీఈ వాసుదేవరావు ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆర్టీపీపీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో అధికారులు సీఈ వాసుదేవరావును సన్మానించారు. ఉద్యోగుల సమష్టి కృషికి ఫలితం వచ్చిందని వాసుదేవరావు చెప్పారు. 2024– 25 ఆర్థిక సంవత్సరంలో మెరుగైన పనితీరు కనబర్చినందుకు ఎక్సలెన్సీ అవార్డు దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈలు సోమశేఖర్‌రెడ్డి, దేవేంద్రనాయక్, భాస్కరరావు, పద్మావతి పాల్గొన్నారు.

ఇందాపూర్, హెరిటేజ్‌పై సీబీఐకి ఫిర్యాదు

ఏలేశ్వరం: తిరుపతి లడ్డూ వ్యవహారంలో ఇందాపూర్, హెరిటేజ్ సంస్థల లావాదేవీలపై సీబీఐ దర్యాప్తు జరపాలని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడిశెట్టి వీరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీబీఐకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మంగళవారం కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతి లడ్డూపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చేసిన వ్యాఖ్యల వెనుక ఆర్థిక లావాదేవీలు ఉన్నాయన్నారు. టీటీడీ చరిత్రలోనే ఎక్కువ ధరకు ఇందాపూర్‌కు కాంట్రాక్టు కట్టబెట్టారన్నారు. ఇందాపూర్, హెరిటేజ్ మధ్య ఆర్థిక, వ్యాపార లావాదేవీలు ఉన్నాయని ఆరోపించారు. దీనిపై సీబీఐ పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని కోరారు.

జిల్లాల వారీగా ఎరువుల పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో యూరియా కొరత ఎక్కడా లేదని వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పేర్కొన్నారు. 'యూరియా.. ప్రైవేటు దయ' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనంపై మంగళవారం స్పందిస్తూ రబీ 2025–26 సీజన్‌లో ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. పెరిగిన సాగు విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం కేటాయించిన ఎరువులను జిల్లాల వారీగా పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ సీజన్‌లో 22,252 దుకాణాలను తనిఖీచేసి రూ.58 కోట్ల విలువైన 21,906 టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపివేశామన్నారు. రూ.6.45 కోట్ల విలువైన 2,358 టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకుని, 92 దుకాణాల లైసెన్సులను రద్దు చేశామని... 253 మందిపై 6ఏ కేసులు, 34 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని తెలిపారు.

బాధితులు జైలులో.. నిందితులు బయట జల్సాలా?

- అంబటి రాంబాబును కక్ష పూరితంగా జైలులో పెట్టారు
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం)/కిర్లంపూడి: 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం దేశమంతటా అమలవుతుండగా... మన రాష్ట్రంలో మాత్రం లోకేశ్ రాసుకున్న రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. అందువల్లే దాడికి గురైన వారు జైలులో ఉంటున్నారు. దాడులకు పాల్పడిన నిందితులు జల్సాగా బయట తిరుగుతున్నారు..' అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి అంబటి రాంబాబును కలిసేందుకు మంగళవారం గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) వచ్చారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ అంబటి రాంబాబును కక్షపూరితంగా జైలులో పెట్టారని విమర్శించారు. అంబటి ఇంటిని ధ్వంసం చేసి, నిప్పు పెట్టి, ఆయన కుటుంబ సభ్యులపై దాడి చేసిన వారు బెయిల్‌పై బయట తిరుగుతున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు మోసం చేశారని, ప్రశ్నిస్తున్న వారిపై దాడులు చేయిస్తున్నారని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. పబ్లిసిటీ, మార్కెటింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ... ప్రజలకు మేలు చేయడంపై లేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం రోజుకు రూ.500 కోట్లు అప్పు చేస్తోందని, ఆ డబ్బులు ఏం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రశ్నిస్తున్న నాయకుల గొంతు నొక్కాలని చూస్తున్న చంద్రబాబు దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడే రోజు దగ్గరలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న గుడివాడ అమర్‌నాథ్

ముద్రగడతో వైఎస్సార్‌సీపీ నేతల భేటీ

వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని ఆయన నివాసంలో మంగళవారం గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాసరావు, కరణం ధర్మశ్రీతోపాటు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి నియోజకవర్గ పరిశీలకుడు చిక్కాల రామారావు మర్యాదపూర్వకంగా కలిసి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో విద్యార్థులు, యువత, రైతులు, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవిత్రమైన తిరుమల లడ్డూను కూడా చంద్రబాబు స్వార్థ రాజకీయాల కోసం వాడుకోవడం సిగ్గు చేటన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, పార్టీ అంగన్‌వాడీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంగూరి లక్ష్మీశివకుమారి తదితరులు పాల్గొన్నారు.

గొంతుకోసి డీలర్ దారుణ హత్య

- భూ తగాదాలే కారణమంటున్న బంధువులు
- అన్నమయ్య జిల్లా వడిశలంకపల్లిలో ఘటన

గాలివీడు (అన్నమయ్య జిల్లా): పక్కా పథకం ప్రకారం మాటు వేసి, ఆపై గొంతు కోసి ఓ డీలర్‌ను కిరాతకంగా హత్య చేసిన ఘటన అన్నమయ్య జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బంధువుల కథనం మేరకు.. గాలివీడు మండలం గోరాన్ చెరువు గ్రామం వడిశలంకపల్లికి చెందిన రేషన్ డీలర్ గుర్రం కృష్ణారెడ్డి(55), లక్ష్మీదేవి దంపతులు గాలివీడు పట్టణం గేటు నాలుగు రోడ్ల కూడలి వద్ద నివసిస్తున్నారు. వడిశలంకపల్లిలో ఉన్న భూముల విషయంలో సమీప బంధువులతో తగాదాలు ఉన్నాయి. దీనిపై కృష్ణారెడ్డి పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో మామిడితోటకు మందులు పిచికారీ చేయాలని బాబా ఫక్రుద్దీన్ అనే కూలీని తోట వద్దకు రావాలని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి కృష్ణారెడ్డి ఒక్కడే మామిడి తోటకు వెళ్లాడు. అప్పటికే రెక్కీ నిర్వహించి, తోటలో మాటు వేసిన దుండగులు కృష్ణారెడ్డిని దారుణంగా గొంతు కోసి హత్య చేశారు. 8 గంటలకు పిచికారీ చేయడానికి వచ్చిన బాబా ఫక్రుద్దీన్.. రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్న కృష్ణారెడ్డిని చూసి ఉలిక్కిపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల దుర్మరణం

గెమ్మెలి రమేష్, సూర్యప్రకాష్, సీదరి పాలు (ఫైల్)

సాక్షి,పాడేరు: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గిరిజన యువకులు మృతి చెందిన ఘటన అల్లూరి జిల్లాలో జరిగింది. పాడేరు మండలం వంతరపాడు గ్రామానికి చెందిన గెమ్మెలి రమేష్(25), హుకుంపేట మండలం గొందిరాపకు చెందిన రేగం సూర్యప్రకాష్(28), తడిగిరి పంచాయతీ ముల్లుమెట్ట గ్రామానికి చెందిన సీదరి పాలు(18) సోమవారం మత్స్యగుండం జాతరకు వెళ్లారు. తిరిగి ముగ్గురు బైక్‌పై బయలుదేరారు. రమేష్ వాహనాన్ని నడుపుతుండగా మిగిలిన ఇద్దరు వెనుక కూర్చున్నారు. గుత్తులపుట్టు సంతబయలు దగ్గరలోని మలుపు వద్దకు వచ్చేసరికి బైక్ అదుపు తప్పి దూసుకుపోయి విద్యుత్ స్తంభాల ప్రాంతంలో ప్రహరీని ఢీకొట్టింది. ఈ ఘటనలో రేగం సూర్యప్రకాష్ అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ఇద్దరూ తీవ్రగాయాలతో రోడ్డుపై పడి ఉన్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన యువకులు 108కు సమాచారం ఇవ్వగా క్షతగాత్రులను జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా..గెమ్మెలి రమేష్ మృతి చెందాడు. సీదరి పాలు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పాపినాయుడు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించారు.

హెరిటేజ్ కోసమే చంద్రబాబు కల్తీనెయ్యి డ్రామా

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

సాక్షి, అమరావతి: హెరిటేజ్ డెయిరీకి టీటీడీ నిధులను దోచిపెట్టడం కోసమే కల్తీ నెయ్యి పేరుతో శ్రీవారి లడ్డూను అడ్డం పెట్టుకుని చంద్రబాబు పెద్ద కుట్రకు తెరలేపారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. ఇందాపూర్ డెయిరీ ముసుగులో హెరిటేజ్‌కి లాభం చేకూర్చే కుట్రలు బహిర్గతం కావడంతో శాసనమండలిలో చర్చకు ప్రభుత్వం భయపడి పారిపోయిందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు తప్పు చేయకపోతే ఇందాపూర్ డెయిరీపై చర్చించడానికి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ఆయన మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇందాపూర్ డెయిరీ కూడా హెరిటేజ్ సంస్థ అనే విషయం బయటపడేసరికి దాన్ని కో మ్యాన్యుఫాక్చరింగ్ యూనిట్‌గా వెబ్‌సైట్‌లో మార్చేశారని చెప్పారు. 'ఈ ఇందాపూర్ డెయిరీ 2014–19 మధ్య చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు టెండర్లు దక్కించుకుని కిలో రూ.278కే టీటీడీకి నెయ్యి సరఫరా చేసింది. 2016 ల్యాబ్ టెస్టుల్లో ఫెయిలైనా.. ఆరునెలల్లోనే నెయ్యి సరఫరాకి చంద్రబాబు క్లియరెన్స్ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 2019–24 మధ్య బిడ్డింగ్‌లో పాల్గొనలేదు. 2024లో చంద్రబాబు సీఎం అయ్యాక మళ్లీ టెండర్లలో పాల్గొంటోంది. గత నవంబర్‌లో కిలో రూ.658కి నెయ్యి సప్లై టెండర్ దక్కించుకుంది. హెరిటేజ్ నెయ్యి, పెరుగులో బీటా కెరోటిన్ ఉంది. హెరిటేజ్ పాలల్లో కేన్సర్ కారకాలున్నాయని కేరళ ప్రభుత్వం ఆ రాష్ట్రంలో ఈ పాలను నిషేధించింది. అని పేర్కొన్నారు.

ముడుపుల కోసం గేట్లెత్తేశారు

- కొండవీటి వాగు రెండో దశ ఎత్తిపోతల్లోనూ నిబంధనల ఉల్లంఘన
- ఆర్థిక శాఖ ఆమోదం లేకుండానే రూ.595.01 కోట్లతో పనులు చేపట్టిన ఏడీసీఎల్
- ఇప్పటి వరకు ఆర్థిక శాఖ అనుమతి లేకుండా చేపట్టిన పనుల విలువ రూ.4,124.96 కోట్లు

సాక్షి, అమరావతి: రాజధాని నిర్మాణ పనుల్లో ప్రభుత్వ పెద్దల దన్నుతో సీఆర్‌డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ), ఏడీసీఎల్ (అమరావతి అభివృద్ధి సంస్థ) అధికారులు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. కొండవీటి వాగు వరద ఎత్తిపోతల రెండో దశ పనులను రూ.595.01 కోట్లతో ఆర్థిక శాఖ అనుమతి తీసుకోకుండానే ఏడీసీఎల్ అధికారులు చేపట్టడమే దీనికి మరో తార్కాణం. టెండర్లలో ఆ పనులను మేఘా సంస్థ దక్కించుకుంది. కాంట్రాక్టు విలువలో 10 శాతం మొబిలైజేషన్ అడ్వాన్సుగా మేఘాకు చెల్లించాలంటూ ఏడీసీఎల్ అధికారులు పంపిన ప్రతిపాదనను పీఏవో (పే అండ్ అకౌంట్స్ ఆఫీసు) అధికారులు తోసిపుచ్చారు. ఆర్థిక శాఖ అనుమతి లేకుండా చేపట్టిన పనులకు మొబిలైజేషన్ అడ్వాన్సే కాదు బిల్లులు కూడా చెల్లించబోమని తేల్చిచెప్పారు. దాంతో చేసేదిలేక ఆ పనులకు అనుమతి ఇవ్వాలంటూ పురపాలక శాఖ ద్వారా ఆర్థిక శాఖకు ఏడీసీఎల్ అధికారులు ప్రతిపాదన పంపారు. చివరకు ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో వాటిని ఆర్థిక శాఖ ఆమోదించడంతో.. కొండవీటివాగు వరద ఎత్తిపోతల రెండో దశ పనులు చేపట్టేందుకు అనుమతి ఇస్తూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆర్థిక శాఖ అనుమతి లేకుండా నిబంధనలు ఉల్లంఘించి ఏడీసీఎల్, సీఆర్‌డీఏ చేపట్టిన పనుల విలువ రూ.4,124.96 కోట్లకు చేరుకుంది.

కొండవీటి వాగు వరద ఎత్తిపోతల రెండోదశ ఇదీ...

రాజధానిని కొండవీటి వాగు వరద ముప్పు నుంచి తప్పించేందుకు.. ఆ వాగు నుంచి రోజుకు 5 వేల క్యూసెక్కులను ప్రకాశం బ్యారేజీలోకి మళ్లించేలా ఉండవల్లి వద్ద ఎత్తిపోతల పనులను 2017–18లో రూ.222.44 కోట్లతో ప్రభుత్వం పూర్తి చేసింది. అప్పట్లో ఆ పనులను మేఘా సంస్థే చేసింది. ఇప్పుడు మరో 8,400 క్యూసెక్కులను ప్రకాశం బ్యారేజీలోకి ఎత్తిపోసే పనులను కూడా మేఘా సంస్థకు రూ.523.18 కోట్ల (జీఎస్టీ, సీనరేజీ పన్నులతో కలిపి)కు అప్పగించింది. అప్పటితో పోల్చితే.. ఇప్పుడు ఎత్తిపోతల పనులలో వినియోగించే స్టీల్, సిమెంట్, పంప్‌లు, మోటార్లు, విద్యుత్ ఉపకరణాలు వంటి వాటి ధరల్లో పెద్దగా వ్యత్యాసం లేదు. కానీ.. ప్రస్తుతం 8,400 క్యూసెక్కులను ఎత్తిపోసే పనులను రూ.523.18 కోట్లకు అదే సంస్థకు ప్రభుత్వం కట్టబెట్టింది. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున ముడుపులు చేతులు మారాయని ఇంజినీరింగ్ నిపుణులు, కాంట్రాక్టు వర్గాలు ఆరోపిస్తున్నాయి.

ప్రత్యూష మృతి కేసులో సిద్ధార్థ్ రెడ్డికి జైలు

సాక్షి, న్యూఢిల్లీ: రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన వర్ధమాన సినీనటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. సుదీర్ఘ న్యాయ పోరాటం, దశాబ్దాల నిరీక్షణ అనంతరం సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం తుది తీర్పును వెలువరించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, ప్రత్యూష ప్రియుడు సిద్ధార్థ్ రెడ్డిని దోషిగా తేలుస్తూ, అతనికి విధించిన శిక్షను అనుభవించేందుకు నాలుగు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. ఈమేరకు జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు విధించిన శిక్షను సవాల్ చేస్తూ గుడిపల్లి సిద్ధార్థ్ రెడ్డి, శిక్షను పెంచాలని కోరుతూ ప్రత్యూష తల్లి సరోజినీ దేవి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన కోర్టు.. తుది తీర్పును వెల్లడించింది. మెరిట్స్ లేవంటూ సిద్ధార్థ్ రెడ్డి పిటిషన్‌ను కొట్టివేసింది. గత నవంబర్‌లో వాదనలు విన్న సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

ఆ రోజు ఏం జరిగింది?

2002 ఫిబ్రవరి 23 సాయంత్రం.. సినీ పరిశ్రమ ఉలిక్కిపడింది. అప్పుడప్పుడే వెండితెరపై తళుక్కుమంటున్న యువనటి ప్రత్యూష, ఆమె ప్రియుడు సిద్ధార్థ్ రెడ్డిలు పెద్దలు పెళ్లికి అంగీకరించలేదన్న కారణంతో ఆత్మహత్యకు యత్నించారు. కూల్‌డ్రింక్‌లో విషం (పురుగుల మందు) కలుపుకొని తాగడంతో ఇద్దరినీ హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రికి తరలించారు. దురదృష్టవశాత్తు చికిత్స పొందుతూ ఫిబ్రవరి 24న ప్రత్యూష కన్నుమూసింది. సిద్ధార్థ్ రెడ్డి ప్రాణాలతో బయటపడ్డాడు. ఇది ఆత్మహత్య కాదని, సిద్ధార్థ్ రెడ్డే ఆమెను చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని ప్రత్యూష తల్లి సరోజినీ దేవి ఆరోపించారు. సిద్ధార్థ్ రెడ్డికి రాజకీయ నేపథ్యం ఉండటంతో కేసును నీరుగారుస్తున్నారని అప్పట్లో ఆందోళనలు జరిగాయి.

Describe magnetic field due to current through a Circular loop..

MAGNETIC EFFECTS OF ELECTRIC CURRENT

2 MARKS QUESTIONS

1. List three characteristics of magnetic field lines?

A. The properties of the magnetic field lines:

1. Magnetic field lines starts at the north pole and end at the south pole.
2. Magnetic field lines do not intersect each other ,because there can't be two direction of the magnetic field at any one point.
3. The degree of closeness of the field lines depends upon the strength of the magnetic field. Stronger the field, closer are the field lines.

2. Name some materials used for making permanent magnets?

A. Permanent magnets are usually made of following materials:

1. Carbon steel, chromium steel, cobalt and tungsten steel.
2. Nipermag and alnico are two important alloys whose permanent magnets are used in industry. Nipermag is an alloy of iron, nickel, aluminum and titanium while alnico is an aluminum -nickel-cobalt alloy of iron.

3. Give some advantages of electromagnets over permanent magnets?

A. An electromagnets has following advantages over a permanent magnet:

1. An electromagnets can produce a very a strong magnetic field.
2. The strength of the magnetic Field of an electromagnet can be increased /decreased by increased /decreased the strength of current or the number of turns in the solenoid.
3. The polarity of an electro magnet can be reversed by sending the current in the reverse direction.

4. When is the force experienced by a current -carrying conductor placed in a magnetic field largest?

A. When the conductor carries current in a direction perpendicular to the direction of the magnetic field , the force experienced by the conductor is largest.

4 MARKS QUESTIONS

1. Write the brief notes of the following.

a) Earth wire b) short circuit
c) over loading.

A. a) Earth wire:- protects us from electric shock in case of leakage of current especially in metallic body appliances. It provides a low resistance path for current in case of leakage of current.

b) Short circuit:- when live wire comes indirect contact with neutral wire accidentally.

a. Resistance of circuit becomes low
b. Can result in overloading.

c) Over loading: when current drawn is more than current carrying capacity of a conductor, it results in over loading.

Causes of overloading:

i) Accidental hike in voltage supply.
ii) Use of more than one appliance in a single socket

2. Describe magnetic field due to current through a Circular loop.

A. 1) Magnetic field around a circular can be represented by concentric circle at every point.
2) Circles become larger and larger as we move away.
3) Every point on wire carrying current would give rise to magnetic field appearing as straight line at centre of the loop.
4) The direction of magnetic field inside the loop is same.

3. List out the characteristics of magnetic field Lines of force?

A. i) Field lines arise from north pole and end into south pole of the magnet.
ii) Field lines are closed curves.
iii) Field lines are closer in stronger magnetic field.
iv) Field lines never intersect each other. If they intersect with each other the field will have two directions at the Point of intersection which is impossible.
v) Direction of field lines inside a magnet is from south to north.

4. Are the magnetic field lines closed? Explain?

A. 1) Yes, magnetic field lines are always closed loops and any two field lines never intersect each other.
2) Inside the magnet the direction of magnetic lines of force is from South pole to north pole.
3) Outside the magnetic each line comes out from north pole and goes into the south pole.
4) Thus,the magnetic lines of force are closed loops.

5. 1) Which is the better way to connect lights and other appliances in domestic circuit, series connection or parallel connection? Justify your answer.

2) An electrician has made electric circuit of a house in such a way that, if a lamp gets fused in a room of the house, then all the lamps in other rooms of the house stop working .what is the type of circuit writing? Give reason.

A. 1) Parallel connection is a better way to connect lights and other appliances in domestic circuit.

It is because

a) When we connect a number of device in parallel combination, each devices gets the same potential as provided by the battery and it keeps on working even, if other devices stop working .

b) Parallel connection is helpful when each devices has different resistances and requires different current for its operation as in this case the current divides itself through different devices unlike series connection.

2) Electrician has made series connection of all lamps stop working.

This is due to the fact that when devices are connection in series, then if one device fails, the circuit gets broken and all the devices in that circuit stop working.

8 MARKS QUESTIONS

1. Describe an activity to show that a current - carrying wire produces a magnetic field that deflects the magnetic compass needle.

(or)

Explain how a current carrying wire creates a magnetic field that causes the magnetic compass needle to deflect.

A. Aim:- To prove that a current-carrying wire produces a magnetic field that deflects the magnetic compass needle.

Materials required: Copper wire, Battery, ammeter, resistor, plug key, connecting wires and compass.

Procedure:-

i. Place a straight thick copper wire between points X and Y in the circuit, Perpendicular to the paper.
ii. Position a small compass horizontally near the copper wire and note the needle's position.
iii. Pass Current through the circuit by inserting the key into the plug.
iv. Observe the compass needle's change in position.

Observations:-

i. Deflection in the compass needle occurs when electric current flows through the circuit.
ii. Passing current through the wire creates a magnetic field around it, affecting the compass needle.

conclusion:-

i. A current carrying wire generates a magnetic field, deflecting the compass needle.
ii. Electricity and magnetism are inter connected.

Precautions:-

i. Ensure proper insulation and safety measures while handling electrical components.
ii. Use appropriate voltage and current levels to prevent over heating (or) damage to equipment.

2. Describe an activity to prove that a magnetic field is produced around a straight current carrying conductor is an circular shape.

A. Aim: To prove that a magnetic field is produced around a current carrying conductor.

Materials Required: Battery, plug key, ammeter, rheostat cardboard, compass and Iron fillings.



Procedure:

i) Take a battery (12V) a Variable resistance or rheostat an ammeter (0-5 A), a plug and a long straight thick copper wire.

Continued on next page..

ii) insert the thick wire through the centre normal to the plane of rectangular cardboard take care that the cardboard is fixed and does not slide up and down.

iii) Connect the copper wire vertically between points x and y as shown in the figure (a) in series with the battery and plug key.

iv) Sprinkle some fillings uniformly on the cardboard.

v) Keep the variable of the rheostat at a fixed position and note the current through the ammeter.

vi) Close to the Key so that a current flows through the wire ensure that the copper wire placed between point X and Y remains vertically straight

vii) Gently tap the cardboard a few times observe the pattern of the iron fillings. you would find that the iron fillings align themselves showing the pattern of Concentric.

Observation: Iron fillings get arranged in concentric circles around the straight conductor.

Conclusion: A magnetic field is produced around a current-carrying conductor.

The direction of the magnetic field gets reversed when the direction of the current is reversed.

3. Write an activity to observe the magnetic field lines around a bar magnet?

A. Aim: To observe the magnetic field lines around a bar magnet.

Material required: A sheet of white paper, drawing board, bar magnet and iron fillings.



field lines around a bar magnet

Procedure:

1. Fix a sheet of white paper on a drawing board using some adhesive material.
2. Place a bar magnet in the center of it.
3. Sprinkle some iron filing uniformly around the bar magnet.
4. A salt Sprinkler may be used for this purpose.
5. Now tap the board gently.
6. We will observe that iron filings set arranged in a pattern around the bar magnet.

Explanation:

1. When iron fillings are Sprinkled around a bar magnet, the iron fillings arrange in a pattern.
2. Particles of iron filings become small magnet and they experience a force in a certain direction due to the magnetic field produced by the bar magnets.
3. These particles arrange in a curved path, this curved path shows magnetic force line around a bar magnet.

Physical Science Model paper

General Science Paper-1
Physical Science

Time : 2h **Max.Marks : 50**

Instructions:

1. Question paper consists of 4 sections and 17 questions
2. Internal choice is there only for Q. No. 12 in Section -III and for all the questions in Section-IV.
3. In the duration of 2 hours 15 minutes of time is allotted to read the question paper.
4. All answers should be written in the answer booklet only.
5. Answers should be written neatly and legibly.

SECTION-I

8×1= 8M

Note: *i) Answer all the questions.*
ii) Each question carries 1 mark.

1. What happened when iron nails is exposed in air or atmosphere? predict

2. What is the pH range of blood
a) 5.6 to 6.8 b) 7.3 to 7.45
c) 4.2 to 4.8 d) 6.2 to 6.8

3. Which Salt is used in the manufacture of Borax.

4. State two ways to prevent the rusting of iron.

5. Mention the name of a structure found in human eye that controls size of the pupil.

6. 1 KWH: ________ joules

7. Match the following.

A	B
1) Resistor	a) 
2) Rheostat	b)
	c)

8. What is the unit of magnetic flux density

SECTION-II

3×2= 6M

Note: *i) Answer all the questions.*
ii) Each question carries 2 marks.

9. Give an example of esterification reaction

10. Write the Characteristics of image formed by plane mirror

11. Pose any two questions to understand the concept of Ohm's Law.

SECTION-III

3×4= 12M

Note: *i) Answer all the questions.*
ii) Each question carries 4 marks.

12. Draw the ray diagrams of image formed when the object is placed infront of a biconvex lens in the following positions
a) between F_1 and O b) beyond $2F_1$
(or)
Draw a neat diagram showing passing carbon dioxide gas through calcium hydroxide solution when metal carbonates (or) metal hydrogen carbonate react with acids

13.

material medium	Air	water	benzene	diamond
speed of light inthe medium	3×10^8	$\frac{9}{4}\times 10^8$	2×10^8	$\frac{5}{4}\times 10^8$

Observe the table and answer the following questions.
1) Which material medium light travels faster
2) Which material medium light travels lowest
3) In which material medium the refractive index is least.
4) In which material medium the refractive index is greatest.

14. Give the important uses of bleaching powder and plaster of paris.

SECTION-IV

3×8= 24M

Note: *i) Answer all the questions.*
ii) Each question carries 5 marks.
iii) Each question has an internal choice

15. Explain the following
1) scattering of light
2) tyndall effect
(or)
Deduce the expression for the equivalent resistance of three resistors connected in parallel

16. Explain the following chemical reactions with examples
a) chemical combination
b) chemical decomposition
c) chemical displacement
d) chemical double displacement
(OR)
Explain the mechanism of the cleaning action of soap

17. Describe an activity to show that a current carrying wire produces a magnetic field that deflects the magnetic compass needle.
(OR)
When an activity to show the reaction of Acids with metals.

AV Sudhakar
School Assistant (PS),
ZPPHS Chennarayunipalem,
Bogole (M), SPSR Nellore

Daily Quiz

1. Decisions related to war and peace are taken in the ?
A) General Assembly B) Secretariat
C) International Court of Justice
D) Security Council

2. Non aligned countries were against ?
A) Joining on either of the military blocks
B) Remove tension between countries
C) Economic co-operation between countries
D) Decolonisation of the countries

3. Liberation of East Pakistan was done with the support of ?
A) India
B) Pakistan
C) China
D) Vietnam

4. The dream of Dr. Martin Luther king was .....
A) People should be respected by their colour
B) People should be respected by their wealth
C) People should be respected by their character
D) People should be respected by the religion

5. Meira Paibi means?
A) Factory workers B) Reformers
C) Torch bearers D) Farmers

రేపటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం

సౌదీలో ప్రారంభమైన రంజాన్ మాసం

సాక్షి, హైదరాబాద్: సౌదీ అరేబియాతో పాటు ఇతర దేశాల్లో మంగళవారం నెలవంక కనిపించడంతో రంజాన్ నెల ప్రారంభమైనట్టు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. ఏపీ, తెలంగాణ వ్యాప్తంగా ఈనెల 19 (గురువారం) నుంచి ముస్లింలు ఉపవాస దీక్షలు పాటిస్తారని ఇప్పటికే ప్రకటించారు. బుధవారం నెలవంక నిర్ధారణ కమిటీ నెలవంక కనిపించినట్లు ప్రకటించిన అనంతరం రంజాన్ నెల అధికారికంగా ప్రారంభమవుతుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల కమిటీలతో పాటు ఢిల్లీలోని కేంద్ర కమిటీతో నెలవంక నిర్ధారణ కమిటీ చర్చలు జరిపి రంజాన్ నెల ప్రారంభంపై ప్రకటన చేయనుంది.

ఒంటిపై గాయాలు ఉన్నాయి

రచయిత శ్రీనివాస్ మృతి కేసులో వేగంగా దర్యాప్తు

కూసుమంచి: ఏపీకి చెందిన ప్రముఖ రచయిత బొగ్గుల శ్రీనివాస్ మృతి కేసు దర్యాప్తులో పోలీసులు వేగం పెంచగా, పురోగతి సాధించినట్లు తెలిసింది. ఆయన ప్రయాణిస్తున్న కారు ఈనెల 14న ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్‌లో మునగగా మృతదేహాన్ని గుర్తించారు. అయితే, ఘటన జరిగాక కారు నడుపుతున్న వ్యక్తి ఒడ్డుకు చేరి అక్కడి నుంచి పారిపోయినట్లు స్థానికులు చెప్పడంతో కూసుమంచి పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. సదరు వ్యక్తి హైదరాబాద్‌లో పోలీసులకు లొంగిపోయే ప్రయత్నాల్లో ఉన్నాడని, అదే జరిగితే కేసులో చిక్కుముడి వీడుతుందని భావిస్తున్నారు. కారు యజమానిని కూడా అదుపులోకి తీసుకుని విచారించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇక శ్రీనివాస్ మృతదేహానికి నేలకొండపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించిన నివేదిక వచ్చినట్లు సమాచారం. శ్రీనివాస్ నీట మునగడంతో చనిపోలేదని, ఆయన ఒంటిపై గాయాలు ఉన్నట్లు పోస్టుమార్టం చేసిన వైద్యులు ధ్రువీకరించారని తెలిసింది. త్వరలోనే కేసు ఛేదిస్తామని కూసుమంచి ఎస్సై నాగరాజు 'సాక్షి'కి తెలిపారు.

తక్షణమే శనగ కొనుగోలు కేంద్రాలు తెరవండి

ఎంవీఎస్ నాగిరెడ్డి విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: మార్కెట్‌లో మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్న శనగ రైతులను ఆదుకునేందుకు తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపీ వ్యవసాయ మిషన్ మాజీ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రబీ సీజన్‌లో రాష్ట్రంలో వరి తర్వాత ఎక్కువగా సాగయ్యేది శనగ పంటేనన్నారు. సుమారు 9.2 లక్షల ఎకరాల్లో శనగ సాగవుతుండగా, ఈ రబీలో 6 లక్షల టన్నుల ఉత్పత్తి అంచనా వేశారన్నారు. ఈ ఏడాది మద్దతు ధర రూ.5,875 కాగా, ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా రూ.5 వేల కంటే తక్కువ ధర పలుకుతోందని, కొనేవారు లేక శనగ రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారని చెప్పారు.

సర్కారు ఉత్తర్వులపై సహకార ఉద్యోగుల ఆగ్రహం

సాక్షి, అమరావతి: దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఉద్యోగులు సమ్మె నోటీసు ఇవ్వడంతో ప్రభుత్వం హడావుడిగా కాలయాపన ప్రణాళిక ప్రకటించింది. ఈ ప్రణాళిక ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడటం కంటే.. హక్కులను కాలరాయడానికే ఉన్నాయని ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచిన ప్రభుత్వం పీఏసీఎస్ ఉద్యోగులకు మాత్రం 60 ఏళ్లకే పరిమితం చేయడం తీరని అన్యాయమని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. ఒకే రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల ఈ వివక్ష ఎందుకని ప్రశ్నిస్తున్నారు. 2019 మార్చి 1వ తేదీ తర్వాత నియమితులైన వారందరినీ 'అనధికారికం'గా ప్రకటించడం ద్వారా వందలాది కుటుంబాలను రోడ్డున పడేసే నిర్ణయం తీసుకున్నారని మండిపడుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో లేదనే సాకుతో 'వేజ్ రివిజన్ కమిటీ' అవసరం లేదని ప్రభుత్వం చెప్పడం ఉద్యోగుల శ్రమను అవమానించడమేనని మండిపడుతున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచకుండా.. పాత జీవోలనే అమలు చేస్తామనడం సమంజసం కాదని పేర్కొంటున్నారు. హెల్త్ అండ్ టర్మ్ ఇన్‌స్యూ ఎటువంటి ప్రత్యేక మార్గదర్శకాలు లేవని ప్రభుత్వం చేతులెత్తేసింది. ఆర్థికంగా వెనుకబడిన సహకార ఉద్యోగులకు కనీసం ఆరోగ్య భద్రత కూడా కల్పించకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తోందని మండిపడుతున్నారు. ప్రస్తుత కాలంలో రూ. 2 లక్షల గ్రాట్యుటీ సీలింగ్ అనేది చాలా తక్కువని, దీనిని కేవలం రూ.లక్ష పెంచి పెద్ద మేలు చేసినట్టు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని పేర్కొంటున్నారు. 'కెపాసిటీ టూ పే' (చెల్లించే శక్తి) పేరుతో జీతాల చెల్లింపుల్లో షరతులు విధించడం వల్ల నష్టాల్లో ఉన్న సంఘాల ఉద్యోగుల పరిస్థితి మరింత దిగజారనుందని, జిల్లా ఫండ్ మద్దతు మూడేళ్లకే పరిమితం చేయడం అంటే ఆ తర్వాత ఉద్యోగుల జీతాలకు గ్యారంటీ లేదని తేల్చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరవధిక సమ్మె నోటీసును నీరుగార్చడానికే ఈ 'టైమ్ టేబుల్' ప్రకటించారని, ఇందులో ఉద్యోగుల మౌలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 62 ఏళ్ల వయసు పెంపు, అందరికీ సమాన వేతన స్కేల్స్, బీమా సౌకర్యం కల్పించే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేస్తున్నారు.

క్రికెట్ మ్యాచ్‌కు ప్రత్యేక ఫ్లైట్లలో!

చినబాబు అమరావతి - కొలంబో - ఢిల్లీ యాత్రకు రూ.కోటిపైనే ఖర్చు

ఆ ఖర్చులు అంతా ఎవరు భరిస్తున్నారు?.. సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా లోకేశ్ మెరుపు పర్యటనలు

సాక్షి, అమరావతి: సామాన్యులు ఎర్రబస్సు ఎక్కిన మాదిరిగా చంద్రబాబు కుటుంబం ప్రత్యేక విమానాలను వినియోగించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. తాజాగా పాకిస్థాన్ ఇండియా క్రికెట్ మ్యాచ్ తిలకించేందుకు మంత్రి నారా లోకేశ్ బృందం ప్రత్యేక జెట్ విమానంలో శ్రీలంక వెళ్లి రావడం హాట్ టాపిక్‌గా మారింది. ఉదయం అమరావతిలో ఉన్న లోకేశ్ సాయంత్రం కొలంబోలో ప్రత్యక్షమయ్యారు. మర్నాడు ఉదయం తిరిగి అమరావతి చేరుకుని బిల్‌గేట్స్‌తో ఫోటోలు దిగడంపై సోషల్ మీడియాలో పెద్ద చర్చ నడుస్తోంది. ఇక ఈ కార్యక్రమం పూర్తి కావడమే ఆలస్యం.. లోకేశ్ తిరిగి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లిపోయారని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. క్రికెట్ మ్యాచ్ కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రత్యేక విమానాల్లో చక్కర్లు కొట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రత్యేక విమానాల వ్యయం ఎవరు భరిస్తున్నారన్నది కీలకంగా మారింది. ఈ ఖర్చుల వివరాలను అధికారికంగా వెల్లడించడం లేదు. ఒకపక్కన రాష్ట్రాన్ని అప్పులతో ముంచెత్తుతూ మరోపక్క విహార యాత్రల్లో గడపడంపై విస్తుపోతున్నారు.

కొలంబోలో ఇండియా-పాకిస్తాన్ టీ20 మ్యాచ్‌ను వీక్షించేందుకు వెళ్లిన మంత్రి లోకేశ్

సమస్యలు గాలికి వదిలేసి...!

ప్రస్తుతం మిడ్ సైజ్ ప్రైవేట్ జెట్ విమానం అద్దె గంటకు రూ.3.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఉంది. దీనికి తోడు అంతర్జాతీయ ప్రయాణం కాబట్టి ల్యాండింగ్ చార్జీలు, గ్రౌండ్ హ్యాండ్లింగ్, విదేశీ ఎయిర్ పోర్ట్ ట్యాక్స్‌లు అన్నీ కలిపి మరో రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఉంటాయి. వెరసి తాజాగా లోకేశ్ యాత్రలకు అయిన ఖర్చు అక్షరాలా రూ.కోటి పైమాటే అని వైమానిక వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి తనయుడు సాధారణ బైక్ రైడ్‌లా విమానాలను వాడుకోవటంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఎన్నికల హామీలు, నిరుద్యోగ సమస్యలను పట్టించుకోకుండా విదేశాల్లో మ్యాచ్‌లు చూడటానికి ఇంత సమయం, డబ్బులు వెచ్చించడం సబబేనా? అని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ ఇది వ్యక్తిగత పర్యటన అయితే అధికారిక హోదాను ఉపయోగించి పొందే ప్రోటోకాల్ సౌకర్యాల ఖర్చును ఎవరు చెల్లిస్తున్నారన్నది ముఖ్యం.

ఒకే ఫైలు.. ఒకే సంతకం.. వేర్వేరు న్యాయమా?

- అందరూ నిర్దోషులు.. నేనే నిందితురాలినా?
- మంత్రులు, మాజీలు బయటపడ్డారు.. నాపైనే విచారణ ఎందుకు?
- కేంద్రం చెప్పిందే చేశా.. నిబంధనలు మీరలేదు
- సుప్రీంకోర్టుకు నివేదించిన ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి
- శ్రీలక్ష్మి తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు



సాక్షి, న్యూఢిల్లీ: 'ఒకే ఫైలు.. ఒకే సంతకం.. కానీ ఆ ఫైలును ఆమోదించిన నాటి గనులశాఖ మంత్రి, అంతకుముందు పనిచేసిన కార్యదర్శి ఇద్దరూ ఈ కేసు నుంచి విముక్తి పొందారు. వారెవరూ విచారణ ఎదుర్కోవడం లేదు. కానీ.. వారికింద పనిచేసిన నన్ను మాత్రమే టార్గెట్ చేసి, ఇంకా విచారణ ఎదుర్కోవాలనడం ఎక్కడి న్యాయం?' అని సీనియర్ ఐఏఎస్ అధికారిణి వై.శ్రీలక్ష్మి సుప్రీంకోర్టులో ఆవేదన వ్యక్తం చేశారు. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో తనపై ఉన్న అభియోగాలను కొట్టేయాలంటూ శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట శ్రీలక్ష్మి తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు వినిపించారు. ఈ కేసులో శ్రీలక్ష్మిని బలిపశువును చేశారని, అసలు నిర్ణయాధికారం ఉన్నవారు బయటపడ్డారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ కేసులో మొదట 9 మందిని నిందితులుగా చేర్చారని తెలిపారు. ఇందులో అప్పటి గనులశాఖ మంత్రి (సబితా ఇంద్రారెడ్డి), అప్పటి ప్రభుత్వ కార్యదర్శి (కృపానందం) తదితరులున్నారని చెప్పారు. కోర్టుల ద్వారా వారు ఈ కేసు నుంచి బయటపడ్డారని గుర్తుచేశారు. 'బాధ్యతలు స్వీకరించిన కొత్తలోనే శ్రీలక్ష్మి ఈ ఫైలును డీల్ చేశారు. నిర్ణయాధికారం ఉన్న ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సేఫ్‌గా బయటపడగా.. కేవలం ఒక అధికారిణిని మాత్రమే ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిప్పడం వివక్ష చూపడమే' అని పేర్కొన్నారు. ఒకే తరహా ఆరోపణలు ఎదుర్కొన్న ఇతరులకు ఊరట లభించినప్పుడు శ్రీలక్ష్మికి ఎందుకు వర్తించదని ప్రశ్నించారు.

కేంద్రం చెప్పిందే చేశాం.. ఉల్లంఘన జరగలేదు

ఓఎంసీకి మైనింగ్ లీజులు ఇచ్చే సమయంలో.. ప్రభుత్వ ఉత్తర్వులో క్యాప్టివ్ మైనింగ్ (సొంత పరిశ్రమల అవసరాలకు మాత్రమే ఖనిజాన్ని వాడుకునే) అనే పదాన్ని ఉద్దేశపూర్వకంగానే శ్రీలక్ష్మి తొలగించి అక్రమాలకు పాల్పడ్డారన్న సీబీఐ ప్రధాన ఆరోపణపై న్యాయవాది దవే అభ్యంతరం వ్యక్తం చేశారు. 'జాతీయ ఖనిజ విధానం ప్రకారం.. మైనింగ్ లీజుల్లో క్యాప్టివ్ వంటి షరతులు విధించకూడదని, అది నిబంధనలకు విరుద్ధమని కేంద్ర ప్రభుత్వమే స్పష్టంగా చెప్పింది. కేంద్రం ఆదేశాలను తూచా తప్పకుండా పాటించిన అధికారిణిని.. నిబంధనలు ఉల్లంఘించారని నిందించడం విడ్డూరం' అని చెప్పారు. ఐరన్ ఓర్ మేజర్ మినరల్ అయినందున, లీజుల కేటాయింపులో తుది నిర్ణయం కేంద్రానిదేనని, రాష్ట్రం కేవలం సిఫార్సు మాత్రమే చేస్తుందని తెలిపారు. అంతేగాక అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలంటే లంచం అడిగి తీసుకోవడం, తద్వారా లబ్ధి పొందినట్లు ఆధారాలుండాలని చెప్పారు. కానీ శ్రీలక్ష్మి విషయంలో ఎక్కడా డబ్బు చేతులు మారినట్లుగానీ, ఆమె ఖాతాల్లోకి నగదు వచ్చినట్లుగానీ ఆధారాలు లేవని తెలిపారు. నీరజ్ దత్తా కేసులో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ఉటంకించారు. కేవలం ఆరోపణల ఆధారంగా అవినీతి ముద్ర వేయలేమని సిద్ధార్థ దవే చెప్పారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. శ్రీలక్ష్మి సోదరి భర్త (రాకేష్‌బాబు) 2005–09 మధ్య ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టారని, దీనివెనుక క్విడ్ ప్రో కో ఉందన్న కోణంలో విచారణ జరిగిందని తెలిపారు. సాక్షుల జాబితాలోని ఎల్.డబ్ల్యూ–8 వాంగ్మూలం ప్రకారం డబ్బు డిమాండ్ చేసినట్లు తెలిసిందని, అధికార దుర్వినియోగం (సెక్షన్ 13(1)(డీ)) జరిగిందని చెప్పారు.

సాంకేతిక అంశాలను ట్రయల్ కోర్టులోనే తేల్చుకోండి

ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ ఎం.ఎం.సుందరేష్ ధర్మాసనం.. కేసు విచారణ దశలో ఉన్నందున తాము ఇప్పుడు మెరిట్స్‌లోకి వెళ్లలేమని, సాక్ష్యాధారాలను ఇక్కడ పరిశీలించలేమని స్పష్టం చేసింది. పిటిషనర్ లేవనెత్తిన సమాన న్యాయం, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు, ఇతర సాంకేతిక అంశాలన్నీ ట్రయల్ కోర్టులోనే తేల్చుకోవాలని సూచించింది. ట్రయల్ కోర్టులో ఈ వాదనలను వినిపించుకునే స్వేచ్ఛ పిటిషనర్‌కు ఉందని పేర్కొంటూ విచారణను ముగించింది.

ఉద్యోగ విరమణ వయసుపై వివక్ష ఎందుకు?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, అమరావతి: వ్యవసాయశాఖ పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ, శ్రీవేంకటేశ్వర వెటర్నరీ, ఏపీ ఫిషరీస్, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీల్లో పనిచేస్తూ యూజీసీ వేతనాలు పొందుతున్న ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు పెంపు విషయంలో ప్రభుత్వ వివక్షను హైకోర్టు ప్రశ్నించింది. ఉన్నత విద్యాశాఖ పరిధిలోని విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును 62 నుంచి 65 సంవత్సరాలకు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈ వర్సిటీల్లో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును మాత్రం పెంచకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఎందుకు ఇలా వివక్ష చూపుతున్నారని ప్రశ్నించింది. ఉన్నత విద్యాశాఖ పరిధిలోని వర్సిటీల ప్రొఫెసర్లకు ఓ న్యాయం, మిగిలిన వర్సిటీల ప్రొఫెసర్లకు ఓ న్యాయమా? అంటూ నిలదీసింది. ఐఏఎస్ అధికారులకు పదవీ విరమణ చేసిన తరువాత కూడా పొడిగింపులు ఇస్తున్న ప్రభుత్వం.. అన్ని అర్హతలు ఉండి, యూజీసీ స్కేల్ తీసుకున్న ప్రొఫెసర్లకు మాత్రం పదవీ విరమణ వయసును ఎందుకు పెంచదని గట్టిగా ప్రశ్నించింది. పదవీ విరమణ వయస్సు పెంచాలని ఉద్యాన తదితర వర్సిటీలు సిఫార్సు చేస్తే, అలాంటి సిఫార్సులు ఏవీ రాలేదని ప్రభుత్వం చెప్పడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. అలాగే ఆర్థికశాఖ సైతం పదవీ విరమణ వయసు పెంపునకు అంగీకరించడం లేదని చెప్పడాన్ని కూడా ఆక్షేపించింది. కోర్టుకు తప్పుడు సమాచారం ఇవ్వొద్దంది. పదవీ విరమణ వయసు పెంపు విషయంలో వర్సిటీల సిఫార్సులను ఎందుకు తిరస్కరించారో, దీనివెనుక ఉన్న హేతుబద్ధత ఏమిటో స్వయంగా తమముందు హాజరై చెప్పాలని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్‌ను ఆదేశించింది. విచారణను ఈ నెల 23కి వాయిదా వేస్తూ.. న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

సింగిల్ జడ్జి తీర్పుపై అప్పీళ్లు..

ఉన్నత విద్యాశాఖ నియంత్రణలోని వర్సిటీల్లో బోధన సిబ్బంది పదవీ విరమణ వయసును పెంచిన ప్రభుత్వం వ్యవసాయ శాఖ పరిధిలోని వర్సిటీల్లో పనిచేస్తున్న తమ పదవీ విరమణ వయసు పెంచలేదని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన, శ్రీవేంకటేశ్వర వెటర్నరీ, ఏపీ ఫిషరీస్, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీల్లో పనిచేస్తున్న పలువురు ప్రొఫెసర్లు, డీన్లు, శాఖాధిపతులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి ఆ పిటిషన్లను కొట్టేశారు. పదవీ విరమణ వయసు పెంపు విధానపరమైన నిర్ణయమని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ నియంత్రణలో పనిచేస్తున్న వర్సిటీల బోధన సిబ్బంది పదవీ విరమణ వయసు పెంపు విషయంలో నాలుగునెలల్లో నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. తమ పిటిషన్లను కొట్టేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పిటిషనర్లు ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరుపుతున్న ధర్మాసనం తాజాగా సోమవారం మరోసారి విచారించింది.

ప్రభుత్వ అప్పు.. రూ.3,28,225 కోట్లు

7.53 శాతం వడ్డీతో మరో రూ.500 కోట్ల బడ్జెట్ అప్పు

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కార్ అప్పుల పరంపర కొనసాగుతోంది. రెండేళ్ల పాలన కాకుండానే బడ్జెట్ లోపల, బడ్జెట్ బయట చేసిన అప్పులు ఏకంగా రూ.3,28,225 కోట్లకు చేరాయి. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీల వేలం ద్వారా ఆర్‌బీఐ 7.53 శాతం వడ్డీతో రూ.500 కోట్ల అప్పును రాష్ట్ర ప్రభుత్వానికి సమీకరించి ఇచ్చింది. దీంతో బడ్జెట్ అప్పులే రూ.1,79,668 కోట్లకు చేరాయి. మరో వైపు బడ్జెట్ బయట అప్పులు రూ.1,48,557 కోట్లకు చేరాయి. ఇందులో వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వ గ్యారెంటీతో చేస్తున్న అప్పులు రూ.1,01,170 కోట్లు ఉండగా రాజధాని పేరుతో మరో రూ.47,387 కోట్ల అప్పులు చేశారు. ఎక్కడ దొరికితే అక్కడ అప్పులు చేయడమే లక్ష్యంగా చంద్రబాబు పాలన కొనసాగుతోంది. చేసిన అప్పులతో సూపర్ సిక్స్‌తోపాటు ప్రజలకిచ్చిన ఇతర హామీలు అమలు చేయడం లేదు. మరి ఇన్ని అప్పులు దేని కోసం చేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది.

హడ్కో రుణ వాయిదాల చెల్లింపునకు... మళ్లీ హడ్కో నుంచే అప్పు

ఒక చేతితో అప్పు తీసుకుని.. మరో చేతితో తిరిగి అదే సంస్థకు చెల్లింపు

- ఇదీ సీఎం చంద్రబాబు నాయుడు సర్కారు అప్పుల బాగోతం
- హడ్కో నుంచి ఏపీపీసీఎల్‌కు రూ.500 కోట్ల టెర్మ్ రుణం
- ఇందుకు లెటర్ ఆఫ్ కంఫర్ట్‌తోపాటు ప్రభుత్వ హామీ
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ విజయానంద్
- రూ.11,610 కోట్లకు చేరిన ఏపీపీసీఎల్ అప్పులు

సాక్షి, అమరావతి: అప్పులు చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం ఆరితేరిపోయింది. ఒక సంస్థ నుంచి తీసుకున్న అప్పు వాయిదాల చెల్లింపు కోసం మళ్లీ అదే సంస్థ వద్ద అప్పు చేస్తోంది. అంటే ఒక చేతితో అప్పు తీసుకుని... మరో చేతితో తిరిగి అదే సంస్థకు రుణ వాయిదాలను చెల్లిస్తోంది. హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హడ్కో) నుంచి ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీపీసీఎల్) అప్పు చేసింది. ఆ అప్పునకు చంద్రబాబు ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చింది. అయితే ఆ రుణ వాయిదాలను సకాలంలో చెల్లించేందుకు ఇప్పుడు మళ్లీ హడ్కో నుంచే ఏపీపీసీఎల్ రూ.500 కోట్లు టర్మ్ లోన్ తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. లెటర్ ఆఫ్ కంఫర్ట్‌ను జారీ చేయడంతోపాటు రూ.500 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. హడ్కో రుణ వాయిదాలను సకాలంలో తిరిగి చెల్లించేలా చూసేందుకు హడ్కో నుంచి ఏపీపీసీఎల్ రూ.500 కోట్ల టెర్మ్ రుణానికి అనుమతించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మొత్తం రుణ వ్యవధి కాలానికి ప్రభుత్వం గ్యారెంటీ ఉంటుందని, అసలు, వడ్డీకి గ్యారెంటీ వర్తిస్తుందని తెలిపారు. రుణం ఇచ్చిన సంస్థకు ఏపీపీసీఎల్ తిరిగి చెల్లించడంలో విఫలమైనప్పుడు ప్రభుత్వ గ్యారెంటీ అమల్లోకి వస్తుంది. గ్యారెంటీ ఇచ్చిన మొత్తంపై 2 శాతం గ్యారెంటీ కమీషన్ చెల్లించాలి. ఇప్పటికే హడ్కోతోపాటు వివిధ సంస్థలు, బ్యాంకుల నుంచి ఏపీపీసీఎల్ రూ.11,110 కోట్లు ప్రభుత్వ గ్యారెంటీతో అప్పులు చేసింది. ఇప్పుడు తీసుకునే రూ.500 కోట్ల రుణంతో కలిపి ఏపీపీసీఎల్ మొత్తం అప్పు రూ.11,610 కోట్లకు చేరింది.

బాబు సర్కార్‌పై పోరాటానికి సిద్ధం: సీపీఐ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: దుర్మార్గమైన పీపీపీ విధానం పేరుతో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుకు దోచిపెడుతున్న చంద్రబాబు సర్కార్‌పై పోరాటానికి సిద్ధమవుతున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు కె.రామకృష్ణ తెలిపారు. కాకినాడలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలకు మంగళవారం హాజరైన రామకృష్ణ మీడియాతో మాట్లాడారు. పేదలకు అవసరమైన వైద్యాన్ని ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. ప్రభుత్వమే అన్ని వసతులూ కల్పించి మరీ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడం ఎక్కడా చూడలేదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు, అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా తిరుమల లడ్డూ చుట్టూ చంద్రబాబు ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు.

23న ఓసీల హక్కులపై ఢిల్లీలో మహాధర్నా

సాక్షి, న్యూఢిల్లీ: ఓసీ కులాల స్థితిగతుల అధ్యయనానికి జాతీయ స్థాయిలో కమిషన్ ఏర్పాటు తదితర ప్రధాన డిమాండ్లతో ఈ నెల 23న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు ఓసీ సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ హక్కుల సాధన కోసం ఏళ్ల తరబడి పోరాడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో ప్రభుత్వాల తీరుకు నిరసనగా ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. అన్ని రంగాల్లో అగ్రకులాల వారికి జరుగుతున్న అన్యాయాన్ని ధర్నాలో ఎండగడతామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడి మృతి

- మరో టీచర్‌కు విరిగిన కాలు
- కొడికొండ–శిర జాతీయ రహదారిపై బైక్‌ను ఢీకొన్న కారు
- ఈ పాపం కూటమి సర్కారుదే అంటున్న ఎంటీఎస్ టీచర్లు
- సుదూర ప్రాంతాలకు బదిలీతో ప్రాణాలు ఫణంగా పెట్టాల్సి వస్తోందని ఆవేదన

పరిగి: శివరాత్రికి స్వగ్రామం వచ్చిన ఓ ఉపాధ్యాయుడు తిరిగి విధులకు వెళ్లే క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలో జరిగింది. వివరాల్లోకెళ్తే.. బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లికి చెందిన ఆదినారాయణ(47) గుడిబండ మండలం మోపురగుండు ప్రాథమిక పాఠశాలలో మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) టీచర్‌గా పనిచేస్తున్నారు. అలాగే అమడగూరు మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్‌కు చెందిన తుమ్మలప్ప అనే ఉపాధ్యాయుడు కూడా గుడిబండ మండలంలోని దిన్నేహట్టి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. వీరిద్దరూ గుడిబండలో ఓ గది అద్దెకు తీసుకుని విధులకు వెళ్తున్నారు. రెండో శనివారం, ఆదివారం, సోమవారం పాఠశాలకు సెలవు ఇవ్వడంతో ఇద్దరూ శనివారమే స్వగ్రామాలకు వచ్చారు. మంగళవారం ఉదయం ఇద్దరూ ద్విచక్ర వాహనంపై 150 కి.మీ దూరంలోని పాఠశాలలకు బయలుదేరారు. వీరి వాహనం పరిగి మండలంలోని ధనాపురం క్రాస్ వద్దకు రాగానే మడకశిర వైపు నుంచి ఎదురుగా వచ్చిన ఓ కారు బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఆదినారాయణ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, తుమ్మలప్పకు కాలు విరిగింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన తుమ్మలప్పను చికిత్స నిమిత్తం, ఆదినారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆదినారాయణ (ఫైల్)

టీడీపీ కూటమిదే ఈ పాపం..

బుచ్చయ్యగారిపల్లికి చెందిన ఆదినారాయణ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2021లో జరిగిన నియామకాల్లో ఎంటీఎస్ టీచర్‌గా నియమితులయ్యారు. అప్పట్లో తన స్వగ్రామం సరిహద్దు మండలమైన కదిరి ప్రాంతంలో పోస్టింగ్ ఇచ్చారు. అయితే, టీడీపీ కూటమి ప్రభుత్వంలో గత ఏడాది జూన్‌లో జరిగిన బదిలీల్లో ఆదినారాయణ, తుమ్మలప్పను 150 కి.మీ దూరంలోని పాఠశాలలకు బదిలీ చేశారు. ఇద్దరి సొంతూర్లు సుదూర ప్రాంతాలు కావడంతో వీరిపై ప్రయాణ భారం పడింది. ఈ క్రమంలో విధులకు హాజరవుతుండగా ప్రమాదం జరిగిందని, టీడీపీ కూటమి ప్రభుత్వం అన్యాయంగా ఓ ఉపాధ్యాయుడిని పొట్టన పెట్టుకుందని ఉపాధ్యాయ వర్గాలు మండిపడుతున్నాయి.

పని ఒత్తిడితో 50 మంది ఉద్యోగులు చనిపోయారు

- సచివాలయ ఉద్యోగుల ఆర్తనాదాలు వినిపించడం లేదా?
- మా సమస్యలు చెప్పుకొనేందుకు సీఎం, డిప్యూటీ సీఎం అవకాశం ఇవ్వడంలేదు
- అన్ని రూల్స్, భారాలు సచివాలయ ఉద్యోగులపైనే మోపుతున్నారు
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు మధుబాబు

సాక్షి, అమరావతి: నిరంతరం ఫీల్డ్ డ్యూటీలు, సమయ పరిమితులు లేకుండా విధులు నిర్వర్తించడం వల్ల తీవ్ర పని ఒత్తిడికి గురై ఇటీవల 50 మందికిపైగా ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ బూరాడ మధుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని, తమ ఆర్తనాదాలు ప్రభుత్వానికి వినిపించడంలేదా అని మధుబాబు మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఉద్యోగులు రాత్రి వరకు పనిచేసి తిరిగి ఇంటికి వెళుతూ ప్రమాదాలకు గురై చనిపోతున్నారని, వారి కుటుంబాలు దిక్కులేకుండా పోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇటువంటి ఘటనలు వరుసగా జరుగుతున్నా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. గత ఏడాది అక్టోబర్ 16న సచివాలయ ఉద్యోగ సంఘాల నాయకులతో జరిగిన చర్చల్లో 45 రోజుల్లో ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇస్తామని, ఆరేళ్లుగా ప్రమోషన్స్ లేని ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీమ్ వర్తింపజేస్తామని, సాంకేతిక పరికరాలు సమకూర్చడంతోపాటు సర్వే పనుల్లో ఒత్తిడి తగ్గిస్తామని, ఆర్థిక, ఆర్థికేతర అంశాలపై న్యాయం చేస్తామని చెప్పారని వివరించారు. కానీ, మూడు నెలలు గడిచినా ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు.

ఇంటింటి సర్వేలకు పంపిస్తారు.. మళ్లీ ఆఫీసుల్లో లేరంటారు..

తమ సమస్యలు వివరించేందుకు అవకాశం ఇవ్వాలని ఎన్నిసార్లు కోరినా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడంలేదని మధుబాబు తెలిపారు. ఇంటింటి సర్వేలు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఇస్తారని, దానిప్రకారం తాము ఫీల్డ్‌లో ఉండగా... మళ్లీ ఆఫీసుల్లో లేరని ప్రచారం చేస్తూ తమ మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సాంకేతిక పరికరాలు, అధికారిక మొబైల్స్, సపోర్ట్ సిస్టమ్ లేకుండా కేవలం లక్ష్యాలు, గడువులు, ఒత్తిడితో ఇబ్బంది పెట్టడం తమను తీవ్రమైన మానసిక క్షోభకు గురి చేస్తోందన్నారు. అన్ని రకాల నిబంధనలు, పనులు, భారాలు తమపైనే మోపుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణం మౌనం వీడి తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగుల ప్రాణాలకు భద్రత కల్పించాలని, తగిన గౌరవం ఇవ్వాలని, హక్కులు కాపాడాలని డిమాండ్ చేశారు.

జేఈఈ మెయిన్‌లో 'ఆదిత్య' ప్రతిభ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఈఈ మెయిన్ –2026 ఫలితాల్లో ఆదిత్య విద్యాసంస్థల విద్యార్థులు 41 మంది 99.0కు పైగా అత్యున్నత పర్సంటైల్స్ సాధించి ప్రతిభ చూపారని చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్.శ్రీసాయి వైభవ్ 99.99, వీఎస్ఎస్ రాఘవరావు 99.98, గంజి శ్రీరామ్ 99.98, బుడి శ్రీరామ్ 99.97, సత్యం భువనచంద్ర 99.96, అబ్దుల్ అదీన్ 99.95, ముత్తా శశిఅస్మిత 99.95, పి.విస్మయ 99.95, కె.వెంకట సూర్యచరణ్ 99.94, బలుసు సాయిలక్ష్మీ తన్మయ చౌదరి 99.92 పర్సంటైల్ సాధించారన్నారు.

శ్రీసాయివైభవ్

రాఘవరావు

గంజి శ్రీరామ్

బుడి శ్రీరామ్

● సీజన్

పరీక్షలు వస్తే...
పిల్లలు ఎలా ఉండాలో చెప్పడంతో పాటు
తల్లిదండ్రులు ఎలా ఉండాలో కూడా చెప్పాల్సి వస్తోంది.
ఇరు పక్షాలు బాగా వత్తిడి ఎదుర్కొక తప్పని సమయం ఇది.
చదువు ముఖ్యమే అయినా పిల్లల శక్తి, స్వభావం
గమనించుకుని తల్లిదండ్రులు తమను తాము
అర్థం చేసుకుని ప్రశాంత వాతావరణం నెలకొల్పాల్సిన
సమయం ఇదని అంటున్నారు నిపుణులు.

ఇల్లు ఎగ్జామ్ సెంటర్ కాదు

ఫిబ్రవరి వచ్చిందంటే పరీక్షల కాలం మొదలైనట్లే. ఏడాది మొత్తం చదివినదంతా ఈ పరీక్షల్లో రాసి, మంచి మార్కులు తెచ్చుకోవాలి. లేకపోతే అమ్మానాన్న ఏమనుకుంటారోనని పిల్లల టెన్షన్. అదే సమయంలో పిల్లలకు తక్కువ మార్కులు వస్తే ఇరుగూ పొరుగూ వారు ఏమనుకుంటారోనని తల్లిదండ్రులకు టెన్షన్. ఇంత టెన్షన్ అవసరమా? ఎగ్జామ్స్ వస్తే ఇళ్లు ప్రశాంతంగా ఉండటం మంచిదేగాని చీమ చిటుక్కుమంటే వినిపించే నిశ్శబ్దంతో 'పిల్లాడు చదువుకుంటున్నాడు. అరవకండి' అనే గుసగుసలతో విద్దూరంగా ఉండటం సమంజసమా? పరీక్షలు రాయాలి కాబట్టి పిల్లలకు టెన్షన్ ఉంటుంది. తల్లిదండ్రులు కూడా ఒత్తిడితో ఆరోగ్యం పాడుచేసుకోవాల్సిన అవసరం లేదని అంటున్నారు నిపుణులు.

తల్లులూ... జాగ్రత్త

పరీక్షల్లో మార్కులు బాగా రావాలని చాలా మంది విద్యార్థులు రాత్రిపూట చదువుకుంటూ ఉంటారు. పిల్లలు వద్దంటున్నా కొందరు పెద్దలు నిద్రమానేసి వారి పక్కనే కూర్చుంటారు. నిద్రపోకుండా టీ, కాఫీ వంటివి అందిస్తుంటారు. కలత నిద్రతోనే పొద్దున్న లేచి మళ్లీ అన్ని పనులు చేస్తుంటారు. ఈ నిద్రలేమి వారిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా రోజంతా ఇంటి పనులు చేసే తల్లులు రాత్రుళ్లు నిద్రపోకపోవడంతో అలసిపోయి అనారోగ్యం బారిన పడుతున్నారని అంటున్నారు. పరీక్షల వేళ పిల్లల ఆరోగ్యం ఎంత ముఖ్యమో తల్లి ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం.

తండ్రులూ... శాంతం

పిల్లలకు మంచి మార్కులు రావాలని తల్లిదండ్రులు కోరుకోవడం సహజం. అయితే కొందరు తండ్రులు తమ పిల్లలే ఫస్ట్ రావాలన్న పట్టుదలతో ఉంటారు. పరీక్షల సమయంలో పిల్లలకన్నా వీరే ఎక్కువ టెన్షన్ పడుతుంటారు. చదువుతున్న పిల్లల్ని గదమాయించడం, అన్నీ చదివావా అని మాటిమాటికీ అడగటం, కాసేపు పక్కన వెళ్లినా కసురుకోవడం, వేరేవాళ్లతో కలవనివ్వకుండా చదవమనడం వంటివి చేస్తుంటారు. పిల్లలు పరీక్ష సరిగ్గా రాస్తారా లేదా అన్న భయంతో బీపీ తెచ్చుకోవడం, కళ్లు తిరిగి పడిపోవడం వంటివీ జరుగుతుంటాయి. ఇవన్నీ చిన్నారుల మీద నెగెటివ్ ఎఫెక్ట్ చూపి, వారిని మరింత అభద్రతకు గురిచేస్తాయని నిపుణులు అంటున్నారు. దీనివల్ల అటు తల్లిదండ్రుల శారీరక ఆరోగ్యం దెబ్బతింటే, ఇటు విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి ఇబ్బంది కలుగుతుందని అంటున్నారు. కాబట్టి పరీక్షల వేళ శాంతం వహించి చదివించాలి.

ఇలా చేస్తే మేలు

పరీక్షల సమయంలో తల్లిదండ్రులు ఎంత ప్రశాంతంగా ఉంటే పిల్లలు అంత బాగా చదువుతారని నిపుణులు అంటున్నారు. 'చదువు..బాగా చదువు..చదవకపోతే జీవితం వేస్ట్' లాంటి మాటలు మాట్లాడకూడదంటున్నారు. ఏయే సబ్జెక్టుల్లో వారు ఇబ్బంది పడుతున్నారో కనుక్కొని అందులో వారి సందేహాలు తీర్చాలి. అవసరమైతే యూట్యూబ్ వీడియోలు చూసి తగిన అంశాలు రాసుకొని వారికి వివరించాలి. రోజంతా పుస్తకాలతో కుస్తీ పట్టాలని కోరకుండా కాసేపు పిల్లల్ని బయటకు పంపాలి. కంబైన్డ్ స్టడీ చేయాలని పిల్లలు కోరితే అందుకు సహకరించాలి. రాత్రిపూట భోజనం అయ్యాక ఒక పదిహేను నిమిషాల పాటు వారితో కలిసి వాకింగ్ చేయాలి. ఆ సమయంలో పరీక్షల గురించి వారితో చర్చించాలి. వారిలో ఉన్న భయాలు పోగొట్టాలి. పరీక్ష రాసి వచ్చాక వారిని ప్రశ్నలతో వేధించకుండా ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి.

ఈ ఆహారం బెటర్

పరీక్షల సమయంలో పిల్లలకు ఇవ్వాల్సిన ఆహారంపై తల్లిదండ్రులకు అనేక సందేహాలు ఉంటాయి. కొందరు ఆహారం విషయంలో కఠినంగా వ్యవహరిస్తే, మరికొందరు అమితంగా తినిపిస్తుంటారు. రెండూ సరికాదని నిపుణులు అంటున్నారు. పరీక్ష సమయంలో కాఫీ, టీ, బ్రెడ్ వంటివి మంచివి కాదని వైద్యులు అంటున్నారు. పోహ, ఉప్మా, అవకాడో పనీర్ టోస్ట్, పండ్లు, ఉడకబెట్టిన కూరగాయలు, మొలకెత్తిన గింజలు తినిపించడం మంచిదని అంటున్నారు. టిఫిన్లలో కిచిడీ, ఊతప్పం, ఇడ్లీసాంబార్ వంటివి మేలంటున్నారు. పిల్లలకు ఇష్టం లేకుండా బలవంతంగా ఆహారం పెట్టొద్దని, వారికి ఆకలి వేసినప్పుడు అడిగినంత మాత్రమే పెట్టాలంటున్నారు.

చిరాకు తెప్పిస్తే ఎలా?

పరీక్షలు వస్తే తల్లిదండ్రుల రోజువారీ కార్యక్రమాలు మారిపోతుంటాయి. పొద్దున్నే లేచి పిల్లల్ని లేపడం, వారిని చదువుకోమని చెప్పి పనులు చేసుకోవడం, ఎవరినీ ఇంటికి రానివ్వకుండా కట్టుదిట్టం చేయడం వంటివి చేస్తుంటారు. బయటకు వెళ్లాల్సిన పనులను వాయిదా వేసి 24 గంటలూ పిల్లల పక్కనే ఉంటారు. ఇదంతా వారు ప్రేమతో చేసినా పిల్లలపై చూపే అతి నియంత్రణ ఇబ్బందిగా మారుతుందని నిపుణులు అంటున్నారు. ఇలాంటివి చేయడం వల్ల పిల్లలకు తల్లిదండ్రుల మీద భయం, కోపం, చిరాకు పెరుగుతాయని అంటున్నారు.

● బ్యూటిప్స్

మొటిమల నివారణకు...

➡ టీ స్పూన్ తేనెలో పావు టీ స్పూన్ దాల్చిన చెక్క పొడి కలిపి, పడుకునే ముందు మొటిమలు ఉన్న చోట రాయాలి. ఉదయం గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఇలా రెండువారాల పాటు చేస్తే మొటిమలు తగ్గుతాయి.

➡ బొప్పాయి గుజ్జును ముఖానికి పట్టించి ఇరవై నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. తరచూ ఇలా చేయడం వల్ల మొటిమలు తగ్గి, చర్మం కాంతిమంతం అవుతుంది.

● నివాళి/ వేలూరి వేంకటేశ్వర రావు

అమెరికా తెలుగువారి ఆత్మీయుడు

ఫిబ్రవరి 7వ తేదీన వేలూరి వేంకటేశ్వర రావు అమెరికాలోని ఫీనిక్స్ నగరంలో చనిపోయారు. దాదాపు 40 ఏళ్ళకుపైగా కలిసి ఉండిన తెలుగు సాహితీ ప్రియులకు ముఖ్యంగా అమెరికాలో ఉన్నవారికి ఓ పెద్ద దిక్కు, ఓ గురుతుల్యుడు, ఓ ఆప్తుడు, ఓ అల్లరి మాటకారి దూరమయ్యారు. ఓ నిలువెత్తు సాహిత్య విగ్రహం, ప్రచురణలో లేని సాహిత్య కథనాలు, సుదీర్ఘ ప్రయాణ ముచ్చట్లు, అపరిమిత జిజ్ఞాస, ఇంకా మరెన్నో ఆయనతో పాటు నిష్క్రమించాయి.

వేలూరి గారంటే...

లింక్డిన్‌లో చూస్తే ఈయన ఓ చికాగో యూనివర్సిటీలో 25 ఏళ్ళు పని చేసిన భౌతిక శాస్త్రవేత్త అని తెలుసుకోవచ్చు. 1971లో అటామిక్, మాలిక్యులర్ విభాగంలో చేసిన పరిశోధనతో డాక్టరేట్ చేశారని తెలుసుకోవచ్చు. విశాఖపట్టణంలో మొదలైన భౌతికశాస్త్రంతో వృత్తిగా చివరంటా దాంతోనే ఉన్నారని తెలుస్తుంది. కానీ, ఆయనతో మూడు దశాబ్దాల పరిచయం ఉన్న నేను ఒక్కసారి కూడా ఆయనతో సైన్సు గురించిన మాట్లాడిన గుర్తు లేదు. ఆయన జీవనోపాధికి ఏం చేశాడో నాబోటి వాళ్ళకు పెద్దగా తెలీదు కానీ, మాకు తెలిసిన వేలూరి పూర్తిగా సైన్సుకు బయటివాడు.

వేలూరి స్నేహాలు

ఈయన ఎక్కడికి వెళ్తే అక్కడ ఓ స్నేహ బృందాన్ని తయారు చేసుకున్నారు. ముఖ్యంగా ఏలూరు కథలు వేలూరి గారే చెప్పాలి. వేల్చేరు నారాయణరావు, పెమ్మరాజు వేణుగోపాలరావు, పోణంగి రామకృష్ణారావు, సూర్యనారాయణ రాజు కొన్నిపేర్లు. దశాబ్దాలూ, సముద్రాలూ, సాహిత్య శిబిరాలన్నింటినీ దాటి సమాంతరంగా చివరంటా సాగిన స్నేహాలు అవి. యవ్వనంలో ఉండే అల్లరి, ఆవేశం, బేఖాతర్ జీవన శైలి నించి వైజ్ఞానికులుగా, పెద్దలుగా, గౌరవనీయులుగా ఎదిగి నిష్క్రమించే దాకా సాగిన స్నేహాలు ఇవి.

ఆయన విశాఖపట్టణం వెళ్ళాక అక్కడ స్నేహితులతో చేసిన 'కావ్య దహనోత్సవం' పేరుతో చేసిన అల్లరి బహుశా తెలుగు సాహిత్య చరిత్రలో నిలిచిపోయే ప్రహసనం. వేలూరి సంభాషణల్లో తరచూ దొర్లే కొన్ని విశాఖపట్నం పేర్లు బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, జ్యేష్ఠ, రత్నం, రావిశాస్త్రి, చేకూరి రామారావు. ఒరిస్సాలో ఉన్న రోజుల్లో ఒరియా సాహిత్యంతోనూ, కొంత బెంగాలీ సాహిత్యంతోనూ, సాహిత్యకారులతోనూ ఈయనకి అక్కడ పరిచయం లభించింది. ఎంతలా అంటే అయ్యో ఫలానా విషయం తెలుగులో లేదే అని బాధపడేంత.

> న్యూయార్కర్ లాంటి సాహిత్య పత్రిక ఉండాలనీ, 'ఈమాట' వెబ్ పత్రికని ఆ టెంప్లేట్లో రూపొందించాలనీ ఆయన చాలా కృషి చేశారు. సైన్సు పేపర్లకి ముందు ఉండే పియర్ రివ్యూ లాంటి పద్ధతి సాహిత్యానికి కూడా ఉండాలని ఆయన స్థిరాభిప్రాయం. నృత్యం చేసేవాడూ, పెయింటింగ్ వేసేవాడూ, పాట పాడేవాడూ ఏదో ఒకటి నేర్చుకుని, బోల్డెంత ప్రాక్టీస్ చేస్తారు. రచయితకి మాత్రం ఎందుకు అలాంటి శిక్షణ, క్రమశిక్షణ లేదు అనేది ఆయన ప్రశ్న.

ఆయన అమెరికా చేరిన తర్వాత ఇంటర్నెట్ రాక ముందు నుంచే చేతిరాతలతోనూ, డయల్ ఫోన్లతోనూ పరిచయాలని నెరిపి దాదాపు మొదటి తరం తెలుగు సాహిత్యానికీ, సాహిత్య స్నేహాలకీ పునాది వేశారు. నేను 1996, 1997 ప్రాంతాల్లో ఈ సమూహాల్లో ప్రవేశం మొదలెట్టేటప్పటికే ఈయన పరుచూరి శ్రీనివాస్, జంపాల చౌదరి, సురేష్ కొలిచాల, చంద్ర కన్నెగంటి, రామారావు కన్నెగంటి, పాణిని శంఖవరం వంటి వాళ్ళచే పెద్దవారిగా, గురుస్థానంలో ఉన్నారు. ఆయనతో విభేదించినా, గొడవపడ్డా, వాదించినా, సలహా అడిగినా అవన్నీ ఆయన్ని గురుస్థానంలో ఉంచే జరిగేవి అని నా అభిప్రాయం. ఇప్పటికీ పబ్లిక్‌గా ఉన్న రచ్చబండ, తెలుసా ఇంటర్నెట్ గ్రూపుల పాతపోస్టులనీ, చర్చలనీ చూస్తే ఈ సంగతి అర్థమవుతుంది.

'తెలుగు డయాస్పోరా' అన్న మాటని మొదట తీసుకు వచ్చింది వేలూరి అని అంటారు. ఆ డయాస్పోరా అన్నా, డయాస్పోరా సాహిత్యం అన్నా ఏమిటి అనే నిర్వచనాలని స్పష్టంగా ఆయన చెప్పారు.

వేలూరికి మనుషులు కావాలి!

వేలూరి ఈ ప్రపంచాన్ని వదిలే సమయానికి ఆయన్ని స్నేహితుడిగా చెప్పుకునే వాళ్ళ వయసులు 15 నించి 100 దాకా ఉంటాయని నా నమ్మకం. మనకి ఓపిక ఉండాలి గానీ ఆయన మాట్లాడుతూనే ఉండగలడు. తిలక్, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, రావిశాస్త్రులూ మా ఫ్రెండ్‌కి ఫ్రెండే అనేంత దగ్గరగా తీసుకురాగలడు.

వేలూరి మంచి హోస్టు. మన ఇండియా, తెలుగు భోజనలకి ఎలాంటి వైన్ పక్కన ఉండాలో చెప్పినవాళ్ళు లేరు. పెసరట్టుకి ఎలాంటి వైన్, గోంగూర పచ్చడి అన్నం పక్కన ఎలాంటి వైన్ లాంటివి మనం అడగాలేగానీ ఆయన చెప్పేస్తారు. ఇప్పుడనిపిస్తోంది ఎందుకు మేమెవ్వరం ఆయన్ని ఈ విషయాల మీద రాయమని అడగలేదా అని!

కానీం ఆయన నాలుక ఎంత పదునంటే ఏదో ఒకటి సడెన్‌గా కోపమొచ్చేలా అంటారు. ఆ నిర్మొహమాటమే ఆయనకి బలం, బలహీనత. మొదట్లో ఉడుక్కునేవాణ్ణి. కానీ ఆయనకి ఎలా సముదాయించాలో కూడా తెలుసు.

ఈ వ్యాసాన్ని పూర్తిగా వేలూరి అనే ఓ వ్యక్తి పరిచయంగా జ్ఞాపకాల్లోంచి రాద్దామని మొదలెట్టినా, చివరి పేరా వచ్చేసరికి కళ్ళు చెమరుస్తున్నాయి. వేలూరి నాకు తెలుసు అని చెప్పుకోవడం గొప్ప మర్యాద. ఆయన ఇప్పుడు లేరు అని గుర్తుంచుకుని బాధ పడాలని లేదు. ఆయన జీవితాన్ని ఎంతలా సెలబ్రేట్ చేసుకోగలమూ, ఎలాంటి పాఠాల్ని నేర్చుగోగలమూ అన్నదే ప్రశ్న.

- అక్కిరాజు భట్టిప్రోలు, రచయిత

సాక్షి సినిమా

● ప్రియాభవానీ, ఆది, నిక్కీ

థ్రిల్ స్టార్ట్

ఆది పినిశెట్టి హీరోగా నటించిన హిట్ మూవీ 'మరకతమణి' (2017)కి సీక్వెల్‌గా 'మరకతమణి 2' సినిమా ఆరంభమైంది. ఈ చిత్రంలో ఆది పినిశెట్టి, సత్యరాజ్, ప్రియా భవానీ శంకర్, నిక్కీ గల్రానీ పినిశెట్టి, మునిష్కాంత్, ఆనందరాజ్, డానీ, అరుణ్‌రాజా కామరాజ్, మురుగానందం కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'మరకతమణి'కి దర్శకత్వం వహించిన ఏఆర్‌కే శరవణ్ దర్శకత్వం వహిస్తున్నారు. సుధన్ సుందరం, మనీష్ సింఘాల్, దుర్గారం చౌదరి, దేవ్ – కేవీ దురై నిర్మిస్తున్నారు. చెన్నైలో జరిగిన ఈ చిత్రం ప్రారంభోత్సవానికి హీరో కార్తీ అతిథిగా హాజరై, క్లాప్ కొట్టగా, హీరో ఆర్య, దర్శకుడు వెంకట్ ప్రభు 'కెమెరా రోలింగ్, యాక్షన్' అంటూ షూటింగ్ ఆరంభించారు. ''మరకతమణి 2' చిత్రం ప్రేక్షకులకు మరింత వినోదం, మ్యాజిక్, థ్రిల్లింగ్ అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ధిబు నినాన్ థామస్, కెమెరా: పీవీ శంకర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మోహన్ .పి.

● నాని

షేర్ రెడీ

'దసరా' (2023) వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'ది ప్యారడైజ్'. మంచు మోహన్‌బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా ఆగస్టు 21 ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నెల 24న నాని పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాలోని 'ఆయా షేర్' అంటూ సాగే తొలి పాటను విడుదల చేయడానికి టీమ్ రెడీ అవుతోంది. ''ది ప్యారడైజ్' టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ లుక్ పోస్టర్లు మూవీపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. మా సినిమాకి అనిరుధ్ రవిచందర్ చక్కని సంగీతం అందించారు. 'ఆయా షేర్' పాటని సుధన్ మాస్టర్ కొరియోగ్రఫీలో వందలాది మంది డ్యాన్సర్లతో నానిపై భారీ సెట్లో చిత్రీకరించాం. ఈ సాంగ్ నాని ఫ్యాన్స్‌కు బర్త్‌డే ట్రీట్‌లా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ, స్పానిష్, ఇంగ్లిష్ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమాకి కెమెరా: సీహెచ్ సాయి.

● అల్లు అర్జున్

● కావేరి బారువా

అల్లు అర్జున్‌పై వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నాను

- బ్రాండ్ స్ట్రాటజర్ కావేరి బారువా

''దక్షిణాది స్టార్ హీరో అల్లు అర్జున్‌తో ఓ యాడ్ షూటింగ్‌లో పాల్గొన్నాను. ఆయన్ను కలవడం అంత సులభం కాదు. హీరోకు షేక్‌హ్యాండ్ ఇవ్వొద్దు. తగిన దూరం పాటించాలి. హీరో సెట్‌లో ఉండగా ఫోన్ వినియోగించకూడదు... అంటూ ఆయన టీమ్ 42 నిబంధనలతో కూడిన ఓ జాబితాను ఇస్తుంది. ఈ విషయంలో ఆయన మేనేజర్లు, సిబ్బంది చాలా కఠినంగా ఉంటారు'' అంటూ బాలీవుడ్ బ్రాండ్ స్ట్రాటజర్ కావేరి బారువా ఇటీవల ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. ఆమె మాటలు ఇటు ఇండస్ట్రీలో అటు అల్లు అర్జున్ అభిమానుల్లో పెద్ద దుమారాన్నే రేపాయి. కావేరి వ్యాఖ్యలపై అల్లు అర్జున్ టీమ్ స్పందించి, ''కావేరి బారువా మాటల్లో ఎలాంటి నిజం లేదు... అల్లు అర్జున్‌గారు ఎలాంటి నిబంధనలు విధించరు. అందరితో స్నేహంగా, అభిమానంగా ఉంటారు'' అంటూ ఓ ప్రకటన విడుదల చేసిన సంగతి కూడా తెలిసిందే. అల్లు అర్జున్‌పై తాను చేసిన వ్యాఖ్యలు వాస్తవం కాదని, క్షమాపణలు చెబుతూ తాజాగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా ఓ ప్రకటన విడుదల చేశారు కావేరి బారువా. ''గత కొన్ని రోజులుగా నా పాడ్‌కాస్ట్‌కు సంబంధించిన ఓ వీడియో సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్ అవుతోంది. ఆ పాడ్‌కాస్ట్‌లో నేను కొన్ని విషయాల గురించి మాట్లాడాను. అల్లు అర్జున్‌ను కలిసినప్పుడు చేయాల్సినవి.. చేయకూడనివి అంటూ 42 నిబంధనలు ఉంటాయని అన్నాను. ఇలా అనడం సరైనది కాదని మరోసారి స్పష్టం చేస్తున్నాను. ఏం చేయాలి? ఏం చేయకూడదు? అనే నిబంధనలకు సంబంధించి ధ్రువీకరించని పత్రాలు నా దగ్గర లేకుండా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదు. అల్లు అర్జున్‌గారు లేదా ఆయన టీమ్ నుండి '42 డూస్ అండ్ డోంట్స్' లిస్ట్ అందలేదు. పాడ్‌కాస్ట్‌లో నా మాటలు అలా దొర్లిపోయాయి. అవి వాస్తవం కాదని గుర్తించాలి. ఇలా మాట్లాడటం వల్ల ఆ కథానాయకుడి గౌరవ, ప్రతిష్ఠకు భంగం వాటిల్లినట్లు తెలిసింది. వాస్తవాలను సరి చూసుకోకుండా, ఎలాంటి ఆధారాలు లేకుండా నేను చేసిన ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నాను. నా వల్ల కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాను'' అని కావేరి బారువా ప్రకటించారు. అదే విధంగా కావేరి బారువా ఇంటర్వ్యూను ప్రసారం చేసిన పాడ్‌కాస్టర్ స్వీకృతి కూడా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ''కావేరి బారువా ఆరోపణల్లో నిజానిజాలు తెలుసుకోకుండా వీడియోను పోస్ట్ చేసినందుకు చింతిస్తున్నాం. ఇప్పటికే ఆ వివాదాస్పద వీడియోను యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ నుండి తొలగించాం. ఈ విషయంలో మా టీమ్ సభ్యులను వేధించడం ఆపాలని విజ్ఞప్తి చేస్తున్నాను'' అని ఆమె కోరారు.

క్లైమాక్స్ చూసి కన్నీళ్లు పెట్టుకుంటారు

- విజయ్ ఆంటోని

అజయ్ ధీషన్, ధనుషా హీరో హీరోయిన్లుగా గణేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బూకీ'. విజయ్ ఆంటోనీ సమర్పణలో శర్వంత్ రామ్ క్రియేషన్స్ పతాకంపై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. సునీల్, లక్ష్మి మంచు కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇప్పటికే తమిళంలో విడుదలైంది. తెలుగులో ఈ నెల 20న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మంచు లక్ష్మి మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో ఓ ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్ చేశాను. ఇది యూనివర్సల్‌గా కనెక్ట్ అయ్యే యూత్‌ఫుల్ సినిమా'' అన్నారు. ఈ సినిమా సమర్పకుడు, సంగీత దర్శకుడు విజయ్ ఆంటోని మాట్లాడుతూ– ''తెలుగు ప్రేక్షకులు మంచి టాలెంట్‌ను ప్రోత్సహిస్తారు. 'మార్గన్' సినిమాతో నటుడిగా అజయ్ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈ 'బూకీ'లోనూ అజయ్ నటన ఆడియన్స్‌ను అలరిస్తుంది. లక్ష్మి, సునీల్‌గార్లు అదిరిపోయే పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. ఈ సినిమా క్లైమాక్స్ చూసినప్పుడు ఆడియన్స్‌కు కన్నీళ్లు వస్తాయి. సురేష్ ప్రొడక్షన్స్, నిర్మాత రామ్‌లతో ఇకముందు కూడా మా అసోసియేషన్ కొనసాగుతుంది'' అన్నారు. ''హీరోగా నేను చేసిన తొలి సినిమా ఇది'' అని చెప్పారు అజయ్. ''నేను తమిళ్ అబ్బాయిని. కానీ విజయవాడ అమ్మాయిని పెళ్లి చేసుకున్నాను. ఇక ఈ సినిమాలో మంచి సర్‌ప్రైజ్ ఉంది'' అని చెప్పారు గణేష్ చంద్ర. రచయిత భాష్యశ్రీ మాట్లాడారు.



● గణేష్ చంద్ర, విజయ్ ఆంటోనీ, లక్ష్మి, ధనుషా, అజయ్

ఆ లుక్ చూసి విలన్‌గా చాన్స్ ఇచ్చారు

- సుహాస్



''నటీనటుల కెరీర్‌లో ఎత్తు పల్లాలనేవి సాధారణం. అయితే ఇన్నేళ్ల నా కెరీర్ పట్ల పూర్తి సంతృప్తిగా ఉన్నాను. 'హే బల్‌వంత్' సినిమా హిట్ అయితే ఆ సంతృప్తి ఇంకా పెరుగుతుంది. యూనిట్ అంతా మూవీ మీద పూర్తి నమ్మకంగా ఉన్నాం. ఈ సినిమాని నా భార్య చూసి ఫుల్‌గా ఎంజాయ్ చేసింది. ఇలాంటి సినిమాలు కదా నువ్వు చేయాల్సిందని చెప్పింది. ప్రేక్షకులు కూడా మా సినిమాని బాగా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు సుహాస్. గోపీ అచ్చర దర్శకత్వంలో సుహాస్, శివానీ నాగారం జోడీగా నటించిన చిత్రం 'హే బల్‌వంత్'. బి. నరేంద్ర రెడ్డి నిర్మించిన ఈ మూవీని బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ నెల 20న విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సుహాస్ విలేకరులతో మాట్లాడుతూ– ''భగవాన్ అంటే భగవంతుడు అనే అర్థం వస్తుంది కాబట్టి.. 'హే భగవాన్' టైటిల్‌ని మార్చమని సెన్సార్ వారు సూచించడంతో 'హే బల్‌వంత్'గా మార్చాం. చిన్నప్పటి నుంచి బిజినెస్ చేయాలని ఆలోచించే కుర్రాడు తండ్రి వ్యాపారాన్ని టేకప్ చేయాలనుకుంటాడు. అప్పుడు అతనికి ఎదురైన పరిణామాలు ఏంటి? అసలు తండ్రి వ్యాపారం ఏంటి? అనే కథాంశంతో ఈ సినిమా పూర్తి ఎంటర్‌టైన్‌మెంట్‌గా సాగుతుంది. గోపీ అచ్చర చెప్పిన ఈ సినిమా కథ వినగానే నచ్చింది. ముఖ్యంగా ఎంటర్‌టైమెంట్‌తో పాటు ఎమోషన్‌కి కనెక్ట్ అయ్యాను. నరేంద్ర రెడ్డిగారు గ్రాండ్‌గా నిర్మించారు. వంశీ నందిపాటిగారు, బన్నీ వాసుగారు మాకు, ఈ సినిమాకు ధైర్యం ఇస్తున్నారు. 'హే బల్‌వంత్' చూసిన ప్రేక్షకులు.. వినోదం, భావోద్వేగాలతో కూడిన ఓ మంచి సినిమా చూశామనే అనుభూతితో బయటికొస్తారు. 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' మూవీలో నా లుక్ చూసి, తమిళ సినిమా 'మండాడి'లో మెయిన్ విలన్‌గా చాన్స్ ఇచ్చారు. కార్తీక్ సుబ్బరాజుగారి బ్యానర్‌లో ఓ సినిమా చేస్తున్నాను. తెలుగులో కొన్ని కథలు వింటున్నాను'' అన్నారు.

> ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ప్రస్తుతం యానిమేషన్ చిత్రాల జోరు సాగుతోంది. అందుకు నిదర్శనం అరడజనుకు పైగా నిర్మాణంలో ఉన్న యానిమేషన్ సినిమాలే. ఆ చిత్రాల విశేషాలు నేటి 'సాక్షి ప్లస్' సినిమా ఈ పేపర్‌లో...

భయంకరమైన చీకటి కథ

● 'ది కేరళ స్టోరీ 2' పోస్టర్

అదా శర్మ, సిద్ధీ ఇద్నానీ, యోగితా బిహానీ, సోనియా బలానీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది కేరళ స్టోరీ'. సుదీప్తో సేన్ దర్శకత్వం వహించిన ఈ మూవీ 2023 మే 5న విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాకి సీక్వెల్‌గా రూపొందిన తాజా చిత్రం 'ది కేరళ స్టోరీ 2'. కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించారు. ఉల్కా గుప్తా, అదితీ భాటియా, ఐశ్వర్య ఓజా కీలక పాత్రలు పోషించారు. విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ మూవీ ట్రైలర్‌ని విడుదల చేశారు. ''ది కేరళ స్టోరీ 2' మరింత భయంకరమైన చీకటి కథను వెలుగులోకి తెస్తుంది'' అని యూనిట్ తెలిపింది.

సైలెంట్ హిట్



● అనురాధ, శ్రేయాసి, సామిత్, మాధురి, సాయి కె. వెన్నం

''ఈ వాలెంటైన్స్ డేకి విడుదలైన 'నిలవే' డీసెంట్ కలెక్షన్స్‌తో సైలెంట్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమా హీరో హీరోయిన్లు భవిష్యత్తులో కచ్చితంగా సూపర్ స్టార్స్ అవుతారు'' అని డైరెక్టర్ వి. సముద్ర పేర్కొన్నారు. సామిత్ పోలాడి హీరోగా నటించి, సాయి కె. వెన్నంతో కలిసి దర్శకత్వం వహించిన చిత్రం 'నిలవే'. శ్రేయాసీ సేన్ హీరోయిన్. హర్ష చెముడు, సుప్రియా ఐసోలా మరో జంటగా నటించారు. రాజ్ అల్లాడ, గిరిధర్ రావు పోలాడి, సాయి కె. వెన్నం నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదలైంది. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో సామిత్ పోలాడి మాట్లాడుతూ– ''మా 'నిలవే'కి ప్రేక్షకుల నుంచి వస్తోన్న రెస్పాన్స్ చూస్తుంటే హ్యాపీగా ఉంది'' అని చెప్పారు. ''టీమ్ అందరి సపోర్ట్‌తోనే ఈ సక్సెస్ వచ్చింది'' అన్నారు సాయి కె. వెన్నం. ''ఇందులో నటించిన వారు కొత్తవారైనా బాగా నటించారు'' అని రాజ్ అల్లాడ చెప్పారు.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	174	83,451
నిఫ్టీ ▲	43	25,725

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,498	▽	49
డోజోన్స్	49,556	▲	55
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,545	▲	71
డాక్స్	25,044	▲	243
షాంఘై	4,082	▽	52
నికాయ్	56,566	▽	240

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	90.30	91.32
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.10	108.95
€	యూరో	ఎస్‌బీఐ	105.38	109.41
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	48.00	61.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	61.73	65.63
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	69.47	73.23
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23. 27	24.78
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.79	25.05
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.24	14.07

కోడ్ నుంచి క్లౌడ్ వరకు..
ఆంత్రోపిక్‌తో ఇన్ఫోసిస్ జట్టు

- టెక్ మార్కెట్లో టర్నింగ్ పాయింట్
- తయారీ, టెలికం రంగాలకు ఏఐ సొల్యూషన్స్ అభివృద్ధి

న్యూఢిల్లీ: దేశీయంగా టెలికం, ఆర్థిక సేవలు, తయారీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ తదితర రంగ సంస్థల కోసం ఎంటర్‌ప్రైజ్ ఏఐ సొల్యూషన్స్‌ని రూపొందించేందుకు, వినియోగంలోకి తెచ్చేందుకు అమెరికన్ ఏఐ సంచలనం ఆంత్రోపిక్‌తో దేశీ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీని కింద క్లాడ్ కోడ్ సహా ఆంత్రోపిక్ క్లాడ్ మోడల్స్‌ని ఇన్ఫోసిస్‌కి చెందిన టొపాజ్ ఏఐ సొల్యూషన్స్‌తో అనుసంధానం చేస్తారు. అలాగే టెలికం రంగ అవసరాల కోసం ఏఐ ఏజెంట్లను తయారు చేసేందుకు ప్రత్యేక ఆంత్రోపిక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని ఏర్పాటు చేయనున్నట్లు, తదుపరి ఇతర నియంత్రిత రంగాల్లోకి కూడా విస్తరించనున్నట్లు ఇన్ఫోసిస్ తెలిపింది. క్లెయిమ్స్ ప్రాసెసింగ్, కాంప్లయెన్స్ సమీక్షలు, కోడ్ జనరేషన్, టెస్టింగ్‌లాంటి బహుళ దశలు ఉండే

పనులను స్వతంత్రంగా హ్యాండిల్ చేయగలిగే ఏజెంటిక్ ఏఐ సిస్టమ్‌లను రూపొందించడంపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు సీఈవో సలిల్ పరేఖ్ చెప్పారు. వివిధ రంగాల్లో అపార అనుభవం ఉన్న ఇన్ఫీ డెవలపర్లు ఇప్పటికే తమ క్లాడ్ కోడ్‌ని ఉపయోగిస్తున్నట్లు ఆంత్రోపిక్ సీఈవో డేరియో తెలిపారు.

భారత్‌లో ఆంత్రోపిక్ కార్యాలయం

ఆంత్రోపిక్ దేశీయంగా బెంగళూరులో తమ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించింది. ఆసియాలో టోక్యో తర్వాత కంపెనీకి ఇది రెండో ఆఫీసు. తమ క్లాడ్.ఏఐ సొల్యూషన్‌కి భారత్ రెండో అతి పెద్ద మార్కెట్ అని కంపెనీ ఇండియా ఎండీ ఇరినా ఘోష్ తెలిపారు. 2025 అక్టోబర్‌లో విస్తరణను ప్రకటించినప్పటి నుంచి భారత్‌లో తమ ఆదాయ వృద్ధి వేగం రెట్టింపయ్యిందని వివరించారు. వివిధ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు స్థానికంగా రిక్రూట్ చేసుకోనున్నట్లు వివరించారు. విద్య, వ్యవసాయం తదితర రంగాల్లో సంస్థలతో భాగస్వామ్యాలను కుదుర్చుకుంటున్నట్లు చెప్పారు.

ఆంత్రోపిక్‌తో భాగస్వామ్యం వార్తల నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేరు మంగళవారం దాదాపు రెండు శాతం లాభపడింది. బీఎస్‌ఈలో 1.83 శాతం లాభపడి రూ. 1,391.20 వద్ద క్లోజయ్యింది.

ఓపెన్‌ఏఐతో ఎటర్నల్ చెట్టాపట్టాల్

వివిధ విభాగాలవ్యాప్తంగా కృత్రిమ మేధ(ఏఐ) వినియోగాన్ని పెంచుకునే దిశగా ఓపెన్‌ఏఐతో భాగస్వామ్య పరిధిని మరింతగా విస్తరించినట్లు ఎటర్నల్ వెల్లడించింది. దీని ప్రకారం జొమాటో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, హైపర్‌ప్యూర్‌తో పాటు తమ భాగస్వామ్య ప్లాట్‌ఫాంలు, అంతర్గత వ్యవస్థల్లో ఏఐ వాడకాన్ని పెంచనుంది. కస్టమర్లు, భాగస్వాములు తమ ప్లాట్‌ఫాంలను మరింత మెరుగ్గా ఉపయోగించుకునేందుకు వీలు కల్పించే కొత్త మార్గాలను ఆవిష్కరించేందుకు ఓపెన్‌ఏఐకి చెందిన ఎంటర్‌ప్రైజ్ ఏపీఐ ప్లాట్‌ఫాంతో కలిసి ఎటర్నల్ పని చేయనుంది. అంతర్గతంగా తమ ఆటోమేషన్ ప్లాట్‌ఫాం స్టిచ్‌తో జీపీటీ–5.3–కోడెక్స్‌లాంటి లేటెస్ట్ కోడింగ్ మోడల్స్‌ని అనుసంధానం చేయడంపై దృష్టి పెట్టనుంది.

ఒక్క చార్జ్ 543 కి.మీ. రేంజ్

- ఈవీ సెగ్మెంట్లోకి మారుతీ మాస్ ఎంట్రీ
- ప్రారంభ ధర రూ. 10.99 లక్షలు

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల సెగ్మెంట్లోకి లాంఛనంగా ప్రవేశించింది. తమ తొలి బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనం ఈ–విటారాను ఆవిష్కరించింది. బ్యాటరీ యాజ్ ఎ సర్వీస్ (బీఏఏఎస్) ఓనర్‌షిప్ ప్లాన్ కింద దీని ధర రూ. 10.99 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. బ్యాటరీ యూసేజీ చార్జీ కిలోమీటరుకు రూ. 3.99 చొప్పున ఉంటుంది. 61కేడబ్ల్యూహెచ్, 49కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్ ఆప్షన్లతో లభించే ఈ–విటారా 543 కి.మీ. వరకు రేంజినిస్తుంది. తొలి నాళ్లలో తీసుకున్నవారికి మారుతీ సుజుకీ డీలర్ లొకేషన్లలో ఏడాది పాటు చార్జింగ్ కాంప్లిమెంటరీగా లభిస్తుంది. అలాగే 3 ఏళ్ల ఓనర్‌షిప్ ప్లాన్‌తో 60 శాతం విలువ వరకు అష్యూర్డ్ బైబ్యాక్ ఆప్షన్ ఉంటుంది. ఈ–విటారా యజమానులు కాంప్లిమెంటరీగా 7.4 కేడబ్ల్యూ ఏసీ వాల్ బాక్స్ చార్జర్‌తో పాటు ఇన్‌స్టాలేషన్ ఉచితంగా పొందవచ్చు. మార్చి 31 వరకు ఈ ప్రారంభ ఆఫర్ అందుబాటులో ఉంటుందని సంస్థ తెలిపింది. రూ. 21,000తో కస్టమర్లు దీన్ని బుక్ చేసుకోవచ్చని వివరించింది.

పటిష్టమైన వ్యవస్థ..: దీన్ని మార్కెట్లో ప్రవేశపెట్టడానికి ముందుగా ఈవీల వినియోగంలో ఎదురవుతున్న అవరోధాలను తొలగించే వ్యవస్థలను పటిష్టంగా తీర్చిదిద్దడంపై దృష్టి పెట్టినట్లు మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు. పబ్లిక్ చార్జింగ్ మౌలిక సదుపాయాలు, ఆఫ్టర్ సేల్స్..సర్వీస్ నెట్‌వర్క్ మొదలైన విషయాలన్నీ పరిగణనలోకి తీసుకున్నట్లు బెనర్జీ పేర్కొన్నారు.

నభా పవర్ కొత్త ఓనర్.. టొరెంట్‌పవర్

- ఎల్ అండ్ టీతో ఒప్పందం
- 100 శాతం వాటా కొనుగోలు
- డీల్ విలువ రూ. 6,889 కోట్లు

ముంబై: ప్రైవేట్ రంగ కంపెనీ టొరెంట్ పవర్ తాజాగా డైవర్సిఫైడ్ దిగ్గజం ఎల్‌అండ్‌టీ నుంచి నభా పవర్‌ను కొనుగోలు చేయనుంది. ఇందుకు ఎల్ అండ్ టీ సొంత అనుబంధ సంస్థ ఎల్ అండ్ టీ పవర్ డెవలప్‌మెంట్‌తో తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీనిలో భాగంగా నభా పవర్‌లో 100 శాతం వాటాసహా మార్పిడికి వీలయ్యే సెక్యూరిటీలను రూ. 6,889 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో సొంతం చేసుకోనుంది. పూర్తిగా కాంట్రాక్టు కలిగిన థర్మల్ పవర్ ప్లాంటును నభా కలిగి ఉంది. గతేడాది(2024–25) రూ. 4,866 కోట్ల ఆదాయం, రూ. 1,153 కోట్ల నిర్వహణ లాభం సాధించింది. జపనీస్ సాంకేతికతతో ఏర్పాటు చేసిన సూపర్ క్రిటికల్ బొగ్గు ఆధారిత(థర్మల్) విద్యుత్ ప్లాంటును నిర్వహిస్తోంది. పంజాబ్‌లోని రాజ్‌పురాలో 700 మెగావాట్ల సామర్థ్యంగల రెండు యూనిట్లతో కలిపి ఈ ప్లాంటు 1,400 మెగావాట్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2014లో కార్యకలాపాలు ప్రారంభమైన ప్లాంటు 25 ఏళ్ల కాలానికి ప్రభుత్వంతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని(పీపీఏ) కుదుర్చుకుంది. బొగ్గు సరఫరాలకు ఎస్ఈసీఎల్, ఎన్‌సీఎల్‌తో ఇంధన సరఫరా ఒప్పందాలను(ఎఫ్ఎస్ఏలు) కలిగి ఉంది. ఈ కొనుగోలు తదుపరి టొరెంట్ పవర్ విద్యుదుత్పత్తి సామర్థ్యం ప్రస్తుత 5 గిగావాట్ల నుంచి 6.4 గిగావాట్లకు బలపడనుంది. అంతేకాకుండా అత్యధిక వృద్ధికి వీలున్న ఉత్తరాది మార్కెట్లలో ప్రవేశించేందుకు వీలు చిక్కనుంది.

ఆదుకున్న బ్యాంకులు

రెండో రోజూ లాభాలు

- సెన్సెక్స్ 174 పాయింట్లు అప్

ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఐటీ, క్యాపిటల్ గూడ్స్ షేర్లు రాణించడంతో దేశీయ స్టాక్ మార్కెట్ రెండో రోజూ లాభంతో ముగిసింది. సెన్సెక్స్ 174 పాయింట్లు పెరిగి 83,451 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 43 పాయింట్లు బలపడి 25,725 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ఆద్యంతం లాభ నష్టాల మధ్య ఊగిసలాడాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 611 పాయింట్ల పరిధిలో 82,987 – 83,598 శ్రేణిలో ట్రేడైంది. నిఫ్టీ 25,570 వద్ద కనిష్టాన్ని, 25,764 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. ఇన్వెస్టర్ల సంపద భావించే బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.1.52 లక్షల కోట్లు పెరిగి రూ.470.11 లక్షల కోట్లకు చేరింది. లూనార్ కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా చైనా, దక్షిణ

కొరియా, హాంగ్‌కాంగ్, తైవాన్, సింగపూర్ మార్కెట్లు పనిచేయలేదు. జపాన్ ఇండెక్సు 0.50% నష్టపోయింది. ఆరంభ నష్టాలు భర్తీ చేసుకున్న యూరప్ మార్కెట్లు స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. అమెరికా స్టాక్ సూచీలు స్వల్ప నష్టాలతో ట్రేడవుతున్నాయి.

- బీఎస్‌ఈ రంగాల వారీ ఇండెక్సుల్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల సూచీ 2.36% పెరిగింది. ఐటీ 1.15%, ఇండస్ట్రియల్స్ 1.13%, సర్వీసెస్ 0.98% ఐటీ 0.94%, ఎఫ్‌ఎంసీజీ 0.87%, కన్జూమర్ డ్యూరబుల్స్ 0.85%, క్యాపిటల్ గూడ్స్ 0.76% పెరిగాయి. స్మాల్, మిడ్ క్యాప్ ఇండెక్సులు 0.49%, 0.26% లాభపడ్డాయి. మరోవైపు మెటల్, కమోడిటీస్, ఇంధన, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.
- హెచ్‌సీఎల్ టెక్ 1.50 శాతం, విప్రో 1.21 శాతం, ఎల్‌అండ్‌టీఎం 1 శాతం లాభపడ్డాయి. టీసీఎస్, టెక్ మహీంద్రా, పెర్సిస్టెంట్ షేర్లు 0.50 శాతం పెరిగాయి.
- భారత పర్యటనలో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్... ప్రధాని మోదీతో భేటీ నేపథ్యంలో మరిన్ని రఫేల్ ఫైటర్ జెట్ల కొనుగోళ్ల ఒప్పందం కుదరొచ్చనే అంచనాలు నెలకొన్నాయి. ఫలితంగా డిఫెన్స్ షేర్లకు డిమాండ్ లభించింది. కొచ్చిన్ షిప్‌యార్డ్ 4%, భారత్ ఎలక్ట్రానిక్స్ 2%, యూనిమెక్ ఏరోస్పేస్ 4%, భారత్ ఫోర్జ్ 1.38%, పరాస్ డిఫెన్స్, జెన్ టెక్నాలజీస్ 1%, హెచ్ఏఎల్ 0.50% లాభపడ్డాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
కర్ణాటకలో టాటా-ఎయిర్‌బస్ హెలికాప్టర్ అసెంబ్లీ లైన్ | డిజిటల్ రాజ్యంలోనూ.. క్యాష్ కింగ్

వెండి రూ. 5,000 డౌన్

- రూ. 2,200 నష్టపోయిన పసిడి

న్యూఢిల్లీ: పసిడి, వెండిలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. ఫలితంగా మంగళవారం ఢిల్లీ మార్కెట్లో వెండి మరో రూ.5,000 నష్టపోయి (2 శాతం) రూ.2,45,000 స్థాయికి దిగొచ్చింది. అటు బంగారం సైతం 10 గ్రాములకు రూ.2,200 నష్టంతో (1.4 శాతం) రూ.1,57,000కు పరిమితమైంది. అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో వెండి ఔన్సుకు 1.65 డాలర్లు (2.15 శాతం) తగ్గి 74.96 డాలర్ల వద్ద, పసిడి ఔన్సుకు ఒక శాతం నష్టపోయి 4,938.70 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి. ''స్పాట్ బంగారం ధరలు వరుసగా రెండో రోజు నష్టపోయాయి. అమెరికా–ఇరాన్ చర్చలకు ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు''అని మిరే అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్ హెడ్ ప్రవీణ్ సింగ్ తెలిపారు. చైనా కొత్త సంవత్సరం సెలవులు కావడంతో కొనుగోళ్ల ఆసక్తి తగ్గినట్టు.. పసిడికి 5,000 డాలర్ల పైన అమ్మకాల ఒత్తిడి ఎదురైనట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీ విభాగం సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. మెటల్స్‌లో లిక్విడిటీ తగ్గిందని.. స్పెక్యులేషన్ పెరగనంత వరకు ధరలు ఒక పరిమిత శ్రేణిలోనే కొనసాగొచ్చన్నారు.

సాక్షి స్పోర్ట్స్

దీపేంద్ర

విజయంతో ముగించిన నేపాల్

ముంబై: టి20 ప్రపంచకప్ నుంచి నేపాల్ జట్టు విజయంతో నిష్క్రమించింది. గ్రూప్ 'సి'లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో నేపాల్ 7 వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌పై నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. ఓపెనర్ మైకేల్ జోన్స్ (45 బంతుల్లో 71; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపు వేగంతో అర్ధసెంచరీ సాధించాడు. జార్జ్ మున్సే (27; 4 ఫోర్లు), మెక్‌ములెన్ (25; 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. మిగతా బ్యాటర్లను నేపాలీ బౌలర్లు తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. సోంపాల్ కామి 3, నందన్ యాదవ్ 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన నేపాల్ 19.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసి గెలిచింది. దీపేంద్ర సింగ్ (23 బంతుల్లో 50 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) ధాటిగా ఆడి అజేయ అర్ధసెంచరీతో జట్టును గెలిపించాడు. ఓపెనర్లు కుశాల్ (35 బంతుల్లో 43; 1 ఫోర్లు, 4 సిక్సర్లు), ఆసిఫ్ షేక్ (27 బంతుల్లో 33; 2 సిక్సర్లు) తొలి వికెట్‌కు 74 పరుగులు జోడించి చక్కని ఆరంభమిచ్చారు.

సూర్యకుమార్

అజేయంగా ముగించాలని...

నేడు ఆఖరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో భారత్ 'ఢీ'

రాత్రి 7 గంటల నుంచి స్టార్‌స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

అహ్మదాబాద్: టి20 ప్రపంచకప్‌లో ఈ రోజు మూడు మ్యాచ్‌లు జరుగనున్నాయి. నెదర్లాండ్స్ జట్టుతో భారత్... యూఏఈతో దక్షిణాఫ్రికా... నమీబియాతో పాకిస్తాన్ తలపడనున్నాయి. టీమిండియా మ్యాచ్ సహా దక్షిణాఫ్రికా మ్యాచ్ కూడా నామమాత్రమైందే! పాకిస్తాన్ మ్యాచ్ మాత్రమే కీలకమైంది. ఎందుకంటే ఇప్పటికే 'సూపర్–8' బెర్తుల్లో ఏడు (భారత్, శ్రీలంక, జింబాబ్వే, వెస్టిండీస్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్) ఖరారయ్యాయి. మిగిలింది ఒక్క బెర్త్ మాత్రమే. అది కూడా భారత జట్టున్న గ్రూప్ 'ఎ'లోనే ఉండటంతో ఆఖరి బెర్త్ ఎవరిదో నేడే తేలుతుంది. దీంతో ఈ రాత్రికే 'సూపర్–8'లో ఎవరెవరు ప్రత్యర్థులనేది కూడా తెలిసిపోతుంది.

ఇక మన మ్యాచ్ విషయానికొస్తే డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన భారత్ ఆడిన మూడు గెలిచి దర్జాగా 'సూపర్–8'కు చేరింది. నేడు జరిగే అనామక పోరులో భారత్... నెదర్లాండ్స్‌పై గెలిచి లీగ్ దశను అజేయంగా ముగించడమే పనిగా పెట్టుకుంది. టీమిండియాకు ఓడినా నష్టం లేదు. అలాగని నెదర్లాండ్స్ గెలిస్తే ఒరిగే ప్రయోజనం కూడా లేదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇది ఇరుజట్లకు అక్కర్లేని మ్యాచ్. వరల్డ్‌కప్ షెడ్యూల్‌లో ఉన్న మ్యాచ్... కాబట్టి ఆడాలి అంతే! ఈ మెగా ఈవెంట్‌లో టైటిల్ ఫేవరెట్, ఆతిథ్య భారత్‌పై ఎవరికి ఏ బెంగా లేదు. సమష్టిగా రాణిస్తోంది. ప్రపంచకప్‌లో దూసుకెళుతోంది... కానీ ధనాధన్ హిట్టర్ అభిషేక్ శర్మ ఫామ్‌పైనే జట్టు మేనేజ్‌మెంట్ కన్నేసింది. రెండు 'డకౌట్లు' కాస్త ఇబ్బందికరం కావడంతో కీలకమైన 'సూపర్–8'కు ముందే ఈ ఓపెనర్ కూడా ఫామ్‌లోకి వస్తే టీమిండియాకు ఎదురుండదని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అదే జరిగితే ఈ మ్యాచ్‌లోనే కాదు... వరల్డ్‌కప్‌లోనే భారత్‌కు పరుగుల పండగ ఖాయమవుతుంది.

భారత్ జోరుకు ఎదురుందా...

జట్టు జోరుపై, విజయాల తీరుపై ఎవరికీ ఎలాంటి సందేహాలే లేవు. ఇలాంటి జట్టుపై నెదర్లాండ్స్‌లాంటి కూన సంచలనానికి అవకాశమే లేదు. ఇషాన్ కిషన్ మెరుపులకు అభిషేక్ హిట్స్ తోడైతే జట్టుకు ఇది భలే బ్యాటింగ్ ప్రాక్టీసుగా పనికొస్తుంది. తిలక్ వర్మ, కెప్టెన్ సూర్య, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్‌లతో కూడిన బ్యాటింగ్ ఆర్డర్‌కు ప్రత్యర్థి

అభిషేక్

శిబిరం నుంచి పెద్దగా సవాళ్లయితే ఉండవు. బౌలింగ్‌లో బుమ్రాకు విశ్రాంతి ఇవ్వాలని భావిస్తే హైదరాబాదీ పేసర్ సిరాజ్ బరిలోకి దిగుతాడు. మొత్తానికి పేస్, స్పిన్, బ్యాటింగ్ ఇలా అన్ని రంగాల్లో భారత జట్టు పటిష్టంగా ఉంది. మరోవైపు డచ్ టీమ్ మూడు మ్యాచ్‌లాడి ఒకటే గెలిచింది. టోర్నీ నుంచి ఈ 'ఒకటే' విజయంతో నిష్క్రమిస్తుంది తప్ప అసాధారణ, అజేయంగా దూసుకెళ్తున్న టీమిండియానైతే ఢీకొట్టలేదు.

పిచ్, వాతావరణం

అహ్మదాబాద్ వికెట్ బ్యాటింగ్‌కు స్వర్గధామం. దీంతో టాస్ నెగ్గిన జట్టు చేజింగ్‌కే మొగ్గు చూపొచ్చు. మంచు ప్రభావం ఉంటుంది. వర్షం ముప్పు లేదు.

గ్రూప్ 'ఎ' టి20 ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
భారత్	3	3	0	6	3.050
అమెరికా	4	2	2	4	0.788
పాకిస్తాన్	3	2	1	4	-0.403
నెదర్లాండ్స్	3	1	2	2	-1.352
నమీబియా	3	0	3	0	-2.443

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

టి20 ప్రపంచకప్‌లో నేడు

దక్షిణాఫ్రికా X యూఏఈ
వేదిక: న్యూఢిల్లీ; ఉ.గం. 11 నుంచి
పాకిస్తాన్ X నమీబియా
వేదిక: కొలంబో; మ.గం. 3 నుంచి
భారత్ X నెదర్లాండ్స్
వేదిక: అహ్మదాబాద్; రాత్రి గం. 7 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మిచెల్ మార్ష్, స్టొయినిస్

ఆస్ట్రేలియా ఇంటికి... జింబాబ్వే ముందుకు...

వర్షంతో జింబాబ్వే-ఐర్లాండ్ మ్యాచ్ రద్దు ● సూపర్-8కు సికందర్ రజా బృందం

పల్లెకెలె: ఆస్ట్రేలియాకు షాక్. అప్పుడు జింబాబ్వే సంచలనంతో షాక్ ఇస్తే, ఇప్పుడు వానొచ్చి మరో షాక్ ఇచ్చింది. జింబాబ్వే–ఐర్లాండ్‌ల మ్యాచ్ జరగకుండా వరుణుడు అడ్డుపడటంతో ఈ లీగ్ మ్యాచ్ రద్దయ్యింది. దాంతో రెండు జట్లకు ఒక్కో పాయింట్ కేటాయించారు. ఫలితంగా సికందర్ రజా సారథ్యంలోని జింబాబ్వే 5 పాయింట్లతో తాజా టి20 ప్రపంచకప్‌లో సూపర్–8కు అర్హత సంపాదించింది. ఆఖరి మ్యాచ్ మిగిలుండగానే ఆస్ట్రేలియా మెగా ఈవెంట్ నుంచి లీగ్ దశలోనే నిష్క్రమించింది. 2009 తర్వాత టి20 ప్రపంచకప్‌లో తదుపరి దశకు అర్హత పొందకుండా గ్రూప్ దశలోనే ఆస్ట్రేలియా వెనుదిరగడం ఇదే ప్రథమం. గ్రూప్ 'బి'లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఐర్లాండ్, జింబాబ్వేల మధ్య మ్యాచ్ జరగాల్సింది. భారీ వర్షం వల్ల మ్యాచ్ ఎంతకీ మొదలవలేదు. ఇలాంటి ప్రతికూల వాతావరణంలో మ్యాచ్ జరిగే అవకాశమే లేకపోవడంతో ఫీల్డ్ అంపైర్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అన్నట్లు... టీమిండియాకు సూపర్–8లో ముందుగా ఎదురుపడే ప్రత్యర్థి కూడా జింబాబ్వేనే! ఈ నెల 26న చెన్నైలో ఈ మ్యాచ్ జరుగుతుంది.

పరాభవాల ప్రభావంతో...

ప్రపంచ క్రికెట్‌ను శాసించిన ఆస్ట్రేలియా ఈ ప్రపంచకప్‌లో మాత్రం సూపర్–8 చేరేందుకు ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సిన స్థితికి వచ్చింది. జింబాబ్వే, శ్రీలంక చేతుల్లో ఓడిన కంగారూ ఒక్క ఐర్లాండ్‌పై గెలిచి 2 పాయింట్లతో ఉంది. శుక్రవారం ఒమన్‌తో జరిగే నామమాత్రమైన మ్యాచ్‌లో గెలిస్తే 4 పాయింట్లతో ఆసీస్ ఇంటికి పయనమవుతుంది. పది టి20 ప్రపంచకప్‌లలోనూ ఆడిన ఆస్ట్రేలియా లీగ్ దశలో నిష్క్రమించడం ఇది రెండోసారి మాత్రమే. 2007లో సెమీఫైనల్ చేరిన ఆసీస్... 2009లో గ్రూప్ దశలో వెనుదిరిగింది. 2010లో రన్నరప్‌గా నిలిచింది. 2012లో సెమీఫైనల్లో ఓడింది. 2014, 2016లలో సూపర్–10లో ఓడి... 2021లో తొలిసారి విజేతగా అవతరించింది. 2022లో సూపర్–12లో, 2024లో సూపర్–8లో వెనుదిరిగింది.

సికందర్ రజా

గ్రూప్ 'బి' టి20 ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	రద్దు	పా	నె.ర.రే
శ్రీలంక	3	3	0	0	6	2.462
జింబాబ్వే	3	2	0	1	5	1.984
ఐర్లాండ్	4	1	2	1	3	0.150
ఆస్ట్రేలియా	3	1	2	0	2	0.414
ఒమన్	3	0	3	0	0	-4.546

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఫిలిప్స్ రచిన్

సూపర్-8కు న్యూజిలాండ్

- కెనడాపై 8 వికెట్ల తేడాతో విజయం
- దంచేసిన ఫిలిప్స్, రచిన్ రవీంద్ర
- యువరాజ్ సామ్రా సెంచరీ వృథా

చెన్నై: టి20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ 'సూపర్–8' దశకు అర్హత సాధించింది. గ్రూప్ 'డి'లో మంగళవారం జరిగిన పోరులో కివీస్ 8 వికెట్ల తేడాతో కెనడాపై నెగ్గింది. తప్పక గెలిస్తేనే ముందుకెళ్లే ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ బ్యాటర్లు గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర చెలరేగారు. ముందుగా టాస్ నెగ్గిన కెనడా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. యువరాజ్ సామ్రా (65 బంతుల్లో 110; 11 ఫోర్లు, 6 సిక్సర్లు) మేటి ప్రత్యర్థి బౌలింగ్‌పై వీరవిహారం చేశాడు. ఈ క్రమంలో 19 ఏళ్ల సామ్రా ఓవరాల్ ప్రపంచకప్ (టి20, వన్డే)ల చరిత్రలో 'శత'క్కొట్టిన పిన్న వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. భారత మాజీ క్రికెటర్ యువీ అభిమాని అయిన బల్జీత్ సామ్రా తన కుమారుడికి అతని పేరే పెట్టాడు. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ దిల్‌ప్రీత్ బాజ్వా (36; 4 ఫోర్లు)తో ఇన్నింగ్స్ ప్రారంభించిన యువరాజ్ తొలి వికెట్‌కు 116 పరుగులు జోడించడం విశేషం. అయితే మిడిలార్డర్ వైఫల్యంతో కెనడా భారీస్కోరు చేయలేకపోయింది. అనంతరం న్యూజిలాండ్ 15.1 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 176 పరుగులు చేసి గెలిచింది. ఒకదశలో 30 పరుగుల వద్ద ఓపెనర్లు సీఫెర్ట్ (6), అలెన్ (21) వికెట్లు కోల్పోయిన కివీస్ తర్వాత మరో వికెట్ నష్టపోలేదు. ఫిలిప్స్ (36 బంతుల్లో 76 నాటౌట్; 4 ఫోర్లు, 6 సిక్సర్లు), రచిన్ (39 బంతుల్లో 59 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) అబేధ్యమైన మూడో వికెట్‌కు 146 పరుగులు జోడించి జట్టును గెలిపించారు.

యువరాజ్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

క్లుప్తంగా...

నీట్ యూజీ అర్హతతో నర్సింగ్ ప్రవేశాలు

సాక్షి, మరావతి: నీట్ యూజీ అర్హత ఆధారంగా 2026–27 విద్యా సంవత్సరం నుంచి బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు అనుమతి ఇస్తూ మంగళవారం వైద్యశాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఏపీ నర్సింగ్ సెట్ స్థానంలో నీట్ యూజీ అర్హత ప్రామాణికం చేసినట్టు చెప్పారు. దీని ఆధారంగా కన్వీనర్, యాజమాన్య కో టా సీట్లు భర్తీ చేయాలని హెల్త్ వర్సిటీని ఆదేశించారు.

రక్షణ రంగ పరిశోధనలకు అధిక ప్రాధాన్యం

డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ ఎస్వీ కామత్

సూచనలు చేస్తున్న డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ ఎస్వీ కామత్

మంగళగిరి టౌన్: భారత రక్షణ రంగంలో అభివృద్ధి సాధించాలంటే పరిశోధనలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ ఎస్వీ కామత్ సూచించారు. ఎస్‌ఆర్‌ఎం వర్సిటీలో మంగళవారం పరిశోధన అధ్యాపక బృందంతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నావిగేషన్ సిస్టమ్‌కు ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆదరణ ఉందని, రక్షణ రంగాలు కూడా దీని కోసం ఎదురు చూస్తున్నాయన్నారు. క్షిపణుల కోసం హై ఎనర్జీ మెటీరియల్స్ అభివృద్ధిపై దృష్టి సారించి డీఆర్‌డీవో శాస్త్రవేత్తల సహకారం తీసుకోవాలని సూచించారు.

హైస్కూల్ ప్లస్‌లను చంపేయొద్దు

పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపీమూర్తి

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా మండలానికో ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్‌గా రూపొందిస్తే ప్రస్తుత ప్రభుత్వం ఆ స్ఫూర్తిని నీరుగారుస్తోందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపీమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాలికలకు ఇంటర్ విద్య అందించాలన్న లక్ష్యంతో స్కూల్ అసిస్టెంట్లకు పీజీటీలుగా పదోన్నతి కల్పిస్తే చంద్రబాబు 2024–25 విద్యాసంవత్సరంలో పీజీటీలను తొలగించార న్నారు. దీనిపై వ్యతిరేకత రావడంతో ఈ హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించినా 2025–26లో ఒక్క ఫ్యాకల్టీనీ నియమించలేదన్నారు. కనీసం వచ్చే ఏడాదైనా పీజీటీలను నియమించి ప్లస్ 2 వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు.

‘పది’ హాల్ టికెట్లలో తప్పులపై ఆందోళన వద్దు

వివరాల సవరణకు మార్చి 31లోగా మరో అవకాశం

సాక్షి, అమరావతి: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల హాల్ టికెట్లలో ఏమైనా తప్పులు దొర్లితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రధాన మార్కుల జాబితా తయారీకి ముందు వరకూ యూడైస్ డేటా సవరణకు మార్చి నెలలో మరోసారి అవకాశం ఇస్తామని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమగ్ర సమాచారాన్ని తప్పులు లేకుండా చూసుకోవాలని సూచించింది. మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈసారి విద్యార్థుల నామినల్ రోల్ వివరాలు యూడైస్ పోర్టల్ నుంచి తీసుకుంటామని, ఇదే తుది నివేదికగా ఉంటుందని పరీక్షల డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అభ్యర్థుల హాల్ టికెట్లు మార్చి మొదటి వారంలో విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచుతామన్నారు. అదనంగా సంబంధిత పాఠశాల లాగిన్, మనమిత్ర యాప్, వాట్సాప్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులు హాల్ టికెట్లలో పొందుపరిచిన విద్యార్థుల వివరాలు పాఠశాల రికార్డులతో సరిపోల్చి మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. హాల్‌టికెట్లలో తప్పులున్నా, పరీక్షల తర్వాత విద్యార్థులకు అందించే తాత్కాలిక మార్కుల లిస్టులో పొరబాట్లు కనిపించినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వివరాల సవరణకు మార్చి 31వ తేదీవరకు మరోసారి అవకాశం ఇస్తామన్నారు. నిబంధనల ప్రకారం మార్కుల మెమో జారీ దశ వరకు కూడా సవరణలు చేసుకునే అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

విద్యాశాఖ వింత పరీక్ష

- 100 మార్కులకు.. ప్రశ్నలు 90 మార్కులకే!
- మిగతా 10 మార్కులకు సమాధానం చెప్పని విద్యాశాఖ

సాక్షి, అమరావతి: నారా లోకేశ్ మంత్రిగా ఉన్న విద్యాశాఖలో పరీక్షల నిర్వహణలో డొల్లతనం మరోసారి బట్టబయలైంది. గతేడాది పదో తరగతి పరీక్షల నిర్వహణ, పేపర్ వ్యాల్యూయేషన్‌లో అనేక తప్పులు దొర్లిన విషయం తెలిసిందే. తాజాగా మరో ఘటన బయటపడింది. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా 24 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి ప్రధానోపాధ్యాయుల పదోన్నతి లేదా ఆ స్థాయి ఇంక్రిమెంట్ పొందేందుకు విద్యా శాఖ ఈ నెల 14, 15న అకౌంటెంట్ టెస్ట్ నిర్వహించింది. కేవలం 100 మందికి మాత్రమే నిర్వహించిన ఈ పరీక్షలోనూ డొల్లతనం తేటతెల్లమైంది. 100 మార్కులకు నిర్వహించాల్సిన పరీక్షకు కేవలం 90 మార్కులకే పేపర్ ఇచ్చారు. దీంతో మిగిలిన 10 మార్కుల పరిస్థితి ఏంటో అర్థంగాక సీనియర్ ఉపాధ్యాయులు అయోమయానికి గురయ్యారు. ఈ నెల 14న జరిగిన పేపర్ –1లో వ్యాసరూప ప్రశ్నలు 9 ఉండాలి. కానీ 8 మాత్రమే ఇచ్చారు. షార్ట్ ఆన్సర్ ప్రశ్నల్లో ఇలాంటి పరిస్థితే ఎదురైంది. ఈ పరీక్షకు సంబంధించి హాల్‌టికెట్ల ముద్రణలోనూ తప్పులు దొర్లడంతో 100 మందిలో 15 మంది ఉపాధ్యాయులు పరీక్ష రాయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 డిసెంబర్‌లో నిర్వహించిన పరీక్షలోనూ ఇదే పరిస్థితి ఎదురైందంటున్నారు. ఉపాధ్యాయులకు ఎంతో కీలకమైన పదోన్నతి పొందే పరీక్షను ఇంత నిర్లక్ష్యంగా నిర్వహించడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి ఏటా డిసెంబర్‌లో ఈ పరీక్ష నిర్వహించాల్సి ఉన్నా.. 2025 డిసెంబర్‌లో పరీక్షను పూర్తిగా రద్దు చేశారు. విద్యాశాఖ నిర్లక్ష్యంతో జరిగిన తప్పునకు బాధ్యత వహించాలని, తాము కోల్పోయిన 10 మార్కులకు గ్రేస్ మార్కులు ఇవ్వాలని గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, ఎల్‌కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు.

సూపర్ స్పెషాలిటీలో 65 శాతం ప్రొఫెసర్ పోస్టుల ఖాళీ

త్వరలో భర్తీ చేయనున్నట్టు మంత్రి వెల్లడి

సాక్షి, అమరావతి: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోని బోధనాస్పత్రుల్లో 13 సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో 65 శాతం ఖాళీలు ఉన్నాయని వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఖాళీలను భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్టు వెల్లడించారు. మొత్తం 155 ప్రొఫెసర్ పోస్టులు మంజూరు కాగా 100 ఖాళీలు ఉన్నట్టు తెలిపారు.

కొన్ని ప్రధాన విభాగాల్లో ఖాళీలు ఇలా

విభాగం	మంజూరు	ఖాళీలు
సర్జికల్ అంకాలజీ	19	17
మెడికల్ అంకాలజీ	18	17
నెఫ్రాలజీ	17	14
యూరాలజీ	19	13
న్యూరాలజీ	16	11
న్యూరో సర్జరీ	17	09
కార్డియాలజీ	12	07

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

పలు జిల్లాలకు డీఎంహెచ్‌వోల నియామకం

సాక్షి, అమరావతి: గుంటూరు, ప్రకాశం, అనంతపురం జిల్లాలకు నూతన డీఎంహెచ్‌వోలను నియమిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రకాశం జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ టి. వెంకటేశ్వర్లును గుంటూరు డీఎంహెచ్‌వోగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ విజయలక్ష్మిని సరెండర్ చేశారు. ఒంగోలు జీజీహెచ్ ఆర్‌ఎంవో డాక్టర్ మాధవిలతను ప్రకాశం డీఎంహెచ్‌వోగా, అనంతపురం డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఎ.ఎన్. భూషణ్‌రెడ్డిని చిత్తూరు డీఎంహెచ్‌వోగా బదిలీ చేశారు.

31 మంది సబ్ రిజిస్ట్రార్లకు డీఆర్‌లుగా పదోన్నతి

సాక్షి, అమరావతి: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో 2025–26 ప్యానల్ సంవత్సరానికి సంబంధించి 31 మంది గ్రేడ్–1 సబ్ రిజిస్ట్రార్లకు జిల్లా రిజిస్ట్రార్‌లుగా (డీఆర్) పదోన్నతి లభించింది. అయితే, ప్యానల్‌లో ఉన్న అందరికీ కాకుండా 18 మందికి మాత్రమే వివిధ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్‌లుగా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఈ మేరకు సోమవారం వేర్వేరు జీఓలు జారీ చేసింది. పదోన్నతి పొంది పోస్టింగ్ లభించిన వారిలో ఎం.పార్వతి (పార్వతీపురం మన్యం), బి.అశోక్ (నంద్యాల), పి.శ్రీనివాసరావు (బాపట్ల), పీవీవీ దుర్గాప్రసాద్ (ఎన్టీఆర్ జిల్లా), జి.శ్రీరామ్‌కుమార్ (తిరుపతి), సి.కుమారస్వామిరెడ్డి(శ్రీకాకుళం) తదితరులు ఉన్నారు. ప్యానల్‌లో ఉన్న ఎం. విజయప్రసాదరావు, పి.సునంద, ఎండీ నుజ్మల్‌హుస్సేన్, ఇ.లక్ష్మి తదితరుల పదోన్నతులను వివిధ కారణాల వల్ల ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది.

ఆరోగ్య విశ్వవిద్యాలయంలో డీఎంఐడీసీ ఏర్పాటు

సాక్షి, అమరావతి: విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం కేంద్రంగా డిసీజ్ మోడలింగ్ అండ్ డెసిషన్ ఇంటెలిజెన్స్ సెంటర్ (డీఎంఐడీసీ)ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. సింగపూర్‌లోని నేషనల్ వర్సిటీ పబ్లిక్ హెల్త్ విభాగంతో ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు.

మంత్రులు, ఎమ్మెల్యేల కంటే పిల్లలే బాగా మాట్లాడుతున్నారు

స్పీకర్ అయ్యన్నపాత్రుడు

సాక్షి, అమరావతి: మంత్రులు, ఎమ్మెల్యేల కంటే చిన్న పిల్లలే బాగా మాట్లాడుతున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీని సందర్శించడానికి వచ్చిన పాఠశాల విద్యార్థులతో తాను మాట్లాడినప్పుడు వారు శాసనసభ వ్యవహారాల గురించి చాలా ప్రశ్నలు అడిగారని చెప్పారు. 200 పాఠశాలల నుంచి అసెంబ్లీని సందర్శించేందుకు దరఖాస్తులు వచ్చాయని, అన్ని పాఠశాలలకు అవకాశం కల్పిస్తామని చెప్పారు.

నేటి నుంచి శనగల కొనుగోళ్లు ప్రారంభం

మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

సాక్షి, అమరావతి: రబీ సీజన్ 2025–26లో పండించిన 94,500 టన్నుల శనగలను కేంద్రం అనుమతితో నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ఐఎస్ ద్వారా మద్దతు ధరకు బుధవారం(18వ తేదీ)నుంచి కొనుగోలు చేయబోతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. సీఎం యాప్ ద్వారా అన్ని జిల్లాల్లో కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభిస్తామని మంగళవారం చెప్పారు. తమ పంట వివరాలను సమీప ఆర్‌ఎస్‌కేల్లో నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు.

మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురు

సాక్షి, అమరావతి: విద్యార్థి సంఘం నేతల కిడ్నాప్ ఆరోపణలపై నమోదైన కేసులో సినీ నటుడు, మోహన్‌బాబు వర్సిటీ చాన్స్‌లర్ మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురైంది. ఆయనపై తిరుచానూరు పోలీసులు నమోదు చేసిన కేసులో అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేందుకు హైకోర్టు నిరాకరించింది. ఆయన దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను కొట్టివేస్తూ న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప మంగళవారం ఉత్తర్వులిచ్చారు. కేసు కొట్టివేతపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని పేర్కొంటూ విచారణను మార్చి 3కి వాయిదా వేశారు.

ఎం-కాడ్వామ్ నిధులతో పెద్దగెడ్డ రిజర్వాయర్ ఆధునికీకరణ

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రాయోజిత పథకం ఎం–కాడ్వామ్(మోడరనైజేషన్ ఆఫ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అండ్ వాటర్ మేనేజ్‌మెంట్) పథకం కింద పెద్దగెడ్డ రిజర్వాయర్, కుడి, ఎడమ కాలువలను ఆధునికీకరించేందుకు రూ.73.55 కోట్లతో పరిపాలన అనుమతి ఇస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రిజర్వాయర్ ఆధునికీకరణకు అయ్యే వ్యయంలో 60 శాతం కేంద్ర, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించనున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో పెద్దగెడ్డ రిజర్వాయర్ కింద 12,221 ఎకరాల ఆయకట్టు ఉంది.

పదిలో వంద సాధ్యమేనా?

పదో తరగతిలో ఫలితాల మెరుగునకు ప్రభుత్వం వందరోజుల ప్రణాళిక అమలు చేస్తోంది. మామూలు రోజుల్లో అదనపు తరగతులతో పాటు సెలవు రోజుల్లోనూ సబ్జెక్టు టీచర్లు క్లాసులు చెప్పేలా ఆదేశాలిచ్చింది. అంతా బాగానే ఉన్నా.. ఉపాధ్యాయుల సమస్యలను మాత్రం పూర్తిగా విస్మరించింది. దీంతో ఉపాధ్యాయులు ఉద్యమబాట పట్టగా, పదో తరగతిలో 'వంద' శాతం ఫలితాలు సాధ్యమేనా అన్న అనుమానం నెలకొంది.

జగరాజుపల్లి మోడల్‌స్కూల్‌లో నిర్వహించిన స్పెషల్ క్లాస్‌కు సగం మందే హాజరైన దృశ్యం

ప్రభుత్వానికే 'పరీక్ష'

- పదో తరగతి ఫలితాల మెరుగుకు ప్రణాళిక
- సబ్జెక్టు టీచర్లతో వంద రోజుల బోధన
- సెలవురోజుల్లోనూ తరగతులు నిర్వహించేలా ఆదేశాలు
- ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లు తీర్చని సర్కార్
- నిరసనలకు దిగుతున్న టీచర్లు.. 'పది'కి వంద ఆటంకాలు

పది విద్యార్థుల వివరాల సంఖ్య ఇలా...

మేనేజ్‌మెంట్	పాఠశాలలు	బాలురు	బాలికలు	మొత్తం
స్టేట్ గవర్నమెంట్	7	431	174	605
ఏపీఆర్ఈఐ సొసైటీ స్కూల్స్	1	76	-	76
కేజీబీవీలు	30	00	1,162	1,162
అంధుల పాఠశాలలు	1	05	02	07
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ స్కూల్స్	7	314	235	549
ఏపీటీడబ్ల్యూఆర్ఈఐ స్కూల్స్	5	29	163	192
ఆశ్రమ స్కూల్స్	1	41	-	41
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	246	5,018	4,682	9,700
మున్సిపల్ స్కూల్స్	26	846	683	1,529
ప్రైవేటు పాఠశాలలు	151	4,005	2,746	6,751
సీబీఎస్ఈ స్కూల్స్	3	28	37	65
ఏపీ మోడల్ స్కూల్స్	10	367	409	776
బీసీ వెల్ఫేర్ స్కూల్స్	10	402	289	686
మొత్తం	498	11,562	10,577	22,139

ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: విద్యార్థి దశలో కీలకమైనవి పదోతరగతి పరీక్షలు. అందుకే విద్యార్థులు, తల్లిదండ్రులు పరీక్షల వేళ టెన్షన్ పడుతుంటారు. ఇప్పుడు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సరిగ్గా 30 రోజులు మాత్రమే గడువుంది. ఈ సారి ఎలాగైనా ఉత్తీర్ణత శాతం పెంచి శ్రీ సత్యసాయి జిల్లాను రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలబెట్టాలన్న లక్ష్యంతో ఉన్నతాధికారులు ప్రభుత్వం నిర్దేశించిన 'వంద రోజుల ప్రణాళిక' పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు, ప్రత్యేక పరీక్షలు, టెస్టులు నిర్వహిస్తూ ప్రోత్సహించాలని సూచించారు. అయితే సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణకు సవాలక్ష సమస్యలు ఎదురవుతున్నాయి.

అయ్యవార్ల సమస్యలపై అలసత్వం

చంద్రబాబు ప్రభుత్వం పాలన చేపట్టి 20 నెలలు అవుతున్నా, ఎన్నికల హామీలు నెరవేర్చక పోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 11వ పీఆర్సీ ప్రకటన, సరెండర్ లీవులు, పీఎఫ్, మెడికల్ బిల్లులు చెల్లించాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, వెంటనే 4 డీఏలు ప్రకటించాలని, పదవీ విరమణ రోజే సౌలభ్యాలు అందజేయాలన్న డిమాండ్లతో నిరసన కార్యక్రమాలు, ధర్నాలు, ర్యాలీలు, రిలే నిరాహార దీక్షలు, చలో విజయవాడ తదితర కార్యక్రమాలు చేపట్టినా చంద్రబాబు ప్రభుత్వంలో చలనం రాలేదు. ఈ పరిస్థితులు పదో తరగతి విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

జిల్లాలో 22,139 మంది విద్యార్థులు..

జిల్లాలో ఈ ఏడాది 22,139 మంది పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. గత రెండేళ్లతో పోల్చితే ఈ ఏడు విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఇందులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 9,700 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 6,751 మంది, కేజీబీవీల్లో 1,162 మంది, మున్సిపల్ పాఠశాలల్లో 1,529 మంది పరీక్ష రాస్తున్నారు. ఇందులో బాలికలు 10,577 మంది ఉండగా, బాలురు 11,562 మంది ఉన్నారు. 2024 సంవత్సరంలో 18,419 మంది (84.46 శాతం) ఉత్తీర్ణత సాధించగా, 2025 సంవత్సరంలో 15,769 మంది (74.26 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతం పెరుగుతుందా... ప్రభుత్వ తీరుతో చతికిల పడుతుందో వేచి చూడాలి.

వంద రోజుల ప్రణాళిక ఉపయోగపడేనా..?

పది పరీక్షలకు ముందు వంద రోజుల ప్రణాళిక ఏర్పాటు చేసి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీనికి చాలా మంది విద్యార్థులు డుమ్మా కొడుతున్నారు. సాధారణ రోజుల్లో ఒకరకంగా వస్తున్నా... సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం సరిగా పెట్టడం లేదని, సగం మంది కూడా హాజరు కావడం లేదు. పర్యవేక్షించాల్సిన ప్రధానోపాధ్యాయులు స్థానికంగా ఉండకపోవడంతో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులు భోజనం సరిగా వండటం లేదు. దీంతో చాలా మంది విద్యార్థులు సెలవురోజుల్లో తరగతులకు వచ్చేందుకు ఇష్టపడటం లేదు.

జగరాజుపల్లి మోడల్‌స్కూల్‌లో మెనూ పక్కన పెట్టి రసం, చిత్రాన్నం పెట్టిన ఏజెన్సీ నిర్వాహకులు

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

గతంతో పోలిస్తే ఈసారి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రత్యేక కృషి చేస్తున్నాం. డిమాండ్ల సాధన కోసం నిరసన తెలిపే హక్కు ఉపాధ్యాయులకు ఉన్నప్పటికీ సబ్జెక్టు టీచర్లు తప్పని సరిగా ప్రత్యేక తరగతులకు హాజరు కావాల్సిందే. విద్యాశాఖ అధికారులతో పాటు కలెక్టర్, జేసీ అందరూ వంద రోజుల ప్రణాళికను పర్యవేక్షిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా హాస్టళ్లలో ఉంచి చదివిస్తున్నాం. మెరుగైన ఫలితాల కోసం శ్రమిస్తున్నాం.

– కిష్టప్ప, జిల్లా విద్యాశాఖ అధికారి

ఈ ఫొటో చూస్తే.. ఇదేంటి కారు ఇల్లెలా ఎక్కింది అనుకుంటున్నారా.. చూడడానికి విడ్డూరంగా ఉన్నప్పటికీ అది నిజమైన కారు కాదు.. కారు రూపంలో కనిపించేది ఓ ఇంటి వాటర్ ట్యాంక్. చీపురుపల్లి మండలం కర్లాం గ్రామంలో ఓ వ్యక్తి తన ఇంటిపై వాటర్ ట్యాంక్‌ను కారు బొమ్మ రూపంలో నిర్మించుకున్నారు. అకస్మాత్తుగా చూసే వారికెవరికైనా ఇదేంటి కారు ఇల్లెక్కింది అన్నట్లే అనిపిస్తుంది. – చీపురుపల్లి

మూగబోయిన 'శాసన' మైకులు

- గంట ఆలస్యంగా శాసనసభ, శాసనమండలి సమావేశాలు
- రెండు సభల్లోను జీరో అవర్ ఎత్తివేత

సాక్షి, అమరావతి: మైకులు పనిచేయకపోవడంతో శాసనసభ, శాసనమండలి సమావేశాలకు మంగళవారం గంటసేపు అంతరాయం ఏర్పడింది. దీంతో రెండు సభల్లోనూ జీరో అవర్ ఎత్తేశారు. ఉదయం తొమ్మిది గంటలకు శాసనసభ, 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో మంత్రులు, సభ్యులు అసెంబ్లీ హాలులోకి ప్రవేశించారు. సభ ప్రారంభమయ్యే ముందు బెల్ మోగకపోవడం, స్పీకర్ రాకపోవడంతో సభ్యులకు ఏం జరుగుతోందో అర్థంకాలేదు. 9.05 గంటల సమయంలో శాసనసభలోకి ప్రవేశించిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు.. సాంకేతికలోపం కారణంగా సభ గంట ఆలస్యంగా ప్రారంభమవుతుందని ప్రకటించారు. తర్వాత 10 గంటలకు బెల్ మోగింది. సభ ప్రారంభమైంది. డిప్యూటీ స్పీకర్ నేరుగా ప్రశ్నోత్తరాలు మొదలు పెట్టారు. కానీ మైకులు పనిచేయకపోవడంతో సభ్యులు ఇబ్బంది పడ్డారు. సిబ్బంది స్టాండ్ మైకులు తీసుకెళ్లగా మంత్రులు, సభ్యులు తమ ప్రసంగాలను కొనసాగించారు. దాదాపు మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. మరోవైపు 10 గంటలకు ప్రారంభం కావాల్సిన శాసనమండలి కూడా గంట ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో జీరో అవర్‌ను రద్దు చేశారు. ప్రశ్నోత్తరాల అనంతరం నేరుగా అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చను ప్రారంభించారు. వాయిదా తీర్మానంపై విపక్ష సభ్యుల ఆందోళనల మధ్య మండలి పలుమార్లు వాయిదాపడింది. సాంకేతిక లోపాలను ముందుగా గుర్తించలేకపోవడంతో విలువైన సభాసమయం వృథా అయిందని లాబీల్లో సభ్యులు చర్చించుకోవడం కనిపించింది.

సర్టిఫికేషన్ ఉంటేనే ఆక్వా సబ్సిడీ

- క్లోజర్ సమయంలోనే కాటన్ బ్యారేజ్ గేట్ల పునరుద్ధరణ
- ఏపీలో 5 స్టార్ రేటింగ్ ఒక్క పాఠశాలకూ లేదు
- అసెంబ్లీ ప్రశోత్తరాలలో మంత్రులు

సాక్షి, అమరావతి:సర్టిఫికేషన్ ఉన్న వాళ్లకే ఆక్వా సబ్సిడీ వర్తింప చేస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. గత ప్రభుత్వం ఇచ్చినట్టుగానే ఆక్వా జోన్ పరిధిలో 10 ఎకరాల్లోపు రైతులకు సబ్సిడీ రాయితీని పరిమితం చేశామని చెప్పారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాలలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో జోన్, నాన్‌జోన్‌తో సంబంధం లేకుండా యూనిట్ రూ.2కే విద్యుత్ సరఫరా చేశామని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.1.50కే ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఆక్వా రైతులకు 20 నెలలు దాటినా సర్టిఫికేషన్ అవ్వడం లేదని, జోన్, నాన్‌జోన్ లేకుండా అందరికీ రూ.1.50కే విద్యుత్ సరఫరా చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన విషయాన్ని ఎక్కడకు వెళ్లినా రైతులు అడుగుతున్నారని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు చెప్పారు. మంత్రి గొట్టిపాటి సమాధానమిస్తూ.. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆక్వా సాగుకు సర్టిఫికేషన్ చేస్తున్నామని, గతం కంటే ఇప్పుడు 50 వేల కనెక్షన్లు రిజిస్ట్రేషన్ చేసి ఆక్వా సబ్సిడీ మంజూరు చేశామని చెప్పారు.

సరిహద్దు రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా

గంజాయి సాగులేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దామని, అయితే సరిహద్దు ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణా జరుగుతోందని హోం మంత్రి అనిత చెప్పారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిస్తూ.. ఒడిశా–ఏపీ సరిహద్దులోని ఐదు జిల్లాల్లో 35 చెక్‌పోస్టులు పెట్టినా సమర్థవంతంగా పనిచేయడం లేదన్నారు. పాలకొండ అటవీ కొండ ప్రాంతాల మీదుగా పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా కొనసాగుతోందన్నారు. సాలూరు, పార్వతీపురం నుంచి ఎక్కువగా గంజాయి రవాణా జరుగుతోందన్నారు. ఐదు జిల్లాల పరిధిలో 45 డ్రోన్లతో పర్యవేక్షిస్తున్నామన్నారు. 20 నెలల్లో 1,423 కేసులు నమోదు చేశామని, 762 వాహనాలు సీజ్‌చేసి 3,515 మందిని అరెస్ట్ చేశామని చెప్పుకొచ్చారు.

పాఠశాల అభివృద్ధి నిధులతో పెండింగ్ పనులు

పాఠశాల అభివృద్ధి నిధులతో మనబడి–మన భవిష్యత్ కింద పెండింగ్ పనులన్నీ ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్టు విద్యాశాఖమంత్రి లోకేశ్ చెప్పారు. మూడు విడతల్లో 52,869 పాఠశాలల్లో రూ.7,877 కోట్ల విలువైన 3,12,656 పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) అకౌంట్‌లో రూ.200 కోట్ల నిధులున్నాయని, వాటిని ఖర్చు చేయమని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఈ బడ్జెట్‌లో రూ.800 కోట్లు అదనంగా కేటాయించామని చెప్పారు. ఏపీలో 5స్టార్ రేటింగ్‌లో ఒక్కపాఠశాల కూడా లేదన్నారు.

క్లోజర్ సమయంలోనే బ్యారేజ్ గేట్ల పునరుద్ధరణ

తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజ్, అనుబంధ విభాగాల మరమ్మతులు, గేట్ల పునరుద్ధరణ పనులను రూ.150.09 కోట్లతో చేపట్టేందుకు అనుమతి ఇచ్చినట్టు నీటిపారుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఈ క్లోజర్‌లోనే పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని, గోదావరి డెల్టా పరిధిలోని లాకుల మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. దీనిపై మంత్రి సమాధానమిస్తూ 197 గేట్లకు 117 గేట్లు ప్రమాదకర స్థాయిలో ఉన్నాయని, కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) సిఫార్సుల మేరకు పాత గేట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు చర్యలుతీసుకున్నామన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికి మాత్రమే రూ.లక్ష చొప్పున పారితోషికం ఇస్తామని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పష్టం చేశారు. గతేడాది విజయవాడ నుంచి వెళ్లిన 72 మంది యాత్రికులకు ఈ ప్రోత్సాహం అందించామన్నారు.

ఏపీ సాంస్కృతిక పునరుజ్జీవానికి చర్యలు

సాక్షి, అమరావతి: సాంస్కృతిక, పర్యాటక, ఫిల్మ్ టూరిజం విభాగాలను సమన్వయం చేస్తూ 'ఆరెంజ్ ఎకానమీ' అభివృద్ధికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. విజయవాడలో సాంస్కృతిక శాఖపై మంగళవారం జరిగిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ.. జూన్ లేదా జూలైలో క్రియేటివ్ ఎకానమీపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. ప్రతి వారం దేవాలయాల్లో, హ్యాపీ సండే వంటి వేదికల్లో స్థానిక కళాకారులకు ప్రదర్శన ఇచ్చే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఉగాది పురస్కారాల ఎంపికలో ఎటువంటి సిఫార్సులకు తావులేకుండా క్షేత్రస్థాయిలో నిజమైన ప్రతిభ ఉన్న కళాకారులను గుర్తించి సత్కరించాలని అధికారులను ఆదేశించారు. కూచిపూడి నృత్యాన్ని అట్టడుగు వర్గాలకు చేరవేయడమే లక్ష్యంగా గతంలో అమలు చేసిన 190 మంది కూచిపూడి నృత్య ఉపాధ్యాయుల పథకాన్ని పునరుద్ధరించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. కళాకారులందరికీ గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. సమావేశంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగడి మల్లికార్జునరావు, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సృజనాత్మక, సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి, జానపద కళల అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య, మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు చెల్లించాలి

సాక్షి, అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2024 జూలై నుంచి పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే ప్రకటించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. ఇవిగాక జనవరి 2026 నుంచి మరో డీఏ రావాల్సి ఉందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు పేర్కొన్నారు. నాలుగు డీఏలు పెండింగ్ ఉండడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు తీవ్రమైన ఆర్థిక నష్టం కలుగుతోందన్నారు.

నంద్యాలలో సోలార్ ప్రాజెక్టుకు 1,500 ఎకరాలు

30 ఏళ్లపాటు లీజు పద్ధతిలో కేటాయింపు

సాక్షి, అమరావతి: నంద్యాల జిల్లా సంజామల మండలం నొస్సం గ్రామంలో 1,500 ఎకరాల భూమిని 250 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం ఎన్‌ఆర్ఈడీసీఏపీ సంస్థకు కేటాయించింది. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ–2024 కింద ఈ భూమిని 30 ఏళ్ల కాలపరిమితికి లీజుకిస్తూ సోమవారం జీఓ జారీ చేసింది. ఎకరాకు ఏడాదికి రూ.31 వేల లీజు ధర నిర్ణయించగా.. రెండేళ్లకు ఒకసారి ఈ ధరను 5 శాతం పెంచుతామంది.

క్రిస్ సిటీ భూ బదిలీకి స్టాంప్‌డ్యూటీ మినహాయింపు

చెన్నై–బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లోని కృష్ణపట్నం నోడ్ (క్రిస్ సిటీ) కోసం ప్రభుత్వం భారీ రాయితీలను ప్రకటించింది. ఏపీఐఐసీ నుండి ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు 2,500.40 ఎకరాల భూమిని గతంలోనే కేటాయించింది. ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకునే క్రమంలో రూ.15.14కోట్ల స్టాంపు డ్యూటీ, రూ.2.33 కోట్ల రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇచ్చింది.

కమ్యూనిటీ హాల్‌కు భూ కేటాయింపు

తిరుపతి జిల్లా దామినేడు గ్రామంలో వెలమ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎకరం భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ అభ్యర్థన మేరకు ఈ భూమిని ఎండోమెంట్స్ కమిషనర్‌కు అప్పగిస్తూ రెవెన్యూ శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ భూమికి ఎకరాకు రూ.2.50 కోట్ల చొప్పున అసోసియేషన్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ భూమిని కేవలం కమ్యూనిటీ హాల్ కోసమే వాడాలని, ఇతర సంస్థలకు బదిలీ చేయకూడదని తెలిపింది.

పీఏసీఎస్‌ల ఆర్థిక పరిపుష్టికి ఉన్నత స్థాయి కమిటీ

సాక్షి, అమరావతి: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఏస్) కంప్యూటరీకరణ తర్వాత ఆర్థిక పరిస్థితి, పీఏసీఎస్ ఉద్యోగుల హెచ్‌ఆర్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం తీసుకోవల్సిన చర్యలపై సిఫార్సుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయ శాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కమిటీకి మెంబర్ కన్వీనర్‌గా ఆప్కాబ్ ఎండీ వ్యవహరిస్తారు. సభ్యులుగా సహకార శాఖ కమిషనర్, నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం)లను నియమించారు. ఈ కమిటీ పీఏసీఎస్‌ల ఆర్థిక పరిపుష్టి కోసం తీసుకోవల్సిన చర్యలతో పాటు హెచ్‌ఆర్ పాలసీపై సిఫార్సులతో నాలుగు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రంజాన్ మాసంలో సదుపాయాలు కల్పించండి

సాక్షి, అమరావతి: రంజాన్ మాసంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆదేశించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ ఆఫ్ వక్ఫ్‌లతో అబ్దుల్ అజీజ్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ముందుగా ఉమ్మీద్ పోర్టల్ అప్‌లోడ్‌పై చర్చించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన పత్రాలు సమీకరించుకుని ఫస్ట్ సర్వే అప్‌లోడ్‌ను 100 శాతం పూర్తి చేసినట్లుగానే త్వరితగతిన సెకండ్ సర్వే అప్‌లోడ్ కూడా పూర్తి చేయాలని ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. రంజాన్ పండుగ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కమిటీలపై ఆరా తీశారు. అత్యవసరమైన చోట కమిటీలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

చంద్రబాబు దేవుడు

- రోజుకు 18 గంటలు చంద్రబాబు, 20 గంటలు లోకేశ్ పనిచేస్తున్నారు
- బడ్జెట్‌పై చర్చలో చంద్రబాబును కీర్తించిన ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి: మంగళవారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చను చంద్రబాబును కీర్తించే కార్యక్రమంగా టీడీపీ ఎమ్మెల్యేలు మార్చేశారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసి ఆ ప్రాంత ప్రజల పాలిట సీఎం చంద్రబాబు దైవంలా మారారంటూ ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పొగడ్తలతో ముంచెత్తారు. ఈ దైవాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని ఆకాశానికి ఎత్తేశారు. ఈ పొగడ్తలకు బల్లలు చరుస్తూ తోటి ఎమ్మెల్యేలూ వంత పాడారు నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కేటాయింపుపై సభలో చర్చించాల్సింది పోయి చంద్రబాబు దేవుడంటూ కీర్తించారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. మార్కాపురం జిల్లాకు చంద్రన్న మార్కాపురం అని పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఇందుకు ఎమ్మెల్యేలు అందరూ కలిసి సీఎంను ఒప్పించాలన్నారు. రోజుకు 18 గంటలపాటు చంద్రబాబు, 20 గంటలపాటు మంత్రి లోకేశ్ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం దయతో కోటీశ్వరులు అవుతామనే నమ్మకాన్ని రైతులకు సీఎం కల్పించారని చెప్పారు. ప్రకాశం జిల్లా ప్రజలు జీవితాంతం చంద్రబాబును మర్చిపోకూడదన్నారు. గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ.. నలుగురు పిల్లలను కనాలని సీఎం చెబుతున్నారని గుర్తు చేశారు. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో ఐవీఎఫ్, టెస్ట్‌ట్యూబ్ బేబీ సేవలు అందుబాటులోకి తేవాలన్నారు. దీనిపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పందిస్తూ.. థామస్ ఆయన వ్యాపారానికి అనుగుణంగా మాట్లాడారన్నారు. సాధారణంగా కాకుండా ఐవీఎఫ్ ద్వారానే పిల్లలు కనాలని అనడం అన్యాయమన్నారు.

సభ నిర్వహణకు ప్రతిసారీ కోర్టుకు రావాలా?

- బీసీవైపీ మూడుసార్లు వినతిపత్రం ఇచ్చినా స్పందించరా?
- బీసీ సింహగర్జనకు అనుమతిపై వివరాలు సమర్పించండి
- పోలీసులకు హైకోర్టు ఆదేశం.. విచారణ రేపటికి వాయిదా

సాక్షి, అమరావతి: భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ) బీసీ సింహగర్జన పేరుతో ఈ నెల 22న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తలపెట్టిన బహిరంగసభకు అనుమతిచ్చే విషయంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణను గురువారానికి (రేపటికి) వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బహిరంగ సభకు అనుమతి కోసం పోలీసులను ఆదేశించాలని కోరుతూ ప్రతిసారీ కోర్టుకొచ్చే పరిస్థితి ఎందుకు తెస్తున్నారని పోలీసులను న్యాయమూర్తి ప్రశ్నించారు. బహిరంగసభ నిర్వహణ అనేది రాజకీయ పార్టీ హక్కు అని తెలిపారు. అనుమతి కోసం మూడుసార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించరా అని అడిగారు. బీసీ సింహగర్జన పేరుతో తలపెట్టిన బహిరంగసభకు అనుమతి విషయంలో పోలీసులు ఇప్పటి వరకు నిర్ణయం చెప్పలేదంటూ బీసీవైపీ రాష్ట్ర అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై జస్టిస్ లక్ష్మణరావు మంగళవారం విచారణ జరిపారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వై.వి.రవిప్రసాద్ వాదనలు వినిపించారు.

అమరేంద్ర బాహుబలి.... భల్లాలదేవ ఢీ అంటే ఢీ అంటూ ఆయుధాలతో, ఒంటి చేత్తో ఒకరిపై మరొకరు ఎలా దాడి చేసుకున్నారో 'బాహుబలి'లో చూశాం...

కొమురం భీమ్... అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ వారిపై ఏ స్థాయి పోరాటం చేశారో 'ఆర్ఆర్ఆర్'లో చూశాం.

ఇప్పుడు ఈ సినిమాల్లోని క్యారెక్టర్లు 'యానిమేషన్' రూపంలో కనిపిస్తే... అదో థ్రిల్.

అంతేనా... హిరణ్యకశిపుడిని నరసింహావతారంలో ఆ విష్ణువు సంహరించిన ఘటనను 'మహావతార్ నరసింహా'లో చూశాం. అయితే యానిమేషన్ రూపంలోనే ఈ సినిమాని చూశాం. ఈ సిరీస్‌లో ఇంకా ఆరు సినిమాలు రానున్నాయి.

ఇవే కాదు... ఇంకా మరికొన్ని యానిమేషన్ చిత్రాలు రెడీ అవుతున్నాయి. ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడు యానిమేషన్ చిత్రాల నిర్మాణం ఎక్కువైంది. దానికి కారణం ఆ చిత్రాలకు దక్కుతున్న ప్రేక్షకాదరణ... వస్తున్న వసూళ్లు.

ఇక 'ఆన్ మిషన్' అంటూ జోరుగా నిర్మాణంలో ఉన్న 'యానిమేషన్ మూవీస్' గురించి తెలుసుకుందాం.





ఆన్ మిషన్
జోరు మీదున్న యానిమేషన్ మూవీస్


• రాజమౌళి

ఇటు బాహుబలి... అటు ఆర్ఆర్ఆర్

ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో పాన్ ఇండియా మార్కెట్ ట్రెండ్‌ను తెరపైకి తెచ్చిన ఈ తరం దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి. ఇప్పుడు మహేశ్‌బాబుతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో 'వారణాసి' సినిమాను తెరకెక్కిస్తూ, అదే స్థాయిలో రిలీజ్‌ను ప్లాన్ చేస్తూ, పాన్-వరల్డ్ ట్రెండ్‌ను టాలీవుడ్‌లో స్టార్ట్ చేశారు. అలాగే రాజమౌళి చూపు యానిమేషన్ చిత్రాలపై పడినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటికే రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన చాలా సినిమాల్లో భారీ స్థాయి వీఎఫ్ఎక్స్ విజువల్ వండర్స్‌ను ఆడియన్స్ తెరపై చూశారు. ముఖ్యంగా 'ఈగ' సినిమాను రాజమౌళి సూపర్బ్ టెక్నికల్ స్టాండర్డ్స్‌తో తెరకెక్కించారు. ఆయన డైరెక్షన్‌లో వచ్చిన 'బాహుబలి' ('బాహుబలి: ది బిగినింగ్', 'బాహుబలి: ది కన్‌క్లూజన్'), 'ఆర్ఆర్ఆర్' సినిమాల కొనసాగింపు కథలు యానిమేషన్ రూపంలో ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా, రానా, అనుష్క, రమ్యకృష్ణ, నాజర్, తమన్నా, సత్యరాజ్ ప్రధాన పాత్రల్లో నటించిన బ్లాక్‌బస్టర్ మూవీ 'బాహుబలి'. ఈ సినిమా తొలి భాగం 'బాహుబలి: ది

బిగినింగ్' విడుదలై పదేళ్లు పూర్తయిన సందర్భంగా 'బాహుబలి: ది బిగినింగ్, బాహుబలి: కన్‌క్లూజన్' చిత్రాలను కలిపి 'బాహుబలి: ది ఎపిక్'గా గత ఏడాది 31 అక్టోబరు 2025న విడుదల చేశారు. ఆ సమయంలో 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి మూడో భాగానికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ రావొచ్చనే ఊహాగానాలు పెద్ద ఎత్తున ప్రచారంలోకి వచ్చాయి. కానీ 'బాహుబలి' కథకు కొనసాగింపుగా 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' అనే యానిమేషన్ సినిమా త్రీడీ ఫార్మాట్‌లో రానుందని, రాజమౌళి అధికారికంగా వెల్లడించారు. 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' సినిమా టీజర్‌ను కూడా రిలీజ్ చేసి, ఈ సినిమాను 2027లో రిలీజ్ చేయనున్నట్లుగా రాజమౌళి తెలిపారు. మరో విశేషం ఏంటంటే.. 2027లో రిలీజ్ అవుతున్నది 'ది బాహుబలి: ది ఎటర్నల్ వార్' తొలి భాగం మాత్రమే. అంటే... 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి మరికొన్ని యానిమేషన్ చిత్రాలొస్తాయని ఊహించవచ్చు. దేవ, రాక్షసుల యుద్ధంలో బాహుబలి ప్రమేయం ఉంటే ఏం జరుగుతుంది? అనే పాయింట్ ఆఫ్ వ్యూలో 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' సినిమా కథనం సాగుతుందని తెలుస్తోంది. ఈ త్రీడీ యానిమేషన్ సినిమాను దాదాపు రూ. 120 కోట్లతో తెరకెక్కిస్తున్నారట మేకర్స్. ఆర్కా మీడియా వర్క్స్, ముంబైకి చెందిన యానిమేషన్ లీడ్ స్టూడియో 88 పిక్చర్స్ ఈ సినిమా నిర్మాణంలో అసోసియేట్ అయ్యాయి. ఇషాన్ శుక్లా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, రాజమౌళి ఈ సినిమాకు సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ''బాహుబలి: ది ఎటర్నల్ వార్' సినిమాకు నా పర్యవేక్షణ కూడా ఉంటుంది. ఇప్పటికే విడుదలైన 'బాహుబలి' సినిమాల్లోని క్యారెక్టర్స్‌తో పాటు మరికొన్ని కొత్త పాత్రలను ఈ సినిమాలో చూస్తారు'' అని ఓ సందర్భంలో రాజమౌళి పేర్కొన్నారు.

ఆర్ఆర్ఆర్ యూనివర్స్

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో 2022 మార్చి 25న ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ఆర్ఆర్ఆర్' సినిమా ఎంతటి బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాట ప్రపంచవ్యాప్తంగా సూపర్ హిట్ కావడం, ఈ పాట రచయిత చంద్రబోస్, సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణిలకు ఆస్కార్ అవార్డులు రావడం కూడా తెలిసిందే. అయితే 'ఆర్ఆర్ఆర్' సినిమా విడుదలైన తర్వాత ఒకట్రెండు సందర్భాల్లో 'ఆర్ఆర్ఆర్ 2' ఉండే అవకాశం ఉందని, ఈ చిత్రం కథారచయిత విజయేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఇప్పుడు 'ఆర్ఆర్ఆర్' కథకు కొనసాగింపుగా సినిమా రానుంది. కానీ లైవ్ యాక్షన్ ఫీచర్ ఫిల్మ్ కాదు... యానిమేషన్ ఫిల్మ్. 'ఆర్ఆర్ఆర్' సినిమాకు కొనసాగింపుగా 'ఆర్ఆర్ ఆర్' యూనివర్స్‌లో ఓ యానిమేషన్ సినిమా చేసే ఆలోచన ఉందని, ఈ అంశంపై జపాన్ స్టూడియోలు వర్క్ చేస్తున్నాయని ఇటీవల ఓ సందర్భంలో రాజమౌళి పేర్కొన్నారు. ఇలా... ఒకవైపు లైవ్ యాక్షన్ ఫీచర్ ఫిల్మ్స్ చేస్తూనే, భవిష్యత్‌లో యానిమేషన్ సినిమాల హవా ఉంటుందని ఇప్పట్నుంచే రాజమౌళి ఈ దిశగా అడుగులు వేస్తున్నట్లుగా స్పష్టంగా తెలుస్తోంది

• మారుతి

• ప్రశాంత్ వర్మ

ఏఐతో 'కొచ్చడైయాన్'

రజనీకాంత్ హీరోగా, ఆయన కుమార్తె సౌందర్య రజనీకాంత్ దర్శకత్వం వహించిన తొలి సినిమా 'కొచ్చడైయాన్' (2014). ఈ తమిళ పీరియాడికల్ యానిమేషన్ మూవీని సునీల్, సునంద మురళీ మనోహర్, ప్రశీదా చౌదరి నిర్మించారు. ఈరోస్ ఇంటర్‌నేషనల్ సంస్థ ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేసింది. కాగా ఈ సినిమా త్వరలోనే రీ రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది. అంటే...'కొచ్చడైయాన్' సినిమాను



ఏఐ (కృత్రిమ మేధ)తో కొత్త వెర్షన్ రెడీ చేశారు. ఈ రీ మాస్టర్డ్ 'కొచ్చడైయాన్' మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో టీజర్‌ను మంగళవారం రిలీజ్ చేశారు మేకర్స్. ''పదేళ్ల క్రితం మోషన్ క్యాప్చర్ ఫిల్మ్‌గా చేశాం. ఈ సినిమా నన్ను చాలెంజ్ చేసింది. నన్ను చేంజ్ చేసింది. 'కొచ్చడైయాన్' రీ మాస్టర్డ్ టీజర్‌ని రిలీజ్ చేయడం భావోద్వేగానికి గురి చేస్తోంది'' అని సౌందర్య రజనీకాంత్ పేర్కొన్నారు. దీపికా పదుకోన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో శోభన్, ఆర్. శరత్ కుమార్, ఆది పినిశెట్టి ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు.

మహావతార్ యూనివర్స్

గత ఏడాది జూలైలో విడుదలైన యానిమేషన్ సినిమా 'మహావతార్ నరసింహా' బాక్సాఫీస్ దుమ్ము దులిపేసింది. ఎటువంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ యానిమేషన్ సినిమాను దాదాపు రూ. 40 కోట్ల బడ్జెట్‌తో మేకర్స్ నిర్మించగా, ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 350 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. అశ్విన్‌కుమార్ డైరెక్షన్‌లో క్లిమ్ ప్రొడక్షన్స్, హోంబలే ఫిల్మ్స్ సంస్థలు 'మహావతార్ నరసింహా'ను నిర్మించాయి. అయితే ఇక్కడ ప్రస్తావించుకోవాల్సిన విషయం ఏంటంటే...'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్' నుంచి 'మహావతార్ పరశురామ్' (2027), 'మహావతార్ రఘునందన్' (2029) – (రామావతారం), 'మహావతార్ ద్వారకాధీష్' (2031) – (కృష్ణుడు), 'మహావతార్ గోకులానంద' (2033) – (కృష్ణుడి బాల్యం/గోకులం), 'మహావతార్: కల్కి పార్ట్ 1' (2035), 'మహావతార్: కల్కి పార్ట్ 2' (2037) చిత్రాలు రానున్నాయి. 'మహావతార్ నరసింహా' తర్వాత 'మహావతార్ పరశురామ్' సినిమాను థియేటర్స్‌లో రిలీజ్ చేస్తామని, ప్రతి రెండేళ్లకొకసారి, మహావతార్ సినిమాటిక్ యూనివర్స్ నుంచి ఓ యానిమేషన్ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామని, దర్శకుడు అశ్విన్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. భవిష్యత్‌లో యానిమేషన్ చిత్రాలకు ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో గొప్ప ఆదరణ ఉంటుందని కూడా అశ్విన్ పేర్కొన్నారు.

వాయుపుత్ర

భారతీయ ఇతిహాసాలు 'రామాయణం, మహాభారతం' ఆధారంగా చాలా సినిమాలు వచ్చాయి... మరి కొన్ని నిర్మాణంలో ఉన్నాయి. కాగా పర్వతాలనే కదిలించిన



మహా బలశాలి, అంజనీపుత్రుడు హనుమంతుని జీవితం ఆధారంగా 'వాయుపుత్ర' అనే యానిమేషన్ సినిమా తెరకెక్కుతోంది. 'కార్తికేయ, కార్తికేయ 2' చిత్రాలను తెరకెక్కించిన చందు మొండేటి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ త్రీడీ యానిమేషన్ సినిమాను సితార ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబరులో 'వాయుపుత్ర' సినిమాను అధికారికంగా ప్రకటించారు. 2డీ, 3డీ ఫార్మాట్స్‌లో 'వాయుపుత్ర' సినిమాను ఈ ఏడాది దసరాకు తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ తెలిపారు.

కీకీ అండ్ కోకో

యానిమేషన్ చిత్రాల్లోనే కిడ్స్ నేపథ్యంలో వచ్చే సినిమాలకు మంచి క్రేజ్ ఉంటుంది. హాలీవుడ్ నుంచి ఇండియన్ వ్యూయర్స్ ముందుకు వచ్చిన పలు బాలల యానిమేషన్ చిత్రాలకు విశేషమైన ఆదరణ దక్కింది. అయితే ఈసారి ఈ జానర్‌లో ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ నుంచి 'కీకీ అండ్ కోకో' సినిమా రానుంది. బాలనటి శ్రీనిక ప్రధాన పాత్రధారిగా పి. నారాయణన్ దర్శకత్వంలో ధరణి నిర్మించిన ఈ కిడ్స్ యానిమేషన్ సినిమా త్వరలోనే రిలీజ్ కానుంది.

పినాకిన్

లార్డ్ శివ నేపథ్యంలో 'పినాకిన్' అనే యానిమేషన్ చిత్రం రూపొందుతోంది. కమల్ భారతి ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై హర్ష్ పండిట్, వామన్ రాణే ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా 'పినాకిన్' సినిమాను అధికారికంగా ప్రకటించారు మేకర్స్. అంతేకాదు... ఈ చిత్రాన్ని ఈ ఏడాదే తెలుగు, తమిళ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో రిలీజ్ చేయనున్నట్లుగా తెలిపారు. అలాగే మహాశివరాత్రి సందర్భంగానే 'శివ్ సతీ' అనే మరో యానిమేషన్ సినిమాను ప్రకటించారు. వివేక్ అంచాలియా ఈ సినిమాకు దర్శకుడు.

ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్

ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన 'హను-మాన్' సినిమా ఎంతపెద్ద విజయం సాధించిందో తెలిసిందే. ఇందులో తేజ సజ్జా హీరోగా నటించారు. ఈ యూనివర్స్ నుంచే ఇంకా 'మహాకాళి, అధీర, జై హనుమాన్' వంటి సినిమాలు రానున్నాయి. హనుమాన్ మూవీకి 71వ జాతీయ అవార్డుల్లో వీఎఫ్ఎక్స్-యానిమేషన్ విభాగంలో అవార్డులు వచ్చిన విషయం గుర్తుంటే ఉంటుంది (యానిమేషన్ విభాగంలో జెట్టి వెంకట్‌కుమార్ అవార్డు అందుకున్నారు). అయితే ఈ యూనివర్స్ నుంచే రెండు యానిమేషన్ చిత్రాలను రూపొందించాలనే ఆలోచనలో ఉన్నారట ప్రశాంత్ వర్మ. గత ఏడాది గోవా వేదికగా జరిగిన 56వ ఇఫీ వేడుకల్లో పాల్గొన్న ఆయన యానిమేషన్ చిత్రాలను రూపొందించే ఆలోచనలో ఉన్నట్లుగా చెప్పినట్లు వార్తలు ఉన్నాయి. ఇక రిషబ్ శెట్టి హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలోని 'జై హనుమాన్' సినిమా ఈ నెల 22న హంపిలో ప్రారంభం కానుందని, ఈ సినిమాలో రానా ఓ కీలక పాత్రలో నటించనున్నారని తెలిసింది. అలాగే 'జై హనుమాన్' చిత్రంలో తేజ సజ్జా కూడా నటిస్తారని సమాచారం. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్నారు.

భలే భలే మగాడివోయ్ సీక్వెల్

నాని, లావణ్యా త్రిపాఠి హీరో హీరోయిన్లుగా మారుతి డైరెక్షన్‌లో రూపొందిన 'భలే భలే మగాడివోయ్' సినిమా 2015లో విడుదలై, సూపర్‌హిట్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్ రావొచ్చనే వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. దీంతో ప్రభాస్ 'ది రాజాసాబ్' సినిమా ప్రమోషన్స్‌లో మారుతి ఈ అంశంపై స్పందించారు. 'భలే భలే మగాడివోయ్' సినిమాకు సీక్వెల్ కథను యానిమేషన్ రూపంలో తీసుకు వచ్చే ఆలోచన ఉందని మారుతి చెప్పారు. ఇండస్ట్రీకి రాకముందు మారుతికి యానిమేటర్‌గా వర్క్ చేసిన అనుభవం ఉంది. అలా యానిమేషన్ రంగంలో ఆల్రెడీ ఆయనకు ప్రవేశం ఉంది. ఒకసారి తెలుగు ఇండస్ట్రీలో యానిమేషన్ సినిమాల హవా ఊపందుకుంటే, ఆయన డైరెక్షన్‌లో ఓ యానిమేషన్ మూవీ రావొచ్చని ఊహించవచ్చు.

ఈ కోవలో మరికొన్ని యానిమేషన్ చిత్రాలు రూపొందుతున్నాయి. ముఖ్యంగా మన భారత పురాణ కథల ఆధారంగా ఎక్కువగా యానిమేషన్ చిత్రాలు రూపొందడం విశేషం. ఆ రకంగా వినోదానికి వినోదం... విజ్ఞానానికి విజ్ఞానం అందుతుంది. నేటి తరం పురాణ కథలు తెలుసుకోవడానికి ఈ యానిమేషన్ చిత్రాలు ఉపయోగపడతాయని చెప్పొచ్చు.

- ముసిమి శివాంజనేయులు

• 'నే ఝా 2' పోస్టర్

యానిమేషన్ సినిమా వసూళ్లు రూ. 19 వేల కోట్లు

ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు సాధించిన టాప్ టెన్ చిత్రాల జాబితాలో ఓ యానిమేషన్ సినిమా ఉంది. అదే 'నే ఝా 2' (2019లో వచ్చిన 'నే ఝా' సినిమాకు ఇది సీక్వెల్). చైనీస్ మైథాలజీతో కూడిన ఈ 'నే ఝా 2' చిత్రం గత ఏడాది జనవరి 29న రిలీజైంది. యు యంగ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. చైనాలో బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా సరికొత్త రికార్డులను సృష్టించింది. 2025 చివర్లో ఇతర విదేశీ భాషల్లో కూడా ఈ సినిమా అనువాదమై, సూపర్‌హిట్‌గా నిలిచింది. దాదాపు రూ. 700 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చైనీస్ యానిమేషన్ సినిమా ప్రపంచవ్యాప్తంగా 2.2 బిలియన్ డాలర్లకు పైగా వసూళ్లను కొల్లగొట్టి ట్రేడ్ వర్గీయులను ఆశ్చర్యపరిచింది. బాక్సాఫీసు వద్ద కనక వర్షం కురిపించింది. మాస్టర్ షెన్‌కు వ్యతిరేకంగా నే ఝా ఎలా పోరాటం చేశాడు? ఈ పోరాటంలో నే ఝా స్నేహితుడు అవో బింగ్ సహకారం ఏంటి? అనే అంశాల నేపథ్యంలో 'నే ఝా 2' కథ సాగుతుంది. ఈ సినిమా ఈ నెల 20 నుంచి జియో హాట్‌స్టార్ ఓటీటీలో ఇంగ్లిష్, హిందీ, మాండరీన్ (చైనా భాష) భాషల్లో యాపిల్ టీవీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది.

బిజినెస్ రీల్

ఫారెక్స్ లావాదేవీల సరళతరంపై ఆర్‌బీఐ ఫోకస్

ముంబై: హెడ్జింగ్ అవసరాల కోసం అధీకృత డీలర్లు విదేశీ మారక లావాదేవీలను సులభంగా నిర్వహించేలా నిబంధనలను సరళతరం చేయడంపై ఆర్‌బీఐ దృష్టి పెట్టింది. ఇందుకు సంబంధించి వారికి మరింత వెసులుబాటు కల్పించేలా ముసాయిదా నిబంధనలను రూపొందించింది. వీటి ప్రకారం అధీకృత డీలర్లు విదేశీ కరెన్సీ మారకంలో రుణాలు తీసుకోవచ్చు, ఇవ్వొచ్చు. అలాగే, రూపాయికి సంబంధించి నాన్–డెలివరబుల్ డెరివేటివ్ కాంట్రాక్టులను కూడా తీసుకోవచ్చు. వీటిపై సంబంధిత వర్గాలు మార్చి 10లోగా తమ అభిప్రాయాలను తెలపాల్సి ఉంటుంది.

ఆస్క్ అసెట్ వెల్త్‌కు ఫండ్స్ లైసెన్స్

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్ వ్యాపారం ప్రారంభించేందుకు సెబీ నుంచి లైసెన్స్ వచ్చినట్టు ఆస్క్ అసెట్ అండ్ వెల్త్ మేనేజ్‌మెంట్ గ్రూప్ ప్రకటించింది. యాక్టివ్ ఈక్విటీ, ప్యాసివ్, హైబ్రిడ్, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ విభాగాల్లో పథకాలను తీసుకురానున్నట్టు తెలిపింది. మొదటిసారి పెట్టుబడులు పెట్టే వారి నుంచి, దీర్ఘకాల పెట్టుబడిదారులు, అధిక ధనవంతులు (హెచ్ఎన్ఐలు), సంస్థాగత పెట్టుబడిదారులను ఆకర్షించనున్నట్టు పేర్కొంది. 2012లో ఆస్క్ అసెట్ అండ్ వెల్త్ మేనేజ్‌మెంట్ గ్రూప్‌లో మెజారిటీ వాటాను బ్లాక్‌స్టోన్ నిర్వహణలోని ప్రైవేటు ఈక్విటీ ఫండ్స్ సొంతం చేసుకోవడం గమనార్హం.

పైసాబజార్ నుంచి బిల్ పేమెంట్ సర్వీసులు

గురుగ్రాం: క్రెడిట్, ఉచిత క్రెడిట్ స్కోర్ సేవలందించే పైసాబజార్ తమ యాప్‌లో బిల్ పేమెంట్స్, మొబైల్ రీచార్జ్ సర్వీసులను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. ప్రీపెయిడ్ మొబైల్ రీచార్జ్‌లు, పోస్ట్‌పెయిడ్ మొబైల్ బిల్స్, క్రెడిట్ కార్డు, రుణాల చెల్లింపులు మొదలైన వాటికి ఇవి ఉపయోగపడతాయని పేర్కొంది. జీరో ప్లాట్‌ఫాం ఫీజు, ప్రతి లావాదేవీపై కచ్చితమైన రివార్డులు మొదలైన ప్రయోజనాలను అందిస్తున్నట్లు పేర్కొంది. నెలకు దాదాపు రూ. 15,000 కోట్ల స్థాయిలో ఉంటున్న మొబైల్ రీచార్జ్ మార్కెట్‌లో అవకాశాలను అందిపుచ్చుకోవడంపై దృష్టి పెడుతున్నట్లు వివరించింది. కంపెనీ ఇప్పటికే బాండ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్స్ విభాగంలోకి ప్రవేశించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-2-2026

విశాఖ	515-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	75.00
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	866	2.07
SBIN	976.35	1.58
HINDALCO	848	1.3
EICHERMOT	7,143.00	1.15
TATACONSUM	1,180.00	0.86

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
MAXHEALTH	1,033.20	-3.71
APOLLOHOSP	6,912.00	-1.98
TRENT	4,040.30	-1.66
BAJAJ-AUTO	8,868.00	-1.55
HDFCLIFE	752.95	-1.49

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,667
ఎన్ఎస్ఈ	95,691
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,03,827
ఎఫ్ఐఐ	+ 995
డీఐఐ	+ 187

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.28 (రాత్రి 11.30కు)	$ 62.75 (క్రితం ముగింపు)
బ్రెంట్	67.31 (రాత్రి 11.30కు)	$ 68.65 (క్రితం ముగింపు)

అలా గ్రూప్‌తో టీవీఎస్ సప్లై జత

వైమానిక, రక్షణ రంగ సరఫరా చైన్‌పై కన్ను

ముంబై: సరఫరాల చైన్ కంపెనీ టీవీఎస్ సప్లై చైన్ తాజాగా ఇటలీ సంస్థ ఏఎల్ఏ(అలా) గ్రూప్‌తో చేతులు కలిపింది. తద్వారా వైమానిక, రక్షణ రంగ సరఫరా చైన్ విభాగంలోకి ప్రవేశించనుంది. తొలుత దేశీ మార్కెట్లో కార్యకలాపాల విస్తరణపై దృష్టి పెట్టనున్నట్లు తెలియజేసింది. ప్రాథమిక దశ ఒప్పందంలో భాగంగా రెండు కంపెనీలు సంయుక్తంగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలలో సప్లై చైన్ అవకాశాలను అందిపుచ్చుకోవడంపై వ్యూహాత్మక మార్గదర్శకాలకు తెరతీయనున్నాయి. దేశీయంగా ఏరోస్పేస్, డిఫెన్స్ మార్కెట్ విలువ 28 బిలియన్ డాలర్లుగా అంచనాకాగా.. ఇండస్ట్రియల్ సరఫరా చైన్‌లలో అత్యంత లాభదాయక విభాగాలుగా టీవీఎస్ సప్లై పేర్కొంది. రెండు సంస్థలు సంయుక్తంగా సమీకృత సరఫరా చైన్ సర్వీసులను అందించనున్నట్లు వెల్లడించింది.

కర్ణాటకలో టాటా-ఎయిర్‌బస్ హెలికాప్టర్ అసెంబ్లీ లైన్

న్యూఢిల్లీ: ఎయిర్‌బస్ హెచ్125 హెలికాప్టర్లకు సంబంధించి భారత్‌లో తొలి ప్రైవేట్ రంగ హెలికాప్టర్ ఫైనల్ అసెంబ్లీ లైన్ని (ఎఫ్ఏఎల్) కర్ణాటకలోని వేమగల్‌లో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్) ప్రారంభించింది. దీన్ని ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుయెల్ మాక్రాన్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఏరోస్పేస్ రంగంలో స్వావలంబన సాధనలో ఇదొక కీలక ఘట్టమని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తెలిపారు. ఇందులో హెచ్125 ఎం మిలిటరీ వెర్షన్ హెలికాప్టర్లను కూడా తయారు చేయొచ్చని ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ సీఈవో బ్రూనో ఈవెన్ తెలిపారు.

నాగ్‌పూర్‌లో కేర్ హాస్పిటల్

రూ. 600 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: క్వాలిటీ కేర్ ఇండియా (క్యూసీఐఎల్) తాజాగా నాగ్‌పూర్‌లో 350 పడకలతో అధునాతన మల్టీ–స్పెషాలిటీ కేర్ ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించి లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్ లభించినట్లు వివరించింది. కస్తూర్‌చంద్ పార్క్ మెట్రో స్టేషన్ సమీపంలో మహా–మెట్రో స్థలంలో దీన్ని నిర్మించనున్నట్లు సంస్థ తెలిపింది. దీనిపై రూ. 600 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు క్యూసీఐఎల్ వివరించింది. కార్డియాక్ సైన్సెస్, ఆంకాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ తదితర విభాగాల్లో అత్యుత్తమ సేవలందించే విధంగా ఇది ఉంటుందని పేర్కొంది. దశలవారీగా ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తుందని, సుమారు 1,500 పైచిలుకు ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు కల్పించగలదని కేర్ హాస్పిటల్స్ సీఈవో పవన్ కుమార్ తెలిపారు.

డిజిటల్ రాజ్యంలోనూ.. క్యాషే కింగ్

- మార్కెట్లో పెరుగుతున్న నోట్ల కట్టలు
- జనవరి చివరికి నగదు చలామణీ రూ.40 లక్షల కోట్లు
- ఏడాదిలో 11 శాతం పెరుగుదల
- డిజిటల్ చెల్లింపులూ అధికమే
- ఏటీఎంల నుంచి పెరుగుతున్న ఉపసంహరణలు

న్యూఢిల్లీ: దేశంలో ఒకవైపు యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులు గణనీయంగా పెరుగుతుండగా.. మరోవైపు వ్యవస్థలో నగదు చలామణి సైతం ఆసక్తికరంగా విస్తరిస్తోంది. జనవరి చివరికి చలామణిలో ఉన్న నగదు రూ.40లక్షల కోట్లకు చేరినట్టు ఎస్‌బీఐ పరిశోధన విభాగం నివేదిక వెల్లడించింది. 2025 జనవరి నుంచి చూస్తే ఏడాదిలో 11.1 శాతం పెరిగింది. ఏడాది కాలంలో నికరంగా రూ.2.76 లక్షల కోట్ల నగదు వినియోగం అధికమైంది. ప్రజల వద్దనున్న నగదు కూడా ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిలో 97.6 శాతంగా ఉంది. విలువ పరంగా రూ.39 లక్షల కోట్లు. 2020–21 (కరోనా అనంతరం) నాటి నుంచి ప్రజల వద్ద నగదు నికరంగా రూ.4.6 లక్షల కోట్లు పెరిగినట్టు ఎస్‌బీఐ పరిశోధన నివేదిక ఆధారంగా తెలుస్తోంది. అంతేకాదు, ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరణలు, ముఖ్యంగా కొన్ని రాష్ట్రాల్లో (కర్ణాటక, వెస్ట్ బెంగాల్, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, జార్ఖండ్) పెరుగుతుండడం గమనార్హం. నగదు వినియోగం పెరుగుతున్నప్పటికీ.. జీడీపీలో నగదు నిష్పత్తి మాత్రం 2021 మార్చి నాటికి ఉన్న 14.4 శాతం నుంచి 11 శాతానికి తగ్గింది.

నగదు ఉపసంహరణలు..

ఏటీఎంల నుంచి నెలవారీ నగదు ఉపసంహరణలు దీర్ఘకాల సగటు రూ.2.5 లక్షల కోట్లను అధిగమించినట్టు తాజా డేటా స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా కర్ణాటక, తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరణలు పెరిగాయి. కర్ణాటకలో జీఎస్‌టీ విభాగం గతేడాది జూలైలో ఏకంగా 18,000 మంది చిన్న వర్తకులకు పన్ను నోటీసులు జారీ చేసింది. వీరి యూపీఐ లావాదేవీలు ఏడాదిలో రూ.40 లక్షలు దాటడమే ఇందుకు కారణం. ఈ పరిమితి దాటితే వారు జీఎస్‌టీ కింద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ చర్య యూపీఐ చెల్లింపులను నిరుత్సాహపరిచి ఉండొచ్చని ఈ నివేదిక అభిప్రాయపడింది. జీఎస్‌టీ విభాగం నోటీసులు జారీ తర్వాత కర్ణాటక రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరణ రూ.37 కోట్ల మేర అదనంగా పెరిగినట్టు తెలిసింది. పశ్చిమబెంగాల్, కేరళలలోనూ ఇదే ధోరణి కనిపించింది.

నగదు పెరగడం వెనుక..

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల వద్ద నగదు కలిగి ఉండడం కూడా పెరిగింది. జీడీపీ వృద్ధికి అనుగుణంగా కరెన్సీకి సైతం డిమాండ్ పెరగడం సహజమేనని... వడ్డీ రేట్లు తక్కువలో ఉండడం కూడా ప్రజల వద్ద నగదు పెరగడానికి ఒక కారణమని ఈ నివేదిక పేర్కొంది. బంగారం, వెండి ధరలు గణనీయంగా పెరిగిపోవడం కూడా మార్కెట్లో నగదు లభ్యత అధికం కావడానికి దారితీసినట్టు విశ్లేషించింది. ధరలు పెరగడంతో ఇళ్లల్లోని పాత బంగారం, వెండిని విక్రయించడం ద్వారా ప్రజల వద్ద సొమ్ము పెరిగినట్టు తెలిపింది. 2025 మార్చి నాటికి వినియోగంలోని రూ.500 నోట్ల విలువ 8.9 శాతం పెరిగి మొత్తం నగదులో 89 శాతానికి చేరింది. పరిమాణం పరంగా 3 శాతం పెరిగి మొత్తం వినియోగ నోట్లలో 40.9 శాతానికి చేరింది. విలువ పరంగా రూ.100 నోట్ల వినియోగం ఒక శాతం పెరిగి 4.7 శాతానికి చేరగా, రూ.200 నోట్ల వినియోగం మొత్తం కరెన్సీలో 0.8 శాతానికి చేరింది. ముఖ్యంగా రూ.500 నోట్ల వినియోగం అధికంగా ఉండడం వెనుక.. రూ.500 లోపు చెల్లింపులకు యూపీఐని ఎక్కువగా వినియోగిస్తుండడం కారణం. వినియోగంలో నగదు చలామణి రూ.40 లక్షల కోట్లకు చేరినప్పటికీ.. ఒక్క నెలలో యూపీఐ లావాదేవీల విలువ రూ.28 లక్షల కోట్ల స్థాయిలో ఉండడం గమనార్హం. 2025 అక్టోబర్‌లో నెలవారీ రూ.2.1 లక్షల కోట్ల విలువ మేర యూపీఐ లావాదేవీలు నికరంగా పెరిగి రూ.27.3 లక్షల కోట్లకు చేరడం గమనార్హం. నవంబర్‌లో రూ.26.3 లక్షల కోట్లకు తగ్గినప్పటికీ.. తిరిగి డిసెంబర్‌లో రూ.28 లక్షల కోట్లు, 2026 జనవరిలో రూ.28.3 లక్షల కోట్ల చొప్పున నమోదయ్యాయి.

రూపే కార్డు వినియోగం పెంచాలి

న్యూఢిల్లీ: చెల్లింపులకు యూపీఐ ప్రధాన సాధనంగా మారిందని.. నగదు లావాదేవీలను మించిపోయాయని కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రకటించింది. రూపే డెబిట్ కార్డు వాడకం పెంచేందుకు ఇప్పుడు లక్షిత చర్యలు అవసరమని పేర్కొంది. ఇందుకు సంబంధించి ఒక సర్వే చేసింది. 15 రాష్ట్రాల్లో 10,378 మంది అభిప్రాయాలను స్వీకరించింది. భిన్న సామాజిక ఆర్థిక విభాగాల్లో డిజిటల్ చెల్లింపుల ఆమోదం పెరిగినట్టు తెలిసింది. సర్వేలో పాల్గొన్న వారిలో 57 శాతం మంది చెల్లింపులకు యూపీఐ సాధనాన్ని వినియోగిస్తున్నారు. నగదు వినియోగం 38 శాతాన్ని ఇది అధిగమించినట్టు ఈ నివేదిక తెలిపింది. సులభంగా, చెల్లింపులు అప్పటికప్పుడు పూర్తయిపోతుండడాన్ని ఇందుకు అనుకూలంగా పేర్కొంది. 65 శాతం మంది రోజులో ఒకటికి మించిన లావాదేవీలను యూపీఐ ద్వారానే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రూపే డెబిట్ కార్డు వినియోగాన్ని, ముఖ్యంగా గ్రామీణ, చిన్న పట్టణాల్లో పెంచాలంటూ.. వర్తకులు ఈ కార్డులను ఆమోదించే విధంగా ప్రోత్సాహక కార్యక్రమాలను అమలు చేయాలని సూచించింది.

లోకల్‌తో పోటీకి బ్రిటానియా రెడీ

- ఈ కామర్స్‌లో మరింత బలపడతాం
- సంస్థ ఎండీ, సీఈవో రక్షిత్ హర్గవే

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో చిన్న సంస్థలతో పోటీ పడేందుకు బ్రిటానియా ఇండస్ట్రీస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. చిన్న సంస్థలతో పోటీపడేందుకు స్టార్టప్ స్వభావంతో బ్రిటానియా వ్యవహరిస్తుందని.. ఈ–కామర్స్ విభాగంలో బిస్కెట్లు, రస్క్, కేక్, వేఫర్‌ల విభాగాల్లో మరింత బలంగా అవతరిస్తామని సంస్థ ఎండీ, సీఈవో రక్షిత్ హర్గవే తెలిపారు. ‘‘ప్రాంతీయ పోటీని ఎదుర్కొంటాం. ఈ–కామర్స్‌లో విస్తరణపై పెట్టుబడులు పెడతాం. అమ్మకాలు పెంచుకునేందుకు మాకు తగినన్ని అవకాశాలున్నాయని భావిస్తున్నాం’’అని వాటాదారులతో నిర్వహించిన కాల్‌లో భాగంగా చెప్పారు. విక్రయాలు పెంచుకునేందుకు మరింత మంది వినియోగదారులను చేరుకోవడం కీలకమని పేర్కొన్నారు. గుడ్‌డే, టైగర్, న్యూట్రిచాయిస్, మ్యారీగోల్డ్ తదితర పాపులర్ బ్రాండ్లు బ్రిటానియా ఇండస్ట్రీస్ సొంతం. చిన్న కంపెనీలను ప్రాంతీయ పోటీదారులుగానే చూస్తామంటూ.. కేవలం తూర్పునే కాకుండా దేశవ్యాప్తంగా చిన్న సంస్థల నుంచి వస్తున్న పోటీని సవాలుగా పేర్కొన్నారు.

ద్రవ్యోల్బణం వల్లే..

ద్రవ్యోల్బణం, ధరలు పెంచడంలో జాప్యం లోగడ మార్జిన్లపై ప్రభావం చూపించిందని, కమోడిటీ ధరలు దిగిరావడతో కంపెనీ లాభదాయకత మెరుగుపడినట్టు రక్షిత్ హర్గవే చెప్పారు. కీలకమైన ముడి పదార్థాలు, పాలు గోధుమల ధరలు స్థిరంగానే ఉన్నాయని.. రానున్న రోజుల్లో ఎలా ఉంటాయో చూడాలన్నారు. చెక్కెర, కోకోవా ధరలు స్థిరంగా ఉండొచ్చన్నారు.

కొనుగోళ్లకూ సై..

విస్తృతమైన పోర్ట్‌ఫోలియో నిర్మాణం దిశగా అవసరమైతే కొనుగోళ్ల అవకాశాలనూ బ్రిటానియా ఇండస్ట్రీస్ పరిశీలిస్తుందని చెప్పారు. అన్నీ సొంతంగానే నిర్మించుకోవడం సాధ్యం కాదన్నారు. చిన్న సంస్థలు ప్రాంతీయంగా అక్కడి ప్రజల ఇష్టాలు, అభిరుచులను మరింత మెరుగ్గా అర్థం చేసుకోగలవని, అవి వాటి బలమని బ్రిటానియా ఇండస్ట్రీస్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ విపిన్ కటారియా తెలిపారు. వాటితో పోటీపడేందుకు బ్రాండ్ నిర్మాణంపై పెట్టుబడులు పెడుతున్నట్టు వాటాదారుల సమావేశంలో చెప్పారు.

ఎంఎస్ఎంఈలకు రుణ లభ్యత పెంచుతాం

ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

ముంబై: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈలు) సకాలంలో సంఘటిత రంగం నుంచి అవసరమైన మేర రుణాలు లభించేలా చూడడమే సెంట్రల్ బ్యాంకుకు విధానపరమైన ప్రాధాన్యత అని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఎంపిక చేసిన ఎంఎస్ఎంఈల ప్రతినిధులతో ఆర్‌బీఐ గవర్నర్ సంప్రదింపులు నిర్వహించారు. జీడీపీలో గణనీయమైన వాటాతో, దేశ ఆర్థిక వ్యవస్థలో ఎంఎస్ఎంఈలు పోషిస్తున్న కీలక పాత్రను, ఉపాధి కల్పనను ఈ సందర్భంగా గవర్నర్ మల్హోత్రా ప్రశంసించినట్లు ఆర్‌బీఐ ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ ఎంఎస్ఎంఈలకు సంబంధించి తీసుకున్న కీలక చర్యలను ఈ సందర్భంగా మల్హోత్రా వారికి గుర్తు చేశారు. దీర్ఘకాలం పాటు కార్యకలాపాలు సాగించేందుకు, మార్కెట్లో పోటీపడేందుకు వీలుగా ఎంఎస్ఎంఈలు సంఘటిత రంగం వైపు మళ్లాలని, రుణాల విషయంలో క్రమశిక్షణగా నడుచుకోవాలని, డిజిటల్ చెల్లింపులు ఆమోదించాలని సూచించారు. రుణాల విషయంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలు, నిర్వహణ సవాళ్లు, విధానపరమైన అంశాలపై ఎంఎస్ఎంఈల ప్రతినిధులు ఆర్‌బీఐ గవర్నర్‌తో పంచుకున్నారు.

ఉద్యోగాలకు చలిగాలి

ఎగసిన నిరుద్యోగం ● జనవరిలో 5% జంప్



న్యూఢిల్లీ: నిరుద్యోగం జనవరిలో 5 శాతానికి పెరిగింది. 2025 డిసెంబర్‌లో ఇది 4.8 శాతంగానే ఉంది. జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 15 ఏళ్లకు మించిన వారికి సంబంధించి నిరుద్యోగం జనవరిలో పెరిగినట్టు తెలుస్తోంది. కార్మికుల భాగస్వామ్య రేటు (ఎల్ఎఫ్‌పీఆర్), జనాభాలో పనిచేసే వారి నిష్పత్తి (డబ్ల్యూపీఆర్) సైతం తగ్గడం గమనార్హం. గ్రామీణ ప్రాంతాల్లో సాగు కాలం ముగియడం వంటి సీజనల్ ప్రభావాలే ఎల్ఎఫ్‌పీఆర్, డబ్ల్యూపీఆర్ తగ్గడానికి కారణమని ఎన్ఎస్ఓ తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణ రంగం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో పనులు, రవాణా, వ్యాపార కార్యకలాపాలు శీతాకాలంలో నిదానించగా, పట్టణాల్లో మాత్రం వాణిజ్య కార్యకలాపాలు స్థిరంగా ఉన్నాయి.

→ గ్రామీణ నిరుద్యోగం గత డిసెంబర్‌లో 3.9 శాతంగా ఉంటే, జనవరిలో 4.2 శాతానికి పెరిగింది. పట్టణాల్లో నిరుద్యోగ రేటు 6.7 శాతం నుంచి 7 శాతానికి చేరింది. → జనవరిలో కార్మికుల భాగస్వామ్య రేటు దేశవ్యాప్తంగా 55.9 శాతంగా నమోదైంది. డిసెంబర్‌లో ఇది 56.1 శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో కార్మికుల భాగస్వామ్య రేటు 59 శాతం నుంచి 58.7 శాతానికి తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో ఇది 50.2 శాతం నుంచి 50.3 శాతానికి స్వల్పంగా మెరుగుపడింది. → మహిళా కార్మికుల భాగస్వామ్య రేటు జనవరిలో 35.1 శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 39.7 శాతం కాగా, పట్టణాల్లో 25.5 శాతంగా ఉండడం గమనార్హం. → జనాభాలో పనిచేసే వారి నిష్పత్తి (డబ్ల్యూపీఆర్) 2025 జూన్‌లో 53.3 శాతంగా ఉంటే, డిసెంబర్ నాటికి 56.7 శాతానికి మెరుగుపడగా.. 2026 జనవరిలో తిరిగి 56.2 శాతానికి బలహీనపడింది. → గ్రామీణ ప్రాంతాల్లో పురుషులకు సంబంధించి డబ్ల్యూపీఆర్ 75.7 శాతంగా, మహిళలకు సంబంధించి 38 శాతంగా ఉంది. పట్టణాల్లో పురుషులకు సంబంధించి 70.5 శాతం, మహిళలకు సంబంధించి 23 శాతం చొప్పున నమోదయ్యాయి.

పబ్లిక్ ఇష్యూకు మూడు కంపెనీలు

క్లీన్ మ్యాక్స్ @ రూ. 1,000-1,053

- ఈ నెల 23–25 మధ్య ఐపీవో
- రూ. 3,100 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన రంగ కంపెనీ క్లీన్ మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 1,000–1,053 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 23న ప్రారంభమై 25న ముగియనుంది. దీనిలో భాగంగా రూ. 1,200 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా వీటికి జతగా మరో రూ. 1,900 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్ విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా కంపెనీ రూ. 3,100 కోట్లు సమీకరించాలని ఆశిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 20న షేర్లను ఆఫర్ చేయనుంది. తొలుత 2025 ఆగస్ట్ దరఖాస్తులో రూ. 5,200 కోట్ల సమీకరణకు సిద్ధపడినప్పటికీ పరిమాణాన్ని కుదించింది. ఈక్విటీ జారీ నిధులలో రూ. 1,125 కోట్లు రుణ చెల్లింపులకు, మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. మార్చి 2న లిస్టకానున్న కంపెనీ రూ. 12,325 కోట్ల మార్కెట్ విలువను అందుకునే వీలుంది.

కంపెనీ తీరిలా

2010లో ఏర్పాటైన రెనెవబుల్ ఎనర్జీ కంపెనీ క్లీన్ మ్యాక్స్ ప్రధానంగా వాణిజ్య(కమర్షియల్), పారిశ్రామిక(ఇండస్ట్రియల్) రంగాలకు పవన, సౌర, హైబ్రిడ్(పునరుత్పాదక) విద్యుత్ సరఫరాసహా ఇంధన సర్వీసులను అందిస్తోంది. ఆయా రంగాలకు నెట్ జీరో, కర్బననిర్మూలన సొల్యూషన్స్ సమకూర్చుతోంది. 2025 జూలై 31కల్లా కంపెనీ 2.54 గిగావాట్ల నిర్వహణా సామర్థ్యంతోపాటు.. మరో 2.53 జీడబ్ల్యూ కాంట్రాక్టెడ్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. అంతేకాకుండా 5.07 జీడబ్ల్యూ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది. 2024–25లో ఆదాయం 13 శాతం ఎగసి రూ. 1,610 కోట్లను అధిగమించింది. నష్టాల నుంచి బయటపడి రూ. 28 కోట్ల నికర లాభం ఆర్జించింది. డేటా సెంటర్లు, ఏఐ, టెక్నాలజీ, సిమెంట్, స్టీల్ తదితర రంగాల క్లయింట్లకు సర్వీసులు అందిస్తోంది.

గౌడియం ఐవీఎఫ్ ఐపీవో 20న

- ధరల శ్రేణి @ రూ. 75–79
- రూ. 165 కోట్ల సమీకరణ

ఫెర్టిలిటీ సర్వీసుల సంస్థ గౌడియం ఐవీఎఫ్ అండ్ విమెన్ హెల్త్ పబ్లిక్ ఇష్యూకి రూ. 75–79 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 20న ప్రారంభమై 24న ముగియనుంది. దీనిలో భాగంగా 1.14 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా వీటికి జతగా మరో 95 లక్షల షేర్లను ప్రమోటర్ మనికా ఖన్నా విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా సంస్థ రూ. 165 కోట్లు సమీకరించాలని ఆశిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 18న షేర్లను ఆఫర్ చేయనుంది. వెరసి కృత్రిమ గర్భధారణ(ఫెర్టిలిటీ) సర్వీసులందించే సంస్థ తొలిసారి స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టకానుంది. ఈక్విటీ జారీ నిధులలో రూ. 50 కోట్లను దేశవ్యాప్తంగా 19 కొత్త ఐవీఎఫ్ కేంద్రాల ఏర్పాటుకు వెచ్చించనుంది. రూ. 20 కోట్లు రుణచెల్లింపులకు కేటాయించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. ఈ నెల 27న లిస్టకానున్న సంస్థ రూ. 575 కోట్ల మార్కెట్ విలువను అందుకునే వీలుంది.

కంపెనీ తీరిలా

ఖన్నా ఏర్పాటు చేసిన గౌడియం ఐవీఎఫ్ దేశీయంగా రీప్రొడక్టివ్ టెక్నాలజీలలో సుప్రసిద్ధమైంది. 7 ప్రధాన కేంద్రాలుసహా 28 అనుబంధ విభాగాల ద్వారా సంస్థ సేవలు సమకూర్చుతోంది. 2024–25లో ఆదాయం రూ. 48 కోట్ల నుంచి రూ. 71 కోట్లకు ఎగసింది. నికర లాభం రూ. 10 కోట్ల నుంచి రూ. 19 కోట్లకు జంప్‌చేసింది. కంపెనీ తొలుత(జనవరిలో) 1.83 కోట్ల ఈక్విటీ షేర్ల జారీ సహా.. ప్రమోటర్ 25.31 లక్షల షేర్లు ఆఫర్ చేయనున్నట్లు పేర్కొంది. తదుపరి వీటి సంఖ్యను సవరించింది. ఐపీవో చేపట్టేందుకు 2025 జూలైలో గోప్యతా మార్గంలో సంస్థ సెబీకి దరఖాస్తు చేసింది.

కార్ల్స్‌బెర్గ్ ఐపీవో చూపు

- దేశీ బిజినెస్ లిస్టింగ్‌పై ఆసక్తి

మాల్ట్ పానీయాల డెన్మార్క్ దిగ్గజం కార్ల్స్‌బెర్గ్ దేశీ బిజినెస్‌ను స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేయాలని యోచిస్తోంది. తద్వారా వాటాదారులకు విలువ చేకూర్చాలని చూస్తున్నట్లు గ్రూప్ సీఈవో జాకబ్ ఆరుప్ ఆండర్సన్ వెల్లడించారు. అయితే పబ్లిక్ ఇష్యూ చేపట్టడంపై ఇంకా తుది నిర్ణయానికి రాలేదని స్పష్టం చేశారు. దేశీయంగా పటిష్ట వృద్ధిని సాధిస్తున్న కంపెనీ దేశీ బిజినెస్‌ను లిస్ట్ చేసే ప్రణాళికల్లో ఉన్నట్లు తెలియజేశారు. సంస్థ వాటాదారుల విలువ పెంచేందుకు ఐపీవోసహా ఇతర మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం ఇంతకుమించి మాట్లాడేందుకు చట్ట సంబంధిత అంశాలు అడ్డుపడుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో లిస్టింగ్ అంశంపై స్పందించలేనని, అయితే వాటాదారులకు విలువ చేకూర్చడంపై ఆసక్తిగా ఉన్నట్లు వివరించారు.

పీఎన్‌జీఎస్ రేవా @ రూ. 367-386

- ఈ నెల 24–26 మధ్య ఐపీవో
- రూ. 380 కోట్ల సమీకరణకు సై

న్యూఢిల్లీ: వజ్రాభరణాల విక్రయ కంపెనీ పీఎన్‌జీఎస్ రేవా డైమండ్ జ్యువెలరీ పబ్లిక్ ఇష్యూకి రూ. 367–386 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 24న ప్రారంభమై 26న ముగియనుంది. దీనిలో భాగంగా రూ. 380 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 23న షేర్లను ఆఫర్ చేయనుంది. ఇష్యూ నిధులను పుణే కంపెనీ 202728కల్లా 15 కొత్త స్టోర్ల ఏర్పాటుకు వినియోగించనుంది. అంతేకాకుండా ప్రధాన బ్రాండ్ రేవా మార్కెటింగ్, ప్రమోషనల్ వ్యయాలకు సైతం వెచ్చించనుంది. కంపెనీ ప్రమోటర్ పీఎన్ గాడ్గిల్ అండ్ సన్స్ వజ్రాభరణ బిజినెస్‌ను స్లంప్ సేల్ పద్ధతిలో విక్రయించడం ద్వారా పీఎన్‌జీఎస్ రేవా డైమండ్ జ్యువెలరీ ఏర్పాటైంది. దీంతో సొంత గుర్తింపుతో వజ్రాభరణ మార్కెట్లో ప్రత్యేక కంపెనీగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. రిటైల్ మార్కెట్‌పై ప్రధానంగా దృష్టిపెట్టిన కంపెనీ 2025 మార్చి31కల్లా 33 స్టోర్లను కలిగి ఉంది. మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటకలలో కార్యకలాపాలు విస్తరించింది. 2024–25లో ఆదాయం 32 శాతం ఎగసి రూ. 258 కోట్లను అధిగమించింది. నికర లాభం 40 శాతం జంప్‌చేసి రూ. 59.5 కోట్లకు చేరింది.

ఆకిబ్ నబీ

ఫైనల్‌కు 83 పరుగుల దూరంలో...

- జమ్మూకశ్మీర్ విజయలక్ష్యం 126
- ప్రస్తుతం 43/2
- బెంగాల్‌ను హడలెత్తించిన నబీ, సునీల్

కల్యాణి (పశ్చిమ బెంగాల్): ప్రతిష్టాత్మక దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో తొలిసారి ఫైనల్ చేరేందుకు జమ్మూకశ్మీర్ జట్టుకు సువర్ణావకాశం లభించింది. మాజీ విజేత బెంగాల్ జట్టుతో జరుగుతున్న రెండో సెమీఫైనల్లో జమ్మూకశ్మీర్ మరో 83 పరుగులు సాధిస్తే టైటిల్ పోరుకు అర్హత సాధిస్తుంది. బెంగాల్ నిర్దేశించిన 126 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన జమ్మూకశ్మీర్... మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 13 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 43 పరుగులు సాధించింది. జమ్మూకశ్మీర్ గెలవాలంటే మరో 83 పరుగులు చేయాలి. చేతిలో ఎనిమిది వికెట్లు ఉన్నాయి. అంతకుముందు మూడో రోజు బౌలర్ల హవా నడిపించారు. మూడో రోజు ఆటలో 17 వికెట్లు నేలకూలడం విశేషం. ఓవర్‌నైట్ స్కోరు 198/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన జమ్మూకశ్మీర్ జట్టు 76.1 ఓవర్లలో 302 పరుగులకు ఆలౌటైంది. చివరి వరుస బ్యాటర్లు ఆకిబ్ నబీ (54 బంతుల్లో 42; 5 ఫోర్లు, 1 సిక్స్), యుధ్‌వీర్ సింగ్ (42 బంతుల్లో 33; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) తొమ్మిదో వికెట్‌కు 64 పరుగులు జోడించారు. భారత బౌలర్, బెంగాల్ స్పీడ్‌స్టర్ మొహమ్మద్ షమీ 90 పరుగులిచ్చి 8 వికెట్లు పడగొట్టాడు. మిగతా రెండు వికెట్లు ముకేశ్ కుమార్‌కు దక్కాయి. 26 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన బెంగాల్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో కుప్పకూలింది. జమ్మూకశ్మీర్ పేస్ బౌలర్లు ఆకిబ్ నబీ, సునీల్ కుమార్, యుధ్‌వీర్ సింగ్ ధాటికి బెంగాల్ 25.1 ఓవర్లలో కేవలం 99 పరుగులకే ఆలౌటైంది. క్వార్టర్ ఫైనల్లో డబుల్ సెంచరీ, సెమీఫైనల్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ సెంచరీ చేసిన **బెంగాల్ బ్యాటర్ సుదీప్ కుమార్ ఘరామి రెండో ఇన్నింగ్స్‌లో 'సున్నా'కే వెనుదిరిగాడు. కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ 5 పరుగులు చేశాడు. నబీ 36 పరుగులిచ్చి 4 వికెట్లు, సునీల్ కుమార్ 27 పరుగులిచ్చి 4 వికెట్లు, యుధ్‌వీర్ సింగ్ 29 పరుగులిచ్చి 2 వికెట్లు** తీసి బెంగాల్‌ను దెబ్బ కొట్టారు. 126 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జమ్మూకశ్మీర్‌కు కూడా శుభారంభం లభించలేదు. ఓపెనర్లు శుభమ్ ఖజురియా (1), యావర్ హసన్ (6) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరుకున్నారు. శుభమ్ పుందిర్ (23 బ్యాటింగ్), వన్షజ్ శర్మ (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. రంజీ ట్రోఫీ చరిత్రలో 10 వేల పరుగులు పూర్తి చేసిన రెండో ప్లేయర్, కెప్టెన్ పారస్ డోగ్రా, అబ్దుల్ సమద్ ఇంకా బ్యాటింగ్‌కు రావాల్సి ఉండటంతో జమ్మూకశ్మీర్‌కే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే షమీ, ముకేశ్ కుమార్, షహబాజ్ అహ్మద్ బంతితో మెరిస్తే బెంగాల్ జట్టు కూడా విజయం ఆశించవచ్చు.

సంక్షిప్త స్కోర్లు

బెంగాల్ తొలి ఇన్నింగ్స్: 328 ఆలౌట్; **జమ్మూకశ్మీర్ తొలి ఇన్నింగ్స్:** 302 ఆలౌట్; **బెంగాల్ రెండో ఇన్నింగ్స్:** 99 ఆలౌట్ (25.1 ఓవర్లలో) (షహబాజ్ అహ్మద్ 24, సూరజ్ జైస్వాల్ 14, అనుస్తుప్ 12, ఆకిబ్ నబీ 4/36, సునీల్ 4/27, యుధ్‌వీర్ 2/29), **జమ్మూకశ్మీర్ రెండో ఇన్నింగ్స్:** 43/2.

షమీ

కర్ణాటక 736 ఆలౌట్

ఉత్తరాఖండ్‌తో రంజీ సెమీఫైనల్

స్మరణ్

లక్నో: **ప్రత్యర్థి జట్టులో మేటి బ్యాటర్లు ఉన్న సంగతి విస్మరించి... తొలుత బౌలింగ్ ఎంచుకోవాలని ఉత్తరాఖండ్ జట్టు కెప్టెన్ కునాల్ చండేలా తీసుకున్న నిర్ణయం ఆ జట్టు ఫైనల్ చేరే అవకాశాలకు తెరదించింది. మాజీ చాంపియన్ కర్ణాటకతో జరుగుతున్న రంజీ ట్రోఫీ రెండో సెమీఫైనల్లో ఉత్తరాఖండ్ జట్టు ఎదురీదుతోంది. కర్ణాటక నమోదు చేసిన భారీ స్కోరుకు జవాబుగా... మూడో రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఉత్తరాఖండ్ ఆట ముగిసే సమయానికి 69 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉన్న ఈ మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించి, తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదిస్తేనే ఉత్తరాఖండ్ జట్టుకు ఫైనల్ చేరే అవకాశం ఉంటుంది. ఇప్పటికే సగం వికెట్లు కోల్పోయిన ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందాలంటే** మరో 588 పరుగులు చేయాల్సి ఉంది. కర్ణాటక బ్యాటర్లు దేవ్‌దత్ పడిక్కల్ (232) డబుల్ సెంచరీ... కేఎల్ రాహుల్ (141) సెంచరీ... రవిచంద్రన్ స్మరణ్ (135) సెంచరీ... కరుణ్ నాయర్ (60), కృతిక్ కృష్ణ (60), విద్యాధర్ పాటిల్ అర్ధ సెంచరీలు సాధించడంతో... కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 736 పరుగులు సాధించి ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 689/6తో మూడో రోజు ఆట కొనసాగించిన కర్ణాటక మరో 47 పరుగులు జోడించి మిగతా నాలుగు వికెట్లు కోల్పోయింది. ఓవర్‌నైట్ సెంచరీ హీరో స్మరణ్ తన వ్యక్తిగత స్కోరుకు మరో 14 పరుగులు జోడించి 135 పరుగులకు అవుటయ్యాడు. విద్యాధర్ (54) అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఉత్తరాఖండ్ బౌలర్లలో ఆదిత్య రావత్ 154 పరుగులిచ్చి 4 వికెట్లు, మయాంక్ మిశ్రా 173 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టారు. అభయ్ నేగి, అవనీశ్, లక్ష్యలకు ఒక్కో వికెట్ దక్కింది.

సహజ శుభారంభం

బెంగళూరు: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ100 మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లి శుభారంభం చేసింది. సింగిల్స్ విభాగంలో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టిన భారత నంబర్‌వన్... డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో 416వ ర్యాంకర్ సహజ 6–2, 1–6, 6–2తో డెయోన్ బ్యాక్ (దక్షిణ కొరియా)పై గెలుపొందింది. 2 గంటల 18 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సర్వీస్‌లో 23 పాయింట్లు, రెండో సర్వీస్‌లో 16 పాయింట్లు సాధించింది. తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసింది. డబుల్స్ తొలి రౌండ్‌లో సహజ–వైదేహి (భారత్) ద్వయం 6–4, 6–4తో బేలా తమాంకర్–సోనల్ పాటిల్ (భారత్) జంటను ఓడించింది. 69 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ–వైదేహి తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశారు. హైదరాబాద్‌కే చెందిన భమిడిపాటి శ్రీవల్లి రష్మిక కూడా డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. తొలి రౌండ్‌లో రష్మిక–మాయా రాజేశ్వరన్ (భారత్) ద్వయం 6–1, 6–3తో వన్షిత పఠానియా–హర్షిణి నాగరాజ్ (భారత్) జోడీపై విజయం సాధించింది.

సుమిత్ ముందంజ

సాకేత్

న్యూఢిల్లీ: సొంతగడ్డపై జరుగుతున్న ఢిల్లీ ఓపెన్ ఏటీపీ చాలెంజర్–75 టెన్నిస్ టోర్నీలో భారత స్టార్ సుమిత్ నగాల్ గెలుపు బోణీ కొట్టాడు. ఢిల్లీ లాన్ టెన్నిస్ సంఘం (డీఎల్‌టీఏ) కాంప్లెక్స్‌లో మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సుమిత్ 6–3, 7–5తో డేవిడ్ జోర్డా సాంచిస్ (స్పెయిన్)పై గెలుపొంది రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. 87 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రపంచ 297వ ర్యాంకర్ సుమిత్ తన సర్వీస్‌ను కోల్పోకుండా, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. మరోవైపు భారత్‌కే చెందిన మానస్ ధామ్నె, మనీశ్ సురేశ్ కుమార్, దిగ్విజయ్ ప్రతాప్ సింగ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. మానస్ 5–7, 4–6తో రియో నొగుచి (జపాన్) చేతిలో, దిగ్విజయ్ 3–6, 4–6తో పీటర్ బార్ బిర్యుకోవ్ (రష్యా) చేతిలో, మనీశ్ 4–6, 5–7తో స్టెఫానోస్ సాకెలారిడిస్ (గ్రీస్) చేతిలో ఓడిపోయారు.

క్వార్టర్స్‌లో సాకేత్ జోడీ

పురుషుల డబుల్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని భారత్‌కే చెందిన భాగస్వామి దిగ్విజయ్ ప్రతాప్ సింగ్‌తో కలిసి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. తొలి రౌండ్‌లో సాకేత్–దిగ్విజయ్ ద్వయం 6–3, 6–4తో ఆదిల్ కల్యాణ్‌పూర్ (భారత్)–డేనియల్ మైకెలాస్కీ (పోలాండ్) జంటను ఓడించింది. 61 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్–దిగ్విజయ్ తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు.

హర్మన్‌ప్రీత్ దూరం

ప్రొ హాకీ లీగ్ రెండో అంచె మ్యాచ్‌ల్లో భారత కెప్టెన్‌గా హార్దిక్


హర్మన్

హార్దిక్

న్యూఢిల్లీ: స్వదేశంలో జరిగిన పురుషుల ప్రొ లీగ్ తొలి అంచెలో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలో భారత్ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. తదుపరి ఈనెల 20 నుంచి 25 వరకు ఆస్ట్రేలియాలోని హోబర్ట్ నగరంలో భారత్ రెండో అంచె మ్యాచ్‌లు ఆడనుంది. అయితే ఈ అంచె మ్యాచ్‌లకు భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ దూరం కానున్నాడు. వ్యక్తిగత కారణాలరీత్యా తాను హోబర్ట్ అంచె మ్యాచ్‌ల్లో పోటీపడే భారత జట్టుకు అందుబాటులో ఉండటం లేదని హర్మన్‌ప్రీత్ తెలిపాడు. హర్మన్‌ప్రీత్ భార్య అమన్‌దీప్ కౌర్ ప్రసవ తేదీ దగ్గర్లో ఉండటంతో హర్మన్‌ప్రీత్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఫలితంగా హోబర్ట్ అంచె మ్యాచ్‌లకు భారత జట్టు సారథ్య బాధ్యతలు మిడ్‌ఫీల్డర్ హార్దిక్ సింగ్‌కు అప్పగించారు. టోక్యో ఒలింపిక్స్, పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో కాంస్య పతకాలు గెలిచిన భారత జట్టులో హార్దిక్ సింగ్ సభ్యుడిగా ఉన్నాడు. తొమ్మిది జట్లు పోటీపడుతున్న ప్రొ లీగ్‌లో భారత జట్టు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఓడి ఎనిమిదో స్థానంలో ఉంది. లీగ్‌లో భాగంగా తదుపరి మ్యాచ్‌ల కోసం భారత జట్టు ఆస్ట్రేలియాకు వెళుతుంది. హోబర్ట్ వేదికగా ఈనెల 21న స్పెయిన్‌తో, 22న ఆస్ట్రేలియాతో... 24న స్పెయిన్‌తో, 25న ఆస్ట్రేలియాతో భారత్ మొత్తం నాలుగు మ్యాచ్‌లు ఆడుతుంది.

భారత పురుషుల హాకీ జట్టు: సూరజ్ కర్కేరా, మోహిత్ హొనెన్నహళ్లి శశికుమార్ (గోల్‌కీపర్లు), అమిత్ రోహిదాస్, జర్మన్‌ప్రీత్ సింగ్, జుగ్‌రాజ్ సింగ్, సంజయ్, సుమిత్, అమన్‌దీప్ లాక్రా, యశ్‌దీప్ సివాచ్, పూవణ్ణ చందురబాబీ (డిఫెండర్లు), రాజిందర్ సింగ్, మన్‌మీత్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, హార్దిక్ సింగ్, మొయిరంగ్తెమ్ రబీచంద్ర సింగ్, విష్ణుకాంత్ సింగ్, రాజ్‌కుమార్ పాల్ (మిడ్‌ఫీల్డర్లు), అభిషేక్, శిలానంద్ లాక్రా, మన్‌దీప్ సింగ్, అరిజీత్ సింగ్ హుండల్, ఆదిత్య అర్జున్ లలాగే, అంగద్‌బీర్ సింగ్, మణీందర్ సింగ్ (ఫార్వర్డ్స్).

సెమీస్‌లో భారత 'ఎ' జట్టు


తనూజా కన్వర్

బ్యాంకాక్: ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ మహిళల టి20 క్రికెట్ టోర్నీలో భారత 'ఎ' జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. నేపాల్ 'ఎ' జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత 'ఎ' జట్టు 7 వికెట్ల తేడాతో గెలిచింది. నాలుగు జట్లున్న గ్రూప్ 'ఎ'లో భారత్, పాకిస్తాన్, యూఏఈ జట్లు నాలుగు పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచాయి. అయితే మెరుగైన రన్‌రేట్ కారణంగా భారత్ (3.042), పాకిస్తాన్ (0.457) జట్లు సెమీఫైనల్లోకి ప్రవేశించగా... యూఏఈ (–0.765), నేపాల్ జట్లు లీగ్ దశలోనే నిష్క్రమించాయి. నేపాల్ 'ఎ' నిర్దేశించిన 79 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత 'ఎ' జట్టు 7.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసి గెలిచింది. దినేశ్ వృంద (18 బంతుల్లో 39 నాటౌట్; 9 ఫోర్లు) ధాటిగా ఆడింది. అనుష్క శర్మ (10 బంతుల్లో 10; 2 ఫోర్లు), తేజల్ హసబ్నిస్ (13 బంతుల్లో 18; 3 ఫోర్లు) రాణించారు. అంతకుముందు నేపాల్ 'ఎ' జట్టు 18 ఓవర్లలో 78 పరుగులకు ఆలౌటైంది. భారత 'ఎ' బౌలర్లు తనూజా కన్వర్ (4/12), మిన్ను మణి (3/8), కెప్టెన్ రాధా యాదవ్ (2/17) నేపాల్ జట్టును దెబ్బ తీశారు.

చీఫ్ కోచ్ పదవి కోసం శ్రీజేశ్ మళ్లీ దరఖాస్తు

న్యూఢిల్లీ: భారత జూనియర్ పురుషుల హాకీ జట్టు చీఫ్ కోచ్ పదవి కోసం దిగ్గజ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ మళ్లీ దరఖాస్తు చేసుకున్నాడు. టోక్యో ఒలింపిక్స్, పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో కాంస్య పతకాలు నెగ్గిన భారత జట్టుకు శ్రీజేశ్ గోల్‌కీపర్‌గా వ్యవహరించాడు. పారిస్ ఒలింపిక్స్ ముగిశాక శ్రీజేశ్ 2024 ఆగస్టు నుంచి 2025 డిసెంబర్ వరకు భారత జూనియర్ జట్టుకు చీఫ్ కోచ్‌గా పని చేశాడు. శ్రీజేశ్ శిక్షణలో భారత జట్టు గతేడాది జూనియర్ ప్రపంచకప్‌లో కాంస్యం గెలిచింది. ఈ టోర్నీ తర్వాత శ్రీజేశ్ పదవీకాలం ముగిసింది. తాజాగా హాకీ ఇండియా జూనియర్ జట్టు చీఫ్ కోచ్ కావాలని ప్రకటన జారీ చేయడంతో శ్రీజేశ్ దరఖాస్తు చేసుకున్నాడు.

భారత మహిళల వన్డే జట్టులోకి ప్రతీక

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో పాల్గొనే భారత మహిళల జట్టులో అదనంగా మరో ప్లేయర్‌ను జోడించారు. చీలమండ గాయం నుంచి కోలుకున్న ఓపెనర్ ప్రతీక రావల్ ఈనెల 24 నుంచి బ్రిస్బేన్‌లో ఆస్ట్రేలియాతో మొదలయ్యే వన్డే సిరీస్‌లో భారత జట్టులోకి వచ్చింది. గత ఏడాది స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్ సందర్భంగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ ప్రతీక గాయపడింది. ఆ తర్వాత ప్రతీక మిగతా టోర్నీకి దూరం కాగా...ఆమె స్థానంలో షఫాలీ వర్మ జట్టులోకి వచ్చింది. ఈనెల 24న బ్రిస్బేన్‌లో తొలి వన్డే తర్వాత... 27న హోబర్ట్‌లో రెండో వన్డే, అదే వేదికగా మార్చి 1న మూడో వన్డే జరుగుతాయి. మార్చి 6 నుంచి భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఏకైక టెస్టు పెర్త్‌లో జరుగుతుంది. 25 ఏళ్ల ప్రతీక భారత్ తరఫున 24 వన్డేలు ఆడి 1110 పరుగులు సాధించింది. ఇందులో రెండు సెంచరీలు, ఏడు అర్ధ సెంచరీలున్నాయి.

భారత వన్డే జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, రేణుక సింగ్ ఠాకూర్, నల్లపురెడ్డి శ్రీచరణి, క్రాంతి గౌడ్, స్నేహ్ రాణా, దీప్తి శర్మ, రిచా ఘోష్, ఉమా ఛెత్రి, కాశ్వీ గౌతమ్, అమన్‌జోత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, ప్రతీక రావల్.

విజేత కార్ల్‌సన్

వెసిన్‌హాస్ (జర్మనీ): అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రీస్టయిల్ చెస్ తొలి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ విజేతగా నిలిచాడు. అమెరికా గ్రాండ్‌మాస్టర్ ఫాబియానో కరువానాతో జరిగిన ఫైనల్లో కార్ల్‌సన్ 2.5–1.5తో గెలిచాడు. భారత గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్‌కు ఆరో స్థానం దక్కింది. ఐదు–ఆరు స్థానాల కోసం జరిగిన పోరులో అర్జున్ 0–2తో హాన్స్ నీమెన్ (అమెరికా) చేతిలో ఓడిపోయాడు.

క్వార్టర్ ఫైనల్లో యూకీ జోడీ

దోహా: ఖతర్ ఓపెన్ ఏటీపీ–500 టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో యూకీ బాంబ్రీ (భారత్)–ఆంద్రీ గొరాన్‌సన్ (స్వీడన్) జోడీ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో యూకీ–గొరాన్‌సన్ ద్వయం 6–2, 6–3తో మొయిజ్ (ట్యూనిషియా)–ముబారక్ జాయిద్ (ఖతర్) జోడీపై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. 59 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో–స్వీడిష్ ద్వయం ఒక ఏస్ సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సర్వీస్‌లో 24 పాయింట్లు... రెండో సర్వీస్‌లో 10 పాయింట్లు సాధించింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ జూలియన్ క్యాష్–లాయిడ్ గ్లాస్‌పూల్ (బ్రిటన్)లతో యూకీ–గొరాన్‌సన్ తలపడతారు.

ఢిల్లీలో జరుగుతున్న ప్రతిష్టాత్మక ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు సందర్శకులు పోటెత్తుతున్నారు. మంగళవారం పలు స్టాళ్లలో ప్రదర్శనకు ఉంచిన వినూత్నమైన ఏఐ మోడళ్లను వారు ఆసక్తిగా తిలకించారు. ఆ మోడళ్లను ఫొటోలు, వీడియోల్లో బంధించడమే గాక వాటికి సంబంధించిన వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

3 గంటల్లో ముగిసిన ఇరాన్, అమెరికా చర్చలు

- జెనీవాలోని ఒమన్ రాయబారి ఇంట్లో పరోక్ష అణు చర్చలు
- చర్చల వేళ హార్ముజ్ జలసంధిని మూసేసిన ఇరాన్

జెనీవా: వివాదాస్పద అణు కార్యక్రమానికి ఇరాన్ చరమగీతం పాడాలన్న ప్రధాన డిమాండ్‌తో గతంలో జరిగిన తొలి దఫా పరోక్ష అణు చర్చలకు కొనసాగింపుగా మంగళవారం జెనీవాలో ఇరాన్, అమెరికాల మధ్య మరోదఫా చర్చలు జరిగాయి. జెనీవాలోని ఒమర్ దౌత్యవేత్త అధికారిక నివాసంలో ఒమన్ మధ్యవర్తులతో వేర్వేరుగా అమెరికా, ఇరాన్ ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈసారి రెండో రౌండ్ చర్చలు కేవలం మూడు గంటల్లోనే ముగియడం గమనార్హం. చర్చల ఫలితాలను ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. అణుబాంబు తయారీ కోసం ప్రయత్నిస్తున్న ఇరాన్‌ను నిలువరించడంతోపాటు ఆ దేశంలో పౌర హక్కుల ఉల్లంఘనలకు స్వస్తిపలుకుతూ ప్రజారంజక పాలన అందించడం, ఖమేనీ ప్రభుత్వం గద్దె దిగడం వంటి డిమాండ్లతో అమెరికా ప్రతినిధి బృందం జెనీవాకు తరలివచ్చిందని ఇప్పటికే వార్తలొచ్చాయి. రెండో రౌండ్ భేటీలో ఏఏ అంశాలు ప్రధానంగా చర్చకొచ్చాయో తెలియరాలేదు. పరోక్ష చర్చల్లో అమెరికా తరఫున అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్, పశ్చిమాసియాలో ట్రంప్ దూత స్టీవ్ విట్కాఫ్‌లు పాల్గొన్నారు. ఇరాన్ తరఫున ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ హాజరయ్యారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ముడి చమురు రవాణా నౌకల రాకపోకలను స్తంభింపజేస్తూ హార్ముజ్ జలసంధిని ఇరాన్ కొన్ని గంటలపాటు మూసేసింది!

మృత్యులోయలో పూల సోయగం

పదేళ్ల తర్వాత ప్రకృతి అరుదైన వింత

ఊహకందని వేడి, భయంకరమైన నిశ్శబ్దం, జీవం లేని నిర్జలత్వం.. ఇదీ మృత్యులోయ.. భూమి మీద అత్యంత కఠినమైన ప్రదేశాల్లో ఇదొకటి. ఏళ్ల తరబడి సూర్యభగవానుడి ప్రతాపానికి మాడి మసైపోయినట్టు కనిపించే ఈ నేల.. ఇప్పుడు ఒక అద్భుతానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. పదేళ్లకోసారి, అరుదుగా కనిపించే 'సూపర్ బ్లూమ్'కు ఈ మృత్యులోయ ఆతిథ్యం ఇవ్వబోతోంది. రంగురంగుల పూలవనంగా మారబోతోంది. ఈ ప్రకృతి వింతే 'సూపర్‌బ్లూమ్'.

'సూపర్‌బ్లూమ్' అద్భుతం

భూమి మీద అత్యంత వేడిగా ఉండే ప్రాంతంగా పేరుగాంచిన కాలిఫోర్నియాలోని 'మృత్యులోయ', త్వరలో రంగురంగుల పూలవనంగా మారబోతోంది. సాధారణంగా పదేళ్లకోసారి మాత్రమే కనిపించే ఈ అద్భుతం.. చివరిసారిగా 2016లో సంభవించింది. గతేడాది కురిసిన భారీ వర్షాలే దీనికి ప్రధాన కారణం. అక్టోబర్ నుండి ఇప్పటివరకు కురిసిన వర్షపాతం, ఏడాది సగటు కంటే ఎక్కువగా ఉండటంతో భూమిలో నిద్రాణమైన విత్తనాలు మొలకెత్తడం ప్రారంభించాయి. 'బ్యాడ్‌వాటర్ రోడ్' వంటి దక్షిణ ప్రాంతాల్లో అప్పుడే పచ్చదనం పరచుకుంది. చిన్న చిన్న పూలు వికసించడం కూడా మొదలైంది. ఈ పూల జాతర ఫిబ్రవరి చివరలో ప్రారంభమై ఏప్రిల్ వరకు గరిష్ట స్థాయికి చేరుకుంటుందని నేషనల్ పార్క్ సర్వీస్ తెలిపింది. కొన్ని వారాల్లోనే, ఆ నిర్జీవమైన నేల పసుపు, ఊదా, పింక్, తెలుపు రంగుల పూలతో నిండిపోతుంది. ఇది కేవలం కంటికింపైన దృశ్యం కాదు.. నిరీక్షణకు, నిలకడకు, ప్రకృతి అజేయతకు నిలువెత్తు నిదర్శనం.

అరుదైన అడవి పూలు

ఈ సూపర్‌బ్లూమ్‌లో డెసర్ట్ గోల్డ్ (ఎరుపు–పసుపు), సాండ్ వెర్బేనా (పర్పుల్), ఈవినింగ్ ప్రిమ్‌రోజ్ వంటి అరుదైన అడవి పూలు కనిపిస్తాయి. ఈ ప్రకృతి అందాలను చూసి ఆనందించాలే తప్ప, పూలను కోయడం నిషిద్ధం. రాబోయే కాలానికి విత్తనాలు భద్రంగా ఉండాలంటే వాటిని అలాగే వదిలేయాలని అధికారులు కోరుతున్నారు. ఈ సంఘటన మనిషికి నేర్పే గుణపాఠం సుస్పష్టం.. జీవితం ఎంత కఠినంగా ఉన్నా, ఎంత చీకటి అలముకున్నా, తగిన సమయం వస్తే, అనుకూల పరిస్థితులు కుదిరితే.. మృత్యులోయలో సైతం జీవం ఉప్పొంగగలదు! ప్రతికూలతలను తట్టుకుని నిలబడిన వారికి విజయం తప్పదని చెప్పే సజీవ సాక్ష్యం ఈ మృత్యులోయ సూపర్ బ్లూమ్.

- సాక్షి, నేషనల్ డెస్క్

టీనేజర్ రీల్స్ మోజు..

తలకిందులైన మరో యువకుని జీవితం

- ఢిల్లీలో టీనేజర్ నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్‌తో చనిపోయిన 23 ఏళ్ల సాహిల్
- రీల్స్ చేస్తూ కారు నడిపిన టీనేజర్
- వెలుగులోకి ఫిబ్రవరి 3 నాటి వీడియో

న్యూఢిల్లీ: ఫిబ్రవరి మూడో తేదీన 17 ఏళ్ల టీనేజర్ నిర్లక్షపూరితంగా కారు నడిపిన ఉదంతంలో 23 ఏళ్ల యువకుడు సాహిల్ ధనేశ్ర ప్రాణాలు కోల్పోయిన ఘటనలో తాజాగా 'రీల్స్'కోణం బహిర్గతమైంది. టీనేజర్ వాహనం నడిపేటప్పుడు పక్కనే అతని సోదరి కూర్చుని స్మార్ట్‌ఫోన్‌లో రీల్స్ చిత్రీకరించింది. సంబంధిత వీడియో తాజాగా బహిర్గతమైంది. సంపన్నుల పిల్లలు సరదాగా చేసే 'రీల్స్'కు తన ఒక్కగానొక్క కుమారుడు బలయ్యాడని మృతుని తల్లి ఇనా మాకెన్ కన్నీటిపర్యంతయ్యారు. ''కనీసం డ్రైవింగ్ లైసెన్స్‌లోని 17 ఏళ్ల బాలుడు ఎస్‌యూవీ నడుపుతూ రీల్స్ చేస్తూ మా అబ్బాయిని ఢీకొట్టాడు. కారుతో ఢీకొట్టాక కనీసం బ్రేకులు కూడా వేయలేదు''అని ఆమె అన్నారు. ''మాకున్న ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు మా అబ్బాయి ఎంతో కష్టపడుతుంటాడు. చిన్న చిన్న పనులు కూడా చేస్తుంటాడు. స్పోర్ట్స్‌లో ఎన్నో మెడల్స్ తెచ్చుకున్నాడు. నైనిటాల్‌లో సెయింట్ జోసెఫ్ కాలేజీలో బీబీఏ ఫైనల్ సెమిస్టర్ చదువుతున్నాడు. మాంచెస్టర్‌లో లగ్జరీ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ చేసేందుకు త్వరలో బ్రిటన్‌కు వెళ్లాల్సినవాడు ఇలా ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు''అని తల్లి కన్నీరుమున్నీరుగా విలపించారు. టీనేజర్‌కు పదో తరగతి బోర్డ్ పరీక్షలు రాయల్సి ఉన్నందున అతనికి జువెనైల్ జస్టిస్ బోర్డ్ మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఇప్పటికే ఒంటరిగా జీవిస్తున్న తల్లి జీవితం కుమారుడి మరణంతో ఏకాకిగా మారిందని పొరుగింటి వాళ్లు చెప్పారు. మరోవైపు లాల్ బహదూర్ శాస్త్రి కాలేజ్ సమీపంలో జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో సమీపంలో కారును పార్క్‌చేసిన డ్రైవర్ అజిత్ సింగ్ జీవితం సైతం కష్టాల కడలిలో పడింది. టీనేజర్ ఆ యువకుడి బైక్‌ను ఢీకొట్టాక నేరుగా వచ్చి అజిత్‌కు చెందిన క్యాబ్‌నూ ఢీకొట్టాడు. దీంతో అజిత్ తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిపాలయ్యాడు. ''కాళ్లు, చేతులు, తల, వెన్నుపూసకు గాయాలయ్యాయి. మూడు నెలలు విశ్రాంతి తీసుకోవాలి వైద్యులు సూచించారు. తర్వాత ఏమాత్రం పనిచేయగలనో నాకే అర్థంకావట్లేదు. నెలకు పాతిక వేలరూపాయల్లోపే సంపాదిస్తా. ద్వారకా సెక్టార్ 19 సమీప గ్రామంలో నివసిస్తున్నా. నా ఇంట్లో సంపాదించేది నేనొక్కడినే. డ్రైవింగ్ జీవనోపాధి పోయక ఇకపై ఎలా బతకాలి?. ధనికులకు ఇలాంటి ప్రమాదంతో పోయేదేం ఉండదు. కానీ నాలాంటి పేదల పరిస్థితి ఏంటి?''అని అజిత్ తీవ్ర ఆవేదన వ్యక్తంచేశాడు.

చేతిలో కుమారుని చిత్రపటంతో రోదిస్తున్న ఇనా మాకెన్

200 కేజీల అనుమానాస్పద రసాయనంతో ఇరానియన్ల పట్టివేత

గుజరాత్ తీరంలో ఘటన

అహ్మదాబాద్: స్పీడ్‌బోటులో ఏకంగా ఇరాన్ నుంచి నేరుగా భారత ప్రాదేశిక జలాలదాకా చేరుకున్న ఇద్దరు ఇరాన్ దేశస్థులను గుజరాత్ ఉగ్రవ్యతిరేక బృందం(ఏటీఎస్), తీర గస్తీ దళం సంయుక్తంగా పట్టుకున్నాయి. అనుమానాస్పద 200 కేజీలకుపైగా బరువైన రసాయనాలను భారత్‌లోకి అక్రమంగా సరఫరాచేసేందుకు ప్రయత్నిస్తూ చిక్కారు. సోమవారం రాత్రి పోరుబందర్ తీరానికి 140 నాటికల్ మైళ్ల దూరంలో అరేబియా సముద్ర జలాల్లో వీళ్ల స్పీడ్‌బోటును అడ్డగించి వీళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఏటీఎస్, కోస్ట్‌గార్డ్ వద్ద ఉన్న హెరాయిన్ పరీక్ష కిట్‌తో ఆ రసాయనాన్ని చెక్‌చేయగా ఫలితం వేరేలా వచ్చింది. దీంతో 203 ప్యాకెట్లలో ప్యాక్‌చేసిన పొడిరూపంలో ఉన్న కెమికల్‌ను స్వాధీనంచేసుకుని అదేంటో తెల్సుకునేందుకు ల్యాబ్‌కు పంపించారు. స్పీడ్‌బోటులో ఏకంగా ఇరాన్ నుంచి రావడం అత్యంత సాహసోపేత ఘటన అని అధికారులు సైతం విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఈ ప్యాకెట్లను పంజాబ్‌కు సరఫరాచేస్తున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ డ్రగ్ స్మగ్లర్ హాజీ ఫిదా ఇచ్చిన సమాచారంతో బలగాలు రంగంలోకి దిగి విజయవంతంగా వీళ్లను పట్టుకున్నాయి.

కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక తల్లిదండ్రుల ఆత్మహత్య

ఛత్తీస్‌గఢ్‌లోని జంజ్‌గిర్–చంపా జిల్లాలో విషాదం

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జంజ్‌గిర్–చంపా జిల్లాలోని ఓ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. కొడుకు మరణాన్ని తగట్టుకోలేక దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. కొడుకు లేని ఈ లోకంలో తాము బతకలేమంటూ సూసైడ్ నోట్ తోపాటు వీడియో సందేశం రికార్డు చేసి మరీ ప్రాణాలు తీసుకున్నారు. దర్దేయి గ్రామానికి చెందిన కృష్ణ పటేల్ (48), రమాబాయి పటేల్ (47) దంపతులకు ఒక్కగానొక్క కొడుకు ఆదిత్య పటేల్ (21). 2024లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఆదిత్య మరణించాడు. నాటినుంచి వారు తీవ్ర మానసిక వేదనతో ఉన్నారు. ఆదివారం రాత్రి ఇంట్లో ఆవరణలోని చెట్టుకు ఉరేసుకున్నారు. '''మా కొడుకు లేని జీవితం మాకు శూన్యం. మేం శ్వాస తీసుకుంటున్నామే తప్ప నిజానికి జీవించడం లేదు. అందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నాం. దీనికి ఎవరూ బాధ్యులు కారు'' అని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. తమ కొడుకు మృతికి రావాల్సిన పరిహారం డబ్బులను తన సోదరులకు ఇవ్వాలని కృష్ణ పటేల్ వీడియోలో కోరారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. లేఖ, వీడియోలను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపించి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనతో గ్రామం మొత్తం విషాదఛాయలు అలుముకున్నాయి.

ఉవ్వెత్తున..

1,300 అడుగులకు పైగా ఎగసిపడ్డ లావా

- ఆకట్టుకుంటున్న కళ్లు చెదిరే రాత్రి దృశ్యాలు

హవాయిలో బద్దలైన అగ్నిపర్వతం

అత్యంత భారీ పరిమాణంలో నిప్పురవ్వలు వేలాది అడుగుల ఎత్తుకు ఎగసిపడుతుంటే ఎలా ఉంటుంది? ఇదుగో, అచ్చం ఇలాగే ఉంటుంది! హవాయి దీవుల్లో కిలవెయా అగ్నిపర్వతం బద్దలైంది. అందులోంచి లావా ప్రవాహం నిరంతరాయంగా కొనసాగుతోంది. దాని తాలూకు రెండు పాయలు సోమవారం రాత్రి ఫౌంటేన్ మాదిరిగా పైపైకి ఎగజిమ్మాయి. ఒకటి 1,300 అడుగులు, మరొకటి 1,000 అడుగుల చొప్పున పైకి ఎగశాయి. ఆకాశంలో ఎర్రని కాంతులతో చూపరులను కట్టిపడేశాయి. వాటి తాలూకు బూడిదైతే ఏకంగా 35 వేల అడుగుల ఎత్తు దాకా చేరింది! ఈ దృశ్యాలను లక్షలాది మంది ప్రత్యక్షప్రసారం ద్వారా వీక్షించారు. హవాయి నేషనల్ పార్కులోని కిలవెయా ప్రపంచంలో అత్యంత చురుగ్గా ఉన్న అగ్నిపర్వతాల్లో ఒకటి. దాని అడుగున భారీ పగుళ్లున్న కారణంగా మాగ్మా ప్రవాహాలు తరచూ తేలిగ్గా పైకి ఎగదన్నుతూ ఉంటాయి. దాంతో అది పదేపదే బద్దలవుతూ, భారీగా లావాను వెదజల్లుతూ వీక్షకులను ఆకట్టుకుంటూ ఉంటుంది. ముఖ్యంగా గత డిసెంబర్ 23 నుంచీ ఇప్పటిదాకా కిలవెయా పదేపదే బద్దవుతూ, కొన్ని గంటల వ్యవధిలోనే శాంతిస్తూ వస్తోంది. ఈసారి అది 1.5 కోట్ల క్యూబిక్ అడుగుల మేరకు లావాను వెదజల్లి ఉంటుందని అంచనా! అది ఏకంగా 11 వేల ఒలింపిక్ సైజు స్విమ్మింగ్‌పూల్స్‌ను నింపేందుకు సరిపోతుందట!! ఎప్పట్లాగే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో ప్రాణ, ఆస్తినష్టం వంటివేవీ సంభవించలేదు. మూడు వారాల తర్వాత కిలవెయా మరోసారి బద్దలవుతుందని భావిస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

మూగబోయిన పౌరహక్కుల గళం

- అమెరికాలో పౌరహక్కుల ఉద్యమనేత జెస్సీ జాక్సన్ అస్తమయం
- మార్టిన్ లూథర్‌కింగ్ తర్వాత ఉద్యమాన్ని ఉరకలెత్తించిన జాక్సన్
- హక్కుల యోధుని మరణంతో వెల్లువెత్తిన సంతాపాలు

షికాగో: అమెరికాలో పౌర హక్కుల ఉద్యమాన్ని దశాబ్దాల తరబడి విజయవంతంగా నడిపించిన హక్కుల యోధుడు, రాజకీయవేత్త జెస్సీ లూయిస్ జాక్సన్ (84) తీవ్ర అనారోగ్య సమస్యలతో మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్య తర్వాత జాక్సన్ పౌరహక్కుల ఉద్యమాన్ని తన భుజస్కంధాలకెత్తుకుని అమెరికాలో కీలక నల్లజాతి నేతగా ఎదిగారు. 2017లో ఆయనకు పార్కిన్సన్ వ్యాధి సోకింది. గత నవంబర్‌లో మెదడులో అసమతుల్యత(ప్రోగ్రెసివ్ సుప్రాన్యూక్లియర్ పాల్సీ) కారణంగా జీవిత చరమాంకంలో మాట్లాడలేని, నడవలేని స్థితికి చేరుకున్నారని జాక్సన్ కుటుంబం ఒక ప్రకటనలో పేర్కొంది. జాన్సన్‌కు ఒక కుమార్తె, ఐదుగురు కుమారులు ఉన్నారు. పౌర హక్కుల కోసం పోరాడుతూనే పేదలు, ఆఫ్రికన్ అమెరికన్లు, నిరుద్యోగుల కోసం అవిశ్రాంతంగా పోరాడారు. విద్య, ఆరోగ్య సంరక్షణ రంగాల అభ్యున్నతికి పాటుపడ్డారు.

కింగ్‌కు శిష్యుడిగా చేరి..

1941 అక్టోబర్ 8వ తేదీన సౌత్ కరోలినా రాష్ట్రంలోని గ్రీన్‌విల్లే పట్టణంలో జాక్సన్ జన్మించారు. విద్యార్థి దశలో బేస్‌బాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ బాగా ఆడేవారు. తర్వాత ప్రొఫెషనల్ బాక్సర్‌గా ఎదిగారు. 1960 దశకంలో విద్యార్థినేతగా ఎదిగారు. ప్రఖ్యాత పౌరహక్కుల ఉద్యమకారుడు మార్టిన్ లూథర్ కింగ్ బోధనలకు ఆకర్షితుడై పాతికేళ్ల వయసులో 1965లో ఆయనకు శిష్యుడిగా చేరిపోయారు. 1968 ఏప్రిల్‌లో లూథర్ కింగ్‌ను హత్యచేసినప్పుడు ఆయన చివరిసారిగా జాక్సన్‌తోనే మాట్లాడారని, ఈయన చేతుల్లోనే ఆయన తుది శ్వాస విడిచారని చెబుతుంటారు. కింగ్‌కు అసలైన ఉద్యమవారసుడు ఇతనే అని అప్పట్లోనే అంతా భావించారు. కింగ్ సారథ్యంలో నడిచే 'సదరన్ క్రిస్టియన్ లీడర్‌షిప్ కాన్ఫెరెన్స్'కు షికాగో శాఖకు జాక్సన్ సారథ్యం వహించారు. ఆఫ్రికన్ అమెరికన్ల సర్వతోముఖాభివృద్ధి కోసం 'ఆపరేషన్ బ్రేడ్‌బాస్కెట్'కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నల్లజాతీయులకు శ్వేతజాతీయుల సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పించడం, నల్లజాతీయులు తయారుచేసి వస్తూత్పత్తులను శ్వేతజాతీయుల సంస్థలతో కొనిపించడం, ఆఫ్రికన్ అమెరికన్లకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడం సహా ఎన్నో రకాల కార్యక్రమాలు చేపట్టారు. అద్భుతమైన వాక్చాతుర్యంతో హక్కుల కార్యకర్తల్లో ఉద్యమాగ్నికి ఎగదోసేవారు. ఓవైపు ఉద్యమాల్లో పాల్గొంటూనే రాజకీయాల్లోనూ చేరారు. 1984, 1988 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడి విఫలమయ్యారు. ఆ తర్వాత కూడా అణగారిన వర్గాల సామాజిక న్యాయం, పౌర హక్కులు, రాజకీయ చైతన్యమే లక్ష్యంగా లాభాపేక్షలేని 'రెయిన్‌బో/పుష్ కూటమి' సంస్థలను స్థాపించి విజయవంతంగా నడిపించారు. వెనుకబడిన వర్గాల కోసం సంపన్న వర్గాలు, ప్రభుత్వాలతో మధ్యవర్తిత్వం నడిపిన గొప్ప దౌత్యవేత్తగా పేరొందారు. 1999లో కువైట్‌ను ఇరాక్ ఆక్రమించినప్పుడు 700 మందికిపైగా విదేశీ వనితలను విడిపించడంలో ఈయన దౌత్యం గొప్పగా పనిచేసింది. శ్వేతజాతీయ పోలీస్ అధికారి నేలకు గొంతు అదిమిపట్టడంతో ఊపిరాడక చనిపోయిన నల్లజాతీయుడు జార్జ్ ఫ్లాయిడ్ మరణానంతరం ఆయన కుటుంబాన్ని జాక్సన్ కలిసి పరామర్శించారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం ఆపాలని పిలుపునిచ్చారు. 2000 సంవత్సరంలో నాటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఈయనకు అమెరికా అత్యున్నత పౌర పురస్కారం 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్'తో సత్కరించారు. జాక్సన్ మరణంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా పలు ప్రపంచ దేశాధినేతలు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ప్రపంచవ్యాప్తంగా సంతాపాలు వెల్లువెత్తుతున్నాయి.

బామ్మకు బంగారు పతకం

78 ఏళ్ల వయసులో ఎంఏ మరాఠీలో టాప్‌ర్యాంక్

ఇండోర్: 78 ఏళ్ల వయసు వచ్చేసరికి దాదాపు అందరూ చదువుపై ధ్యాస వదిలేసి ఆరోగ్యంపై దృష్టిపెడతారు. కానీ అదే 78 ఏళ్ల వయసున్న సుష్మా మోఘే మాత్రం తన విద్యా ప్రయాణాన్ని ఇంకా వేగంగా కొనసాగిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని దేవి అహల్యా విశ్వవిద్యాలయంలో ఎంఏ మరాఠీ కోర్సులో టాప్‌ర్యాంక్ సాధించి సుష్మా గోల్డ్ మెడల్ పొంది అందర్నీ అబ్బురపరిచారు. మంగళవారం ఇండోర్‌లో రాష్ట్ర గవర్నర్ మన్గూభాయ్ పటేల్ సమక్షంలో జరిగిన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ కార్యక్రమంలో గవర్నర్ చేతుల మీదుగా సుష్మా బంగారు పతకాన్ని స్వీకరించారు. ''78 ఏళ్ల వయసులో ఎంఏ మరాఠీ కోర్సు చేయాలని నాకూ లేదు. కానీ మరాఠీ భాషపై మరింత పట్టు సాధించాక చదువుపై అమితమైన శ్రద్ధ పెరిగింది. అదే నన్ను బంగారుపతకం సాధించేలా చేసింది. ఈ విషయంలో నా అధ్యాపకులకు ఎంతో రుణపడి ఉన్నా. ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లోనూ నాకు పాఠాలు బోధించారు. ఇప్పుడు హిందీ రచయితల రచనలను మరాఠీలోకి తర్జుమా చేస్తున్నా. అందరికీ ఒక్కటి చెబుతా. ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోండి. ఈ ప్రపంచంలో కొత్తగా నేర్చుకోవడానికి ఎన్నో ఉన్నాయి''అని అన్నారు. ''ఈమె సాధించిన ఘనత మా విద్యాలయానికీ గర్వకారణం''అని వర్సిటీ ఉపకులపతి డాక్టర్ రాకేశ్ సింఘాయ్ అన్నారు.

17 ఏళ్ల తర్వాత పాక్ గూఢచారి విడుదల

సహరాన్‌పూర్(యూపీ): నకిలీ పేరుతో భారత్‌లో ఉంటూ గూఢచర్యానికి పాల్పడిన పాకిస్తాన్ పౌరుడు ఇక్బాల్ భాటీ అలియాస్ దేవరాజ్ సెహగల్‌ను భారత అధికారులు 17 ఏళ్ల జైలు శిక్ష ముగిశాక మంగళవారం అధికారికంగా పాకిస్తాన్ అధికారులకు వాఘా సరిహద్దు వద్ద అప్పగించారు. ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్ పరిధిలోని హకీకాట్ నగర్‌లో దేవరాజ్ అనే మారుపేరుతో జీవిస్తూ స్థానికులతో పరిచయాలు పెంచుకుని దేశ కీలకమ్యాప్‌లు, సైనిక డాక్యుమెంట్లను సంపాదించాడు. విషయం తెల్సి పంజాబ్ పోలీసులు 2008లో ఇక్బాల్‌ను అరెస్ట్‌చేశారు. దేశద్రోహం, ఫోర్జరీ, గూఢచర్యం నేరాలు రుజువుకావడంతో దోషిగా తేల్చి 17 ఏళ్ల జైలు శిక్ష విధించారు. శిక్షను 11 నెలల క్రితమే గౌతమ్ బుద్ధ్ నగర్ జిల్లా కారాగారంలో పూర్తిచేసుకున్నాక అప్పటి నుంచి నిర్బంధ కేంద్రంలో ఉంచారు. తర్వాత డాక్యుమెంట్ ప్రక్రియను పూర్తిచేసి మంగళవారం సరిహద్దు వద్ద పాకిస్తాన్‌లోకి పంపేశారు.

పాకిస్తాన్‌లో ఉగ్రవాద దాడి

11 మంది భద్రతా సిబ్బంది , ఒక చిన్నారి మృతి

పెషావర్: పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో బజావుర్ జిల్లాలోని భద్రతాబలగాల చెక్‌పోస్ట్ మీదకు బాంబులున్న వాహనంతో ఢీకొట్టించి నిషేధిత తెహ్రీక్–ఇ–తాలిబాన్ పాకిస్తాన్(టీటీపీ) ఉగ్రవాదులు విధ్వంసం సృష్టించారు. ఈ పేలుళ్లలో 11 మంది భద్రతా బలగాలు, ఒక చిన్నారి ప్రాణాలు కోల్పోయారు. మరో ఏడుగురు గాయపడ్డారు. సోమవారం ఈ ఘటన జరిగింది. ఉగ్రవాదుల ధాటిని భద్రతాబలగాలు దీటుగా ఎదుర్కొన్నారు. బలగాల కాల్పుల్లో 12 మంది టీటీపీ ఉగ్రవాదులు హతమయ్యారని పాకిస్తాన్ ఇంటర్ సర్వీస్ పబ్లిక్ రిలేషన్(ఐఎస్‌పీఆర్) తర్వాత ప్రకటించింది. సమీప ప్రాంతాల్లో ఉగ్రవాదుల కోసం బలగాలు వేటమొదలెట్టాయి. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో 2024 ఏడాదిలో 1,620 హింసాత్మక ఘటనలు జరగ్గా 2025 ఏడాదిలో 2,331 ఘటనలు చోటుచేసుకోవడం ఈ ప్రాంతంలో అస్థిర పరిస్థితులకు అద్దంపడుతోందని వార్షిక భద్రతా నివేదిక–2025 పేర్కొంది.

అమెరికాలో తుపాకీ మోత

రోడ్ ఐలాండ్ యూత్ హాకీ గేమ్ ఘటనలో ముగ్గురు మృతి

రోడ్ ఐలాండ్(యూఎస్): అమెరికాలో తుపాకీ సంస్కృతికి మరో ఇద్దరు బలయ్యారు. ఆగంతకుడు వెనువెంటనే ఆత్మహత్య చేసుకున్నాడు. పాటకెట్ పట్టణంలో జరిగిన హైస్కూల్ బాయ్స్ ఐస్ హాకీ గేమ్‌లో గొడవ జరిగి ఒకతను మిగతా వాళ్లపై కాల్పులు జరిపాడు. దీంతో ఇద్దరు చనిపోయారు. తర్వాత ఆగంతకుడు తనను తాను తీవ్రంగా గాయపర్చుకోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. షూటర్, మృతుల పేర్లను అధికారులు ఇంకా వెల్లడించలేదు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని ఆస్పత్రిలో చేర్పించామని, వాళ్ల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని పాటకెట్ పోలీస్ చీఫ్ టీనా గోన్‌కాల్వేస్ వెల్లడించారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం డెన్నిస్ ఎం.లించ్ ఏరినాలో ఈ కాల్పుల ఘటన జరిగింది.

జార్ఖండ్‌లో రెండు అమానవీయ ఘటనలు

ఛాత్రా/బొకారో(జార్ఖండ్): జార్ఖండ్‌లోని ఛాత్రా, బొకారో జిల్లాలో సోమవారం రెండు అమానవీయ ఘటనలు చోటుచేసుకున్నాయి. పిల్లలను ఎత్తుకెళ్తున్నాడన్న పుకార్లతో 45 ఏళ్ల మతిస్థిమితం లేని ఒక వ్యక్తిని స్థానికులు మూకుమ్మడిగా దాడి చేసి చావబాది చంపేశారు. పిపర్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఛిరయటాండ్, కిచ్టో గ్రామాలకు చెందిన ప్రజలు పిల్లలను ఎవరో ఎత్తుకెళ్తున్నారని ఆగ్రహంగా ఉన్నారు. అదే సమయంలో ఆదివారం రాత్రి ఆ ప్రాంతానికి వెళ్లాడు. పిల్లలను ఎత్తుకెళ్లేందుకే వచ్చాడని భావించి మూకదాడి చేశారు. గాయాలతో రాంచీలోని రాజేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆస్పత్రిలో బాధితుడు కన్నుమూశాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని పోలీసు అధికారి అభయ్ చెప్పారు. మరో ఘటనలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆరుగురు మహిళలపై జార్ఖండ్‌లో దాడి జరిగింది. వైద్యం కోసం జాన్‌పూర్ నుంచి జార్ఖండ్‌కు చేరుకున్న మహిళలు గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామోదర్ నది వంతెన సమీపంగా వెళ్తుండగా స్థానికులు గమనించారు. కొత్తగా కన్పిస్తున్న ఈ ఆరుగురు మహిళల గుంపే పిల్లలను ఎత్తుకుపోతోందని పుకార్లు రావడంతో వాళ్లపై దాడిచేశారు. విషయం తెల్సి పోలీసులు ఎలాగోలా వీళ్లను రక్షించారు. జార్ఖండ్‌లో 300కుపైగా సోషల్‌మీడియా ఖాతాల నుంచి కిడ్నాప్ పుకార్లు షికార్లు చేయడంతో ఈ ఘటనలు జరిగాయని పోలీసులు గుర్తించారు.

దేశంలో సౌభ్రాతృత్వాన్ని నేతలే కాపాడాలి

నేతల విద్వేష ప్రసంగాల పిటిషన్లపై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రాజకీయనేతల విద్వేష ప్రసంగాల పరంపర అధికమవడంతో సుప్రీంకోర్టు రాజకీయనేతలకు హితబోధ చేసింది. రాజకీయనేతల ప్రసంగాలపై మార్గదర్శకాలు జారీచేయాలని, ఆయా ప్రసంగాల ప్రసారాలపై మీడియాకు తగు సూచనలు చేయాలంటూ 12 పిటిషన్లు రావడంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీల ధర్మాసనం మంగళవారం స్పందించింది. ''విద్వేష ప్రసంగాలు మానేసి సమాజంలో సౌభ్రాతృత్వం పెంచేలా మెలగాల్సిన బాధ్యత నేతలపై ఉంది. నేతలు ఇందుకు కట్టుబడి ఉండాలి''అని బీవీ నాగరత్న వ్యాఖ్యానించారు. మైనార్టీలపై అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ విద్వేష ప్రసంగాలు చేశారని, ముస్లింలపైకి గురిపెట్టి కాల్చినట్లు వీడియోను సోషల్‌మీడియాలో వైరల్‌చేశారని కపిల్ సిబల్ సైతం కేసు వేశారు. అయితే కేవలం ఒక్కరిని అందులోనూ ఒక్క రాజకీయ పార్టీని లక్ష్యంగా చేసుకుని కేసు వేసినట్లుగా ఉందంటూ ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని సిబల్‌కు సీజేఐ సూచించారు.

ప్రతి హత్యను గమనించడమే మా పనా?

సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో 2018లో స్థానిక ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ కార్యకర్తలపై దాడులు ఎక్కువయ్యాయంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. ''ఫలితాలు రాగానే రాష్ట్రవ్యాప్తంగా 19 రాజకీయ హత్యలు జరిగాయి. ముగ్గురు బీజేపీ కార్యకర్తలను చంపేశారు. ఒక హతుని కుటుంబసభ్యులకు ప్రాణహాని ఉంది''అని సీనియర్ లాయర్ గౌరవ్ భాటియా వాదించారు. ఈ కేసును జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాల ధర్మాసనం విచారించింది. ''బెంగాల్‌లో జరిగే ప్రతి హత్య/హింసాత్మక ఘటనను గమనించమే కోర్టు పనా?. తొలుత మీరెందుకు కలకత్తా హైకోర్టుకు వెళ్లలేదు? ముందుగా రాష్ట్ర హైకోర్టుకు వెళ్లండి. హతుని కుటుంబ సభ్యులకు బెదిరింపులు ఇంకా వస్తుంటే పోలీసు రక్షణ ఏర్పాటు చేయాలి''అని జస్టిస్ విక్రమ్‌నాథ్ ఆదేశించారు. కేసు తదుపరి విచారణను మార్చి పదో తేదీకి వాయిదావేశారు.

భారత రాజ్యాంగం సమాఖ్యపూరితమని తెలియజేసేది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

అంతర్రాష్ట్ర సంబంధాలు

ఒక సమాఖ్య వ్యవస్థ విజయవంతంగా పనిచేయడానికి కేంద్ర, రాష్ట్ర సంబంధాలు ఎంత ముఖ్యమో, అంతర్రాష్ట్ర సంబంధాలూ అంతే ముఖ్యం అనే వాస్తవాన్ని గుర్తించిన రాజ్యాంగ నిర్మాతలు అంతర్రాష్ట్ర వివాదాలను పరిష్కరించడానికి, స్నేహపూరిత వాతావరణాన్ని కల్పించడానికి రాజ్యాంగంలో కొన్ని ఏర్పాట్లు చేశారు. అందులో ముఖ్యమైనవి..

- అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల పరిష్కార ట్రైబ్యునళ్లు
- అంతర్రాష్ట్ర మండళ్లు
- పబ్లిక్ చట్టాలు, రికార్డులు, న్యాయస్థానాల ఆదేశాలను పరస్పరం గుర్తించే పద్ధతులు
- అంతర్రాష్ట్ర వాణిజ్య వ్యాపార సంబంధాలు

అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల పరిష్కారం

ప్రకరణ 262 ప్రకారం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాలను సత్వరమే పరిష్కరించడానికి పార్లమెంటు ఒక చట్టం ద్వారా ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేయవచ్చు. అలాంటి వివాదాలను నేరుగా ట్రైబ్యునలే పరిష్కరిస్తుంది. ఇందుకోసం 1956లో అంతర్రాష్ట్ర జలాల వివాదాల పరిష్కార చట్టం, రివర్ బోర్డు చట్టాన్ని రూపొందించారు. వీటికి పాక్షిక న్యాయాధికారాలు (Quasi-Judicial) ఉంటాయి.

ప్రకరణ 262(2) ప్రకారం పార్లమెంటు చేసిన చట్టాలపై సుప్రీంకోర్టుకు న్యాయసమీక్ష అధికారం ఉండదు. కానీ, కేంద్రం తన శాసన విధులను నిర్వర్తించేలా ఆదేశించవచ్చు.

ఈ ట్రైబ్యునళ్ల ప్రధాన ఉద్దేశం వివాదాలను సత్వరమే పరిష్కరించడం. సాధారణంగా అంతర్రాష్ట్ర వివాదాలు సుప్రీంకోర్టు ప్రారంభ పరిధిలోకి వస్తాయి. అయితే నదీ జలాల పంపిణీ వివాదాలను పరిష్కరించడానికి ప్రత్యేక ట్రైబ్యునళ్లు ఏర్పాటైతే, ఆయా రాష్ట్రాలు ట్రైబ్యునళ్లలోనే వివాదాలను పరిష్కరించుకోవాలి. వీటి తీర్పులపై సుప్రీంకోర్టులో కేవలం సలహా పూర్వకమైన అప్పీలు చేసుకోవచ్చు.

ఇప్పటివరకు దేశంలో ఎనిమిది అంతర్రాష్ట్ర నదీ జలాల ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేశారు.

- కృష్ణా నదీ జలాల ట్రైబ్యునల్ –1969 (దీని పరిధిలోకి వచ్చే రాష్ట్రాలు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ).
- గోదావరి నదీ జలాల ట్రైబ్యునల్– 1969 (మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, తెలంగాణ)
- నర్మదా నదీ జలాల ట్రైబ్యునల్– 1969 (రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర)
- రావి, బియాస్ నదీ జలాల ట్రైబ్యునల్– 1986 (పంజాబ్, హర్యానా)
- కావేరి నదీ జలాల ట్రైబ్యునల్– 1990 (కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి)
- కృష్ణా నదీ జలాల ట్రైబ్యునల్ 2–2004 (మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)
- వంశధార నదీ జలాల ట్రైబ్యునల్–2010 (ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)
- మహాదాయి నదీ జలాల ట్రైబ్యునల్–2010 (గోవా, కర్ణాటక, మహారాష్ట్ర).

అంతర్రాష్ట్ర మండలి

ప్రకరణ 263 ప్రకారం అంతర్రాష్ట్ర మండలిని (Inter State Council) ఏర్పాటు చేస్తారు. ఇది కేంద్ర–రాష్ట్రాలు, అంతర్రాష్ట్రాల మధ్య వివిధ అంశాలపై విచారణ చేసి తగిన సూచనలు చేస్తుంది.

నిర్మాణం:

సర్కారియా కమిషన్ నివేదిక (1983–87) మేరకు జనతాదళ్ ప్రభుత్వం (వి.పి.సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు) 1990లో అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేసింది. దీని నిర్మాణం కింద పేర్కొన్న విధంగా ఉంటుంది.

- ప్రధానమంత్రి – అధ్యక్షుడు
- అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు– సభ్యులు
- కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు (శాసనసభలు ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలు) –సభ్యులు
- కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలకులు –సభ్యులు
- కేంద్ర ప్రభుత్వ హోంమంత్రి సహా ఆరుగురు కేబినెట్ మంత్రులు – సభ్యులు

విధులు:

- కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉమ్మడి ప్రయోజన విషయాలను పరిశీలించి, చర్చించి నివేదిక ఇవ్వడం.
- అంతర్రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని సాధించే పద్ధతిని, చర్యలను సూచించడం.
- కౌన్సిల్‌కు నివేదించిన ఇతర సాధారణ విషయాలపై చర్చించి సూచనలు చేయడం.

కౌన్సిల్ ఏడాదికి మూడు పర్యాయాలు సమావేశం కావాలి. దీని విధులన్నీ సలహా విధులే. సమావేశంలో వివిధ అంశాలను ఏకాభిప్రాయ సాధన పద్ధతిలో నిర్ణయిస్తారు.

1996లో నిరంతర సలహాల కోసం ఒక స్థాయి సంఘాన్ని కూడా ఏర్పాటు చేశారు. దీనికి కేంద్ర హోం శాఖా మంత్రి చైర్మన్‌గా ఉంటారు. అయిదుగురు కేంద్ర కేబినెట్ మంత్రులు, తొమ్మిది మంది ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉంటారు. అంతర్రాష్ట్ర మండలికి ప్రత్యేక సచివాలయం ఉంది. దీనికి అధిపతిగా కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి ఉంటారు. ఈ సచివాలయమే జోనల్ కౌన్సిళ్లకు కూడా ఉమ్మడి సచివాలయంగా పనిచేస్తుంది.

ప్రకరణ 263 ప్రకారం రాష్ట్రపతి కింద పేర్కొన్న కౌన్సిళ్లను కూడా ఏర్పాటు చేశారు.

- రాష్ట్రపతి సెంట్రల్ హెల్త్ కౌన్సిల్
- సెంట్రల్ లోకల్ గవర్నమెంట్ కౌన్సిల్
- అర్బన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్
- నాలుగు ప్రాంతీయ అమ్మకపు పన్ను కౌన్సిళ్లను కూడా ఏర్పాటు చేశారు.

అదేవిధంగా 2003లో సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్, సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హోమియోపతి అనే సంస్థలను కూడా ఏర్పాటు చేశారు.

పబ్లిక్ రికార్డులు-న్యాయ ప్రక్రియలు

రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర అధికార పరిధి రాష్ట్ర భూభాగానికే పరిమితం కాబట్టి, రాష్ట్రాలు జారీ చేసిన చట్టాలను, రికార్డులను, ఇతర సర్టిఫికెట్లను ఇతర రాష్ట్రాలు కూడా గౌరవించే విధంగా ప్రకరణ 261లో కొన్ని ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించి పార్లమెంటు చట్టాలను రూపొందిస్తుంది.

అంతర్రాష్ట్ర వ్యాపార, వాణిజ్య సంబంధాలు

రాజ్యాంగంలోని 13వ భాగంలో ప్రకరణ 301 నుంచి 307 వరకు అంతర్రాష్ట్ర వ్యాపార, వాణిజ్య అంశాలకు సంబంధించి కొన్ని రక్షణలు పేర్కొన్నారు. ప్రకరణ 301 ప్రకారం దేశంలో ఎక్కడైనా వాణిజ్యం, వ్యాపారం, వృత్తిని చేసుకోవడానికి స్వేచ్ఛ ఉంటుంది. అయితే కొన్ని రాష్ట్రాల ప్రత్యేక ప్రయోజనాల కోసం ఈ స్వేచ్ఛలపై కూడా పరిమితులు విధించవచ్చు.

ప్రాంతీయ మండలాలు

జోనల్ కౌన్సిళ్లు చట్టపర సంస్థలు. 1956లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా వీటిని ఏర్పాటు చేశారు. దేశాన్ని 5 జోన్లుగా విభజించారు.



వీటికి రాజ్యాంగ ప్రతిపత్తి లేదు. కేవలం చట్ట ప్రతిపత్తి (Statutory Status) మాత్రమే ఉంది. అవి:

- **ఉత్తర మండలం:** ఇందులో జమ్ము–కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలు ఉన్నాయి. దీని ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉంది.
- **దక్షిణ మండలం:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి. దీని ప్రధాన కార్యాలయం చెన్నైలో ఉంది.
- **పశ్చిమ మండలం:** గుజరాత్, మహారాష్ట్ర, గోవా, దాద్రా & నగర్ హవేలి, డామన్ & డయ్యూ. దీని ప్రధాన కార్యాలయం ముంబైలో ఉంది.
- **తూర్పు మండలం:** బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా. దీని ప్రధాన కార్యాలయం కోల్‌కతాలో ఉంది.
- **మధ్య మండలం:** ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్. దీని ప్రధాన కార్యాలయం అలహాబాద్‌లో ఉంది.
- **ఈశాన్య మండలం:** పైన పేర్కొన్న 5 జోన్లకు అదనంగా ఈశాన్య మండలాన్ని ప్రత్యేకంగా పార్లమెంటు చట్టం ద్వారా 1971లో ఏర్పాటు చేశారు. ఇందులో అసోం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, త్రిపుర, సిక్కిం రాష్ట్రాలున్నాయి. సిక్కిం రాష్ట్రాన్ని ఎనిమిదో రాష్ట్రంగా (ఈశాన్య రాష్ట్రాల్లో) 1994లో ఈశాన్య మండలంలో చేర్చారు. దీని ప్రధాన కార్యాలయం షిల్లాంగ్ (మేఘాలయ)లో ఉంది.

నిర్మాణం:

ప్రతి జోనల్ కౌన్సిల్‌లో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇద్దరు ఇతర మంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలకులు, ప్రణాళికా సంఘం నామినేట్ చేసిన ఒక సభ్యుడు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు, ఆయా రాష్ట్రాల అభివృద్ధి కమిషనర్లు సభ్యులుగా ఉంటారు. కేంద్ర హోం శాఖా మంత్రి జోనల్ కౌన్సిళ్లకు ఉమ్మడి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అదేవిధంగా ఆ జోన్‌లోని రాష్ట్ర ముఖ్యమంత్రులు రొటేషన్ పద్ధతిలో ఒక సంవత్సర కాలానికి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

విధులు:

- దేశంలో ప్రజల మధ్య భావ సమగ్రతను సాధించడం.
- మితిమీరిన ప్రాంతీయ వాదాన్ని, భాషా వాదాన్ని, రాష్ట్ర వాదాన్ని నియంత్రించడం
- రాష్ట్రాల విభజన తర్వాత ఏర్పడిన పరిణామాలను పరిష్కరించి, ఆర్థిక అభివృద్ధి, సమగ్రత మధ్య సమన్వయాన్ని సాధించడం.
- కేంద్రం సహకారంతో సామాజిక, ఆర్థిక అంశాల్లో ఏకరూపకతను సాధించడం.
- విభిన్న ప్రాంతాల మధ్య ఒకే రకమైన రాజకీయ సమానత్వాన్ని సాధించడం.
- జోనల్ కౌన్సిల్ విధులన్నీ సలహాపూర్వకమైనవే.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కిందివాటిలో కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి రాష్ట్రాలకు ఇచ్చే పన్ను ఏది?
   ఎ) ఎగుమతి, దిగుమతి సుంకాలు
   బి) స్టాంపు డ్యూటీ
   సి) ఆదాయ పన్ను
   డి) రైలు చార్జీలపై విధించే పన్ను
2. శాంతి భద్రతలు ఏ జాబితాకు చెందినవి?
   ఎ) రాష్ట్ర జాబితా బి) కేంద్ర జాబితా
   సి) ఉమ్మడి జాబితా
   డి) ఏదీకాదు
3. అవశిష్ట అధికారం ఎవరికి ఉంటుంది?
   ఎ) కేంద్రం బి) రాష్ట్రం
   సి) రాష్ట్రపతి డి) ఏదీకాదు
4. భారత, అమెరికా సమాఖ్యలకు ఉన్న సాధారణ లక్షణం ఏది?
   ఎ) ఏక పౌరసత్వం
   బి) రాజ్యాంగంలో మూడు జాబితాలు
   సి) ద్వంద్వ న్యాయ వ్యవస్థ
   డి) రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించడానికి ఒక సమాఖ్య న్యాయ వ్యవస్థ
5. భారత రాజ్యాంగం సమాఖ్యపూరితమని తెలియజేసేది?
   ఎ) లిఖిత, దృఢ రాజ్యాంగం
   బి) స్వతంత్ర న్యాయవ్యవస్థ
   సి) కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన
   డి) పైవన్నీ
6. భారత దేశంలోని రాష్ట్రాల మధ్య సహకారం సమన్వయాలకు ఉన్న రాజ్యాంగేతర, చట్టపరంకాని సాధనాలు ఏవి?
   1. జాతీయాభివృద్ధి మండలి
   2. గవర్నర్ల సమావేశం
   3. మండల కౌన్సిళ్లు
   4. అంతర్రాష్ట్ర మండలి
   ఎ) 1, 2 బి) 1, 2, 3
   సి) 3, 4 డి) 4
7. ఆదాయ పన్ను విధింపు, వసూలు, పంపిణీకి సంబంధించి కిందివాటిలో సరైంది?
   ఎ) కేంద్రం విధించి, వసూలు చేసి, ఆ మొత్తాన్ని కేంద్రం, రాష్ట్రాల మధ్య పంపిణీ చేస్తుంది
   బి) అన్ని పన్నులను కేంద్రమే విధించి, వసూలు చేసిన మొత్తాన్ని ఖర్చు చేస్తుంది
   సి) అన్ని పన్నులను కేంద్రం విధించి, వసూలు చేసిన మొత్తాన్ని రాష్ట్రాలకు పంపిణీ చేస్తుంది
   డి) ఆదాయపు పన్నుపై వసూలు చేసిన సర్‌చార్జీని మాత్రం కేంద్రం రాష్ట్రాల మధ్య పంపిణీ చేస్తుంది

సమాధానాలు

1) డి; 2) ఎ; 3) ఎ; 4) డి; 5) డి; 6) డి; 7) ఎ.

‘అభినవ వాగను శాసనుడు’ అని ఎవరిని అంటారు?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

1. ‘కొండవీటి పొగ మబ్బు – తెలుగువాళ్ల గోల్డు నిబ్బు’ అని శ్రీశ్రీతో ప్రశంసలు పొందినవారు?
   1) జాషువా
   2) విశ్వనాథ సత్యనారాయణ
   3) గురజాడ అప్పారావు
   4) రాయప్రోలు సుబ్బారావు
2. ‘శ్లేష కవితా చమత్కృతి’ ఎవరి కవితా గుణం?
   1) చేమకూర వేంకటకవి
   2) రామరాజ భూషణుడు
   3) తెనాలి రామకృష్ణుడు
   4) పింగళి సూరన
3. కాళ్లకూరి నారాయణరావు రచించిన ‘వరవిక్రయం’ నాటకం ఒక ?
   1) పౌరాణికం 2) చారిత్రకం
   3) కల్పితం 4) సాంఘికం
4. ‘తెలుగు సాహిత్య విమర్శ అవతరణ–వికాసం’ అనే సిద్ధాంత గ్రంథాన్ని రచించిన విమర్శకుడెవరు?
   1) కె.వి.ఆర్. నరసింహం
   2) ఎస్వీ రామారావు
   3) గుంటూరు శేషేంద్రశర్మ
   4) కోవెల సుప్రసన్నచార్య
5. ‘అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతి’ అని పేర్కొన్న అలంకారికుడు?
   1) ఆనందవర్ధనుడు
   2) అభినవ గుప్తుడు
   3) విశ్వనాథుడు 4) భరతుడు
6. రామరాజ భూషణుడు రచించిన ‘హరిశ్చంద్రనలోపాఖ్యానం’ అనేది ఒక
   1) ద్వ్యర్థి కావ్యం 2) చంపూ కావ్యం
   3) త్ర్యర్థి కావ్యం
   4) శాంతరస కావ్యం
7. ఈ ఏడాది తుఫాను వచ్చి పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఇది ఏ రకమైన వాక్యం?
   1) కర్మణి వాక్యం 2) హేత్వర్థక వాక్యం
   3) శత్రర్థక వాక్యం
   4) చేదర్థక వాక్యం
8. ‘స్త్రీల రామాయణ పాటలు’ అనే గ్రంథాన్ని సంకలనం చేసిందెవరు?
   1) శ్రీపాద గోపాలకృష్ణమూర్తి
   2) నండూరి సుబ్బారావు
   3) విశ్వనాథ సత్యనారాయణ
   4) ఆరుద్ర
9. ‘ఎ గ్రామర్ ఆఫ్ తెలుగు లాంగ్వేజ్’ అనే పేరుతో ఆంగ్లంలో తెలుగు భాషకు వ్యాకరణం రాసిందెవరు?
   1) కాల్డ్‌వెల్ 2) క్యాంప్‌బెల్
   3) సి.పి.బ్రౌన్ 4) మెకంజీ
10. వ్యక్తిని కానీ, వ్యవస్థను కానీ విమర్శించడం ఏ ప్రక్రియలో సాధారణం?
    1) కథానిక 2) నవల
    3) గల్పిక 4) వైజ్ఞానిక కల్పనా వ్యాసం
11. 1965–68 మధ్య కాలంలో తెలుగు సాహితీ లోకాన్ని దిగ్భ్రమకు గురి చేసినవారు?
    1) భావ కవులు 2)అభ్యుదయ కవులు
    3) స్త్రీవాద కవయిత్రులు
    4) దిగంబర కవులు
12. విభక్తి పరమైనప్పుడు ‘గోయి’ మొదలైనవాటి తుది అక్షరం?
    1) ‘ఇ’ వర్ణమగును
    2) ‘టి’ వర్ణమగును
    3) ‘ంటి’ వర్ణమగును
    4) ‘తి’వర్ణమగును
13. మనస్తత్వ శాస్త్రం ఆధారంగా ‘గోపీచంద్’ రాసిన నవల?
    1) యమపాశం
    2) పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా
    3) చీకటి గదులు
    4) అసమర్థుని జీవయాత్ర
14. ‘పసిడి పలుకులు, మిన్నేరు, సెలయేరు’ అనే జానపద రచనలు ఎవరు చేశారు?
    1) బిరుదురాజు రామరాజు
    2) ఆర్.వి.ఎస్. సుందరం
    3) నేదునూరి గంగాధరం
    4) జి.ఎస్. మోహన్
15. అభ్యుదయ కవిగా ‘భువనఘోష’ను వినిపించిన కవి?
    1) కె.వి. రమణారెడ్డి
    2) శ్రీశ్రీ 3) రెంటాల గోపాలకృష్ణ
    4) ఆవంత్స సోమసుందర్
16. ‘శోకాగ్ని’ అనే పదంలోని సమాసం?
    1) షష్ఠీ తత్పురుష
    2) విశేషణ పూర్వపద కర్మధారయం
    3) ఉపమాన పూర్వపద కర్మధారయం
    4) రూపక సమాసం
17. కట్టమంచి రామలింగారెడ్డి ‘ముసలమ్మ మరణం’ ఒక?
    1) వీరగాథా కావ్యం
    2) జానపద కథా కావ్యం
    3) శాంతరస కావ్యం
    4) కరుణ రసాత్మక కావ్యం
18. ‘భారతామృతం కర్ణపుటంబుల నారగ్రోలి యాంధ్రావళి మోదము బొరయునట్లు’గా భారతాంధ్రీకరణ చేసినవారు?
    1) నన్నయ 2) తిక్కన
    3) ఎర్రన 4) అథర్వణుడు
19. మూల ద్రావిడ ‘క’ కారం ‘చ’ కారంగా మారడం?
    1) వర్ణ వ్యత్యయం 2) తాలవ్యీకరణం
    3) వర్ణలోప దీర్ఘత
    4) వర్ణ సమీకరణం
20. మహ్మదీయ ప్రభువులకు తెలుగు కావ్యాలను అంకితమిచ్చిన ప్రథమ కవి?
    1) పొన్నగంటి తెలగనార్యుడు
    2) అద్దంకి గంగాధరుడు
    3) కందుకూరి రుద్రకవి
    4) చింతలపూడి ఎల్లనార్యుడు
21. ముద్దు పళని రాసిన మోహన శృంగార ప్రబంధం?
    1) సత్యభామా సాంత్వనం
    2) రాధికా సాంత్వనం
    3) ఇళాదేవి సాంత్వనం
    4) రాధాగోపాళం
22. 1943లో తెనాలిలో జరిగిన అరసం ప్రథమ మహాసభకు అధ్యక్షత వహించినవారు?
    1) శ్రీరంగం శ్రీనివాసరావు
    2) తాపీ ధర్మారావు
    3) సురవరం ప్రతాపరెడ్డి
    4) దాశరథి కృష్ణమాచార్యులు
23. ‘భావ కవిత్వానికి నవ్య మార్గ ప్రవక్త’ అని ఎవరిని అంటారు?
    1) రాయప్రోలు సుబ్బారావు
    2) దేవులపల్లి కృష్ణశాస్త్రి
    3) నండూరి సుబ్బారావు
    4) కట్టమంచి రామలింగారెడ్డి
24. తొలి తెలుగు మైనారిటీ వాద కవిత, దాని రచయిత?
    1) జల్‌జలా – స్కైబాబా
    2) వలస – అప్సర్
    3) పుట్టుమచ్చ– ఖాదర్ మొహియుద్దీన్
    4) వెండి మేఘం– సలీం
25. ‘తెలుగు బాలెడ్ పొయిట్రీ’ అనే పేరుతో జానపద వ్యాసాలు ప్రకటించిన పాశ్చాత్యుడు?
    1) జె.ఎ.బోయల్
    2) సి.పి.బ్రౌన్
    3) ఆర్.ఎస్. బాగ్స్
    4) డబ్ల్యు.జె.థామ్స్
26. ‘అమలోదాత్త మనీష నేను భయ కావ్య ప్రౌఢి పాటించు శిల్పమునంబార గుడ కళావిదుడ’ అని చెప్పుకొన్న కవి?
    1) నన్నయ 2) తిక్కన
    3) శ్రీనాథుడు 4) భట్టుమూర్తి
27. ‘జలరుహ నాభుడిట్లు రభసంబున నందన పారిజాతముం’ అనే పద్య పాదం ఏ వృత్తానికి చెందింది?
    1) మత్తేభం 2) శార్దూలం
    3) చంపకమాల 4) ఉత్పలమాల
28. సంగీత, సాహిత్య, నాట్య సంకేతాల సమ్మేళనం కలిగిన పుట్టపర్తి నారాయణాచార్యుల రచన?
    1) శివ తాండవం
    2) సాక్షాత్కారం
    3) మేఘదూతం
    4) పండరీ భాగవతం
29. వంగూరు సుబ్బారావు ఆంధ్ర పత్రికలో ప్రకటించిన వ్యాసం?
    1) సువర్ణ లేఖలు
    2) శారద లేఖలు
    3) ప్రేమ లేఖలు
    4) వసంత లేఖలు
30. ‘అనంతం’ అనేది శ్రీశ్రీ రాసిన
    1) రేడియో నాటిక
    2) వ్యంగ్య కవితలు
    3) ప్రామాణిక విమర్శ వ్యాసాలు
    4) చారిత్రాత్మక ఆత్మకథ
31. ‘పెళ్లి–దాని పుట్టు పూర్వోత్తరాలు’ ఎవరి రచన?
    1) ఆచార్య తిరుమల రామచంద్ర
    2) తాపీ ధర్మారావు
    3) అయ్యగారి వీరభద్రరావు
    4) గుడిపాటి వెంకటాచలం
32. త్రిపురనేని శ్రీనివాస్ వెలువరించిన గురి చూసి పాడే పాట ఒక?
    1) భావకవితా సంకలనం
    2) దళిత సంకలనం
    3) స్త్రీవాద కవితా సంకలనం
    4) అనుభూతివాద కవితా సంకలనం
33. ‘నేనింత ఒక పిడికెడు మట్టే కావచ్చు. కానీ కలమెత్తితే నాకు ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది’ అని పేర్కొన్న కవి?
    1) తిలక్ 2) మోహన్ ప్రసాద్
    3) శేషేంద్రశర్మ 4) సినారె
34. ‘మొక్కజొన్న, చక్రకేళి’ అనే పదాలు ఏ అర్థ పరిమాణానికి ఉదాహరణ?
    1) అర్థ గౌరవం 2) మృదూక్తి
    3) అలంకారిక ప్రయోగం
    4) లోక నిరుక్తి
35. ‘అభినవ వాగను శాసనుడు’ అని ఎవరిని అంటారు?
    1) గురజాడ అప్పారావు
    2) కందుకూరి వీరేశలింగం
    3) గిడుగు రామ్మూర్తి పంతులు
    4) ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి
36. 'Poetry we will call musical thought' ఈ వాక్యానికి తెలుగు అనువాదం?
    1) మధురమైన భావమే కవిత్వం
    2) ఛందోబద్ధమైన లయ కవిత్వం
    3) మనోహరమైన అర్థమే కవిత్వం
    4) భావనా వ్యక్తీకరణమే కవిత్వం
37. సుప్రసిద్ధ మైనారిటీవాద కవి స్కైబాబా సంపాదకత్వంలో వెలువడిన కథల సంపుటి?
    1) జల్ జలా 2) వతన్
    3) వలస 4) పుట్టుమచ్చ
38. ‘ఇందీవరం’ అనే పదానికి పర్యాయ పదాలు?
    1) నల్లకలువ, నీలోత్పలం
    2) పొలం, శాలిక్షేత్రం, వరిమడి
    3) పర్వతం, నగం, అద్రి
    4) మలయం, ధరణీధరం
39. ‘హేతువాదాన్ని స్వీకరించే భాష కూడా జన్మసిద్ధం’ అని ప్రకటించిన భాషావేత్త?
    1) బ్లూంఫీల్డ్ 2) మాక్స్‌ముల్లర్
    3) యాస్కాచార్యుడు
    4) నోమ్‌ఛామ్‌స్కీ
40. ‘మాట్లాడే భాషకు, రాసే భాషకు ఎక్కువ తేడా ఉండరాదు’ అనేది ఏ భాష ముఖ్య ఉద్దేశం?
    1) గ్రాంథికం 2) ప్రామాణికం
    3) వ్యవహారికం 4) శిష్ట వ్యవహారికం
41. బోధనను ప్రభావితం చేసి, చురుకైన అభ్యసనకు తోడ్పడేవి?
    1) బోధనోపకరణాలు
    2) బోధనా లక్ష్యాలు
    3) బోధనా నైపుణ్యాలు
    4) కనీస అభ్యసన స్థాయిలు
42. ‘నేడు విద్యా విధానం ఉపాధ్యాయుడు కేంద్రంగా కాకుండా, శిశు కేంద్రంగా సాగాలని’ ఎవరు చెప్పారు?
    1) రూసో 2) పెస్టాలజీ
    3) బెంజిమన్ బ్లూమ్
    4) ఫ్రోబెల్
43. ఉపాధ్యాయుడి బోధనా సాఫల్యం ఏ సోపానంపై ఆధారపడి ఉంటుంది?
    1) మూల్యాంకనం
    2) ప్రదర్శనం 3) ఉన్ముఖీకరణ
    4) పఠనాపాటవం
44. దేశంలో ఒకే విద్యా ప్రమాణాలను సాధించడానికి ప్రాథమిక దశ విద్యార్థుల కోసం వేటిని ప్రవేశపెట్టారు?
    1) బోధనోపకరణాలు
    2) బోధనా సోపానాలు
    3) కనీస అభ్యసన స్థాయిలు
    4) బోధనా లక్ష్యాలు
45. ఉపాధ్యాయుడు విద్యార్థులతో కత్తి గొప్ప దా? కలం గొప్పదా? లాంటి విషయాలపై వ్యాస రచన చేయించడం ఏ రకమైంది?
    1) విమర్శనాత్మక వ్యాసాలు
    2) ఆలోచనాత్మక వ్యాసాలు
    3) సంవాదాత్మక వ్యాసాలు
    4) వర్ణనాత్మక వ్యాసాలు
46. ఏ విధానంలో ‘బాలబాలికలు స్వయంగా అభ్యసిస్తారు. ఉపాధ్యాయులు కేవలం మార్గదర్శులు’ గా ఉంటారు?
    1) డాల్టన్ పద్ధతి
    2) మాంటిస్సోరి పద్ధతి
    3) క్రీడా పద్ధతి
    4) ప్రాజెక్టు పద్ధతి
47. 1956లో త్రిభాషా సూత్రాన్ని రూపొందించినవారు?
    1) యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్
    2) జాతీయ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ
    3) జాతీయ విద్యా పరిశోధన శిక్షణా సంస్థ
    4) కేంద్రీయ విద్యా విషయక సలహా సంఘం
48. ఉపవాచకం అధ్యయనం చేయాలంటే ఏ పఠనం ఆమోదయోగ్యం?
    1) బాహ్య పఠనం
    2) క్షుణ్ణ పఠనం 3) ప్రకాశ పఠనం
    4) విస్తార పఠనం
49. సి.పి.బ్రౌన్ అభిప్రాయం ప్రకారం, ఏ జిల్లాలో మాట్లాడే తెలుగు భాషా రూపం ఆధునిక ప్రామాణిక భాషగా గుర్తింపు పొందింది?
    1) కృష్ణా, గుంటూరు
    2) కృష్ణా, ఉభయ గోదావరి
    3) కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి
    4) కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి
50. సహపాఠ్య కార్యక్రమాలు అనేవి?
    1) బోధనను సులువు చేస్తాయి.
    2) పాఠ్యప్రణాళికకు సన్నిహితంగా ఉండవు.
    3) భాషా సామర్థ్యాల ప్రకటనకు అవకాశం కల్పిస్తాయి.
    4) విద్యార్థుల్లో భాషాజ్ఞానం పెంపొందిస్తాయి.

సమాధానాలు

1) 2	2) 2	3) 4	4) 2	5) 1
6) 1	7) 2	8) 1	9) 2	10) 3
11) 4	12) 4	13) 4	14) 3	15) 1
16) 4	17) 4	18) 2	19) 2	20) 2
21) 2	22) 2	23) 4	24) 3	25) 1
26) 2	27) 3	28) 1	29) 4	30) 4
31) 2	32) 3	33) 3	34) 4	35) 3
36) 1	37) 2	38) 1	39) 4	40) 3
41) 1	42) 3	43) 3	44) 3	45) 3
46) 1	47) 4	48) 4	49) 2	50) 3

‘చార్మినార్’ను దేనికి గుర్తుగా నిర్మించారు?

కుతుబ్‌షాహీలు గోల్కొండను రాజధానిగా చేసుకొని సుమారు 171 ఏళ్లపాటు పరిపాలించారు. వీరు ఆంధ్రదేశాన్ని సమైక్యం చేసి ఆంధ్ర సంస్కృతిని పోషించారు. తెలుగు ప్రజల ఆదరాభిమానాలను పొందారు. గోల్కొండ రాజ్యంలోని ప్రజల్లో మూడో వంతు హిందువులేనని గుర్తించి, వారి హృదయాలను చూరగొంటే తప్ప సుస్థిర పాలన చేయలేమని భావించారు. జాతి, మత భేదాలను పాటించకుండా అర్హత, సామర్థ్యం ఉన్న వారికి ఉన్నత ఉద్యోగాలిచ్చి ప్రోత్సహించారు.

కుతుబ్‌షాహీల పాలనా వ్యవస్థ

కుతుబ్‌షాహీలు పరదేశీయులు, ఇతర మతస్థులు అనే భావన ప్రజల్లో రానీయకుండా పరిపాలన చేసినట్లు దక్కన్‌లో వెలువడిన సమకాలీన సాహిత్యం వల్ల తెలుస్తోంది. కుతుబ్‌షాహీల పాలనా విధానం, రాజకీయ, ఆర్థిక, మత పరిస్థితులను సమగ్రంగా పరిశీలించడానికి ఇండో–పారశీక చరిత్ర, అబ్దుల్లా కుతుబ్‌షా, ఔరంగజేబు మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, అక్బర్ నుంచి ఔరంగజేబు వరకు లభిస్తున్న మొగలుల చరిత్ర, గోల్కొండ కవుల సాహిత్యం దోహదపడుతున్నాయి. వీటితో పాటు గోల్కొండను సందర్శించిన బౌరే, టవర్నియర్, తెవ్‌నాట్, బెర్నియర్, మెత్తవోల్డ్, మనుస్సీ, మూర్‌లాండ్ లాంటి విదేశీ యాత్రికుల కథనాలు, వారి యాత్రానుభవాలు వీరి పాలన గురించి తెలియజేస్తున్నాయి. మధ్యయుగ చరిత్రను తెలియజేసే క్రానికళ్లు, మెకంజీస్ సేకరించిన కైఫీయతులు, సుల్తానులు జారీచేసిన ఫర్మానాలు కూడా ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి.

కుతుబ్‌షాహీలు బహమనీ సుల్తానుల పాలనా విధానాన్నే అనుసరించారు. ప్రభుత్వ యంత్రాంగంలో సుల్తాన్ ప్రధానపాత్ర పోషించేవాడు. రాజ్యాధిపతిగా ఆయనే శాసనకర్త. సుల్తాన్ తనకు తాను దేవుని ప్రతిబింబం (జిలుల్లా)గా, దైవాంశ సంభూతుడిగా విశ్వసించి నిరంకుశంగా రాజ్యపాలన చేసేవాడు. రాజే సర్వాధికారి, సైన్యాధిపతి, ఉన్నత న్యాయాధిపతి. ప్రభుత్వ విధానాలను రూపొందించి ఫర్మానాలు జారీ చేయడంతోపాటు రాయబారులను, ఉన్నతోద్యోగులను సుల్తానే నియమించేవాడు. రాజ ఆస్థానం ఎల్లప్పుడూ ఆడంబర విలాసాలతో నిండి ఉండేదని సమకాలీన సాహిత్యం ద్వారా తెలుస్తోంది.

సుల్తాన్ సర్వాధికారి అయినప్పటికీ దైవానికే సమాధానకర్తగా వ్యవహరించేవారు. ఖురాన్ గ్రంథం, సూఫీ మత ప్రభావం వల్ల ప్రజల యోగక్షేమాలు చూసేవారు. రాజధానిలో రాజ్య వ్యవహారాలు చర్చించి, విధాన నిర్ణయాలను అమలు చేయడానికి మజ్లిస్–దివాన్‌దారీ, మజ్లిస్–ఇ–కింగాష్ అనే పండిత పరిషత్తులు ఉండేవి. ఇందులో మతాచార్యులు, విద్వాంసులు, రాజనీతిజ్ఞులు, ఉన్నత ఉద్యోగులు సభ్యులుగా ఉండి సుల్తాన్‌కు రాజ్య వ్యవహారాల్లో సూచనలు, సలహాలు ఇస్తుండేవారు. సుల్తాన్ తర్వాతి స్థానం ప్రధానమంత్రిది. కుతుబ్‌షాహీల కాలంలో ప్రధానమంత్రిని వకీల్–ఇ–ముకాలఖ్ (లేదా) పీష్వా అని పిలిచేవారు. ఇతడు రాజ్యంలో సాధారణ పరిపాలనతో పాటు బహిర్గత, అంతర్గత వ్యవహారాలు నిర్వహించేవాడు. ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో ముస్తాఫాఖాన్ ఆర్దిస్థానీ, మహమ్మద్ కులీకుతుబ్‌షా కాలంలో మీర్ మెమిన్ అస్త్రాబాది, అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో షేక్

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర

మహమ్మద్ ఇబన్‌ఖాతున్ లాంటి వారు ప్రధాన మంత్రులుగా పేరు పొందారు. ప్రధానమంత్రి తర్వాతి స్థానం మీర్ జుమ్లా (మంత్రి)కు ఉండేది. ఇతడు ఆర్థిక, రెవెన్యూ శాఖలతోపాటు రాజ్యంలో రాబడి, ఖర్చులకు సంబంధించిన కార్యకలాపాలను ప్రధానంగా నిర్వహించేవాడు. కొన్ని సందర్భాల్లో పీష్వా కంటే ఎక్కువ అధికారం చెలాయించేవాడు. హైదరాబాద్ నగర నిర్మాత మహమ్మద్ కులీ కుతుబ్‌షా కాలంలో మీర్జామహమ్మద్ అమీన్, అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో మీర్ మహమ్మద్ సయీద్ లాంటి వారు ఆర్థికశాఖా మంత్రులుగా గొప్ప పేరు గడించారు. పీష్వా (లేదా) ప్రధానమంత్రి పేరును అబుల్ హసన్ తానీషా కాలంలో దివాన్‌గా మార్చారు. మాదన్న దివాన్‌గా పేరు గడించాడు. కోశాధికారిని ‘ఖజాన్‌దార్’గా, గణాంక శాఖాధికారిని ‘మజుందార్’గా, పోలీస్ కమిషనర్‌ను ‘కొత్వాల్’గా, పౌర ఉద్యోగిని ‘హవల్దార్’గా పిలిచేవారు. ప్రధాన రెవెన్యూ ఉద్యోగిని ‘సర్‌ఖేల్’ అని పిలిచేవారు. అన్ని రాష్ట్రాలపై ఇతడు పర్యవేక్షణాధికారిగా వ్యవహరించేవాడు. ప్రభుత్వ ఉత్తర, ప్రత్యుత్తరాలను పర్యవేక్షించడానికి డబీరులు అనే ఇద్దరు కార్యదర్శులు ఉండేవారు. డబీర్ అంటే పండితుడు అని అర్థం. వీరిలో ఒకరు తప్పనిసరిగా హిందువు ఉండేవాడు. ఇతడు సుల్తాన్ జారీ చేసిన ఫర్మానాలను స్థానిక భాషల్లోకి అనువాదం చేసేవాడు. కొత్వాల్ రక్షక భటాధికారి. రాజ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ ఇతడి ప్రధాన విధి.

రాజ్యాన్ని తరఫ్‌లు (రాష్ట్రాలు)గా విభజించారు. అబుల్ హసన్ తానీషా కాలంలో ఆరు తరఫ్‌లు ఉండేవి. వీటిలో తెలంగాణా ప్రాంతం ఒకటి. రాష్ట్రాలను సర్కార్లు(జిల్లాలు)గా, సర్కార్లను పరగణాలు(తాలూకాలు)గా విభజించారు. రాష్ట్రానికి తరఫ్‌దార్ (గవర్నర్) అధిపతి. జిల్లా–తాలూకా అధికార్లను ఫౌజ్‌దార్లు అనేవారు. వీరికి సహాయంగా హవల్దార్లు ఉండేవారు. మచిలీపట్నం లాంటి రేవు పట్టణానికి హవల్‌దార్లు ఉండేవారు. ప్రధాన రేవు అధికారిని షా బందర్ అని పిలిచేవారు. సర్కార్లను సీమలు అని కూడా పిలిచేవారు. బెల్లంకొండ, వినుకొండ, నిజాంపట్నం, కొండపల్లి, మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రి మొదలైన 22 సీమలు ఉండేవి. అబుల్ హసన్ కాలంలో 37 సర్కారులు, 517 పరగణాలు ఉండేవి.

రేవు పట్టణాల్లో షాబందర్, హవల్‌దార్లు సుంకాలు వసూలుచేసేవారు. రాజ్యంలో శిస్తు వసూళ్లను వేలంపాటల ద్వారా అమ్మేవారు. సర్కార్లను కొన్ని ప్రాంతాలుగా విభజించి ఇష్టమైన వారికి శిస్తు వసూలు అధికారాన్ని ఇచ్చేవారు. ప్రభుత్వానికి, రైతుకు మధ్య ఇద్దరు లేదా ముగ్గురు మధ్యవర్తులు ఉండటంతో రైతుపై శిస్తుభారం విపరీతంగా పెరిగింది. దేశ్‌పాండే, ఠాణేదార్లు, దేశ్‌ముఖ్‌లు, మజుందార్లు, తలస్‌కర్ణి లాంటి వారి పాత్ర నిరంకుశంగా ఉండేది. వీరు గ్రామీణ రైతులను దోచుకు తినేవారు. అబుల్ హసన్ పాలనా కాలంలో మజ్లిస్–ఇ–దివాన్ (ప్రివీ కౌన్సిల్) ఏర్పడింది. ఇది రోజూ క్రమం తప్పకుండా సమావేశం అయ్యేది. ఈ సంఘంలో 20 మంది సభ్యులు ఉండేవారు. వీరికి వేతనాల కింద జాగీర్లు ఇచ్చేవారు.

వాస్తు, స్మారక నిర్మాణాలు

వాస్తుపరంగా విశిష్టమైన కుతుబ్ షాహీ శైలి వెలుగులోకి వచ్చింది. వీరు బహమనీ సుల్తాన్ల వాస్తు విధానాన్నే అనుసరించారు. పెద్ద గుమ్మటాలు, విశాలమైన ప్రవేశ ద్వారాలు, ఎత్తైన మినార్లు, అష్టకోణాకృతి నిర్మాణాలు ఈ శైలికి సంబంధించిన ముఖ్య లక్షణాలు. చార్మినార్, చార్‌కమాన్, మక్కామసీదు, టోలీ మసీదు, గోల్కొండ కోట, గోల్కొండ సమాధులు తదితరాలను ముఖ్యమైన వాస్తు కట్టడాలుగా పేర్కొనవచ్చు.

కుతుబ్‌షాహీ మూడో సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో మూసీ నదిపై పురానాపూల్ (పాతవంతెన)ను 1578లో నిర్మించారు. ఇతడి కాలంలోనే హుస్సేన్‌సాగర్, బద్వేల్, ఇబ్రహీంపట్నంతో పాటు గోల్కొండ కోటలో ఇబ్రహీం మసీదును నిర్మించారు.

మహమ్మద్ కులీకుతుబ్ షా 1591లో మూసీ నది ఒడ్డున ‘చిచలం’ గ్రామంలో ప్లేగు వ్యాధి నివారణకు గుర్తుగా చార్మినార్‌ను నిర్మించాడు. 1594లో హైదరాబాద్‌లో జమామసీదు, బాదుషాహీ అసూర్ ఖానా (పత్తర్‌గట్టీ), దారుల్‌షిఫా, చార్‌కమాన్ లాంటివాటిని నిర్మించారు. వీటిని రాయి, సున్నంతో నిర్మించారు. మహమ్మద్ కుతుబ్‌షా(1612–26)కాలంలో 1617లో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్దదైన మక్కామసీదును నిర్మించారు.

కుతుబ్‌షాహీల స్మారక నిర్మాణాలు, గోల్కొండ కోట అంతర్భాగంలో భక్త రామదాసు బందీఖానా, రాణీమహల్, సుల్తానుల మరణానంతరం ఖననానికి ముందు స్నానం చేయించే గదులు నేటికీ ఉన్నాయి. కుతుబ్‌షాహీల సమాధులు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వాస్తు స్మారక నిర్మాణాలు. కుతుబ్‌షాహీల నిర్మాణాలన్నింటిలో అత్యంత విశాలమైన మైదానంలో నిర్మించినవి ఇవే. ఒకే రాజవంశానికి చెందిన సుల్తానుల సమాధులన్నీ ఒకే ప్రాంగణంలో నిర్మించడం ప్రపంచచరిత్రలో ఇక్కడ మాత్రమే కనిపిస్తుంది. సమాధి డోమ్ అంతర్భాగాన్ని కోణాకృతిలో ప్రత్యేక సాంకేతిక పద్ధతిలో నిర్మించారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఇంగ్లిష్ తూర్పు ఇండియా వర్తక సంఘానికి మచిలీపట్నంలో ఫ్యాక్టరీని స్థాపించడానికి అనుమతి ఇచ్చినవారెవరు? (గ్రూపు–2, 2008)
   జవాబు: అబ్దుల్లా కుతుబ్ షా
2. బీరారు రాజ్యాన్ని స్థాపించిన వంశస్థులు? (గ్రూపు–2, 2005)
   జవాబు: ఇమాద్ షాహీలు
3. ఆది మహాదేవుని దేవాలయం సమీపాన జన్మించిన నది ఏది? (గ్రూపు–2, 2005)
   జవాబు: గోదావరి
4. భగవద్గీతను పర్షియన్ భాషలోకి తర్జుమా చేసినవారెవరు? (గ్రూపు–1, 2003)
   జవాబు: దారాషికో
5. ప్రాకృత భాషలో సంకలనం చేసిన ‘గాథా సప్తశతి’ వేటి గురించి వివరిస్తుంది? (సివిల్స్ ప్రిలిమ్స్–2002)
   జవాబు: శృంగారగాథలు
6. భారతదేశంపై దండెత్తిన మొదటి ముస్లిం రాజు ఎవరు? (గ్రూపు–2, 2000)
   జవాబు: మహమ్మద్‌బిన్ కాశిమ్
7. కిందివాటిలో సరికాని జత ఏది? (నాన్ గెజిటెడ్ జనరల్ స్టడీస్–2005)
   ఎ) నిజాం షాహీ – అహమ్మద్‌నగర్
   బి) ఆదిల్ షాహీ – బీజాపూర్
   సి) కుతుబ్ షాహీ – గోల్కొండ
   డి) ఇమాద్ షాహీ – బీదర్
   జవాబు: డి
8. కిందివాటిలో మహమ్మద్ కులీకుతుబ్ షా నిర్మించని కట్టడం? (గ్రూప్–1, 2003)
   ఎ) గోల్కొండ
   బి) హైదరాబాద్
   సి) చార్మినార్
   డి) జమా మసీద్
   జవాబు: ఎ
9. ‘చార్మినార్’ను దేనికి గుర్తుగా నిర్మించారు? (గెజిటెడ్–2005)
   జవాబు: ప్లేగు వ్యాధి నిర్మూలనలో విజయం
10. ఔరంగజేబు గోల్కొండను జయించిన సంవత్సరం? (గెజిటెడ్–2005)
    జవాబు: క్రీ.శ. 1687

Whose rank is first in a class test?

MODEL QUESTIONS

Directions (Q. No. 1-5): Study the following information carefully and answer the following questions.

P, Q, R, S, T and U are six members of a group in which there are three female members. Females work in three departments - Accounts, Administration and HR - and sit on three different floors - Ground floor, first floor and second floor. Person working in the same department are not on the same floor. On each floor two persons work. No two females work in the same department or sit on the same floor. Q and T work in the same department but not in HR. S works in Administration. T and P are on the ground floor and second floor respectively and work in the same department. S, a female does not sit on the first floor. R, a male works on ground floor. U, works on the first floor; and S and P work on the same floor.

1. Which of the following group of members are female?
   1) S, T, U 2) R, S, T 3) Q, T, U 4) P, S, U 5) Can't be determined
2. Which of the following pair of person work in Administration?
   1) R, S 2) Q, S 3) R, T 4) Data inadequate 5) None of these
3. Which of the following pair works on second floor?
   1) P, S 2) R, S 3) Q, U 4) S, T 5) None of these
4. U works in which department?
   1) Accounts 2) HR 3) Administration 4) Either HR or Administration 5) None of these
5. If U is transferred to Accounts and T is transferred to Administration, who is to be transferred to HR to maintain the original distribution of female on each floor?
   1) R 2) S 3) Q or S 4) Data inadequate 5) None of these

Directions (Q. No. 6-8): Study the following information carefully and answer the given questions:

Six students A, B, C, D, E and F wrote an exam and the following is the data regarding their marks (maximum marks is 20).

- E got twice as much as A.
- A got one-and-a-half times as much as C.
- B got one-third of the marks scored by E.
- D got double that of C.
- F scored 6 marks more than A but is not the topper of the class. (All marks are integers)

6. Who is the topper of the class & how many marks did he obtain?
   1) D - 15 2) E - 12 3) A - 18 4) D - 12 5) E - 18
7. How much more marks does A have to score to be the topper? (if only one person is on 1st position).
   1) 9 2) 6 3) 8 4) 10 5) 12
8. What is the difference between the marks obtained by C and F?
   1) 6 2) 7 3) 5 4) 8 5) 9

Directions (Q. No. 9-13): Each of the questions below consists of a question and three statements numbered I, II and III given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question and then mark the appropriate option as answer.

9. Six friends M, T, S, R, U and W are sitting around a circular table facing the centre. What is the position of S with respect to M?
   I) M is between R and T.
   II) R sits second to the left of W.
   III) U does not sit on the immediate right of R.
   1) Only I and II
   2) Only II and III
   3) Only III
   4) Only I and III
   5) All I, II and III together
10. What is the code for 'cold' in a code language?
    I) 'icecream is cold' is written as 'tic jic lic'.
    II) 'fruits are healthy' is written as 'mic fic eic'.
    III) 'healthy is icecream' is written as 'jic mic lic'.
    1) Only I 2) Only II
    3) Only I and II 4) Only III and I
    5) None of these
11. Among P, Q, R, S, T and U, whose rank is first in a class test?
    I) P scored more than only R and S.
    II) T's rank is 3rd highest.
    III) U did not score the highest marks.
    1) Only I 2) Only II 3) Only III
    4) I, II and III even together are not sufficient to answer the question.
    5) All I, II and III
12. Five persons Jitesh, Jeevan, Jeet, Jai and Jeena sit on a straight line, facing north, but not necessarily in the same order. How many persons sit between Jitesh and Jai?
    I) Jeet sits second to the right of Jitesh. Jai is not an immediate neighbour of Jitesh.
    II) Jeena sits on the extreme end of the line.
    III) Jeet sits on the immediate right of Jeevan.
    1) Only II 2) Only III
    3) Only I and II
    4) Only I and III
    5) All I, II and III together
13. How is N related to X?
    I) M is brother of N; M is grandson of W.
    II) S is sister of N.
    III) X is mother of M's father.
    1) Only I 2) Only II 3) Only III
    4) All I, II and III together
    5) Even I, II and III together are not sufficient

BANK EXAMS
REASONING

Directions (Q. No. 14 - 18): Study the following information carefully and answer the given questions:

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement. (All the numbers are two-digit numbers.)

Input: set near 14 19 went 20 78 ago 80 toy 36 pink 42 colour
Step I: went set near 19 20 78 ago 80 toy 36 pink 42 colour 14
Step II: went toy set near 20 78 ago 80 36 pink 42 colour 14 19
Step III: went toy set pink near 78 ago 80 36 42 colour 14 19 20
Step IV: went toy set pink near colour 78 ago 80 42 14 19 20 36
Step V: went toy set pink near colour ago 78 80 14 19 20 36 42
Step VI: went toy set pink near colour ago 80 14 19 20 36 42 78
Step VII: went toy set pink near colour ago 14 19 20 36 42 78 80

Step VII is the last step of the above input, as the desired arrangement is obtained.

As per the rule followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

Input: one 15 and 90 two 88 12 make 18 so 21 thus 56 near.
(All the numbers are two-digit numbers.)

14. Which step number is the following output?
    two thus so one near and 90 88 make 56 12 15 18 21
    1) Step V 2) Step VI
    3) Step IV 4) Step III
    5) There is no such step
15. How many elements (words or numbers) are there between 'make' and '18' as they appear in last but one step?
    1) 3 2) 4 3) 5 4) 2 5) 6
16. How many steps would be required to get the final output?
    1) Five 2) Six 3) Four
    4) Seven 5) None of these
17. Which of the following represents the position of 'and' in the fifth step?
    1) Sixth from the left
    2) Seventh from the left
    3) Fourth from the right
    4) Eighth from the left
    5) Sixth from the right
18. Which word/number would be at fifth position from the right in Step VI?
    1) 12 2) 18 3) 90
    4) and 5) 15

Answers With Explanations

(1-5):

Person	Sex	Floor	Department
P	Male	Second floor	Accounts
Q	Male	First floor	Accounts
R	Male	Ground floor	HR/Administration
S	Female	Second floor	Administration
$T^{(-)}$	Female	Ground floor	Accounts
$U^{(-)}$	Female	First floor	HR

1) 1; 2) 4; 3) 1; 4) 2; 5) 2.

(6-8): E → 18
F → 15
D → 12
A → 9
B/C → 6

6) 5; 7) 4; 8) 5;

9) 5;

From I



From I and II



From I, II and III



From all three statements, M sits second to the left of S. So, all three statements are necessary to answer the question.

10. 4; From I and III,
cecream is cold ® tic jic lic ...(1)
healthy is icecream ® jic mic lic ...(2)
icecream ® jic or lic
is ® lic or jic
So, the code for 'cold' is 'tic'.
Thus, statements **I** and **III** are sufficient

11. 5; From I. P > R, S
From I and II. – > – > T > P > R, S
From I, II and III.
Q > U > T > P > R, S
Hence all together are sufficient

12. 3; **Form I.**



Thus I and II together are sufficient.

13. 5; **From I.** M is Brother of N and Grand-son of W and M is male.
From II. S is female and Sister of M,
From III. X is Grand mother of M.
So, in family tree, the sum of all three statements is as follows:
Here N's gender is not defined So,



we can't say whether N is Grandson or Granddaughter of X.

(14-18):

The machine rearranges words and numbers in such a way that numbers are arranged from right side and words are arranged from left side. While numbers are arranged in ascending order, words are arranged in reverse alphabetical order.

Input: one 15 and 90 two 88 12 make 18 so 21 thus 56 nears.
Step I: two one 15 and 90 88 make 18 so 21 thus 56 near 12
Step II: two thus one and 90 88 make 18 so 21 56 near 12 15
Step III: two thus so one and 90 88 make 21 56 near 12 15 18
Step IV: two thus so one near and 90 88 make 56 12 15 18 21
Step V: two thus so one near make and 90 88 12 15 18 21 56
Step VI: two thus so one near make and 90 12 15 18 21 56 88
Step VII: two thus so one near make and 12 15 18 21 56 88 90

14. 3;
15. 2;
Sixth step is the last but one.
There are four elements between 'make' and '18'.
The elements are : and, 90, 12 and 15
16. 4;
17. 2; **Step V:** two thus so one near make and 90 88 12 15 18 21 56
Thus, Seventh from the left is 'and'.
18. 5;
Step VI: two thus so one near make and 90 12 15 18 21 56 88.
Thus fifth from the right is 15